# శ్రీ మాతావైష్ణోదేవి (కాట్రా) మాహాత్మ్యము

## మాత శ్రీవైష్ణవి ప్రాభవం

రచన

ముక్తినూతలపాటి మారుతి వేంకట సుబ్రహ్మణ్యం

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2022

# SRI MAATA VAISHNODEVI (KATRA) MAAHATMYAMU

by
**Mukthinutalapati Maruti Venkata Subrahmanyam**

T.T.D. Religious Publications Series No. 1423
© All Rights Reserved

First Edition : 2022

Copies : 500

Price :

*Published by :*
**SRI A.V. DHARMA REDDY,** I.D.E.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 501

*D.T.P:*
Publications Division,
T.T.D., Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

శ్రీమాతా వైష్ణోదేవి మందిరం జమ్ము-కాశ్మీర్ రాష్ట్రంలోని "కాట్రా" నగరంలో నిర్మింపబడి ఉంది. ఈ కాట్రానగరం సముద్రమట్టం నుండి 2500 అడుగుల ఎత్తులో త్రికూట పర్వతంపైన విస్తరించి ఉంది.

"త్రికూటం" అంటే - శ్రీసరస్వతి, శ్రీమహాలక్ష్మి, శ్రీపార్వతి - ఈ ముగ్గురమ్మలు ఏకీకృతమైన శ్రీవైష్ణోదేవి వెలసిన పర్వతం అని అర్థం. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు సృష్టి స్థితి లయల్లో అధిష్ఠాన దేవతలై ఉన్నట్లు ముగ్గురు ప్రముఖ దేవతల సమీకృతరూపం శ్రీవైష్ణోదేవిగా శ్రీమాత ఇక్కడ సాక్షాత్కరిస్తుంది.

శ్రీమాతా వైష్ణోదేవి వెలసిన మూలపీఠం నుండి గంగ ఉద్భృతంగా ప్రవహిస్తూ ఉంటుంది. ఈ ప్రవాహాన్ని భక్తులు 'చరణగంగ" అని పిలుస్తారు. ఈ గంగలో స్నానంచేసి భక్తులు పునీతులౌతుంటారు. ఈ త్రికూట పర్వత పరిసరాలను, శతశృంగ పర్వత ప్రాంతాల్ని - ఇక్కడ జరిగే ఉత్సవాలను, అర్చనలను రచయిత శ్రీ ముక్తినూతలపాటి మారుతి వేంకట సుబ్రహ్మణ్యంగారు పాఠకుల కళ్ళకు కట్టినట్టుగా అభివర్ణించారు.

దుష్టశిక్షణ, శిష్టరక్షణలో శ్రీమాతను, మహిషాసుర మర్దనిగా, శుంభ నిశుంభుల సంహారణిగా రచయిత కీర్తించారు. శ్రీమాత వైష్ణోదేవి దర్బారు అంటే - ఆమె కొలువుకూటాన్ని గురించి విశదీకరిస్తూ - నిత్యం సర్వదేవతలూ సమావేశమై - మహామాతృక శక్తి ప్రపత్తుల్ని ప్రకటిస్తూ జయజయధ్వానాలు పలుకుతుంటారన్నది - ఒక దివ్యానుభూతిని రేకెత్తిస్తుంది!

నవరాత్రుల పండుగ సందర్భంగా త్రికూట పర్వతాగ్రం మీద వెలసిన మాతా వైష్ణోదేవి గుహకు పాదభాగంలోని కాట్రానగరం దీపకాంతులతో శోభాయమానంగా అలంకరింపబడుతూ ఉంటుంది!

భారతీయులకు ముఖ్యమైన దీపావళి పండుగనాడు మహాలక్ష్మి – మహాకాళి దేవతలకు ప్రత్యేక అలంకరణలు, అర్చనలు జరుగుతుంటాయి. శ్రీమాత చంద్రబింబంలాంటి చల్లని వదనంతో భక్తులపైన తన వాత్సల్యపూరిత అమృతకిరణాల్ని ప్రసరింపజేస్తూ, భక్తులు దినదిన ప్రవర్ధమానంగా జీవించేలా కరుణిస్తూ ఉంటుంది.

శ్రీవైష్ణోదేవి ఆలయప్రాంతాలను, ఆ మహామాతృక మహిమలను, ఆ దేవి దర్శనానికి ఎంతో కష్టపడి చేరుకునే భక్తుల తన్మయత్వాన్ని తాను దర్శించి పాఠకులకు దర్శనం చేయించారు రచయిత.

ఈ భక్తిభరిత గ్రంథం భారతదేశంలోని క్షేత్రమాహాత్మ్యాన్ని, తీర్థప్రాముఖ్యాన్ని, దైవభక్తిని, ఆలయాల సందర్శన ఆసక్తిని పాఠకులలో పెంపొందిస్తుందని విశ్వసిస్తూ – తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా ఒక చారిత్రిక ప్రదేశాన్ని పరిచయం చేసిన రచయితను మనఃస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

సదా శ్రీవారిసేవలో

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# విన్నపం

వేద, పురాణాలలో సంఖ్యాసంబంధ పదం "త్రి" లేదా "తృతీయ" అత్యంత ప్రాధాన్యత కలిగివున్నది. అవి క్లుప్తంగా త్రిమూర్తులు, త్రిలోకములు, త్రికాలములు, త్రిగుణములు మొదలైనవి. అట్టిదే జమ్మూ రాష్ట్రమందలి "త్రికూట" అన్న పర్వతము. మాత శ్రీమహాలక్ష్మీ, శ్రీ మహాకాళి, శ్రీ మహాసరస్వతి అన్న త్రి మహాశక్తులు సమ్మిళితమైనందున ఈ దేవి "శ్రీవైష్ణోదేవి" అన్న నామంతోను, ఈ క్షేత్రం మహా వైష్ణవశక్తి క్షేత్రంగాను విరాజిల్లుతున్నది. త్రిగుణములు, వానిచే ఏర్పడిన ప్రకృతి, అధిష్ఠితులై సృష్టి, స్థితి, లయలను నిర్వహించు బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరాది త్రిమూర్తులు, వీరి అధిష్ఠాత్రి పరబ్రహ్మ, పరమేశ్వరి యొక్క దివ్యాంశయే, శ్రీవైష్ణవి.

శతశృంగపర్వత కనుమలలో త్రికూట పర్వతముపై ముగ్గురమ్మల మూలపుటమ్మగా నెలవైన పెద్దమ్మ – "శ్రీవైష్ణవి", తన వీక్షణాలతోనే భరతఖండమందు అపార ప్రకృతి సంపదను ప్రసాదిస్తూ భక్త సంతతికి ఇహలోక సౌఖ్యము, పారలౌకిక సద్గతులు ప్రాప్తింపజేస్తుంది. సృష్టి భద్రతకు, భక్త రక్షణకు గాను, భద్రతా దళాలకు అపార మనోధైర్యం కల్పిస్తూ పరజాతీయుల, ముష్కరుల విధ్వంస పన్నాగాలను నిర్వీర్యం చేస్తుంది. బిడ్డలకై ప్రార్థనచేసే తల్లి, వీరసైనికుని తల్లి, సతి, వారిని కదనాన ముందుండి నడిపించే శక్తి, వీరస్వర్గము అందించేశక్తి, ఈ మాతయొక్క దివ్యాంశలే! వేదసంస్కృతి వ్యక్తీకరించే పరాత్పరి, పరబ్రహ్మస్వరూపిణి, అవ్యక్త, స్వయంభు, పరమతత్త్వము ఈ జగన్మాతయే! ఇక సనాతన ధర్మము శ్లాఘించి వేసిన పెద్దపీట ఈ మాతృమూర్తికే.

మాత ఒడి చేరేందుకు భక్తులు కఠోర ప్రకృతి వైపరీత్యాలకోర్చి "జైమాతాదీ" అని జేజేలు పలుకుతూ పరస్పరం కష్టాలను మరిచేలా ఉత్సాహపరుచుకుంటూ క్లిష్టమైన మెట్లదోవన ప్రయాణించి, మాత ఆలయ కాషాయవర్ణ పతాకము కన్పించగనే, ఆనంద భాష్పాలతో శ్రమను మరచి, మాతృదర్శనానికి అర్రులు చాస్తుంటారు. మార్గక్రమంలో చరణగంగ,

గర్భయోని, మరియు ప్రాచీనగుహ అన్న ప్రదేశాల సందర్శనానందం, ప్రతి భక్తుడు స్వయంగా అనుభవించి పొందవలసినదే! శక్తిపాతము ఆవహించియున్న దర్బారు అనే ప్రదేశము మాతృఒడిలో భక్తులు ఆస్వాదించే వెచ్చదనానికి, తల్లి అభయానికి నిదర్శనము.

నా తిరుగు ప్రయాణంలో చివరి అంశం, మాత బాలగా భువిపై అడుగిడిన నాటి హంసలి గ్రామం. అనగా నేటి “భూమిక” చేరుకొనే సరికి సమయం సాయంత్రం 4 గం॥లు. అక్కడే కొండ కనుమల మధ్య ఏరుకు ఆవలి ఒడ్డున మాత భూమిక ఆలయం. పక్కనే భక్తశ్రీధర పండితుడు, సతీమణి నివసిస్తూ శ్రీ బాలవైష్ణవి దర్శనం పొంది ధన్యులైన గృహం. మాత ఆదేశానుసారం భారీ విందు ఏర్పరచిన చిరుగృహం అది. కథాంశంగా, ఆహ్వానితుడైన భైరవనాథుడు అహంకారంతో మాతను అనుచిత కోరికలు కోరిన సందర్భం– నేటి దర్బారు వైభవానికి మొదటి అడుగు ఈ ప్రదేశమే. అచ్చట సమయంకాని సమయంలో దైవికంగా భక్తులు జరుపుకుంటున్న విందు మలిదశలో ఉన్నది. ఆప్యాయతతో వారు అందించిన నైవేద్యము, అలా మాత అనుగ్రహం నాకు చిరస్మరణీయములు.

ఈ భావ పరంపరలను అక్షరీకరణకు అనుగ్రహించిన జగన్మాతకు నమోవాకములు. హృద్యమైన ఈ క్షేత్రయాత్రలో నా అనుభూతులను తెలుగుప్రజలతో పంచుకోవాలనే ఆసక్తితో, నే చేసిన ప్రయత్నఫలమే ఈ పొత్తము “శ్రీ మాతా వైష్ణోదేవి (కాట్రా) – మాత శ్రీ వైష్ణవి దివ్య దర్శనం”. ఈ చిరు గ్రంథాన్ని ఆమోదించి ముద్రణకు అనుమతించిన శ్రీయుత కార్యనిర్వహణాధికారి తి.తి.దే.వారికి, ప్రచురణల విభాగం వారికి ధన్యవాదములు తెలుపుకుంటూ, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయక శ్రీ తిరుమల వేంకటేశుని పాదపద్మములకు ఈ పుస్తక కుసుమాన్ని సమర్పిస్తున్నాను.

వినమ్రతతో

శ్రీ ముక్తినూతలపాటి మారుతి వేంకట సుబ్రహ్మణ్యం

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1) | సురథునకు సుమేధ మహర్షి దేవి - మాహాత్మ్య ప్రవచనం | 1 |
| 2) | శ్రీమహావిష్ణువు ఆవిర్భావం | 3 |
| 3) | యోగమాయ ఆవిర్భావం | 4 |
| 4) | మహామాతృక | 6 |
| 5) | కలియుగంలో శ్రీవైష్ణవి | 9 |
| 6) | మాతకై భైరవుని అన్వేషణ | 25 |
| 7) | భైరవునివధ - మోక్షప్రసాదం | 26 |
| 8) | సురథుడు - సమాధులకు - దేవి అనుగ్రహం | 30 |
| 9) | త్రేతాయుగమందు శ్రీవైష్ణవి అవతారధారణ | 32 |
| 10) | మాత శ్రీవైష్ణవి ప్రాచీన గుహ - ప్రాభవం | 35 |
| 11) | ఏకీకృత శిలారూపంలో శ్రీవైష్ణవి | 38 |
| 12) | నూతన సొరంగ మార్గం | 40 |
| 13) | గుహలోని దేవతాది ధార్మిక చిహ్నాలు | 42 |
| 14) | మాత శ్రీవైష్ణవి నిత్యపూజలు | 45 |
| 15) | మాత శ్రీవైష్ణవి మూడు పిండాకృతుల మాహాత్మ్యం | 47 |
| 16) | మాత శ్రీవైష్ణోదేవి త్రిపిండాకృతుల రహస్యం | 53 |
| 17) | సృష్టిఆదిగా భగవతి మాహాత్మ్యం | 55 |
| 18) | మహిషాసురుడు బ్రహ్మవరములను పొందడం | 62 |
| 19) | దేవగణాలతో మహిషాసురసైన్యం మహాసంగ్రామం | 63 |
| 20) | సమస్త దేవతల తేజోరాశి - భగవతి ఆవిర్భావం | 67 |

21) మహిషాసురుని వధ 71

22) శుంభ నిశుంభుల ప్రాబల్యము 75

23) కౌశికి ఆవిర్భావం - ధూమ్రలోచన-చండముండుల వధ 76

24) రక్తబీజుని వధ 78

25) శుంభ నిశుంభుల వధ 80

26) బహుళ ప్రాచుర్యంలో భగవతి మహిమలు 83

27) శ్రీ మాతా వైష్ణోదేవి దర్బారు యాత్రికులకు ముఖ్య సమాచారం 111

28) మాత శ్రీవైష్ణవి పిలుపు 116

29) కాట్రా నగరం నుండి భవన్‌లోని, తల్లి దర్బారు సందర్శనం 117

30) భవన్ పరిసరాలలో సందర్శనీయ మందిరములు 140

31) యాత్రయందు ఇతర సందర్శనీయ ప్రదేశములు 144

32) జమ్ము నుండి కాట్రా మార్గంలో దర్శనీయ క్షేత్రములు 145

33) కాట్రా నగరంలో 151

34) శివ-ఖోరి మందిరం (శివ పరమాత్మధామం) 155

35) మాత శ్రీవైష్ణోదేవి ష్రైన్‌బోర్డువారి ఆర్జిత సేవలు 159

36) జమ్ము ప్రాంతమందు నవరాత్రి ఉత్సవములు 162

## శ్రీమాతావైష్ణోదేవి - కాట్రా

# మాతా శ్రీవైష్ణోదేవి - కాట్రా మాహాత్మ్యము

### దేవి ఆవిర్భావము - ముప్పురు మాతల పౌరాణికగాథ

### సురథునకు సుమేధ మహర్షి దేవి - మాహాత్మ్య ప్రవచనం

స్వారోచిష మన్వంతరంలో చైత్రవంశసముద్భవుడైన సురథుడు అనే మహారాజు సమస్త భూమండలాన్ని ప్రజారంజకంగా పరిపాలిస్తూ వుండేవాడు. అతడు అపారభక్తిపరుడు, ఉదారుడు, సత్యవాది, గురుభక్తి తత్పరుడు, ధనుర్విద్యావిశారదుడు, జితామిత్రుడుగా, మన్ననలు పొందుతూ ప్రజాభిమానం చూరగొన్నాడు.

ఇలా ఉండగా, మ్లేచ్ఛులు అనే పర్వతవాసులు కొందరు కుట్రబుద్ధితో సురథునిముఖ్యమంత్రి, సైన్యాధిపతులతో, రహస్యమంతనాలు నెరిపి, వారి పరోక్ష సహకారంతో సురథునిపై దండెత్తి, విజయం సాధించారు. ఆస్థాన ప్రముఖుల వెన్నుపోటుతో రాజ్యాన్నికోల్పోయిన సురథమహారాజు సమస్త సంపదలను, భార్యాబిడ్డలను వదలి అర్థాంతరంగా ప్రాణరక్షణకై రహస్యంగా కారడవులలో ప్రవేశించాడు.

అతడు, ఆకస్మికంగా ప్రతికూలమైన దైవలీలకు చింతిస్తూ గమ్యంతోచక అడవంతా తిరుగాడసాగాడు. సాయంసంధ్యాసమయానికి, ప్రశాంతమైన వాతావరణంలో ప్రకృతిసోయగాలు నింపుకొని ఆహ్లాదాన్ని కలిగించే ఒక ముని ఆశ్రమాన్ని చేరుకున్నాడు. రగులుతున్న హోమగుండాల పొగల మధ్యగా సన్నగా చెవినబడుతున్న శ్రావ్యమైన వేదపఠనం తన ఆవేదనను క్రమంగా తొలగిస్తుండగా ఆ ఆశ్రమంలోకి ప్రవేశించాడు సురథుడు.

అది మహర్షి సుమేధుని ఆశ్రమం. అచ్చట సాలవృక్షచ్ఛాయలో ప్రశాంతంగా కృష్ణాజినంపై పద్మాసనాసీనుడై, శిష్యులకు వేదబోధ చేస్తున్న

మహర్షిని దర్శించాడు. ఆశ్చర్యం! అతని మనసెంతో తేలికపడింది. తన వృత్తాంతాన్ని మహర్షికి విన్నవించి శరణువేడాడు. అలా మహర్షి సాంత్వనతో ఆశ్రమంలో నిర్భయంగా జీవిస్తున్న తరుణంలో ఒకనాడు అతనికి పాత జ్ఞాపకాలతోపాటు తన రాజ్యభోగం, మ్లేఛ్ఛుల అరాచకత్వం, భార్యాబిడ్డల కఠోర జీవితం గుర్తురాగా మనస్సు కకావికలమైంది. ఆవేదనతో కూర్చొని ఆలోచిస్తున్న సురథుని వద్దకు ఒక వ్యక్తి దిగులుగా నడుచుకుంటూ వచ్చాడు. అతడు తాను వైశ్యజాతికి చెందినవాడినని, పేరు "సమాధి" అని తెలియ చేసుకున్నాడు. సత్యవాదిగా, ధర్మతత్పరుడిగా కోట్లుగడించిన తనను, ధనలోభంతో తన భార్యబిడ్డలే ఇంటినుండి తరిమినట్లు తన వ్యథను వెళ్ళబోసుకున్నాడు. పరస్పర పరిచయానంతరం వారు తమ, తమ మనోవేదనలను మహర్షికి విన్నవించి సాష్టాంగ పడ్డారు. మహర్షి వారిరువురి మనసులలోని ఆర్తిని, పూర్వ స్మృతుల వల్ల రగులుతున్న ఆందోళనను గ్రహించి వారి దుఃఖాన్ని తొలగించే జ్ఞానోపదేశంచేయ నిశ్చయించాడు.

వత్సలారా! ''మోహ, మోక్షాలకు'' మూలం తెలియచేస్తాను. ఆలకించండి. దీనికంతటికి కారణం మహామాయ. అది ఆదిపరాశక్తి యొక్క సృష్టి పాలనాంశము. ఆ శక్తి సకల చరాచరజగత్తుకు ఉత్పత్తిహేతువు. ఆ బ్రహ్మాపిపీలికాది పర్యంతం సమస్త ప్రాణికోటి ఆ మహామాయ ఆధీనమే. అట్టి మాయాధీనమైన ప్రాణికోటికి "బంధ-మోహములు" అనివార్యములు. ఆ మహాశక్తి ప్రాణికోటినంతటినీ తాను కల్పించిన మాయావాసంలో ఉంచి తనఆధీనంలో ఉంచుకొని ప్రతిప్రాణి జీవన దశదిశలను నిర్దేశించి నడిపిస్తుంది. ఆ మహామాయ ఆదిశక్తి-సత్యము మరియు నిత్యము. ఆ మాహాత్మ్యాన్ని వివరిస్తాను. సావధానులై వినండి'' అని శ్రీమద్దేవీ భాగవతాన్ని ఇలా ప్రవచించసాగాడు.

## శ్రీమహావిష్ణువు ఆవిర్భావం

దేవ్యనుగ్రహపాత్రులారా!

ఈ సకల చరాచర జగత్తు సృష్టికి ఆదిపురుషుడైనవాడు పరమాత్మ లేక పరబ్రహ్మ. ఈతడు నిరాకారుడు అనగా ఎలాంటి ఆకార రూపాదులు లేనివాడు. కాని సంకల్ప మాత్రాన్నే ఏ రూపాన్నైనా, ఏ ఆకృతినైనా ధరించగలవాడు. అంతేగాక ఇతడు నిర్వికారుడు. అంటే ఏలాంటి కోరికలు లేనివాడు పూర్ణకాముడు అయినప్పటికినీ లోకకళ్యాణార్థం వ్యక్తమయినాడు. సంకల్పించిన మరుక్షణమే ఎట్టి కోరికనైనా నెరవేర్చగలవాడు, అట్టి పరమాత్మ దివ్యతేజఃస్వరూపుడు.

ఈ పరబ్రహ్మము తన తేజస్సునుండి నీలమేఘవర్ణంలో చతుర్భుజా కారునిగా భక్తికి దాసుడైన నీలవర్ణశరీరచ్ఛాయగల ఈ పరబ్రహ్మము, ఆ వర్ణానికి పర్యాయపదమైన "కృష్ణుడు" అన్న నామంతో సార్థక నామధేయు డయ్యాడు.

తానే బీజము, స్రష్ట అయినందున, ప్రకృతి సహకారం లేక సృష్టి జరుగుట దుర్లభమైనందున, తన దక్షిణ భాగాన్ని పురుష రూపంగాను, వామభాగాన్ని స్త్రీ రూపంగాను మారేలా సంకల్పించి వెంటనే ఆయా రూపాలు ధరించాడు. అలా కృష్ణుని వామభాగంనుండి అవతరించిన ఆ శక్తి స్వరూపిణియే కృష్ణాదేవి. ఆమె అత్యంత అద్భుతమైన సౌందర్యరాశి. ఆమెతో పరమాత్మయైన శ్రీకృష్ణుడు రాసక్రీడలు సాగించాడు. అలా బ్రహ్మకాలమానం ప్రకారం ఒకరోజు (అనేక కల్పాల కాలం) కొనసాగిన శృంగార ప్రక్రియ ఫలంగా కృష్ణాదేవి గర్భందాల్చింది. నూరు మన్వంతరాల కాలం, ఆ గర్భాన్ని పోషించి, భరించి ఒక మగబిడ్డకు జన్మనిచ్చింది. కానీ శతమన్వంతరాల కాలం తనకు గర్భభారం కల్గించిన శిశువుపై పట్టరాని కోపంతో, అంతటా నిండిఉన్న మహాజలార్ణవంలోకి ఆ బిడ్డను నిర్దాక్షిణ్యంగా వదిలేసింది.

కుపితుడైన శ్రీకృష్ణుడు, ఆకలితో అలమటిస్తూ, జలాల్లో తేలుతూ రోదిస్తున్న ఆ మగశిశువును చేరదీసి ఇలా అనుగ్రహించాడు.

"వత్సా! ఇప్పటికి నా తేజస్సులో పదహారవ అంశయైయున్న నీవు నాతో సమానం కాగలవు. నీవు జగదాధారుడవు విశ్వవ్యాపితుడవైన నీవు "మహావిష్ణువు" అనే నామధేయుడవవుతావు. నారములు (అపారజలరాశి) యందు నివసిస్తున్నావు కాబట్టి "నారాయణుడిగా" కీర్తింపబడతావు. ఈ విశ్వమంతా నీవు వ్యాపించి ఉంటావు కావున నీవు విశ్వవిరాట్ శక్తిగా విరాజిల్లుతావు".

అలా ఆశీర్వదింపబడ్డ ఆ శిశువు తనను సమీపించిన వటపత్రంపై చేరి శయనించి చేతులుజోడించి శ్రీకృష్ణుని ద్వారా "ఓం శ్రీకృష్ణాయస్వాహా" అనే షడక్షర మహామంత్రం ఉపదేశంపొందాడు. శ్రీవిష్ణువు సంకల్పించిన తత్క్షణం అతనికి చతుర్భుజాలు, పట్టుపీతాంబరాలు, దివ్యకిరీటం, స్వర్ణాభరణాలు, ఏర్పడి మిగుల అలంకార శోభితుడయ్యాడు.

అతడు ఈ మహావిశ్వంలో సృష్టికి కారకుడు, పోషకుడు, రక్షకుడు అయ్యాడు. అత్యంత శక్తిమంతుడైనందున విశ్వవిరాట్ స్వరూపుడయ్యాడు. బ్రహ్మాండాలు, త్రిలోకాలు సకల చరాచర జీవరాసులు, ఈతడి నుండే ఉద్భవించి పోషింపబడి ఈతని యందే లయమవుతున్నాయి. వేవేల మహత్తులు అతనికి సహజసిద్ధమైన ఆభరణాలై ప్రకాశించాయి. అతడే శ్రీమన్నారాయణుడైన శ్రీమహావిష్ణువు.

అట్టి శ్రీమహావిష్ణువు సృష్టిప్రారంభ సమయంలో జీవరాసులన్నింటిలో చైతన్యశక్తిని ఆపాదించి, జీవనక్రమాన్ని నడిపించే దైవశక్తిని సృష్టించదలచాడు.

## యోగమాయ ఆవిర్భావం

శ్రీమహావిష్ణువు అలా సంకల్పించగానే అతడి వక్షఃస్థల వామభాగం నుండి ఒక దివ్యశక్తి ప్రభవించింది. ఆ శక్తి సర్వశక్తిసంపన్న, దివ్య

స్వరూపిణియేగాక చతుర్భుజాలతో విరాజిల్లుతోంది. వెనువెంటనే మహావిష్ణువు మనస్సునుండి అష్టాదశ గుణములు పుట్టి విద్యుల్లతల్లా వరుస క్రమంలో ఆ స్త్రీమూర్తిలో ఐక్యమయ్యాయి. తత్క్షణం ఆ స్త్రీశక్తికి అష్టాదశ బాహువులు ఏర్పడి, భీకరాకారిణిగా మారి ఉచ్ఛ్వాస, నిశ్వాసములు, భీకర ఉష్ణజ్వాలలుగా వీస్తుండగా ఆవేశంతో ఊగిపోతూ అట్టహాసం చేయసాగింది.

అంత విష్ణువు ఆమెతో “నీవు విశ్వవిరాట్ స్వరూపిణివి. దైవమాయవు. వేరెవ్వరు జయింపశక్యము కాని దుర్గమమైన శక్తి-దుర్గవు. నీవు కాళి, చండి, మంగళ అనే పేర్లతో కూడా జగత్ప్రసిద్ధమౌతావు. నీవు అదృశ్య రూపిణివి. నా ద్వారా సంక్రమించిన అష్టాదశగుణాలు అదృశ్యరూపంలో నీచే సృష్టింపబడే సకలచరాచర జీవరాసులన్నింటా, విశ్వమంతా వ్యాపించి ఉంటాయి. ఆ గుణముల కన్నింటికి అధిష్టాన దేవతవు నీవు. ఈ అష్టాదశ గుణములన్నింటిని సృష్టిలోని జీవులన్నింటిలో ఆపాదించి, వాటిని ఆశ్రయించుకొనిఉండి జీవులను నడిపించే చేతనశక్తివి నీవే.” అని పలికాడు.

అష్టాదశశక్తులలో పదహారు శక్తులు విశ్వవ్యాపితంకాగా సృష్టికి మూలమైన కామ, మోహ గుణములకు ప్రతిరూపంగా, ప్రకృతి తానేఅయి, క్షేత్రజ్ఞగా “దుర్గ” సృష్టికి మాతృదేవత అయింది. ఈ మాయామేయ జగానికి అధిష్ఠానదేవత అయింది. ఆ మాయనుండి ఎంతటి వారైనా బయటపడలేరు. ఎవరైతే తపస్సుచేత లేదా యోగశక్తి చేత అష్టాదశ గుణాలను జయిస్తారో, వారికి మాత్రం మోక్షం ప్రాప్తిస్తుంది. అంటే విష్ణుసాయుజ్యం లభిస్తుంది.

అలా నారాయణుని అనుగ్రహంతో ఈ శక్తి ముల్లోకాలలోని, చరాచర జీవరాసులన్నింటిలో అంతర్లీనంగా, అదృశ్య రూపంలో ఉండి జీవరాశి నంతటిని ప్రభావితం చేస్తూ నియంత్రణ శక్తిని కలిగిఉండే మహామాయయై ఉన్నది. ఈ శక్తి విశ్వమంతా ఆవహించియున్నందున ఆ విశ్వమంతా ఆమెకు లోబడి, ఏ దుష్టశక్తులూ జయింపలేనిదై దుర్గాస్వరూపిణిగా వెలుగొందుతోంది.

ఆమె విష్ణుమాయా స్వరూపిణి. యోగవిద్య ద్వారా ఆమె నిజస్వరూప స్వభావాదులను దర్శించదలచిన అధ్యాయులకు ఆమె యోగమాయయైన శ్రీవైష్ణవి.

అష్టాదశపురాణాలలో శ్రీమద్భాగవతము ప్రథమస్థానంలో ప్రకాశిస్తూ ఉంటుంది అన్నది అక్షరసత్యం. అదే విధంగా దేవీభాగవతం మాహాత్మ్యత పరంగా సమానస్థాయిని సంతరించుకున్నది.

పరమాత్మతత్త్వంతో, మానవజీవితాన్ని అనుసంధానం చేయటమే ఈ రెండు పురాణాల ఏకైక లక్ష్యమన్నది నిర్వివాదాంశము. దేహ పరిపూర్ణతకు వామ, దక్షిణాంగముల సమదృష్టి, సమన్వయము ఎలా ఆవశ్యకమో, పరతత్త్వము సంపూర్ణంగా సిద్ధించడానికి ఈ పురాణాల "అనుసంధానము సర్వైక సమదృష్టి" ప్రాణప్రదము. విశిష్టంగా దేవీపురాణమందు, పరాత్పర పరబ్రహ్మను మాతృరూపంలో ఆరాధించటమన్న అత్యద్భుత అపురూపభావన–మాతృస్థానానికి సనాతనధర్మం కల్పించిన పెద్దపీట.

**మహామాతృక**

వేయి భిన్నవర్ణాల తామరలు ఒకేమారు వికసించగా ఉట్టిపడే సౌందర్యం, ఉన్నట్లుండి వేయిసూర్యులు ఆకాశంలో ఒకేమారు ఉదయిస్తే ఆవిష్కృతమయ్యే దివ్యతేజస్సు–ఇవి భగవతి మనోహర రూపసౌందర్యాలకు ప్రతీకలు.

సూర్యచంద్రులు ఆమెకు ఇరునేత్రాలు. అందమైన నక్షత్రాలు అలుముకున్న ఆకాశం ఆమె చీరకాగా, హరితంతో ప్రకాశించే భూమి ఆ చీర చెరగవుతుంది. ఆ తల్లి సతతం సిందూర వర్ణంలో ప్రకాశిస్తూ మందారపూవు వర్ణంతోను, రక్తవర్ణంతోను పోటీ పడుతుంటుంది. ఆ తల్లి కొన్నిమార్లు మంచుతో నిండిన హిమాలయ పర్వతశ్రేణులను తలదన్నే శ్వేతవర్ణంతో తెల్లని రాయంచలా ప్రకాశిస్తుంది. మరికొన్ని మార్లు

చితిమంటల భీకర కీలలలో స్థితయైయుండునట్టిది. ధర్మ వినాశకరుల పాలిట మృత్యుదేవత.

శ్రీవైష్ణవి, పొత్తిళ్ళలోబిడ్డకు అవ్యాజప్రేమానురాగాలతో పాలిస్తూ ఆనందించే తల్లిలా అపారకరుణామయి. త్రిపురసుందరిగా పోలికలేని జగదేకసుందరి. భద్రకాళిగా, కపాలములదండ ధరించి మృత్యువుతో సమానమైన భీకరమైనది. ఆ తల్లియే వైష్ణోదేవిగా అవతరించింది. ఆమెయే నిర్మల, నిరాకారి, నిర్వికారి, నిష్కలంక అయిన శ్రీవైష్ణవి. ఆమె ఎలాంటి రూపము లేనిదైనప్పటికీ లోకమందు ఆర్తుల క్లేశములు తొలగించి, ధర్మాన్ని పునరుద్ధరించడానికి వివిధ రూపాలలో అవతరిస్తుంది.

దేవీపురాణమునందు చెప్పబడిన విధంగా ఒకరోజు నారదమహర్షి శివుని వద్దకేగి "స్వామీ! త్రిమూర్తులైన మీరు ముువ్వురు సదా ధ్యానమందు నిమగ్నులై ఉంటారు. మీ ముువ్వురు కాక ఏ దైవము అందరికంటె పూజనీయులు? మీ ధ్యానమునకు ధ్యేయమై, పూజార్హులైన అట్టి వారినిగూర్చి తెలియచేయండి" అని కోరాడు.

అందుకు శివుడు "ఆమె సనాతని మరియు అలౌకిక ఆద్యాశక్తి అయినట్టి పరాశక్తి". ఆమెయే స్వయంగా పరబ్రహ్మ. సకల చరాచరజగత్తు సృష్టి, స్థితి, లయలకు కారణమైనట్టిది. వాస్తవానికి ఆమె ఎట్టిరూపము లేని దైనప్పటికి, సందర్భానుసారము, ఆ తల్లి పార్వతి, దుర్గ, కాళిక, వైష్ణో మరియు సరస్వతి రూపములు ధరించగలదు". అని వచించాడు.

తన అర్ధాంగి అయిన సతీదేవి – దశమహావిద్యలైన "కాళిక, తార, షోడశి, భువనేశ్వరి, భైరవి, ఛిన్నమస్త, త్రిపురసుందరి, భగళాముఖి, ధూమవతి మరియు మాతంగి" తన అంశలే అని తెలియచేసినపుడు, పరమశివుడు ఎంతో ఆశ్చర్యానికి లోనైనట్లు దేవీపురాణం విశదపరుస్తుంది.

"నేను నిత్యను-సత్యరూపమునైన దానను. ప్రపంచమందు వాస్తవమైనది సత్యము మాత్రమే. ఆ సత్యమే నేను. జగత్తుకు చేతనాశక్తిని నేనే", అన్నది దేవీభాగవతంలో దేవి స్వీయ ప్రవచనం. ఇక "భగవతి" - పరబ్రహ్మము కన్న సనాతనియా? అన్న ప్రశ్నకు మరి తావేది?

దేవీభాగవతమునందు బ్రహ్మదేవుడు - పరమాత్ముని స్థూలసూక్ష్మ స్వరూపమును గూర్చి నారదునకు ఇట్లు తెలియచేశాడు. "సకల ప్రాణులలోనున్న చైతన్యమే పరమాత్మ. "ఆ పరమాత్మ, అలానే ఆద్యాశక్తి" - సర్వత్రా వ్యాపించి యున్నట్లుగా తలపోయవలెను. వారులేకుండా జగత్తునందు ఏ వస్తువునకు ఉనికిలేదు. వారు సదా ప్రతిప్రాణి శరీరమందును కలసియుందురు. ఇరువురూ అవినాశులు ఏకరూపులు, చిన్మయులు, నిర్గుణులు, నిర్మలులు. శక్తియే పరమాత్మ - పరమాత్ముడే శక్తి అని సిద్ధాంతము. ఇది సూక్ష్మతత్త్వము.

వరమదగర్వితులైన మధుకైటభులను శ్రీవిష్ణువు సంహరించిన పిమ్మట త్రిమూర్తులకు భగవతి ఆద్యాశక్తి దర్శనమిచ్చింది. షట్కోణయంత్రరాజము మధ్యలో భగవతి ఆసీనురాలైయున్నది. ఆ భగవతిని చూచిన విష్ణువు వివేకపూర్వకంగా ఆ దేవి జగదంబికయని గుర్తించాడు. ఆ దేవియే మనకందరికి ఆదికారణమని తెలిపినాడు. "ఈమెయే సంపూర్ణ ప్రకృతి, నాశంలేనిది. ఈమె పరమాత్మునియొక్క ఇచ్ఛాశక్తి. ఈమెయే మూలప్రకృతి. ఎల్లప్పుడు పరమపురుషునితో కూడి విహరిస్తుంటుంది. ఆ పరమపురుషుని యొక్క ఈ ఆదిశక్తి మహామాయ. ప్రళయార్ణవము నందు నాకు దర్శనమిచ్చినది - ఈ తల్లియే" అని పలికినాడు.

ఆ విధముగా సృష్టి - స్థితి - లయ కారకులగు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు వారివారి విధులను యాంత్రికముగా, భగవతి ఉద్దీపన-ఆమెచే ప్రసాదితమైన శక్తి ద్వారానే నిర్వహించుచున్నట్లు ప్రస్ఫుట మవుతున్నది.

ఆ విధంగా శక్తి – చేతనత్వములకు ప్రతీకయైన దేవి లేకున్న ఈ సృష్టి శ్మశాన తుల్యము. విశ్వమంతయు జాగ్రత్, స్వప్న, సుషుప్త్యవస్థలకతీత, తురీయస్థితియైన చిత్‌స్వరూపిణి – భగవతియొక్క ప్రతిరూపమే. అట్టిశక్తి ఆద్యంతములు లేనిది, అవినాశి మరియు నిత్య స్వరూపిణి.

## కలియుగంలో శ్రీవైష్ణవి

అది సుమారు ఏడువందల సంవత్సరముల పై చిలుకు నాటిమాట. ఆ ప్రదేశం వేదజనని భరతఖండపు ఉత్తరభాగం. హిమాలయ పర్వతశ్రేణుల సానువులలో అత్యంత రమణీయమైన ప్రదేశం. మూడువందలఅరవై రోజులూ ఆహ్లాదకరమైన వాతావరణంతో అలరారుతుంటుంది. కమనీయమైన ప్రకృతి సౌందర్యం కన్నులవిందు చేస్తుంటుంది. అది లోక కళ్యాణార్థం, వేదవాణి అయిన “ఓంశాంతి”, ప్రణవార్థానికి ప్రతీకగా శ్వేతవర్ణంతో భాసించే మంచుపర్వతాలకు మూలపుగడ్డ.

బహుజాతుల పూతేనెలు మనసారా సేవించి మత్తులో ఝూంకారము మరచి పుష్పాలపైనే పరవశించి తూలుతున్న తుమ్మెదల గుంపులతో నిండిన పూతోటలకు పురిటిగడ్డ. మధురఫలాల భారంతో నేలను ముద్దాడుతూ ఆప్యాయంగా ఆశ్రిత ఆర్తులను ఆదరించే పండ్లతోటలకు మేటిపెరటి. ఎత్తైన వృక్షాలకు పోటిగా ప్రేమతో పెనవేసుకొని ఎగబాకి, విరగబూస్తూ సకలవర్ణాలతో ఆదిత్యుని ప్రకాశానికి దీటుగా ఆకాశాన్ని వర్ణశోభితం చేస్తున్న దట్టపు హరితారణ్యాలకు ఆలవాలం. ప్రతిశిఖరం శివుని శిరస్సుకాగా, ఆకాశం నుండి అదృశ్యంగా ఆపైదూకి, అటనుండి ప్రళయవాహినిగా జాలువారే గంగలాగా లెక్కలేనన్ని జలపాతాలకు, భూమిని తాకిన పరవశంతో హృద్యంగా పరవళ్ళుతొక్కే సెలయేళ్ళకు పురిటిగడ్డ ఆ దివ్యభూమి.

అదే ఇల కైలాసానికి ముఖద్వారమై, ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతూ అన్నింటా ప్రాధాన్యత సంతరించుకున్న దివ్యధామం ‘జమ్మూకాశ్మీర’ రాష్ట్రం.

అది ప్రస్తుతం జమ్మూ విభాగంలోని 'కాట్రా' నగరానికి సుమారు రెండు కి.మీ దూరంలో త్రికూట పర్వతలోయలో నెలకొన్న 'హంసలి' అనే గ్రామం. నాల్గుదిక్కుల ఎత్తైన వృక్షాలతో కూడిన హరితవనాలు, ఆవల ఆకాశాన్నంటే పర్వతాలు, వయ్యారంగా జాలువారు తున్న జలపాతాలు, ఊరిమధ్యగా గలగలాపారుతున్న పిల్లకాలువలతో ఎంతో మనోజ్ఞంగా ఉన్నదా గ్రామం. వనాల, పూదోటల మీదుగా ప్రయాణం చేసిన మలయమారుతాలు ఆ సుగంధాలను గ్రామమంతా వెదజల్లుతున్నాయి. అంతటి ఆహ్లాదకర పర్యావరణంలో ఆధ్యాత్మికతను ప్రాణవాయువుగా అందిస్తూ. ఆలౌకిక ఆనందపు అనుభూతులు అందచేస్తూ వీనులవిందుగా వినిపిస్తున్నాయి "దేవీపూజా విధానం మరియు దేవ్యపరాధ క్షమాపణస్తోత్రం".

భక్తి - ఆత్మసమర్పణభావం తొణికిసలాడుతున్న ఆ పారాయణం త్రికూటపర్వత లోయల లోతులుచూచి తిరిగి కొండచరియలను ఢీకొని హృద్యంగా ప్రతిధ్వనిస్తోంది. ఆ స్తోత్రం చెవినేసుకుంటూ దినచర్యలో నిమగ్నమయిన ఆ ప్రాంత వాసుల హృదయాంతరాళాల్లోని "భక్త్యా వేదన" ఏకంగా ఆ తల్లి అనుగ్రహ దర్శనం వల్ల వెలువడే ఆనంద బాష్పాలతో ఉపశమిస్తోంది.

భావార్థ సహితంగా, గంభీరంగా, ప్రాతఃకాలాన వినిపించే ఆ కంఠం గ్రామ ప్రజలకు ప్రీతిపాత్రుడైన పండిత శ్రీధరునిది. అతడు పండితుడే గాక గొప్పవక్త, ఉపన్యాసకుడు కూడా. విద్యార్థులకు జ్ఞానబోధచేస్తూ గ్రామస్థులకు ధర్మం, నీతి బోధించే రామాయణ, భారత, భాగవతాది గ్రంథాల అంశాలు ప్రవచనం చేస్తుంటాడు. గ్రామ అభ్యుదయం కోసం తన వంతు సహకరిస్తూ, ఆ కార్యక్రమాలు సమన్వయం చేస్తూ, గ్రామ ప్రజలతో తలలో నాలుకగా మసలుతున్నవాడు. ప్రతిదినం వినే దేవీ అపరాధక్షమాపణ స్తోత్రం భావార్థం, క్షుణ్ణంగా గ్రామ ప్రజల గుండెల్లో లోతుగా నిండుకొని ఉంది. శ్రీధరుని గొంతుక నుండి వెలువడుతున్న ఆర్ద్రత ఆ దినం గ్రామాన్నంతా

కలచివేస్తోంది. "అమ్మా! నిన్ను శరణు కోరితే కష్టాలన్నీ తొలగిపోతాయని తెలుసుకున్నాను. కాని నాకు ఏలాంటి మంత్రాలు, స్తోత్రాలు, యంత్రాలు, ధ్యాన విధానాలు తెలియవు. నీతో మొరపెట్టుకోవడం కూడా తెలియదు. నీ పూజా విధానం తెలియనందున, ధనాభావంచేత, ఆచరణలో అశక్తుడనైనందు వల్ల నీ పాదసేవ చేయలేకున్నాను. క్షమించు ఈ భూమిపై సుశీలురైన నీ బిడ్డ లెందరో నీ సేవలో తరిస్తున్నారు. కాని నేను చంచలస్వభావం కలవాడనయ్యాను. తల్లి ఎడల దుష్టుడైన కొడుకులుంటారు గాని–కొడుకుపై కాఠిన్యం వహించే తల్లి ఎక్కడైనా ఉంటుందా?

ఆకలి దప్పుల సమయంలో బిడ్డలు అమ్మా! అని ఆక్రోశించడం పరిపాటి అయినట్లు నేనీ ఆపద సమయంలో నిన్ను తలుస్తున్నాను. నన్ను చెడువానిగా భావించకు. నీవు దయాసముద్రవు. అపరాధములు పరంపరగా చేస్తున్నా – తల్లి, కొడుకును విస్మరించదు గదా! ఓ జగదంబా, నీవు నన్ను కరుణించడంలో ఆశ్చర్యమే లేదు. నా వంటి పాపిలేదు. నీ వంటి పాపహారిణిలేదు. నా యోగ్యతానుసారం నన్ను అనుగ్రహించు."

అనుదినం ఈ స్తోత్రార్థాన్ని నెమరువేసుకుంటున్న ఫలంగా మనస్సులో కోరుకున్న కోరికలు యోగ్యతానుసారం ఫలించడం ఆ గ్రామ ప్రజలకు పరిపాటి. పండిత శ్రీధరుడు పఠిస్తున్న ఆ స్తోత్ర నివేదన ముగిసింది.

"జయజయమహాదేవి! జయ జయ అంబ, జయభవాని జయం జయం" ఒక్కసారిగా ఆయన కంఠం ఆర్ద్రతతో గద్గదమైంది. కళ్ళు చెమర్చాయి. నొసటిపై చందనం తిలకంతో కలసిన చెమట వరదగా మారి కనుకొలుకులకు చేరుతోంది. జగన్మాతతో ఇలా మొరపెట్టుకున్నాడు, శ్రీధరుడు.

"తల్లీ జగన్మాతా! అనునిత్యం నేను చేస్తున్న అర్చన, స్తోత్ర, పూజా, విధివిధానాలలో దోషాలేంటి? నన్నేల కరుణించవు? నేనెరుగుదును, నీవు

త్రికాలజ్ఞవు. ఇన్నాళ్ళ నా ప్రార్థనలు విన్నపాలు స్వీకరించి అనుగ్రహించ లేదేల? ఇకనైనా కనికరించు. నా పొరపాట్లు, దోషాలు క్షమించు, లేకుంటే నాకు దర్శనమిచ్చి "నాకున్న సంతాన లేమితో నా వంశం ఏలా వృద్ధిచెందుతుందో తెలియజెప్పు." అంటూ భక్తి భావోద్వేగంతో తనలో తను మాట్లాడుకోసాగాడు. శరణాగతితో ఆత్మసమర్పణ చేసుకుంటున్న ఆతని పెదవులు తడారిపోతున్నాయి. శరీరం కంపించసాగింది.

ఇంతలో ఎవరో ఆ ప్రాంగణంలోకి ప్రవేశించిన అలికిడి. వారెవ్వరో, తనను సంభోదించకుండానే, సమీపిస్తున్నట్లు అర్థమౌతోంది. సున్నితమైన పదవిన్యాసపు సవ్వడి. ఏదో శుభసూచకంగా ఆసక్తిని కలిగిస్తోంది. మృదువైన పాదస్పర్శతో పరవశిస్తున్నట్లు, ఎండుటాకుల గలగలల హర్షాతిరేకం, దివ్యానందాన్నిస్తోంది. తమ పూలపై సేదతీరుతున్న నీటిబిందువులకు, పుప్పొడిని, పూదేనెను చేర్చి ఆ అతిథి పాదప్రక్షాళన చేసి, పూలనురాల్చి పూజించి, ధన్యుల మయ్యామన్న ఆనందంతో పూమొక్కల నృత్యహేల, శీతలపవనాల స్పర్శతో ఆహ్లాదకరంగా ఉంది. ఘల్లు ఘల్లు మంటూ కాలికడియపు చిరుమువ్వల రవళి. దివ్యానందపు అనుభూతితో మేను పులకించి, ఆనంద బాష్పాలు నిండిన కళ్ళతో తలపైకెత్తి ఆసక్తితో చూచాడు శ్రీధరుడు.

పట్టపగలు సూర్యకాంతిని త్రోసిరాజన్నట్లు, చల్లని సాయంత్రపువేళ చంద్రకాంతి తీసికట్టన్నట్లు, దివ్యమణి కాంతులతో, ఇంద్రధనుస్సు కాంతులీనుతూ ఎంతో మనోహరంగా ప్రకాశిస్తోందా ప్రాంగణమంతా. ఏదో అద్భుతం జరుగబోతోందన్న ఆనందం ఒకపక్క, ఏమీ అర్థంకాని ఆయోమయ స్థితి మరోపక్క, పండితుడు చుట్టుపక్కలంతా ఆతృతతో వెదకసాగాడు. కానీ విచిత్రం! ఎంత వెతికినా ఏలాంటి వ్యక్తి జాడ కనరాలేదు. క్రమంగా అతనికి ఆవేదనతో గూడిన నిరుత్సాహం ఆవహించసాగింది.

అదంతా భ్రమగా భావించి, నిట్టూర్చి తననుతానే సంబాళించుకొని జగన్మాతకు దోసిలినిండుగా పుష్పాలు సమర్పించి, నమస్కరించి మిట్టపైనున్న గ్రామానికి బయల్దేరాడు శ్రీధరుడు. అక్కడ సప్తకన్యల నోము నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకోవలసిఉంది.

సప్తకన్యల వ్రతం-గణపతిపూజ-దేవిపూజలతో ప్రారంభమైంది. ఆరుగురు చిన్నారి బాలికలు పద్మాసనస్థితులై వరుసక్రమంలో కూర్చొని ఉన్నారు. పండిత శ్రీధరుడు ఒకరి తరువాత ఒకరుగా ఆ బాలికల పాదాలను అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రక్షాళనం చేస్తున్నాడు. ఆశ్చర్యం! అంతలో ఒక్కమారుగా, ఉదయపు మధుర సంఘటన మదిలో స్ఫురించగా, “అదే మువ్వల రవళి” అతని చెవుల్లో ఆహ్లాదంగా ప్రతిధ్వనించసాగింది. ఎదుట అనుపమ సౌందర్యరాశి - దివ్య తేజోవతి అయిన ఒక బాలిక ప్రత్యక్షమయింది. పండితుని ఆనందానికి అవధుల్లేవు. వందలాది సూర్యులు ఒక్కమారుగా ఉదయించగా ప్రజ్వలించిన కాంతికి దీటుగా ఆ బాలిక ముఖమండలం అపార అలౌకిక తేజస్సుతో విరాజిల్లుతోంది. వేలాది పుష్పాలు ఒకేమారు వికసించినంత అందాన్ని సంతరించుకున్న ఆమె ముఖం అమాయకత్వం తొణికిసలాడుతుండగా చూపరులకు దివ్యానందాన్ని కల్గిస్తోంది.

ఆశ్చర్యం! ఇంతకు ముందెన్నడూ తాను ఈ కన్యను చూచి ఉండలేదు. ఈ గ్రామానికి చెందిన బాలికగా కూడా అనిపించడం లేదు. ఎర్రని వస్త్రాలు ధరించిన ఆ బాలిక కుసుమ కోమలమైన పాదాలకు, ఘల్లుఘల్లుమని సవ్వడి చేసే సిరిమువ్వల పట్టీలు అలంకరించబడి ఉన్నాయి. ఈ కన్య తన పాదాలను శ్రీధరుని చేరువకుచేర్చింది. విస్మయచిత్తుడైన పండితుడు ఆనంద బాష్పాలు జాలువారుతుండగా తన్మయుడై ఆమె పాదాలను కడుగసాగాడు. ఆ దివ్య స్పర్శకు, శ్రీధరుని శరీరం పులకించి, పునీతమైంది. భగవతి అనుగ్రహ స్పర్శక్రమంగా అతనికి అవగతమౌతోంది. ఆ అలౌకిక

దివ్యానుభూతి నుండి తేరుకొని. తదుపరి సప్తకన్యలకు పాదాభివందనం చేసి అర్ఘ్యం సమర్పించాడు. నైవేద్యం పిమ్మట భక్తితో దక్షిణ తాంబూలాదులు సమర్పించాడు. సంతుష్టులైన మిగిలిన కన్యలందరూ అచ్చటి నుండి నిష్క్రమించగా, దివ్యస్వరూపిణి మాత్రం అక్కడే విశ్రమించసాగింది. పండిత శ్రీధరుడు ఆమెతో మాట్లాడడానికి ఉపక్రమించేలోగానే, కన్యరూపంలో ఉన్న దివ్యశక్తి ఇలా పలికింది.

"ఆర్యా! నేను తమవద్దకు ఒక ఆవశ్యక కార్యంపై వచ్చియున్నాను". కౌమారపు ఛాయలు వీడని ఆ కన్యనోట విచిత్రమైన ఆ మాటలు విన్న శ్రీధరుడు నిర్విణ్ణుడై భయంతో కంపించసాగాడు. "నీవు నీ గ్రామంలోను చుట్టుపక్కల గ్రామాలలోను, ప్రజలందర్నీ రేపు మధ్యాహ్నం నీ ఇంట జరుగనున్న గొప్ప విందుకు హాజరుకమ్మని ఆహ్వానించిరావాలి."

అమ్మా! అదెలా??? అనబోయి, ఈ ఆశ్చర్యకరపరిణామంనుండి తెప్పరిల్లి ఆ కన్యతో సంభాషించాలని ఉపక్రమించేలోగా ఆమె అదృశ్యమయింది. శ్రీధరుడు ముప్పిరిగొంటున్న ఆలోచనలతో సతమతమవసాగాడు. ఇంతకీ వాస్తవానికి ఈ కన్య ఎవరు? ఈ ఆలోచన అతన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. ఏదేమైనా ఈమె ఓ దివ్యకన్య కాక మరొకరుకాదు. అయితే ఆమె సూచించిన ఘనమైన విందు ఏర్పాటు సమస్యతో పండిత శ్రీధరుడు వ్యాకులతకు లోనయ్యాడు. ఇలా ఆలోచించసాగాడు. పిలుపులకు నేను బయల్దేరితే విందు ఏర్పాట్లు వేరెవరు నిర్వహిస్తారు? నాకు విందు ఏర్పరిచే సామర్థ్యమేది? నేనేమి చేయగలవాడను? ఆహ్వాన విధి విరమించుకుంటే? అమ్మో! ఈ కన్య దివ్యశక్తి అయితే, ఆమె అనుజ్ఞ పాటించకుంటే? నా అజ్ఞాన కారణంగా తల్లిఅనుగ్రహం కోల్పోయి జీవితాంతం చింతించాలి. ఇది నాకు పరీక్షాసమయమే". సుదీర్ఘ ఆలోచన అనంతరం, శ్రీధరుడు ఆ కన్యక వాక్కులను అనుసరించటమే శ్రేయస్కరంగా భావించి ఆహ్వాన ప్రక్రియకు ఉపక్రమించాడు. గ్రామప్రజలందరూ ఆశ్చర్యచకితులై

చూస్తుండగా వారందరినీ సాదరంగా విందుకు ఆహ్వానించి పక్కగ్రామాలలో ఆహ్వానం పూర్తి చేసుకున్నవాడై తుదిగా గురుగోరఖ్‌నాథ్ ఆశ్రమం చేరాడు పండిత శ్రీధరుడు.

వారి శిష్యుల ఆహ్వానంతో సుఖాసీనుడైన శ్రీధరుడు ఆ ఆశ్రమ వాతావరణాన్ని నిశితంగా గమనిస్తూ నాథ సాంప్రదాయాన్ని ఒకమారు నెమరు వేసుకున్నాడు.

"నాథ సాంప్రదాయానికి మూలం శైవయోగం. "హఠయోగం, ముద్రాబంధం, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధులు" – ఈ సాంప్రదాయానికి పునాది. ఇందు తాంత్రిక సాధనాపద్ధతి యోగికీకరణం చేయబడి శక్త్యుపాసనా పరమైన యోగినీ కౌలమతం ప్రవర్తకం చేయబడింది. అంటే శివ – శక్తుల సామరస్యం సంధానం చేయబడిందన్నమాట. ఈ సాంప్రదాయకులు "మూలాధార – ఉడ్యాణ–జాలంధర బంధం" మొదలైన యోగాభ్యాసాలతో హృదయ కమలంలో చలించే జ్యోతివంటి పరమాత్మకళను సాక్షాత్కరింపచేసుకొని, కాలచక్ర రహస్యాలను మరియు సమస్త తత్త్వాలను యోగాభ్యాసంతో జయించి వశం చేసుకుంటారు. వీరి గురువు మత్స్యేంద్రనాథుడు."

ఇంతలో అక్కడకు వచ్చిన భైరవనాథునికి తనరాక కారణం తెలియచేశాడు. శ్రీధరుడు. ఆహ్వానం అందుకున్న భైరవనాథుడు ఇలా పలికాడు.

"పండిత వర్యా! మరొక్కమారు స్తిమితంగా ఆలోచించి చెప్పండి. ఇప్పటికీ సమయం మించిపోలేదు. అసందర్భంగా మీరు మా గురువుగారి కోపానికి బలిఅయ్యే పరిస్థితి కల్పించుకోవద్దు. అతిథి మర్యాదలు సంతృప్తికరంగా లేని పక్షంలో తీవ్రపరిణామాలను ఎదుర్కొనవలసిఉంటుంది. తలుచుకుంటే మా గురువు ఒక్క క్షణంలో తన కోపాగ్నితో మీ గ్రామాన్నే

సమూలంగా భస్మీపటలం చేయగలడు." ఇంకా భైరవనాథుడు ఇలా సర్దిచెప్పప్రయత్నించాడు. "అయ్యా, మీకు ఏమీ తెలియనట్లుంది. వినండి. క్రితంలో ఒక మారు దేవతలరాజు ఇంద్రుడు మమ్మల్ని ఇలాగే విందుకు ఆహ్వానించారు. విందులో నిరవధికంగా వడ్డిస్తూ ఉన్నారు. మా యోగి సమూహం అంతా ఆరగిస్తూనే ఉన్నాం. పాపం! ఇంద్రదేవుడు! ఏంచెప్పను? ఇంద్రపురిలో ఆహారనిల్వలు అడుగంటాయి. ఇంద్రలోక వాసులందరు, మేముకోరిన ఆహార పదార్థాలు సమకూర్చడానికి తీవ్రప్రయత్నం చేశారు. అయితే తుదిగా మా కడుపునిండా ఆహారం అందించలేక క్షమాపణలు కోరారు. హా!హా!హా! మీకు అర్థమయిందనుకుంటాను! ధన, ధాన్య కనక సంపన్నుడు, సాక్షాత్ దేవతల రాజైన ఇంద్రుడు మాకు తగినంత ఆహారం పెట్టలేక విఫలమయ్యాడు. తెలుసుకోండి. తమరు మమ్ము విందుకు ఆహ్వానించి బహుపెద్ద తప్పుచేస్తున్నారు. మరొక్కమారు ఆలోచించండి!"

అది విన్న శ్రీధరుడు ముకుళిత హస్తుడై ఇలా విన్నవించుకున్నాడు. "అయ్యా! తమరు సాధువులు, సంతులు, యోగులు. కేవలం నా పూర్వజన్మ సుకృతం చేత మిమ్ములను ఇలా దర్శనం చేసుకోగలిగాను. రేపటి విందుకు నేను ఈ చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరిని ఆహ్వానించి యున్నాను. నేను నా కర్తవ్యాన్ని గుర్తెరిగే మిమ్ములను రేపు మా గృహాన్ని పావనం చేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను. ఇంత ఘనమైన విందు నిర్వహించగల స్వయంసామర్థ్యం లేని వాడినని తెలిసికూడా, తగురీతిన ఏర్పాట్లు చేయగలనని హామీ ఇస్తున్నాను. ఇక అంతా ఆ బాలిక దయయే!"

అదేంటి? "ఇక అంతా ఆ బాలిక దయయే" అంటే అర్థమేమిటి? అన్నాడు భైరవనాథుడు. యోగివర్యా!" ఇదంతా ఆ బాలిక ఆదేశంతోనే...," సంశయంతో తటపటాయిస్తూ సప్త కన్యకల పూజ విశేషం సవివరంగా నివేదించాడు శ్రీధరుడు.

కన్య? ఎవరీకన్య? భలేగావుంది! ఒంటరిగా ఒక కన్య ఇంతటి, పెద్ద యోగిదళానికి విందు భోజనం తయారుచేసి పెట్టగలదా? మొత్తం గ్రామ వాసులందరికి విందు అందించగలదా? ఓహో! గురువర్యా! చూడండి; ఈ పండితు దేమంటున్నాడో? ఒంటరియైన ఓ కన్య ఇంతమందికి ఆహారం అందించగలదట! అంటూ ఎగతాళిగా, పగలబడి నవ్వసాగాడు భైరవనాథుడు. అయితే గురువు గోరఖనాథుడు మధ్యలోనే అతన్ని వారించి "భైరవా! ఈ సందేహనివృత్తికి, రేపు అక్కడికక్కడే పరీక్షిస్తే తప్పేముంది? రేపటిదినం మనం తప్పక వీరి ఇంటికివెళ్ళి అంత గొప్పకన్య ఎవరో తెలుసుకుంటాం. అంటూ శ్రీధరుని వైపుచూసి "మేము మా శిష్యగణంతో కూడి విందు భోజనం స్వీకరించేందుకు రేపు నిర్దిష్ట సమయానికి మీ ఇంటి వద్దకు చేరగలం" అని పలికాడు.

గ్రామ గ్రామాలు తిరిగినవాడై, అలసిన శ్రీధరుడు సాయంసమయానికి ఇంటికి చేరి అలసటతో వెంటనే నిద్రకు ఉపక్రమించాడు. విందు ఏర్పాట్లు, నిర్వాహణ ఆలోచనలతో సతమతమౌతున్న శ్రీధరునికి భళ్ళున తెల్లవారింది. అంతులేని ఈ ఆలోచనలకు తెరపడకుండానే, సమయం ఎలా గడుస్తున్నదో తెలియకుండానే భోజన సమయం ఆసన్నమైంది. ఆహ్వానితుల బృందాలు ఏకంఅయి కుటీరం అవరణ అంతా అతిథులతో నిండిపోయింది.

పండిత శ్రీధర్ తన కుటీరం ముంగిట పేడతో అలికిన మట్టి అరుగుపై కూర్చొని ఎదురుకాబోయే పరిణామాలు తలుచుకుంటూ, ఆవేదనతో, తలమునకలై ఉన్నాడు. ఏమీ అర్థంకాని అయోమయ పరిస్థితి నెలకొని ఉంది. "ఏం చేయాలి? ఏం జరగబోతోంది?" ఇవి శేషప్రశ్నలు.

ఇంతలో అతని చెవులలో చిడతల శబ్దంతో కూడిన భగవన్నామస్మరణ విన్పించ సాగింది. ఆ దిక్కువైపు తేరిపారచూసేసరికి "బోలేనాథునకు జయము-జయము" అన్న నినాదాలతో తమ భారీ శిష్యగణాలతో కూడి

యోగి భైరవనాథుడు, ఆతని గురువు గోరఖ్‌నాథుడు తన కుటీరంవైపు రావడం కన్పించింది.

శ్రీధరునికి ఉద్విగ్నత అధికంకాసాగంది. ఆహ్వానితులైన గ్రామ ప్రజలంతా తన కుటీరం ముందు గుమిగూడి ఆశ్చర్యంతో చూస్తున్నారు. ఈ విచిత్ర పరిస్థితిని గురించి పరస్పరం రకరకాలుగా చెప్పుకుంటున్నారు. "పాపం! పండితుడు ఈ దినం విచిత్రంగా ఇరుక్కుపోయాడు" అంటున్నాడొక వ్యక్తి వేరొకడు "చూడగా ఇది సంపూర్ణంగా గ్రామ సమస్యగా మారబోతున్నట్లున్నది" అంటున్నాడు. "మరి ఎందుకు ఇంత అనాలోచితంగా గ్రామ వాసులనందరినీ విందుకు ఆహ్వానించినట్లు? ఇదేమైనా నవ్వులాట వంటిదా ఏంటి?" స్త్రీలు కూడా గుసగుసలాడుతూ కన్పించారు.

అప్పటిదాకా తీక్షణంగా ఉన్న ఎండ తీవ్రత అకస్మాత్తుగా తగ్గింది. ఆకాశం అంతా మేఘావృతమైంది. ఆ ప్రదేశమంతా చీకట్లుకమ్ముకున్నాయి. ఆశ్చర్యం! అంతలో ఒక్కమారుగా ముందుకన్నా మిక్కిలిగా అద్భుతమైన కాంతితో ఆ ప్రదేశమంతా ప్రకాశించింది. కళ్ళు మిరుమిట్లుగొలిపేలా ఆదివ్యకన్య ఎర్రని వస్త్రంధరించి, కమండలంచేతబూని, త్రిశూలం భుజంపై ఉంచుకొని శ్రీధరుని ఎదురుగా నిలిచింది. ఆ కన్య ఎచ్చటినుండి, ఎలా, ప్రత్యక్షమైందో ఎవ్వరికి అంతుబట్టలేదు.

అందరూ ఆశ్చర్యంలో మునిగిపోయారు. ఆ దివ్యకన్య శ్రీధరునితో ఇలా పలికింది! "భక్తా! ఆవేదన చెందకు. విందు నిర్విఘ్నంగా నిర్వహింప బడుతుంది. ముందుగా యోగుల నందరిని, భోజనం సిద్ధంగా ఉన్నందున కుటీరంలోకి ప్రవేశించ మని సాదరంగా ఆహ్వానించు."

పండిత శ్రీధరుడు ఉత్సాహంతో లేచి యోగుల గురువు గోరఖ్‌నాథుని తన పాదస్పర్శతో కుటీరాన్ని పావనం చేయమని కోరాడు. అంత గురువు "పండితా! మూడువందల అరవైమంది శిష్యులతో కూడి అరుదెంచిన మేము

మీ చిన్న కుటీరంలో ఏలా కూర్చొని భుజింపగలం? ఆరుబయట స్థలం మాకు ఉచితమని తోచుచున్నది. కుటీరం చిన్నదైనందున, ఆహార పదార్థాలను ఇక్కడికే తెప్పించండి” అని పలికాడు.

ఆర్యా! “ఆ కన్య తమకు కుటీరమందే ఆతిధ్యం అందించమని చెప్పింది”. అని పలికాడు శ్రీధరుడు. గురువు ఆశ్రమంలోకి అడుగిడగానే వారిని అనుసరించి శిష్యులందరూ – ఆహారం స్వీకరించేందుకు సుఖాసీనులయ్యారు. విచిత్రంగా, ఎందరు బారులు తీరినా, ఎన్ని పంక్తులు నిండినా, ఇంకా ఖాళీ స్థలం ఏర్పడుతూ, ఆహ్వానం పలుకుతూ, ఆ కుటీరం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. సాటి గ్రామ వాసులందరకూ కుటీరం ముంగిట, ఆరుబయట స్థలంలో విందువసతి ఏర్పరచబడింది.

పంక్తులలో భారీ వడ్డన ప్రారంభమైంది. దివ్యకన్య తన కమండలంలోని జలం మంత్రించి ప్రోక్షిస్తూ వివిధరకాల రుచికరమైన పదార్థాలను అపరిమితంగా సృష్టించింది. తనఆవేదన అంతా ఒక్కమారుగా తొలగిపోగా పండిత శ్రీధరుడు ప్రసన్నుడై ఎంతో సంతోషంగా వడ్డనలో పాల్గొంటు మరింతగా ఆనందిస్తున్నాడు. రుచికరమైన వంటలను సంతృప్తితో భుజిస్తూ ఆశ్చర్యానికి లోనుకావడం అతిథుల వంతైంది. అందరికీ ఏలాంటి లోపంలేకుండా వారివారి ఆసక్తి అనుసారం వంటకాలు అందచేయ బడుతున్నాయి. అతిథులందరూ వివిధరకాల వంటలను వారివారి ఇచ్ఛానుసారం నచ్చినవిధంగా భుజించసాగారు.

ఈ అపూర్వఘట్టాన్ని గమనిస్తున్న గురుశిష్యులు గోరఖ్‌నాథ్ – భైరవనాథులు పరస్పరం చర్చించుకొని ఇలా ఆలోచించసాగారు. “మానవాతీత శక్తులు ప్రదర్శిస్తున్న ఈ కన్య తప్పక ఒకశక్తి అంశయే! వాస్తవానికి ఈ శక్తి ఎవరు? ఈ బాలిక సమాచారం తెలుసుకొని తీరవలసిందే. ఇలా ఉండగా, ఆ కన్య నెమ్మది నెమ్మదిగా అందరికీ వంటలు వడ్డిస్తూ భైరవనాథుని సమీపించింది.

"ఓ బాలికా! అందరికీ వారి కోరికమేర విందు భోజనం వడ్డిస్తున్నావు. మరి నాకు కూడా నా మనసుకు నచ్చిన వంటకాలను వడ్డించలేవా?" అన్నాడు భైరవనాథుడు, వ్యంగ్యంగా. "చెప్పండి యోగినాథా! తమరేం కోరుకుంటున్నారు?" అన్నది బాలిక. మాత త్రికాలజ్ఞ, సర్వాంతర్యామి అయిఉండి కూడా తాను ప్రదర్శించబోయే లీలలో అంతర్భాగమా? అన్నట్లు, – పసిబిడ్డ తన ఆటవస్తువులతో ఆడుతూ పాడుతూ, పరుగెడుతూ, సంభాషిస్తూ ఆడుకునే విధంగాతన భవిష్యలీలా ప్రక్రియను రచించసాగింది. భైరవనాథుని మనస్సులోని ఆలోచనలను పసికట్టినదై ఉండికూడా, దానిని అతని నోటినుండే వినాలని తలచింది, కన్యరూపంలోని మాత. "ఆలా అయితే ఓ కన్యా! నాకు మద్యం – మాంసాలతో కూడిన భోజనం తెచ్చి వడ్డించు" అన్నాడు భైరవనాథుడు. "భైరవనాథా! మీరు ఒక శ్రీవైష్ణవ బ్రాహ్మణుని కుటీరంలో భోజనార్థం ఆసీనులైయున్నారన్న విషయం మరువకండి! ఇచ్చటి విందు కేవలం వైష్ణవ సాంప్రదాయ భోజనమే! కావున శ్రీవైష్ణవ విందులో అనుపాకాలు పిండివంటల పదార్థాల నుండి ఎంచుకోండి!"

అసహనంతో భైరవనాథుని మొండిపట్టుదల తీవ్రతరంకాసాగింది. ఆ కన్య వడ్డించగా మద్యం సేవించి, మాంసాహారం భుజించి తీరాలన్న నిర్ణయిం మరింత దృఢతరం కాసాగింది. "అతిథి – వడ్డించని విస్తరి" అన్నది, ఆ కన్యకు విషమపరీక్ష. తానే నెగ్గాలని భైరవనాథుని నిర్ణయం. తర్క – వితర్కాలు ఎన్నో చోటుచేసుకున్నాయి. యోగిక్రోధం తారాస్థాయికి చేరింది. ఎలాఅయినా ఆ కన్యచేయిపట్టి వారించి, బలాధిక్యం ప్రదర్శించ దలిచి, ముందుకు ఉరికాడు భైరవనాథుడు. ఆశ్చర్యం! కన్యక రూపంలోని మహాశక్తి ఆక్షణంలోనే అంతర్ధానమయింది. భైరవనాథుడు సాధారణ యోగి కాదు మరి! యోగవిద్యా పారంగతుడు. అతీతశక్తులను నియంత్రించే శక్తి గలవాడు. వెంటనే తన తపశ్శక్తితో ఆ కన్య వాయురూపంలో త్రికూటపర్వతం వైపు వేగంగా ప్రయాణించడం గమనించాడు. అతని జిజ్ఞాస తీవ్రరూపం

దాల్చసాగింది. ఇంతకీ ఈ కన్య ఎవరు? ఏ శక్తి ఈ రూపంలో సంచరిస్తున్నది? తెలుసుకోవాలన్న తాపత్రయం మిక్కుటం కాగా, అనుజ్ఞ కోసం తన గురువు గోరఖ్‌నాథ్‌ను ఇలా వేడుకున్నాడు. "గురుదేవా! నేనాకన్యను వెంబడించి ఆ కన్య ఎవరన్నదీ, ఆమెఉనికి వివరాలు సేకరించి రాగలను. ఆ కన్య సిద్ధులు పొంది ఉంటే అవి ఎవరి ద్వారా ఎలా ప్రాప్తించాయి? ఈ వివరాలన్నీ సమగ్రంగా తెలుసుకొవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఆ వివరాలన్నీ లభ్యమయ్యేలా అనుగ్రహించండి. ఈ కార్యంపై వెళ్ళిరాగలందులకు అనుజ్ఞ ఇవ్వండి".

వత్సా! "నీ ఇచ్ఛ నెరవేరగలందులకు సర్వేశ్వరుడు శుభాశీస్సుల నిచ్చుగాక!" అన్నాడు గోరఖ్‌నాథుడు. తన ప్రయత్నం సగభాగం సఫలమైందని భైరవనాధుడు ఆనందంతో ఒంటరిగా త్రికూటపర్వతం వైపు ప్రయాణం సాగించాడు. ఆ కన్యను వెతికి పట్టుకోవాలన్న కోరికబలమై పెద్దమ్మ నెత్తికెక్కి సవారిచేస్తోంది మరి. ఈ అన్వేషణలో భాగంగా అతడు పలుమార్లు సమాధిస్థితిలోకి చేరుకొని ఆ కన్య పవనరూపంలో పయనించిన మార్గాన్ని దర్శించి అదే మార్గంలో వడివడిగా ప్రయాణించ సాగాడు.

అది పండిత శ్రీధరుని కుటీరం. దివ్యకన్య ఆకస్మికంగా అంతర్ధానమై ఇది రెండవరోజు. పండితుడు మిక్కిలి విచారగ్రస్తుడైనాడు. వాస్తవానికి ఆతనిస్థితి వొడ్డునబడ్డ చేప చందంగా ఉంది. జలానుబంధం కోల్పోయిన చేప బతికి బట్టకట్టేదెలా? అవ్యక్తభావాలు మనస్సును అల్లకల్లోలం చేస్తుంటే, నిర్లిప్తంగా అదేపనిగా శూన్యంలోకి దిక్కులు చూడసాగాడు. అన్నపానీయాలు, నిద్ర, పరులతో సంభాషణ,మాని శ్రీధరుడు చేజారిన భాగ్యానికి చింతించ సాగాడు. దాహార్తితో ఎడారిలో నడుస్తున్న వ్యక్తికి, "ఎండమావి భ్రమతొలిగినట్లు ఆవేదన అతన్ని కలచివేస్తున్నది. దీనంగా ఆక్రోశించ సాగాడు. భారంగా దినం గడిచి, సూర్యాస్తమయమై చీకట్లు కమ్ముకోసాగాయి. నిస్సత్తువ ఆవహించగా సొమ్మసిల్లి నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు

శ్రీధరుడు. అదొక తియ్యని మాతృస్పర్శ అనుభూతి. పండిత శ్రీధరుని తలపై ఒక స్త్రీ తన మృదువైన హస్తాలతో నిమరసాగింది. మున్నెన్నడు లేని సాంత్వన. ఏదో దివ్య ఆనందానుభూతి. ఆనందబాష్పాలతో కళ్ళుతెరచి చూసిన శ్రీధరుడు తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. ఎదురుగా సాక్షాత్ దుర్గాదేవి సింహంపై ఆసీనురాలై దర్శనమిచ్చింది. దివ్యాభరణాలను, త్రిశూలాది పలుఆయుధాలను ధరించి ప్రకాశిస్తోంది. శ్రీధరుడు శిరస్సువంచి సాష్టాంగ ప్రణామంచేసి ఆనందాశ్రువులతో తడబడుతున్న ఉచ్చారణతో దేవిని ప్రార్థించసాగాడు.

కరుణామూర్తి దుర్గ పండితునితో ఇలాఅంది. "శ్రీధరా! అన్న పానీయాలను త్యజించావెందులకు? కఠోరదీక్షతో, అపారభక్తితో నీవుచేస్తున్న పూజలు, స్తుతిస్తోత్రాలు నన్నెంతో ముగ్ధురాలను చేసాయి. నీ జన్మ ధన్యమయింది. ఇలా రా. నన్ననుసరించు. నీకు నా దివ్యధామ దర్శనం కల్పిస్తాను".

అనూహ్యమైన దివ్యానందంతో కాళ్ళు తడబడుతుండగా శ్రీధరుడు జగన్మాతవెంట ముకుళిత హస్తుడై ప్రయాణం సాగించాడు. వారిరువురు ఒక ఎత్తైన పర్వతం అధిరోహించసాగారు. శ్రీధరుని శరీరం దూదిపింజలా తేలియాడుతుండగా, అప్రయత్నంగా, యాంత్రికంగా, ఆనందంతో జగన్మాతను అనుసరిస్తున్నాడు.

"ఆహా! మహామాతృక ఎంత దయతో అనుగ్రహించింది!" శ్రీధరుడు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ తేరుకొనేలోగా వారిరువురు ఒక అద్భుతమైన గుహను సమీపించారు. గుహ ద్వారం చాలాచిన్నదిగాను, ఇరుకైనదిగాను ఉంది. జగన్మాత వాయురూపంలో లోనికి ప్రవేశించగా శ్రీధరుడు ఇనుమడించిన ఉత్సాహంతో పాకుతూ లోనికి చేరుకున్నాడు. అదొక అద్భుత అనుభూతి! తల్లి నివాసం దర్శిస్తున్న తన భాగ్యం కోటిజన్మల పుణ్యఫలం!

వర్ణనకందని ఆ శోభను తిలకించిన శ్రీధరుడు పులకించిపోయాడు. పలుమార్లు శిరస్సు తల్లి పాదాక్రాంతం చేసి "కృతార్థుడనయ్యానమ్మా" అంటూ ఆనంద భాష్పాలతో విన్నపాలు చేసుకున్నాడు. ఆ దివ్యానందాన్ని భరించే శక్తి తనికిక లేదనిపించింది శ్రీధరునికి. తల్లి దివ్యమంగళమూర్తిని తదేకంగా చూస్తూ నెమ్మదిగా వెనుకకు అడుగులు వేసుకుంటూ, కొంతదూరం ప్రాక్కుంటూ గుహ ముఖద్వారానికి చేరుకున్నాడు. గుహ బయట తేజోవంతమైన సూర్యకిరణాలు తన్మయత్వంతో ఉన్న ఆతని కనురెప్పలను తాకాయి.

శ్రీధరునికి నిద్రాభంగమైంది. వేకువ వీడసాగింది. తూర్పున భాస్కరుని అరుణోదయకిరణాలు ఆకాశమంతా వ్యాపించసాగాయి. "జై జగన్మాత!" అంటూ కళ్ళునులుము కుంటూ లేచి కూర్చున్నాడు, పండిత శ్రీధరుడు. మదినిండా మాతృ దర్శన ఆనందం నింపుకొని పండిత శ్రీధరుడు అవ్యక్త భావనిధిలా పరులకు ఎంతో ప్రసన్నంగా గోచరిస్తున్నాడు. స్వప్నంలో చూచిన సుందరమైన ప్రదేశం, భవంతులు, నిర్మాణాకృతులు ప్రకృతి సౌందర్య సంపద, తల్లి భోగభాగ్యాలు, వీటినన్నింటిని మించి అమ్మ వాత్సల్య–అనుగ్రహాల అపూర్వ అనుభూతితో అతని హృదయం పులకించి పరవశించి ఉన్నది. సింహవాహన – మాతస్వరూపం, అతని మనఃఫలకంపై ముద్రించ బడి ఉంది. పర్వతాలలో కష్టంతో కూడుకున్న ప్రయాణమార్గం, ఇరుకైన సుందర గృహప్రవేశ మార్గం, గుహలోపల శిలారూపంలో పిండాకృతులతో భగవతి దివ్య దర్శనం ఇదంతా ఒక్కోమారు ఎదో విచిత్ర మాయానుభూతిగా – ఎండమావుల వంటి భ్రాంతిని తలపిస్తూ ఒకింత ఆవేదన కలుగసాగింది. ఆ స్వప్నానుభవం మరుపురాకుండా – మరీమరీ నెమరువేసుకోసాగాడు శ్రీధరుడు. ఆనాటి నుండి భక్త శ్రీధరుడు ఆ జగన్మాత మందిరాన్ని గుర్తించేందుకు ప్రయత్నం మొదలుపెట్టాడు. స్వప్నంలో చూచిన మార్గం గుర్తించి తదనుసారం ఆతడు త్రికూట పర్వతం అధిరోహించాడు. మార్గ

అన్వేషణ ప్రక్రియలో అతని ఆతృత తీవ్రతరం కాసాగింది. ఎన్నోమార్లు మార్గాన్ని మరచి వేరొక మార్గంలో ప్రయాణిస్తున్నానేమో అన్న సందేహంతో సతమతమయ్యేవాడు. కాని ప్రతిసారి స్వప్నంలోని దృశ్యాలను నిశితంగా పునశ్చరణ చేసుకొని సరియైన మార్గాన్ని గుర్తించేవాడు. ఇలా నిరాశ నిస్పృహలను దరిరానీయకుండా సహనంతో వెతికివెతికి తుదిగా ఒకరోజు మాతృక గుహ ముఖద్వారాన్ని గుర్తించాడు. అదే ద్వారం! మహామాతృక స్వప్నంలో తోడ్కొని చూపించింది ఇదే ద్వారం! సాధించానన్న సంతృప్తి మనసంతా నిండిపోగా, అతని ఆనందానికి అవధుల్లేవు. ఇంతకాలానికి తన జన్మధన్యమైంది. శ్రీధరుడు పలుమార్లు చేతులు జోడించి మొక్కుతూ జగదంబను ప్రార్థించసాగాడు. అనాటినుండి అనునిత్యం పవిత్ర శిలా ప్రతిమలకు అభిషేకం, అలంకరణ, పూజ, ధూప, దీప, నైవేద్యాల సమర్పణ సభక్తికంగా నిర్వహించసాగాడు. అతని ఆత్మసమర్పణ ప్రక్రియ, భక్తి శ్రద్ధలకు మెచ్చినదై దేవి, ఒక దినం ప్రాతఃకాలాన శ్రీధరుని ఎదుట సాక్షాత్కరించింది. కరుణార్ద్రప్రదాయిని అయిన ఆ దేవేరి ఆతనికి నల్వురు పుత్రులను ప్రసాదించింది. ఆనందబాష్పాలతో నిర్విణ్ణుడైన శ్రీధరుని ఇలా ఆశీర్వదించింది. “వత్సా! నీ భక్తి నిరుపమానం! నీ వంశం యుగయుగాలుగా నా మందిరంలో అర్చకులై సేవ చేసుకుంటూ సుఖశాంతులు, ధనధాన్యాది సంపదలతో వర్ధిల్లగలరు”.

శ్రీవైష్ణవి అనుగ్రహంతో ఈనాటికి శ్రీధరుని వంశజులే మాతకు అర్చక స్వాములైయున్నారు. అలాగే విందు జరిగిన శ్రీధరుని ఇల్లు “భూమికా మందిర్” అన్న పేరుతో ప్రఖ్యాతమైంది. కాలక్రమేణా భక్త శ్రీధరునిచే ప్రకటీకృతమై ఈ దేవతామూర్తుల ప్రాచీన గుహ మందిరం ప్రపంచింపబడింది. సందర్శక భక్తకోటి మనోవాంఛలు సత్వరం సిద్ధించసాగాయి. భూలోకంలో కోరికలీడేర్చే తల్లికొలువు బహుళ ప్రాచుర్యం పొందింది. ప్రతి సంవత్సరం మాత వైష్ణవీదేవి సందర్శనార్థం వేంచేసే భక్తుల సంఖ్య వేలాది – లక్షలాదిగా క్రమంగా వృద్ధిచెందసాగింది. ప్రాంతీయవాసుల సాంప్రదాయం, ఉచ్చారణా

సౌలభ్యక్రమంలో ఈజగన్మాత శ్రీ మాతా వైష్ణోదేవి గాను, ఆ మందిరం దర్బారుగాను, ఈ క్షేత్రం భవన్ గాను, పిలువబడుతూ సుప్రసిద్ధమైనవి.

**మాతకై భైరవుని అన్వేషణ**

కాలచక్రం గిర్రున తిరుగుతున్నది. చూస్తుండగానే తొమ్మిదినెలలు గడచి పోయాయి. త్రికూటాది పర్వతాలపై భైరవనాథుడు ముగ్ధకన్యను వెతుక్కుంటూ దారితప్పినట్లు పిచ్చిపిచ్చిగా తిరుగాడుతున్నాడు. ఎన్నోమార్లు అతడు తన చిత్తప్రవృత్తి నంతా ఏకాగ్రంచేసి సమాధిస్థితి చేరుకొని ఆ బాలికగమనాన్ని, స్థితిగతులను తెలిసికొన ప్రయత్నిస్తూనే ఉన్నాడు. యోగవిద్యలో తన ప్రతిభా పాటవాలన్నింటిని కలబోసి ఎన్ని ప్రయోగాలు కావించినా ఆ కన్య ఎక్కడకు చేరుకొన్నదన్న నిర్ధారణకు మాత్రం రాలేకున్నాడు. కానీ ఆతని అంతరాత్మతట్టి చెబుతోంది. ఆ కన్య ఈ పర్వతం మీదే ఎదో భాగంలో ఉండే ఉంటుంది. కానీ, ఎక్కడ? అదొక యక్షప్రశ్నలా మిగిలిపోతోంది. అక్కడికి చేరేమార్గం గూర్చి స్పష్టత లేకుంది. మొదటిమారు యోగశక్తితో చూచినపుడు ఆమెకు అండగా చేత పతాకంతో ఒక నల్లని ఆకృతిగల వానరవీరుడు, అనుసరిస్తున్నాడు.

ఒక ప్రదేశంలో ఆ కన్య తన వాడి బాణాలను పెనుశిలలపై సంధించగా, ఎంతో లోతులో ఉన్న నీరు ఉవ్వెగిసిపడింది. ఆ ప్రదేశాన్ని స్పష్టంగా గుర్తించిన భైరవనాథుడు, అక్కడకు చేరుకొని సమాధిస్థితిలో నిమగ్నమయ్యాడు. ఆ స్థితిలో సత్వరం అతని ప్రయత్నం ఫలించింది. ఆనందంతో ఉద్విగ్నతకు లోనయ్యాడు భైరవుడు. ఆ కన్య ఊర్ధ్వముఖంగా ప్రయాణించి ఒక చోట నిలిచింది. అతడు మనోవేగంతో అక్కడికి చేరుకొని నిశితంగా గమనించాడు. నున్నటి ఆ శిలలపై ఆ కన్య పాదముద్రలు ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. అచ్చటి నుండి ఆ కన్య శూన్యంలో మరింతపైకి ప్రయాణించిన మార్గం కూడా గుర్తించగలిగాడు. అతనికి ఉన్నట్లుండి ఒక ఆలోచన కలిగింది. “ఆ కన్య ఇచ్చట అన్ని పర్వతాలపై తొమ్మిది నెలలనుండి ఎంత వెతికినా,

ఎక్కడా కన్పించలేదు. కానీ ఆ కన్య ఈప్రాంతాలలోనే సంచరిస్తున్న ఆనవాళ్ళున్నాయి. "ఇంత యోగ, జ్ఞాన సంపద కలిగిన నేను వెనుకంజ వేయరాదు. విజయానికిముందు ధీరులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోరాదు" అని ధృడంగా నిశ్చయించాడు. ఇనుమడించిన ఉత్సాహంతో, ఆ కన్యను గుర్తించాలన్న జిజ్ఞాస ప్రబలంకాగా తన కర్తవ్యానికి పునరంకితమయ్యాడు భైరవుడు.

## భైరవునివధ - మోక్షప్రసాదం

మార్గమధ్యంలో అతడు తపోదీక్షలో నిమగ్నమైన ఒక వృద్ధసాధువును గమనించాడు. "తపస్వీ! తమరు ఈ ప్రాంతంలో సంచరిస్తున్న ఒక బాలికను ఏమైనా చూచి ఉన్నారా?" ప్రశ్నించాడు భైరవుడు. "ఆర్యా! తమరికి తెలియదేమో మరి. ఈ పర్వతంపై స్వయంగా భగవతి నివసిస్తుంటుంది. కాబట్టి ఆమె తప్ప ఆ కన్యక వేరొకరు ఎవరు కాగలరు?" సమాధానమిచ్చాడు సాధువు.

"సాధువర్యా! కావచ్చు. ఈ పర్వతంపై గత తొమ్మిదినెలలుగా నిర్విరామంగా ఆ కన్య దాగిఉన్న స్థలంకోసం వెతుకుతున్నాను. ఆ బాలిక ఇక్కడకు రావడం స్వయంగా నేను చూసిఉన్నాను. ఆమె ఈ కొండ బిలమందు ఉండితీరాలి మరి". అంటూ భైరవనాథుడు ఆ గుహలోకి ప్రవేశించడానికి ఉపక్రమించాడు.

అది గమనించిన తపస్వి, భైరవుని మార్గాన్ని అడ్డుకొన్నాడు. గుహ ద్వారానికి అడ్డుగా నిలబడి ఇలా పలికాడు. "ఓరీ మూర్ఖా! ఎవరినైతే నీవు సాధారణ కన్యగా భావిస్తున్నావో ఆమె జగజ్జనని అయిన మహాశక్తి. ఆదిపరాశక్తి. నీ మేలుకోరి చెప్తున్నా. నీ ప్రయత్నం విరమించి వెంటనే తిరిగి వెళ్ళిపో!"

"వినాశకాలే విపరీతబుద్ధి" అని శాస్త్రములు వల్లిస్తున్నవి. అంటే జన్మ అంతం కావచ్చే సందర్భం ఆసన్నమైతే ఆ వ్యక్తి బుద్ధి అందుకు అనుగుణంగా,

విచక్షణా శక్తికోల్పోయి, విపరీత ధోరణిలో వర్తిస్తుంది. భైరవనాథుని ప్రస్తుత స్థితి అట్టిదే. వారించడానికి సాధుతపస్వి ఎంతగా ప్రయత్నిస్తున్నా, అంతకు అంతగా అతని బుద్ధియందు మూర్ఖత్వంతో కూడిన పంతం చోటు చేసుకోసాగింది. ఎక్కడైతే బుద్ధి మరియు జ్ఞానం మూర్ఖత్వం చేత కబళింపబడునో అక్కడ విచక్షణాజ్ఞానం నశిస్తుంది. అలాగే భైరవనాథుని ఆలోచనాశక్తి, విచక్షణా జ్ఞానం క్రమంగా క్షీణించసాగాయి. “ఈ కన్య తొమ్మిది నెలలు నిండుగా ఈ గుహలో దాగిఉంది. ఈ గుహ గర్భయోనిలా పసికందుని నవమాసాలు పోషించింది. నేను వెంటనే దీనిలో ప్రవేశించి అ కన్యను కనపరచుకొని గుండెల నిండుగా శ్వాస పీల్చుకుంటాను” అంటూ భైరవుడు ఉద్వేగంతో పెద్ద పెద్ద అంగలేసుకుంటూ ఆ బిలంలోకి ప్రవేశించాడు.

గుహలో పరివేష్టిత అయిన జగన్మాత గంభీరంగా ఇదంతా గమనిస్తూ ఉంది. ఆమె అనుజ్ఞతోనే ఈ ప్రపంచంలో విహిత కర్మలు ఆచరింపబడతాయి. ఆమె తలిస్తే ఆ క్షణమే భైరవుని కథ సమాప్తం చేయగలదు.

కాని సర్వలోకాలకు అధిష్ఠాత్రి అయిన ఆ తల్లి లీలలు అనూహ్యమైనవి. ఆమె జగన్నాటక సూత్రధారి. ఆ సమయంలో ఆమె తన నిర్ణయాన్ని అమలు చేయదలిస్తే అడ్డుచెప్పగలవారెవరు? ఈ జగత్తులోని సర్వప్రాణకోటి ఆ మాతృక చేతిలో ఆటబొమ్మలు. ఆ బొమ్మలతో ఆమె అనందంగా ఆడుకొన గలదు. లేకుంటే పసిపాపలా పనికిరాని బొమ్మను అదే క్షణం విరగగ్గొట్టి విసిరేయగలదు. ప్రారబ్ధానుసారం భైరవనాథుడే ఈనాటి ఆటబొమ్మ. ఆమె తన దివ్యశక్తితో త్రిశూలాన్ని ఉపయోగించి గుహ వెనుక భాగంలో వేరొక మార్గం ఏర్పరచి అందుండి బయటకు వెలువడింది.

మహాశక్తి ముందు నడుస్తుండగా “ఆగు కన్యా! నా నుండి తప్పించుకోలేవు.” అంటూ భైరవుడు ఆమెను వెంబడించసాగాడు. తుదిగా దేవి త్రికూట పర్వత శిఖరాన దట్టంగా అల్లుకున్న పూతీగెలు, వాటికి

మెండుగా విరగబూచిన వివిధ వర్ణాల పూలతో అలంకృతమైన ఓ అందమైన గుహ వద్దకు చేరుకుంది. ఒక్కమారు ఆమె వెనుదిరిగి "ఓ యోగీ! నీ క్షేమం కోరుకున్న వాడవైతే తిరిగి నీ ఆశ్రమానికి వెళ్ళిపో" అని ఆదేశించింది. భైరవుడు తల్లి మాటను లెక్కచేయక ఆమెను అనుసరించసాగాడు. అంత దేవి భైరవుని ప్రవేశం నిరోధించేందుకు గుహ వాకిట, వీర వానరుని కాపలాగా నిలిపి తాను లోనికి ప్రవేశించింది. అది గమనించిన భైరవుడు, ఒక్క మారుగా లోనికి ప్రవేశించేందుకు తీవ్రప్రయత్నం చేశాడు. అందుకు వానర వీరుడు మరింత బలంతో ప్రతిఘటించాడు.

"నీ వెవడవు నన్నాపేందుకు? నేను భైరవబలుడ్ని, నేను వెళ్ళదలుచుకున్న చోటికి ఎక్కడికైనా వెళ్ళి తీరుతాను" అంటూ వానరుని గద, లాక్కొన్నాడు భైరవుడు. క్రోధితుడైన వానరుడు తనగద తిరిగి లాక్కొన్నవాడై శక్తినంతా ప్రయోగించి భైరవుని ఒక బలమైన దెబ్బ కొట్టడానికి ప్రయత్నించాడు. భైరవుడు మెరుపువేగంతో చాకచక్యంగా ఆ ఘాతాన్ని తప్పించుకున్నాడు. బలాధిక్య నిర్ధారణకై ఎంతోసేపు వారిరువురి మధ్య తీవ్రమైన పెనుగులాట జరిగింది. గుహయందు వేంచేసియున్న సర్వదుష్ట భయంకరియైన జగన్మాత ఈ దుష్క్రీడను నిశితంగా గమనించసాగింది క్రమంగా వానరవీరుని బలపరాక్రమాలు క్షీణించసాగాయి. ఇనుమడించిన బలంతో భైరవుడు ఒక్క ఉదుటున వానిని దూరంగా త్రోసి బిలంలో ప్రవేశించడానికి సమాయత్త మయ్యాడు. ఇక రిపుక్షయకరియైన మహాశక్తి స్వయంగా చండీ రూపాన్ని ధరించి తన కరవాలంతో భైరవుని కంఠాన్ని ఒక్కవేటుతో తెగనరికి వధించింది.

ఈ సంఘటన, విధివ్రాతననుసరించి భగవతి, లీలాంశమైన కేళీ ప్రక్రియ. ఆటబొమ్మ తనకు ఆనందంకల్గించేలా ఆడకుంటే విరుగగొట్టి విసిరివేసే బాలల స్వభావం మన మెరిగినదే. ప్రపంచంలోని మానవులనే ఆటబొమ్మలకు సంరక్షకి, అధిదేవతఅయిన జగన్మాత క్రమశిక్షణలేక,

దౌష్ట్యాన్ని ప్రదర్శిస్తున్న ఓ ఆటబొమ్మను భవిష్యదనుగుణంగా తన ఆటసామాగ్రి నుండి తొలగించింది.

ఆ చండి కరవాలపు పదును, మెరుపుతో సమానమైన వేగం, అత్యద్భుతం! భైరవుని మొండెం గుహ సమీపంలోను, శిరస్సు సమీప పర్వతాగ్రం మీద, ఎగిరిపడ్డాయి. ఆ ప్రదేశమే నాటినుండి "భైరవఘాటి" అని ప్రసిద్ధి గాంచింది.

భైరవనాథుడు సాధారణ వ్యక్తికాదు. అతడొక సిద్ధపురుషుడు. మహాబల వంతుడే గాక గొప్పయోగికూడా! మొండెం నుండి శిరస్సు విడివడి ఉన్న స్థితిలో కూడా అతని చేతనత్వం కించిత్ మాత్రం క్షీణించలేదు. అతని కన్నుల నుండి అశ్రువులు ధారాపాతంగా కారుతున్నాయి. అతడు తన దురాలోచనకు, మాత ఎడల ప్రవర్తనకు ఎంతో ఆవేదన చెందసాగాడు, పశ్చాత్తాప పరితప్త హృదయంతో మాతతో ఇలా మొరపెట్టుకున్నాడు.

"ఓ ఆది శక్తీ! కళ్యాణకారిణీ! నాకు మృత్యువు సమీపిస్తోందన్న ఆవేదనకాని, భయంకాని ఏమాత్రం లేవు. ఏల అనగా నా చావు జగద్రచయిత, అయిన తమచేతి యందు నిర్దేశింపబడింది. నాకు తప్పక మోక్షం సిద్ధిస్తుంది. అయినప్పటికీ మాతేశ్వరీ! దయతో నన్ను క్షమించండి. ఈ రూపంలో నేను తమకు అపరిచితుడను. ఓ మాతృక! తమరు నన్ను క్షమించకుంటే, ముందు యుగాలలో నేను పాపిగా పరిగణించబడి, నా పేరు చెవిన బడినంతనే లోకులు నన్ను అసహ్యించుకోగలరు. సన్మాతృకవై ఈ బిడ్డను కనికరించు. తల్లియేగదా లోకంలో క్షమాస్వరూపిణి మరియు సంస్కారకారిణి!."

భైరవుని నోట "తల్లీ"! అనే పదం విన్నంతనే ఆ మాతృ హృదయం ఆనందంతో పరవశించింది. అంత్యదశలో దీనస్థితిలో ఉన్న భైరవుని ఇలా అనుగ్రహించింది.

"వత్సా! భూలోకంలో భక్తులు నా దర్శనానంతరం నిన్ను సందర్శించి పూజలు చేయటం ద్వారానే వారికి సంపూర్ణ యాత్రాఫలం సిద్ధించేటట్లు ఆదేశిస్తూ నిన్ను అనుగ్రహిస్తున్నాను. ఆ విధంగా నీవు మోక్షప్రాప్తి కలిగించే దేవతగా వర్ధిల్లగలవు! నిన్ను దర్శించుకున్న వారి మనోభీష్టాలు సంపూర్ణంగా సిద్ధించేలా అనుగ్రహిస్తున్నాను."

పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చితం వేరొకటి లేదుకదా! మాత శ్రీవైష్ణవి అనుగ్రహంతో భైరవునకు మోక్షం సిద్ధించింది. భైరవుని తల తెగి నేలను తాకిన ప్రదేశంలో భైరవ మందిర నిర్మాణం కావించబడింది. మాతృక వరప్రసాదాను సారం భక్తజనులు మందిరంలో మాత శ్రీ వైష్ణవి దర్శనానంతరం భైరవబాబా దర్శనార్థం ఈ మందిరాన్ని సందర్శించడం ఆనవాయితి అయిది.

## సురథుడు - సమాధిలకు - దేవి అనుగ్రహం

పూర్వం ఒక దినం మహారాజగు జనమేజయుడు, సత్యవతీ నందనుడైన వ్యాసుని ఇలా ప్రశ్నించాడు. "ఆర్యా! "-దేవిని మొట్ట మొదటగా ఆరాధించిన పుణ్య చరితులెవరు? - ఎవరియెడల ప్రప్రథమంగా దేవి ప్రసన్నురాలైంది? - ఎవరికి ఆ ఫలం అనుభవించే సౌభాగ్యం ప్రాప్తించింది? తెలియచేయండి."

ప్రసన్నుడైన వ్యాసుడు ఇలా వివరించసాగాడు.

రాజా! పూర్వము, స్వారోచిషమన్వంతర కాలంలో సురథుడనే రాజు ఉండే వాడు. అతడు సామ్రాజ్యాన్ని ప్రజారంజకంగా పాలించేవాడు. అకారణంగా పర్వతవాసులైన మ్లేచ్ఛులు సురథునిపై శత్రుత్వాన్ని పెంచుకొని అకస్మాత్తుగా దండెత్తారు. అతని మంత్రివర్గము, సైన్యాధ్యక్షులు మ్లేచ్ఛులతో చేతులు గలిపి రాజుకు వెన్నుపోటు పొడిచారు. ఆ కారణంగా పరాజితుడైన సురధుడు చింతాక్రాంతుడయ్యాడు. అంతఃపురంలో ప్రవేశించలేక అశ్వారూఢుడై మనశ్శాంతి కోరి గురుసమాశ్వాసన ఆశిస్తూ సమీప

అరణ్యంలోని సుమేధుడు అనే మహామునీంద్రుని ఆశ్రమం చేరాడు. మహాముని సురధునకు అర్ఘ్యపాదాద్యులనిచ్చి, ఆహ్వానించి రాకకు కారణం చెప్పమన్నాడు. అంత రాజు తనకు సంప్రాప్తమైన రాజకీయ దుష్పరిణామాలను, సచివుల సైన్యాధ్యక్షుల నమ్మకద్రోహం, భార్యాబిడ్డల దయనీయమైన స్థితి, ప్రజల ఇక్కట్లు, ధనదుర్వినియోగము తదితర వివరములు తెలియచేసి - తనకు జ్ఞాన బోధ కావించి మనఃశాంతి ప్రసాదించమని కోరాడు.

మహాముని, తన తపఃప్రభావం వలన ఆశ్రమ పరిసరాలలో హింసకు తావులేదని, కష్టాలను మరచి ప్రశాంతంగా కొంతకాలం అక్కడ ఆశ్రమ జీవనం సాగించమని, మేలు జరుగుతుందని అభయమిచ్చాడు.

కొంతకాలానికి ఎంతో ధనవంతుడైన సమాధి అనే వైశ్యుడు సుమేధముని ఆశ్రమానికి అరుదెంచాడు. అచ్చట సురధమహారాజుతో అతనికి మైత్రి ఏర్పడింది. సమాధి గొప్ప సంపన్నుడే కాక సాటిలేని దానశీలి. అది సహించలేని అతని భార్య - బిడ్డలు ఆ ధనాన్ని రహస్యంగా తమవశం చేసుకొని, ఆహారపానీయాలు, అందించక అతన్ని ఇంటినుండి గెంటేశారు.

వీరిరువురు తమగత ప్రాభవాన్ని మరచిపోలేక, సంసార బంధాలను వీడలేక చింతాక్రాంతులై, ఆ శోక నివారణోపాయం తెలుపమని సుమేధమహామునిని కోరారు. అంత సుమేధుడు ఇలా పలికాడు. " మీ దుఃఖ కారణము బంధమోహము. ఆ మోహాన్ని కల్పించునది మహామాయ. ఆమె భక్తికి దాసురాలు. ఆమెను పూజించి ఆమెకై తపమాచరించి, దర్శనం పొంది, ధన్యులుకండి" అంటూ వారికి మంత్రాన్ని, పూజా - హోమ విధానాలను, నవార్ణవమును తెలియచేశాడు. అలా వారు మూడు సంవత్సరాలు కఠోర తపస్సుచేయగా దేవి ప్రత్యక్ష దర్శనం ఇచ్చింది.

ఆమె అనుగ్రహంతో సురథుడు తన రాజధానికి చేరి శత్రువులను తరిమి, మంత్రుల, సైన్యాధ్యక్షుల సంపూర్ణ సహకారంతో ప్రజారంజకంగా,

సంపూర్ణ భూమండలాన్ని పాలించి, తుదిగా శరీరం త్యజించి "మనువు" పదాన్ని పొందాడు. సమాధి అన్న వైశ్యుడు సంసారిక బంధవిముక్తుడై జ్ఞానమయ జీవితం గడుపుతూ, అంబ అనుగ్రహంతో శరీరాన్ని త్యజించి పరమపదం పొందాడు.

## త్రేతాయుగమందు శ్రీవైష్ణవి అవతారధారణ

వాల్మీకి రామాయణమందు ఈ కథ ప్రస్తావన లేనందున ప్రామాణికం కాకున్నా జనశ్రుతులు, పరంపరాగతమై భక్తిపరమైన ప్రాచుర్యం సంతరించుకొని తరతరాలుగా జనబాహుళ్యంలో ఆధ్యాత్మికత, భక్తి భావనలను పెంపొందింపచేస్తోంది. ఎంతో ఆసక్తికరమైన ఈకథ ఈనాటి శ్రీవైష్ణవి దివ్యక్షేత్ర ప్రాభవానికి నాందీవాక్యమైనది. తరతరాలుగా మానవుల హృదయాలలో ఆధ్యాత్మికబీజాలు నాటుతూ వారు కఠోరశ్రమకోర్చి భక్తితో తల్లిని సేవించి ధన్యులు కావడానికి పవిత్రగంగా ప్రవాహం ఆలంబన అయినది. లోకంలో వివిధయుగాలలో రాక్షసప్రవృత్తి విజృంభించి అరాచకాలు మితిమీరి, ధర్మాచరణకు ప్రతిబంధకం ఏర్పడిఉన్న సమయంలో పరాశక్తి విభిన్న అవతారాలను ధరించి ధర్మసంస్థాపన, శిష్టరక్షణ, దుష్టశిక్షణ కావిస్తుంది.

బిడ్డల ఎడల సహజప్రేమ, ఆర్ద్రత, వాత్సల్యం, తప్పుగునడతను సరిదిద్దుట, ఇత్యాది సుగుణాలతో శోభిల్లుతూ, అనంతమై అద్భుతమైనది మాతృరూపం. అట్టి మాతృమూర్తి శుద్ధ సచ్చిదానందమయి, పరాత్పరిగా ఆరాంధింపబడుతున్న మహాశక్తి.

ఆ మహాశక్తి, కాలానుగుణంగా మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి రూపాలు ధరించింది. ఆ రూపాలు రజః, తమో, సాత్విక గుణములకు ప్రతీకలు.

త్రేతాయుగంలో భూలోకంలో, రావణ, కుంభకర్ణ, ఖర-ధూషణ, తాటక మొదలైన రాక్షసులు యజ్ఞ యాగాది క్రతువులు, ధ్యాన, తపశ్చర్యాదులు

నిర్వహించే మునులు, ఋషులు, బ్రాహ్మణులను భయకంపితులను చేసి ఆ వాటికలను అపవిత్రంగావించి ఆ కార్యక్రమాలకు విఘ్నం కల్గించసాగారు. దైత్యుల క్రూరహింసలకు సహించలేక వారిని ఎదుర్కొని శక్తి లేని సాధుజనులు, ధర్మనిరతులు, అయిన దేవమానవులు పరాశక్తిని శరణువేడుకొన్నారు.

భక్త సులభులైన మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి, ధర్మపరిరక్షణార్ధం తమతమ శక్తులను, తేజస్సును ఏకీకృతంచేసి ఒక దివ్యశక్తిని రూపొందించారు. త్రివిధశక్తుల తేజస్సు నుండి ఉద్భవించిన ఆ కన్య మిక్కిలి సౌందర్యరాశియే గాక శత్రుభయంకరి కూడా. ఆ కన్య వినమ్రతతో ఆ త్రిమహాశక్తులకు నమస్కరించి తనను సృష్టించుటకు కారణమేమని ప్రశ్నించింది. అంత వారు "యుగాంతరాలుగా ధర్మాన్ని పరిరక్షిస్తూ ఆ ధర్మాన్ని దశదిశలా వ్యాప్తి చేయగలందులకు తక్షణమే నీవు దక్షిణ భారతదేశంలో రామేశ్వరం అనే నగరంలో రత్నాకరసాగరుని ఇంట పుత్రికవై జన్మించు. అచ్చట నీవు భగవాన్ శ్రీ మహావిష్ణుని అంశగా జన్మించగలవు. తదుపరి నీ మహత్తుతో భూలోకంలో భక్తి మరియు ధర్మాచరణలను గతి తప్పనీయక ఉద్ధరించగలవు అని పలికారు.

మహాశక్తుల ఆజ్ఞానుసారం, ఈ దివ్యకన్య రత్నాకరసాగరుని ఇంట అవతారధారణ కావించింది. ఆ మహాభాగ్యానికి ఉప్పొంగిపోయిన రత్నాకరసాగర దంపతులు ఆ బిడ్డకు "త్రికూట" అనే పేరిడి అల్లారుముద్దుగా పెంచుకోసాగారు. శ్రీమహావిష్ణుని అంశగా ఆవిర్భవించినందున, చిన్ననాటి నుండి అద్భుత శక్తులు ప్రకటిస్తూ ఆ బిడ్డ "వైష్ణవి" అన్న నామంతో విఖ్యాతి గాంచింది. తాను ఏ ధర్మాన్ని ఆచరిస్తూ, బోధిస్తూ లోకంలో ప్రాచుర్యం కావించిందో ఆధర్మం వైష్ణవధర్మమని పిలువబడుతోంది. "వైష్ణవ" శబ్దం వాడుకలో కాలక్రమేణా వైష్ణోగా మారింది. పిన్నవయస్సులోనే దేవి త్రికూట తన అలౌకికశక్తులచేత అపారజ్ఞానాన్ని ప్రదర్శిస్తూ, ప్రముఖ దేవతలు, మునులు, ఋషులను విభ్రాంతులను చేస్తూ తన ప్రజ్ఞను ప్రకటించసాగింది. ఎంతెంతో దూరాలనుండి "కన్య త్రికూట"ను సందర్శించేందుకు భక్తులు

బారులు తీరసాగారు. శ్రీవిష్ణునిలో ఐక్యం కావాలని పరితపించే త్రికూట, తండ్రి అనుమతితో సాగరతీరంలో శ్రీవిష్ణు అవతారమైన శ్రీరాముని గూర్చి ధ్యానంలో నిమగ్నమై తపస్సు ఆచరించింది. అతని ప్రత్యక్షదర్శనం కోసం ఎదురుచూడసాగింది. కొంత కాలానికి, రావణుడు సాధ్వీసీతను చెరబట్టగా, శ్రీరామచంద్రుడు వానరసేనతో కూడి లంకపై దండెత్తడానికి సాగరతీరానికి చేరిన సందర్భం అది.

దీర్ఘ సమాధి స్థితిలో తపస్సు ఆచరిస్తున్న దివ్యకన్య అతని దృష్టిని ఆకర్షించింది. ఆ కన్య అకుంఠిత భక్తికి శ్రీరాముడు ప్రసన్నుడయ్యాడు. తన తపోదీక్షకు కారణం తెలియచేయ మన్నాడు. అందుకు దేవి త్రికూట, శ్రీ విష్ణుని తాను పతిగా పొందాలన్న ఆకాంక్షను తెలియచేసి, తనను పత్నిగా అనుగ్రహించమని ప్రార్థించింది. అందుకు సీతాపతి తాను ఈ యుగంలో ఏకపత్నీ వ్రతుడనని, ధర్మనిరతిని అధిగమించలేనని పలికాడు. అదివిన్న దేవిత్రికూట నిశ్చేష్టురాలయింది. విచారవదనంతోనున్న త్రికూటతో శ్రీరాముడు, ఆమె కోరిక తీరేందుకు ఇది తగినసమయం కాదని అరణ్యవాసానంతరం త్రికూట వద్దకు వస్తానని, ఆ సమయంలో ఆమె తనను గుర్తిస్తే తనలో ఐక్యం చేసుకుంటానని అభయమిచ్చాడు. అన్నమాట ప్రకారం రావణ వధానంతరం శ్రీరాముడు, త్రికూట వద్దకు ఒక వృద్ధుని రూపంలో వచ్చాడు. దైవనిర్ణయంగా త్రికూట ఆ సమయంలో శ్రీరాముని గుర్తించలేకపోయింది. దాశరథి, దేవి త్రికూటను ఓదార్చి "నీవు త్రిమాతల ఆదేశానుసారం ఒక ప్రత్యేక కార్యం నెరవేర్చేందుకు ఈ భూమిపై అవతరించావు. కాబట్టి నీవు హిమాలయాలలోని మాణిక్ పర్వతశ్రేణులలో త్రికూట పర్వతం పై గల ముఖ్యమైన గుహను సందర్శించు. ఆ గుహయే ముగ్గురు మహాశక్తుల నివాసం. అక్కడ నీ తపోదీక్షను కొనసాగిస్తూ, భక్తుల కోరికలు అనుగ్రహించు. ఇకనుండి శ్రీవైష్ణవి నామంతో నీ అనుగ్రహప్రసాద ఖ్యాతి విశ్వవ్యాపిత మవుతుంది. ఈ నల, నీల, హనుమంత, జాంబవంతాది

వానర ప్రముఖులు నీ అంగరక్షకులు కాగలరు. కలియుగమందు కల్కి అవతారంలో నీ కోరిక తీర్చగలను" అని పలికాడు.

ఆనాటినుండి శ్రీరాముని ఆదేశానుసారం, శ్రీవైష్ణవి ఆ గుహలో త్రిమహా శక్తులతో కూడి భక్తుల కోరికలీడేరుస్తూ వారిపాలిట కొంగుబంగారమై ఉన్నది.

అలా త్రిమాతల ఏకీకృతశక్తి, రత్నాకరసాగరుని కుమార్తెగా పెరిగి త్రేతాయుగం నుండి సౌందర్యరాసులైన మహాశక్తుల కూడికతో మహిమాన్వితమైన గుహలో విరాజమానయై తపోదీక్షయందు లీనమై ఉన్నదని భక్తుల ప్రగాఢ విశ్వాసం. యుగయుగాలుగా మాత శ్రీవైష్ణవి వివిధ సమయాలలో తన లీలలను ప్రదర్శించింది. ఏ సందర్భంలో ఆమెలీలలు ప్రకటితమయ్యాయో, ఆ ఘట్టాలు, ఆ ప్రదేశాలు ఎంతో మహత్వపూర్ణమై తల్లియొక్క మహాత్యాన్ని, భక్తులపాలిట ఆమె అపార దయాగుణాన్ని తేటతెల్లంచేస్తున్నవి.

**మాత శ్రీవైష్ణవి ప్రాచీన గుహ - ప్రాభవం**

మాత శ్రీవైష్ణవియొక్క గర్భాలయం "దర్బారు" అని కూడా పిలువబడుతుంది. ప్రాచీన గుహ ముఖద్వారం, పవిత్ర చరణగంగ నది జన్మస్థానం అయిన ఈ లోయ ప్రాంతం "భవన్"గా ప్రసిద్ధిగాంచింది. సముద్రమట్టానికి సుమారు 5700 అడుగుల ఎత్తులో నెలకొన్న కొండగుహయే మాత శ్రీవైష్ణవి యొక్క ఆలయం. భూగర్భ శాస్త్రజ్ఞుల పరిశోధన ననుసరించి ఈ గుహ అత్యంత ప్రాచీనమైనది. మిలియన్ సంవత్సరములకు పూర్వమే ఏర్పడి ఉన్నట్టిది. ఈ గుహ పొడవు దరిదాపు 100 అడుగులు. వెడల్పు 3 నుండి 4 అడుగులు. ఎత్తు 2 నుండి 6 అడుగులు. పవిత్ర చరణ గంగానది ఉద్భవించిన ప్రదేశంలో నెలవైయున్న ఈ గుహ, భక్తజనులలో ప్రకటితమయ్యే దుర్భరమైన ప్రయాణ ప్రయాస, అకుంఠిత దీక్ష, శ్రద్ధాభక్తులకు, సరిపడ దివ్యానుగ్రహాన్ని ప్రసాదించునట్టిదై పరిఢవిల్లుతోంది. ప్రకృతే తానయిన మాత నివాసమైనందున మనోజ్ఞమైన

ఈ క్షేత్రం, అచ్చటకు చేరుకోవడానికి భక్తులుపడే కష్టాలను క్షణాలలో మటుమాయం చేస్తుంది.

జమ్మునగరానికి 72 కి.మీ దూరంలో ఉత్తరపశ్చిమ దిశలో (వాయవ్య దిశలో) శతశృంగ పర్వతపు కనుమలు నెలకొని ఉన్నాయి. ఈ కనుమలలోని త్రికూటమని పిలువబడే శిఖరాల నడుమ, చరణగంగానది ఉద్భవించిన ప్రదేశంలో మాత శ్రీవైష్ణోదేవి స్థితమై అత్యంత ప్రాచీనమై, సహజసిద్ధమైన గుహయే మాత దేవాలయం.

ఈ గుహముందే దేవి తన మహాకాళి అంశతో – వరమదోన్మత్తుడైన మహిషాసురుని వధించిందని శతాబ్దాలుగా ఈ ప్రాంతవాసుల ప్రగాఢ విశ్వాసం. కష్టాలు కడతేరగా ఆనందంతో సమస్తదేవతలు తమభక్తిని చాటుకుంటూ స్తోత్రాలు చేసారు. పొందిన ఉపకారానికి ధన్యవాదాలు తెలుపుకుంటూ, అంబ దయాశీలతను, శౌర్యపరాక్రమాలను వేనోళ్ళ ప్రశంసించారు. ఇలా దేవిని భక్తితో స్తుతిస్తూ, భవిష్యత్తులో కూడా రక్షణకై శరణుకోరి అభయం పొందారు.

వసంతుడే విడిదిచేశాడా అన్నట్లు హరితం పరుచుకున్న పర్వతాలు, ఎత్తైన వృక్షాలు, వాటిని అల్లుకొని నిండుగాపూలతో – బలమైన తీగలు, దట్టమైన పూపొదలు, మెండుగా వివిధ జాతుల ఫలవృక్షాలు, వరుణుడు తిష్ఠవేసినందున సంవత్సరం పొడవునా చిత్తడినేల, భూమిని తాకడానికి పరితపించే సూర్యకిరణాలు, మంచు కప్పిన ఆకులను సూర్యకిరణాలు తాకగా, ముత్యాల్లా మారి ఆకులపై పరుగెట్టే నీటి బిందువులు, ఇలా హరితశోభ ప్రభవించే అడవులతో ఆ ప్రదేశమంతా ఆహ్లాదకరంగా ఉంటుంది. వర్షంతో తడిసి సూర్యుని పలకరింపుతో మెరిసిపోతున్న పర్వతశిఖరాలు, వయ్యారపు నడకలతో నయగారాలు ఒలకబోస్తున్న జలపాతాలు, తమ కిలకిలారావాలతో సప్తస్వరాలు వినిపిస్తున్న పక్షిజాతులు,

భగవతి పాదస్పర్శతో పునీతనయ్యానన్న గర్వంతో పరవళ్ళు తొక్కుతూ నిండుగా ప్రవహించే చరణగంగా నది. "మనోరంజితమైన ఈ ప్రకృతి ప్రసాదాన్ని ఆస్వాదించి ముగ్ధరాలై ఈ మానవాళిని తరింపచేసేందుకు మహామాతృక ఈ ప్రదేశాన్ని తన తపోభూమిగా ఎంపిక చేసుకొని ఉండవచ్చు" అనడంలో ఆశ్చర్యమేలేదు.

సృష్టిరచన ప్రారంభంనుండి కన్యక వ్రతధారణ గావించి, ఆది కుమారిగా, తపస్సునిమిత్తం ప్రథమంగా ఇరుకైన కొండబిలంలో ధ్యాన మగ్నయైన మహామాతృక, తదుపరి చరణగంగ జన్మస్థలిలో ప్రకృతి సిద్ధమైన ఈ గుహలో స్థితమైంది. ఈ బిలమందు శ్రీ సరస్వతి, శ్రీమహాలక్ష్మి, శ్రీకాళికలు ప్రముఖ త్రివిధగుణములగు సత్వ, రజస్తమోగుణముల ప్రతీకలుగా మూడు సాలగ్రామాలుగా పిండపు ఆకృతిలో ఏకశిలపై వెలసియున్నారు. భైరవ నాథుడు తనను అనుసరిస్తుండగా భగవతి ముఖద్వారం వద్ద అతనిని వధించి ఈ గుహలో ప్రవేశించి ముప్పురు దేవతల మూలపుటమ్మగా ఈ గుహను మహిమాన్వితం చేసింది.

ఒకప్పుడు జగన్మాతను ఉద్దేశించి చతుర్ముఖబ్రహ్మ ఇలాఅన్నాడు. "ఓ దేవి, నీవు "త్రికళ" అనే నామంతో వర్ధిల్లగలవు! సర్వదా ఈ చరాచరసృష్టిని ఏలునట్టిదానవు నీవే. అదనంగా సందర్భానుసారం నీలో వ్యక్తమయ్యే గుణములననుసరించి వివిధములైన అనేక రూపములు – నామములు నీకు సిద్ధించగలవు. నీలో ప్రస్ఫుటమయ్యే త్రివర్ణముల ప్రాతిపదికగా త్రిమూర్తులను సృష్టించు". అంతమహాశక్తి తన శ్వేత, రక్త, శ్యామవర్ణాల నుండి మనోహరమైన మూడు పిండ రూపాకృతులను ఏకశిలపై సృష్టించింది. అవి బ్రహ్మఅంశయగు మహాసరస్వతి, విష్ణు అంశయైన మహాలక్ష్మి, రుద్రుని అంశయైన మహాకాళిగా ఆరాధింప బడుతున్నాయి. అలా ఆ తల్లి అరుణ, రక్త, కృష్ణ అనే త్రివర్ణకాంతి పుంజాల దివ్యశోభతో ప్రకాశిస్తూ దర్శనమిస్తుంది.

## ఏకీకృత శిలారూపంలో శ్రీవైష్ణవి

అలా ఈ కొండబిలంలో మూడుపిండములు ఆ ముగ్గురు దేవతల రూపాలకు ప్రతీకలు. ఈ త్రిపిండముల సమీకృతనామమే శ్రీవైష్ణవి. మహిషాసురవధ సందర్భంగా మాత శ్రీసరస్వతి, శ్రీ మహాలక్ష్మి, శ్రీ పార్వతులు తమతమ అంశలను సమీకృతంచేయగా ఉద్భవించిన శ్రీవైష్ణవి, "త్రికూట, త్రిగుణాత్మిక" అని కూడా పిలువబడుతోంది. ఈమె అనగా శ్రీమహాలక్ష్మియే మహాకాళియును, మహాసరస్వతియున్ను. ఈమె నివాసం, శతశృంగ పర్వత పంక్తులలోని త్రికూట పర్వతం. పరమాత్మ, పరాశక్తి ఇరువురూ ఏకరూపులే. పరమాత్మ – పరబ్రహ్మ ఒక్కరే అయినప్పటికి, ఏ విధంగా వారు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా విభక్తమై సృష్టి, స్థితి, లయ కార్యములకు అధిష్ఠాన దేవతలై యున్నారో అదేలాగున పరాశక్తి కూడా కార్యకారణవశమున త్రిరూపధారిణి అయి ఉన్నది.

అలా ప్రాచీన గుహయొక్క ముఖద్వారము వద్ద నిత్య దీపారాధన, పూజ నిర్వహింపబడుతున్నవి. ప్రాచీనగుహ ముఖద్వారపు ముంగిట పాలరాయి పరచబడి ఉన్నందున ఎంతో శోభాయమానమై ప్రకాశిస్తుంటుంది. తల్లి దర్శనానికి ఆత్రుతగా ఎదురుచూస్తూ వస్తున్న భక్తులను ఆశ్చర్యచకితులను చేసే విధంగా ఆ ముంగిట గోడపై ఏర్పరచిన శ్రీగణేశ, మహాసరస్వతి, మహాలక్ష్మి, మహాకాళికల విగ్రహాలు, రంగు రంగుల విద్యుద్దీప కాంతులతో ప్రకాశిస్తూ దర్శనమిస్తుంటాయి.

ముగురమ్మలతో కూడి మూలపుటమ్మ మాత శ్రీవైష్ణవి వేంచేసిఉండే ప్రాచీన గుహ ముఖద్వార సొరంగమార్గం సహజసిద్ధంగా భూమికి అతితక్కువ ఎత్తులో ఎంతో ఇరుకుగా ఏర్పడినట్టిది. ఈ ద్వారం సంవత్సరంలో అతితక్కువకాలం మాత్రమే భక్తుల ప్రవేశానికై తెరువబడి ఉంటుంది. సొరంగమార్గం ఇరుకుగా, ఎత్తు తక్కువగా ఉండటం వల్ల ఒక్కొక్క భక్తునికి

తల్లి గర్భాలయం చేరడానికి ఎంతో సమయం పడుతుంది. రోజువారి తల్లిదర్శనంకోసం వీక్షించే యాత్రికుల సంఖ్య దృష్టియందుంచుకొని, యాత్రికుల సంఖ్య ఎనిమిదివేల మందికన్నా తక్కువగా ఉంటే తప్ప ఈ ద్వారం ద్వారా ప్రవేశం అనుమతించబడదు.

ఈ సమస్య పరిష్కారమార్గంగా, మరింత మంది భక్తులకు మాత దర్శనం కల్పించే విధంగా రెండు నూతన సొరంగ మార్గాలు నిర్మింపబడ్డాయి. ఒక మార్గము భక్తుల ప్రవేశానికి, అనగా మాత గర్భాలయం వరకు సౌకర్యవంతంగా చేరేలా ఉపకరిస్తుంది. రెండవది నిర్గమన మార్గంగా ఉపయోగించ బడుతున్నది. ముఖ్యంగా శీతాకాలంలోను, సందర్శకుల సంఖ్య సాధారణంగా ఉండే దినాలలోను సహజసిద్ధమైన సొరంగమార్గం ప్రవేశానికై తెరువబడి ఉంటుంది. మొత్తానికి ఈ ప్రాచీన సహజ సొరంగం గుండా ప్రయాణించి మాతను దర్శించడం, ఒక విచిత్రమై, కొంత సాహసంతో కూడినదై, భక్తికి పరాకాష్ఠ అన్నట్లు, జన్మాంతరం మరచిపోలేనిదిగా జ్ఞాపక పుటలలో మిగిలిపోతుంది. ఈ పురాతన అద్భుతమైన గుహ "సుందర గుహ" అనికూడా పిలువబడుతుంది.

ఈ సొరంగమార్గపు ముఖద్వారం ఒకమారు ఒకే భక్తుడు మాత్రం ప్రాకుతూ ప్రవేశించగల అవకాశమున్నంత ఇరుకైనది. లోపల కూడా ఒక వ్యక్తి నిటారుగా నడిచి వెళ్ళడానికి అవకాశం లేనట్టిది. ఇరువైపులా సొరంగపు గోడలు తగలకుండా పాకుట దుస్సాధ్యము. భక్తుల వామభాగపు గుహగోడ ఏటవాలుగా ఏర్పడి ఉంటుంది. అలాంటి కప్పుపై పవిత్ర ఆధ్యాత్మికపరమైన చిహ్నాలు సహజసిద్ధంగా ఏర్పడిఉండి దర్శనమిస్తాయి. మాతదర్శనం త్వరలో కాబోతోందన్న ఆనందంతో, యాత్రికులు అంత ఇరుకులోను అపారభక్తితో ఆ చిహ్నాలను గుర్తించి ఆరాధిస్తారు. మోకాటిలోతున, చల్లని స్వచ్ఛమైన నీటి ఉద్ధృతప్రవాహం గుహనుండి బయటకు వెలువడుతూ ఎదురయ్యేభక్తుల ఆధ్యాత్మికచింతన స్థితిని మరింత బలోపేతం చేస్తుంది. ఇలాంటి ప్రవాహానికి

దరిదాపు నూరుఅడుగుల దూరం ఎదురు నడచిన భక్తులు తుదిగా మాతదర్శనం కోసం మూడు – నాలుగు మెట్లెక్కి ఒక అరుగును చేరుకుంటారు. విద్యుద్దీపాలు ఏర్పడక ముందు ఎన్నో సంవత్సరాలు ఈ సొరంగ మార్గం, ప్రాచీన గుహ అంతా కటికచీకటి ఆవరించి ఉండేది. ఆ కాలమంతా యాత్రికులు అకుంఠిత దీక్షతో ఇరుకైన గుహలో ఉద్ధృతజల ప్రవాహానికి ఎదురీదుతూ, పాకుతూ, మోకాళ్ళపై నడుస్తూ ఎదురయ్యే ప్రమాదాలను లెక్కచేయక భక్తితో, సాహసం ప్రదర్శిస్తూ సాగిపోయేవారు. అట్టి భక్తులకు విచిత్రమైన, అనూహ్యమైన, అలౌకిక అనుభవస్థితి ద్యోతకమై, మాతృదర్శనంతో వారికి అనుభవైక వేద్యమయిన ఆనందం కలిగేది.

కానీ కదలిపోయేకాలం ఎన్నో మార్పులు, చేర్పులకు సాక్షీభూతమైంది. సంవత్సరకాలంలో కొద్దిరోజులు తప్ప మిగిలిన కాలమంతా ఈ పురాతన మార్గం మూసివేయ బడిఉంటుంది. బదులుగా నూతన సొరంగాల మార్గం ఉపయోగించబడుతోంది.

సహజసిద్ధ సొరంగద్వారం దాటి కొద్దిగా ముందుకు నడిస్తే ఆ మార్గంలో అసంఖ్యాకమైన గంటలు పైకప్పు నుండి వ్రేలాడుతూ దర్శనమిస్తాయి. తమ రాకను తల్లికి తెలియచేస్తూ భక్తులు ఉత్సాహంతో మ్రోగించే ఈ గంటల మంగళధ్వని వీనుల విందుగా భక్తులను మరింత జాగృతులను చేస్తుంది. మరికొన్ని గజాల దూరంలోనే భక్తులు విశాలమైన పాలరాతి కట్టడమైన వేదికను చేరుకుంటారు. అచ్చట తల్లి వాహనమైన సింహం బొమ్మలు అమ్మదర్శనానికి ఆమోదం అందచేస్తున్నట్లు ఆహ్వానిస్తూ ఉంటాయి. ఆ విశాలమైన పాలరాతి వేదికపై పది అడుగుల ఎత్తైన పంచలోహపు చాముండి విగ్రహం, దర్శనంతోనే దివ్యానుభూతిని కల్గిస్తుంది.

**నూతన సొరంగ మార్గం**

మాతృక చాముండి ఆహూతులైన భక్తులకు అనుగ్రహం ప్రసాదిస్తూ, తల్లిగా తలనిమిరి వారి కష్టాలను రూపుమాపి దివ్యానందాన్ని కలుగచేస్తుంది.

ఇచ్చటి నుండే గుహలోని అంబపీఠం చేరుకోవడానికి కొత్త సొరంగ మార్గం మొదలవుతుంది. ఈ మార్గం ఏర్పాటువల్ల యాత్రికులకు దర్శనం ఎంతో సులభతరం, సుఖప్రదం అయింది. ఈ మార్గంలో తాజా గాలులు ప్రసరించడం వల్ల, ప్రత్యామ్నాయంగా, విద్యుత్‌దీపాలు, పంకాలు ఏర్పాటు అయిఉన్నందున యాత్రికులకు శ్వాసమొదలగు సమస్యలు ఏవీ తలెత్తవు. ఈ నూతన గహ్వరపు ద్వారం 1.8 మీటర్ల వెడల్పు, 2.2 మీటర్ల ఎత్తు, 38 మీటర్ల పొడవు కలిగి ఉంటుంది. ఈ గుహ సొరంగమార్గాన్ని గౌ॥ శ్రీ కరణ్‌సింగ్ గారు ప్రారంభోత్సవం కావించారు.

ఈ మార్గంగుండా సాగిపోతే భగవతి శ్రీవైష్ణవి గుహరూప మందిరం, అందున్న పీఠంపై స్వయంభువులై ప్రకృతి సిద్ధమైన ఏకశిలపై ఆవిర్భవించిన మూడు పిండాకృతులు, త్రివర్ణ దివ్యశోభతో దర్శనమిస్తాయి. ఇలా దివ్యకాంతులతో విరాజిల్లే ఈ మందిరాన్ని వీక్షించిన యాత్రికులు భక్తి పారవశ్యంతో తాదాత్మ్యం చెందుతారు. అది జీవ-పరమాత్మల సంగమానందమై ఉండవచ్చు, ఆ స్థితి సురానందభైరవి అనుగ్రహ ప్రసాదము.

ఈ త్రివిధ పిండాకృతులు, మధ్య మాత శ్రీవైష్ణవి, ఆ తల్లి కుడిభాగంలో మహాసరస్వతి, వామభాగంలో మాత మహాకాళి యొక్క ప్రతిరూపాలుంటాయి.

సృష్టికి మూలమైన ఏకైకశక్తి ఆదిపరాశక్తి. అలాగే ఈ త్రిపిండాకృతుల మూలమైన శిల ఒక్కటే. అదే ముగ్గురమ్మల మూలపుటమ్మ, జగదేకమాత, జగజ్జనని, శ్రీవైష్ణవి. ఆ మూలశిల అయిదారడుగుల పొడవైనది. దృగ్గోచరమయ్యే మూడు ఆకృతులు సత్వ, రజస్తమో గుణాలకు ప్రతిరూపాలు.

పిండాకృతులైన మాత మహాసరస్వతి శ్వేతవర్ణంతోను, మాత మహాలక్ష్మి ఎరుపు రంగుతోను, మాత మహాకాళి నలుపు రంగుతోను ప్రకాశిస్తుంటారు.

మధ్యభాగంలో స్థితమైన పిండాకృతి ఇరు పక్కలగల ఆకృతుల కంటే కొద్దిగా పెద్దదిగా ఉంటుంది. ఆ త్రిమూర్తుల "సహజవర్చస్సు-అలంకరణలను" నిశితంగా గమనిస్తే తల్లి జగన్మాతరీవి ప్రస్ఫుటమౌతుంది.

ముప్వరూ శిరమున చాందీలు, బంగారు కిరీటములు, ఛత్రములతో విరాజిల్లుతుంటారు. దేవి త్రిస్వరూపాల ప్రతీకలైన ఈ పిండాకృతుల ముందు భాగాన ఆయాదేవతల సాకారరూపాలు ప్రతిష్ఠింపబడ్డాయి.

మాత మహాకాళి పిండాకృతి సమీపంలో రెండు సాకారమూర్తులు భక్తుల దృష్టిని ఆకర్షిస్తాయి. మొదటగా కాలమేఘపు వర్ణంలోని అష్టధాతు లోహ విగ్రహం. అది కామదాత్రి, కామహర్త్రియైన తల్లి మహాకాళి విగ్రహం, ఈ తల్లి కలహప్రియగా, ఆర్తత్రాణ పరాయణిగా, అభయప్రదాయినిగా దర్శనమిస్తుంది. రెండవది చూడముచ్చటైన మాత శ్రీవైష్ణవి పాలరాతి విగ్రహం. పిండాకృతులు సమీకృతమైన మూలశిల వెనుకభాగంలో శ్రీ మహారాజ్ గులాబ్‌సింగ్ చేత సమర్పించబడిన 65 తులముల బరువైన పద్మాసనస్థితయైన మాత శ్రీమహాలక్ష్మి విగ్రహం సాక్షాత్కరిస్తుంది. ఆ విగ్రహం వెనుక భాగంలో 22 తులాల బరువైన సింహవాహనస్థిత మాతశ్రీవైష్ణవి బంగారు విగ్రహం దర్శన మిస్తుంది. ఈ విగ్రహం గుహనూతనద్వార ప్రారంభోత్సవ సందర్భంలో డా॥ కరణ్‌సింగ్ చేత సమర్పించబడినట్టిది. అదే విధంగా మాత సరస్వతి యొక్క పిండాకృతి వెనుక భాగంలో సకలశాస్త్ర విద్యాధిదేవత హంసవాహనియైన శ్రీవాగ్దేవి ఇత్తడి, మరియు పాలరాతి విగ్రహాలు దృగ్గోచరమౌతాయి. ఆ తల్లి బ్రహ్మజ్ఞాన ప్రదానం చేసేందుకు, సిద్ధమన్నట్లు వాత్సల్యం నిండారగా దర్శనమిస్తుంది.

## గుహలోని దేవతాది ధార్మిక చిహ్నాలు

ఈ పవిత్ర గుహలోను, కుడ్యములపైన, కప్పు భాగాన సొరంగ మార్గమందూ ధర్మసంబంధిత-దేవతామూర్తుల చిహ్నాలు ఎన్నెన్నో కనువిందుచేస్తాయి. ముప్పది మూడుకోట్ల దేవతలు ఈ గుహయందు హాజరై ఈ ముప్వరుమాతలను, దేవి శ్రీవైష్ణవిని భక్తిమీర పూజించి తమ గుర్తుగా ఇట్టి చిహ్నాలను ఏర్పరచినట్లు భక్తుల ప్రగాఢనమ్మకం. నిత్యపూజల మరియు

ఉదయాస్తమాన హారతిసమయాలలో సకలదేవతలు ఈ గుహకరుదెంచి ఈ జగన్మాతకు తమ భక్తి విధేయతలను ప్రకటిస్తారని భక్తుల అపారనమ్మకం. ఈ గుహ ప్రాచీన సొరంగమార్గ ముఖద్వారము నుండి రమారమి 100 అడుగుల పొడవు ఉంటుంది. హైందవధర్మాచార నిరతులగు భక్త బాహుళ్యము కొలిచే దేవతల చిహ్నాలు ఎన్నింటినో ఈ గుహలో సందర్శించవచ్చు.

సొరంగ ముఖద్వారపు వామభాగంలో వక్రతుండగణేశుని ఆకృతి దర్శనమిస్తుంది. ఆ ప్రక్కనే సూర్యచంద్రుల చిహ్నాలను భక్తులు దర్శించవచ్చు. తదుపరి భక్తులు అడ్డుగా ఉన్న ఒక కొండ రాతిని దాటడానికి పాకవలసి ఉంటుంది. ఆ రాతిని "భైరవనాథుని మొండెము" అని పిలుస్తారు. వద్దని వారిస్తున్నా వినకుండా తనను అనుసరిస్తున్న భైరవనాథుని, మాత శిరశ్ఛేదం చేసినది, ఈ గుహ ద్వారంముందే. ఈ శిల పదునాలుగు అడుగుల పొడవు కలిగి ఉంటుంది. తరువాత మనకు రామ భక్త హనుమాన్ దర్శనమవుతుంది.

ఈ స్వామిని భక్తబాహుళ్యం "వానరవీరుడు" అని కొలుస్తారు. ఇక్కడి నుండి భక్తులు ఉద్ధృత చరణగంగ ప్రవాహానికి ఎదురుగా నడవడం ఎంతో కష్టంతో కూడుకున్నపని. కానీ వారిలోని అమ్మని చూడబోతున్నామన్న ఆనందం ఆ కష్టాలను త్రోసిరాజంటుంది.

అలా! మరో ఇరవైమూడు అడుగులు ముందుకు నడిస్తే భక్తుల వామహస్తం భాగంలో గుహపైకప్పు మిక్కిలి ఏటవాలుగా ఉండి ఒరిగి పోతున్నట్లుంటుంది. విచిత్రం. ఆ కప్పు భాగమంతా లెక్కకందని శేషనాగుల ఆకృతులతో నిండి ఉంటుంది. అలా వాలిపోతున్న కప్పుభాగం అసంఖ్యాకములైన ఆదిశేషుని శిరస్సులపై బలంమోపి నిలబడినట్లు భావనకల్గిస్తూ, ఆ చిత్రం భక్తులమనస్సును దోచుకుంటుంది. ఆదిశేషుని ఆకృతి క్రిందిభాగంలో మాతయొక్క హవనకుండపు చిత్రం దర్శనమిస్తుంది. హవనకుండం

సమీపంలోనే శంఖ, చక్ర, గదాది చిహ్నాలు చెక్కబడి ఉంటాయి. తరువాత ఆ గుహకప్పును తాకుతున్నంత ఎత్తులో పంచపాండవుల, సప్తర్షుల రూపులు, పవిత్ర గోమాత-కామధేనువు పొదుగు, బ్రహ్మ, విష్ణు, శివపార్వతుల ఆకృతులు చెక్కబడిఉంటాయి.

ఇంకొద్దిగా ముందుకుసాగితే శివపార్వతుల చిత్రాలకు కొద్దిగా క్రిందభాగంలో, అనుపమ హరిభక్తుడు ప్రహ్లాదుని "తప్తస్తంభం" అనబడే శిలాఫలకాకృతిని దర్శించవచ్చు. ఈ తప్తస్తంభానికి క్రింది భాగంలో మూలగా నీటి ప్రవాహంలో శక్తిసమన్వితమైన యంత్రరాజాన్ని చూడవచ్చు. ఈ యంత్ర ఉపరితలంపై అసంఖ్యాకములైన, గూఢమైన, మర్మముతోకూడి, భావగర్భితంగా, అవగాహనకందని గుర్తులు, సంఖ్యలు చెక్కబడి ఉంటాయి. మరో ఇరవైరెండు అడుగులు ముందుకు సాగితే తల్లి వాహనమైన సింహపుపంజా ఆకృతిని దర్శించవచ్చు, పంజాను చూచినతక్షణం తల్లి అనుజ్ఞతో దుష్టసంహారానికి సిద్ధమన్నట్లు సంపూర్ణ సింహాకృతి మన కనులముందు నిలుస్తుంది. ఇప్పటివరకు భక్తులు ముఖద్వారం నుండి ఏబదితొమ్మిది అడుగులు ప్రయాణించినట్లు. మరో పదమూడు అడుగులు ముందుకుసాగితే గుహకప్పుభాగంలో ఆదిశేషుని ఆకృతి దర్శనమిస్తుంది. ఆ ప్రదేశంలో కొండరాతి కప్పుభాగం భారమంతా తానే భరిస్తూ మాతను సేవించుకుంటున్నట్లు భక్తశేషునిభావం భక్తులకు అవగతమౌతుంది. మరో ఆరుఅడుగులు ముందుకు సాగితే భక్తులకు ఎడమచేతివైపు శ్రీగౌరిశంకరులు దర్శనమిస్తారు. అక్కడినుండి మరో పదమూడు అడుగుల దూరంలో భక్తులు త్రిపిండాకృతులు విరాజమానమైన మాతశ్రీవైష్ణవి పీఠం చేరుకుంటారు. వారే మాత శ్రీసరస్వతి, మాతశ్రీ మహాలక్ష్మి, మాతశ్రీ మహాకాళి. ఈ పవిత్ర దేవతామూర్తులకు కుడివైపు కొద్ది ఎత్తులో శ్రీమహాగణపతి, సూర్యచంద్రులు మరియు తల్లి అన్నపూర్ణ దర్శనమిస్తారు. వారి ప్రక్కనే కూర్చున్న భంగిమలో సింహరాజాన్ని దర్శించవచ్చు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావించే సమయాలలో

భగవతికి సహకారిణిగా ప్రదర్శించే గాంభీర్యానికి, శౌర్యానికి ప్రతీక ఈ సింహరాజం. ఆ చిత్రానికి కొద్దిగా ముందుగా కోరినకోర్కెల నీడేర్చే తల్లి వరదహస్తాకృతిని దర్శించవచ్చు.

పిండాకృతుల పీఠానికి ఎదురుగా సహజసిద్ధమైన పశుపతినాథుని మూర్తి దర్శనమౌతుంది.

శ్రీవైష్ణవి పీఠపు మూలభాగంనుండి గంగ ఉద్భృతంగా ప్రవహిస్తూ గుహను పావనంచేస్తూ స్నానఘట్టానికి చేరుకుంటుంది. ఎడతెగకపారే ఈ ప్రవాహాన్ని భక్తులు చరణగంగ అని వ్యవహరిస్తారు. ఈ పవిత్రజలాన్ని భక్తులు ఆసక్తితో సేకరించి సుదూరప్రదేశాలకు తమతోపాటు కొనిపోయి మాత తీర్థంగా అందచేస్తారు. ఈ స్నానఘట్టంలో పుణ్యస్నానం చేసిన పిమ్మటే భక్తులు మాత దర్శనంకోసం బారులు తీరుతారు. స్వయంగా, కష్టమైనా - ఇష్టంగా సభక్తికంగా త్రికూటపర్వతం ఆధిరోహించి మార్గమధ్యంలో మాత చరించిన దివ్యప్రదేశాలను సందర్శిస్తూ, చరణ గంగ స్నానఘట్టంలో స్నానమాచరించి తల్లి దర్శనం పొందినవారు ధన్యులు. అట్టి భాగ్యశీలురైన భక్తులు మాత్రమే తల్లినివాసమైన ఈ పర్వతసానువులలో, లోయలలో, ప్రకృతి సందర్శనలో, ప్రాచీన గుహ ఆకారప్రాకారాలలో అణువణువున ద్యోతకమయ్యే ఆధ్యాత్మికశోభను ఆస్వాదించి దివ్యానందాన్ని అనుభవించి కృతార్థులు కాగలరు.

## మాత శ్రీవైష్ణవి నిత్యపూజలు

సతతం దివ్యశోభతో అలరారే శ్రీమాత వైష్ణోదేవి యొక్క పవిత్రగుహ భక్తుల సందర్శనార్థం సూర్యోదయ సమయంలో రెండు గంటలు, సాయంసంధ్యాసమయంలో రెండుగంటలు-పూజహారతులకుగాను-తప్ప దినమంతా తెరవబడి ఉంటుంది. ప్రతిదినం సూర్యోదయ సమయాన మాతకు ప్రాతః కాలపూజ, ఆరతి నిర్వహించబడతాయి. ప్రాతః కాలపూజలో

భాగంగా పవిత్రగుహ, తల్లి గర్భాలయ ప్రదేశము శుద్ధి జరుగుతుంది. తదుపరి పవిత్ర పిండమూర్తులకు శుద్ధజలంలోను, పంచామృతాలతోను మంత్ర సహితంగా అభిషేకం జరుగుతుంది. తదనంతరం నూతన వస్త్రధారణ, సమస్త ఆభరణాలతోను పలురకాల పూలతోను అలంకరణ కావింపబడుతుంది. నైవేద్యం, అనంతరం మంగళ హారతి ఇవ్వబడుతుంది.

ఘంటారావం మిన్నంటుతుండగా, శంఖారావం సమీపలోయల నుండి ప్రతిధ్వనిస్తుండగా, చేతాళములు మార్మోగుతుండగా అర్చకస్వాములు భగవతికి నీరాజనం సమర్పిస్తారు. తదనంతరం అర్చకస్వాములు "అట్కా" అనే ప్రదేశంలో పవిత్రగుహకు నీరాజనం సమర్పిస్తారు. పిమ్మట భక్తులకు దర్శనం కల్పించి ప్రసాదవితరణ కావిస్తారు. భక్తులు సమర్పించదలచిన కానుకలను గుహప్రవేశద్వారానికి ముందుగానే నిర్దిష్టప్రదేశంలో అర్చక స్వాములకు అందచేయవలసిఉంటుంది. దర్శనానంతరం వానిని 'అట్కా' అనే ప్రదేశంలో భక్తులకు తిరిగి అందచేస్తారు. 'అట్కా' అనగా, అర్చకులు భక్తులు భగవతికి సమర్పించదలచిన కానుకలను స్వీకరించి మాతకు నివేదించి, తిరిగి భక్తులకే అందచేసే ప్రదేశం. అదే సమయంలో మాత శ్రీవైష్ణవి యొక్క వృత్తాకారపు వెండి పూతగల లోహపు రూపు మరియు ప్రసాదం కూడా భక్తులకు అందచేస్తారు. ఈ వృత్తాకారపు రూపు అంచు భాగంలో శ్రీమాతవైష్ణోదేవి ష్రైన్ (గర్భగుడి) బోర్డు (జె&కె) అని ఆంగ్లంలో ముద్రించబడి ఉంటుంది. అంతర్భాగంలో మేఘములు, ఆ ఎత్తున త్రికూట పర్వతశిఖరములు, గోపురం కల గుహముఖద్వారం, ఆ రూపు ముద్రించిన సంవత్సరము అన్న అంశములు అందంగా ముద్రించబడి ఉంటవి. ఆ రూపు వెనుకభాగంలో ద్వారంలో రెండుసింహాలు, వాటివెనుక త్రిపిండాకృతులు, తత్సంబంధిత కిరీటములు, ఛత్రములు, ముద్రింపబడి ఉంటాయి. ఎంతో మనోజ్ఞంగాఉండే ఈ రూపు పొందినవారిదే భాగ్యమన్నట్లు దివ్యానందాన్ని, కల్గిస్తూ మందిరంలో జీవితాంతం భద్రపరచుకోనేలా చేస్తుంది.

అట్కావద్ద మాతగుహకు హారతి సమర్పించిన తరువాత భక్తులను సందర్శనార్థం గుహప్రవేశానికి అనుమతిస్తారు.

## మాత శ్రీవైష్ణవి మూడు పిండాకృతుల మాహాత్మ్యం

### (అ) మాతశ్రీమహాలక్ష్మి మాహాత్మ్యం

భరతఖండపు ఉత్తరభాగాన శతశృంగపర్వతపు త్రికూటశిఖరంపై మాత శ్రీవైష్ణవిదేవి విరాజమానురాలై ఉన్నది. ఈ పర్వతపు ప్రముఖ గుహలో ఏకశిలపై ఆవిష్కరింపబడిన మూడు గోళాకృతి రూపాలు వెలసియున్నవి. మధ్య స్థానంలో వేంచేసియున్నది, శ్రీమహావిష్ణువుయొక్క శక్తిఅయిన మాత శ్రీవైష్ణవి. ఈతల్లి దర్శనమాత్ర జీవన్ముక్తి ప్రదాత. ఈమెయే శ్రీ వైష్ణవీ పరాశక్తి. ఈమె మాతృరూపంలో ఉన్న సచ్చిదానంద పరాత్పరబ్రహ్మ. ఈ తల్లి పరమాత్మతోకూడి సృష్టి, స్థితి, లయ, కార్యములను నెరవేర్చు ప్రకృతి. ఆమె జనన మరణములు లేనట్టిది. శ్రీ దేవీభాగవత అంతర్గతంగా, శ్రీమహాలక్ష్మి మహిషాసురవధ సందర్భంగా ఇంద్రునితో ఇలా పలికింది. "శచీపతీ! వెన్నెలతో చంద్రుని విడదీయలేని అపురూప సంబంధంలా, ఒక దేహంలోని వామ – దక్షిణ భాగాలవలె, ఈ సృష్టి నిర్వాహణలో పరమాత్మతో అంతర్లీనంగా నేను సంపూర్ణత్వం కలిగి ప్రాణులలో వ్యాపించి విరాజమాననై ఉంటాను. నా ఈ స్వరూపము సత్వము, రజస్సు, తమస్సు అనే త్రిగుణములకు అతీతము. నా మరొక పేరు నారాయణి. నేను నిత్యను సమస్త విశ్వమునకు అధీశ్వరిని. ఎల్లలులేని కళ్యాణమయ గుణశోభితను, నారాయణి అనే నామంతో వెలసియున్న వైష్ణవీ పరాశక్తిని".

వేదశాస్త్ర, విజ్ఞానముననుసరించి శ్రీవైష్ణవి శుద్ధసత్వస్వరూప. ఆమెయే శ్రీ మహాలక్ష్మి. ఆమె పరమాత్మ స్వరూపమైన శ్రీహరియొక్క శక్తిఅంశ. సహస్రదళ శోభితమైన పద్మం ఆమె ఆసనం. ఆమె యొక్క ముఖవర్చస్సు, కాంతులీనుతున్న బంగారు తేజస్సును త్రోసిరాజంటుంది. ఆ తల్లి రూపకాంతి

ముందు కోటి చంద్రుల కాంతి దిగదుడుపే. మాత మహాలక్ష్మి పెదవులపై చిరుదరహాసం సదా తొణికిస లాడుతుంటుంది. సర్వసంపదలకు అధిష్ఠాత్రి అయినందున ఆమెను కొలిచేవారికి అడగకుండానే ఆమె ధనం, ఐశ్వర్యం, సుఖశాంతులు, అంత్యంలో మోక్షప్రాప్తి అనుగ్రహిస్తుంది. భగవాన్ శ్రీహరి యొక్క మాయయైయుండి, ఆతని సర్వశక్తుల సమీకృత రూపమైనందున ఈ తల్లి మహాలక్ష్మి అని పిలవబడుతోంది. వైష్ణవి, దుర్గ అనేవి ఈ దేవి ప్రముఖ ఇతరనామాలు.

ఏవిధంగా వేదశాస్త్రాలు "నదులలో గంగ, దేవతలలో శ్రీహరి, వైష్ణవులలో పరమశివుడు, శ్రేష్ఠులని" ప్రవచించాయో అదేలాగున దేవియొక్క అన్ని నామ రూపాలలో వైష్ణవి నామంతో ప్రసిద్ధిగాంచిన భగవతి శ్రీమహాలక్ష్మి సర్వోన్నతురాలు, మాత శ్రీ మహాలక్ష్మి సౌందర్యరాశి, సంయమనశీలి, శాంతమయి మరియు కోమల స్వభావి. కామక్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాది అరిషడ్వర్గ రహితులైన భక్తులను కృపతో పాలించుట ఆ తల్లి సహజసిద్ధగుణమై యున్నది. ఆమె వాక్కులు మధురమైనవే గాక అత్యంత ప్రీతికరమైనవి. ఆ తల్లి ఎన్నడూ అప్రియ వాక్కులు పలుకనట్టిది. క్రోధము, హింసవంటి చర్యలకు అతీతమైనట్టిది. సంపూర్ణ ప్రపంచము, సమస్త సంపదలు ఆమె స్వరూపమే. ప్రపంచంలోని జీవరాసుల మనుగడకు ఆవశ్యకములైన అన్నము, ఫలపుష్ప వనస్పత్యాది ఆహార పదార్థములు అన్నియు ఆమె స్వరూపమే భూమండలంలో మానవమాత్రుల సంసారిక – వ్యాపార సంబంధిత కార్యముల నిర్వాహణకు ఆవశ్యకమైన ధనమునకు అధిష్ఠాత్రి, ఈ దేవియే. శ్రీలక్ష్మిదయలేని, దరిద్రుడైన వ్యక్తి జీవించియున్నా మృతప్రాయునితో సమానుడు. శ్రీమహాలక్ష్మి కృపాకటాక్ష వీక్షణ పాత్రుడైనవాడు సుఖవంతమైన, గౌరవప్రదమైన జీవితం గడపగలడు. లక్ష్మీప్రసన్నతకు నోచుకోనివారు బంధుమిత్రుల చేత హీనంగా చూడబడతారు. లక్ష్మీ అనుగ్రహపాత్రుల ఇంటిచుట్టూ సోదరులు, బంధుమిత్రులు

కపటప్రేమను ఒలకబోస్తు ప్రదక్షిణలు చేస్తుంటారు. మాత మహాలక్ష్మి దయతోనే మానవులకు పారమార్థిక శోభ ప్రాప్తిస్తుంది. అట్టివారు నిశ్చింతతోకూడిన సుఖప్రద జీవితం సాగించగలరు. వారికి ధర్మార్థకామ మోక్షాలు సులభంగా సిద్ధిస్తాయి.

ఆదిశక్తి సర్వకార్యకారణ రూపిణి. సర్వోన్నత పవిత్రమూర్తి ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులను స్వరూపముగా గల్గినది. వైకుంఠంలో స్వామి శ్రీహరి సేవలో లీనమై మహాలక్ష్మిగా కీర్తింపబడే ఆ తల్లి, క్షీరసాగరంలో గృహ లక్ష్మిగాను, పచ్చని పంటపొలాలలో సంక్రాంతి లక్ష్మిగా, ధాన్యపు పాతరలలో, గాదెలలో ధాన్యలక్ష్మిగా, వ్యాపారాభివృద్ధికై అనుగ్రహించే వ్యాపారలక్ష్మిగాను, గ్రామగ్రామాన స్థానిక గ్రామదేవతగాను, ఇంటింటా సౌభాగ్యలక్ష్మిగాను ప్రస్తుతింపబడుతోంది.

ప్రపంచంలోని సర్వచరాచర జీవరాసులలో జీవనశోభను ప్రసాదిస్తూ వెలుగొందుతోంది. ఈ ప్రపంచంలో దృష్టికి గోచరించే సౌందర్యము, ఐశ్వర్యము, దివ్యత్వము, జ్ఞానం ఈ దేవి కారణంగా సిద్ధించేవే. పాపులైన మానవులలోని దుష్కర్మ నైజము, పరస్పర రాగద్వేషములు, విరోధము, తగువులాటలు, దెబ్బలాటలు, హత్యలు, అసభ్య ప్రేలాపనలు, నిందారోపణలు, వంటిప్రవృత్తి ఆ తల్లిమాయ ప్రభావమే.

మాత మహాలక్ష్మి దయాసముద్ర. భక్తులు ఆమెకు మిగుల ప్రీతి పాత్రులు. అందుచే మాతాపితరుల సమానంగా వారిని పోషిస్తూ వారి కోరికలను సిద్ధింపచేస్తుంది. ఆ జగన్మాత తనను ఆరాధిస్తూ, పూజాది కార్యక్రమములను నిర్వహించే వారిని అనుగ్రహించుటకు ఎల్లప్పుడూ ఆరాటపడునట్టిది.

**(ఆ) మాత శ్రీమహాకాళి మాహాత్మ్యము**

గుహలోని మాతశ్రీమహాలక్ష్మి, వామభాగమున ఉన్నట్టి మరో పిండాకృతి మహాకాళి స్వరూపము. మహాకాళి, మహాశక్తియొక్క

ప్రధానాంగము. మహావీరులైన క్రూరరాక్షసులు శుంభ, నిశుంభులతో జరిగిన భీకరయుద్ధ సమయంలో ఈ తల్లి, భగవతిదుర్గయొక్క నుదురు భాగంనుండి ఉద్భవించింది. మహాకాళి, భగవతి దుర్గయొక్క అర్థాంశంగా ప్రకటితమైనది. తేజస్సుయందు, గుణములందు, దేవిదుర్గకు దీటైనది. ఆమెయొక్క అత్యంత శక్తివంతమైన ఆకాశాన్నంటే శరీరము, కోటిసూర్యుల కాంతితో సమానమైన తేజస్సు కల్గినట్టిది. ఆదిపరాశక్తి అంశలన్నింటిలో మహాకాళి ప్రముఖమైనది. ఆ మాతృకను మించిన మరోశక్తిశాలి ఇకలేదు. మహాకాళి కరుణాంతరంగ. చైతన్యస్వరూపిణి. సంపూర్ణసిద్ధిప్రదాత. గుణసంపద, లోకపాలన, దుష్టశిక్షణ, శిష్టరక్షణ, శౌర్యపరాక్రమములందు ఆతల్లి శ్రీహరికి సమానురాలు.

ఆమె శ్యామల వర్ణశోభిత! మహాకాళి అసమానశక్తి సంపన్నురాలు. తలంపు మాత్రాన సమస్త విశ్వాన్ని ఒక్కక్షణంలో ప్రళయంలో ముంచెత్తే లయకారిణి కాగలదు. రాక్షసప్రవృత్తి లోకశ్రేయస్సుకు ప్రతిబంధకమని, ముల్లోకాలలో తెలియచేయుటే తన ధ్యేయంగా అసురులతో అనేక యుద్ధాలలో పోరాడి అధర్మాన్ని నియంత్రించింది. భగవతి మహాకాళిని పూజించే వారికి ధర్మార్థకామమోక్షాలు సిద్ధించడమేగాక, సాంసారిక సంపదలు కూడా ప్రాప్తిస్తాయి. అందుచేత బ్రహ్మాదిదేవతలు, ముని గణములు, సమస్తమానవులు భక్తితో మహాకాళిని ఉపాసిస్తారు.

భగవాన్ శంకరుడు "మహాకాళుడు" అని కూడా పిలువబడతాడు. అట్టి దేవదేవుని శక్తియైన ఈ మాతృక మహాకాళి అనిపిలువబడుతుంది. కాళిక నీలి కమలమును బోలు శ్యామవర్ణ స్వరూపిణి. నాల్గుహస్తములతోను, కంఠమందు పుర్రెలమాల, పులిచర్మము-వస్త్రముగాను, కలిగిఉంటుంది. పొడవైన, పదునైన దంతాలు, భయంకొల్పే రక్తసిక్తమైన నాలుక, ఎర్రనికళ్ళు, విశాలమైన చెవులు, విప్పారినవదనంతో ఆ తల్లి దర్శనమిస్తుంది.

"కాళీమాత, భద్రకాళి, శ్మశానకాళి, గుహ్యాకాళి మరియు రక్షాకాళి" మొదలైన నామాలతో సంబంధిత రూపాలతో విరాజిల్లుతుంది. ఈ దేవికి

మరొక ప్రసిద్ధనామం "చాముండ". చండ-ముండ నామధేయులైన ఇరువురు మహారాక్షసులను యుద్ధంలో సంహరించింది కావున చాముండ అని కొలువబడుతుంది. మాత మహాకాళి లయకారిణి. అధర్మంగా వ్యవహరించే దుష్టులను సంహరించి, భక్తులకు అభయ ప్రదానం చేయటం ఆ తల్లి ముఖ్యధర్మం. తన భక్తులకు విఘ్నములు, రోగములు, శోకము, దుఃఖము, భయము మొదలైన క్లేశాలను దూరంచేస్తుంది.

ఈమె మహా తేజఃస్వరూపిణి. ఈ మాత స్వరూపము వీరత్వము, సాహసము, ఐశ్వర్యము, తేజము మరియు అలౌకికశక్తి ఆదిగాగల సంపదల సమష్టి ప్రతీక. ఆమె పదిహస్తాలలో ఖడ్గము, చక్రము, గద, బాణము, ధనుస్సు, భుశుండి, త్రిశూలము, పరిఘ, శిరము మరియు శంఖాదులను ధరించిఉంటుంది. ఆమె త్రినేత్రి, సర్వాభరణభూషిత, ఆమె శరీరకాంతి నీలమణుల కాంతితో సమానం. ఆ తల్లి ఎల్లప్పుడూ తన భక్తుల సంకటములను తొలగించి రక్షిస్తూ జీవిత కాలమున సకల సంపదలను ఒనగూరుస్తూ, అంత్యంలో మోక్షసిద్ధి కలుగచేస్తుంది.

మధు-కైటభుల దాడితో సంకటగ్రస్తులైన బ్రహ్మ, విష్ణు, తదాదిదేవతలను భయవిముక్తులను గావించింది. ఈ తల్లి కృపవలన మానవులు నిర్భయులౌతారు. యుద్ధంలో వారిని శత్రువులు పరాజితులను చేయలేరు. వారికి ఎట్టి వ్యాధులు సంక్రమించవు. అకాలమృత్యువు దరిచేరదు. గ్రహదోషములు, భూతప్రేత పిశాచాది శక్తులు బాధించవు. కాళిమాతను భక్తిభావంతో సేవించి, ఉపాసించిన మానవులకు శత్రునాశనం, ఆరోగ్య, సౌభాగ్యప్రాప్తి, పరమపద ప్రాప్తి సిద్ధిస్తాయి.

**(ఇ) మాతశ్రీ మహాసరస్వతి మాహాత్మ్యము**

గుహయందలి శ్రీమహాలక్ష్మి దక్షిణభాగమున ఉన్నట్టి మూడవ పిండాకృతి, మాత మహాసరస్వతి. మహాశక్తి యొక్క మూడవ ప్రముఖ

రూపనామము మహాసరస్వతి. ఆమె పరబ్రహ్మ-పరమాత్మలతో అనుసంధానానికి ఆవశ్యకమైన బ్రహ్మజ్ఞానానికి, వాక్కుకు అధిష్ఠాత్రి, జ్ఞానముద్ర, విజ్ఞాన ప్రదాయిని. కవి, పండితుల పూజలనందుకుంటూ వారికి జ్ఞానసిద్ధి కలిగిస్తూ వారి ద్వారా సమాజమందు సనాతనధర్మము వేళ్ళూనుకొనేలా చేసే తల్లి దేవిసరస్వతి, శుద్ధసత్వ స్వరూపిణి, మరియు శాంతస్వరూపిణి. మానవులకు వాణి, విద్య, బుద్ధి, జ్ఞానముల ప్రదాత్రి ఈ తల్లియే. వాక్కునందు శ్రేష్ఠత, విద్యయందు, కళలయందు నిపుణత, బుద్ధియందు విలక్షణత, జ్ఞానమందు వైవిధ్యము, ఈ తల్లి కృపాంశమే. ఆ తల్లి మేనిఛాయ హిమాలయములను త్రోసిరాజను శ్వేతవర్ణము. ఈ మాతృక మిక్కిలి సౌందర్యరాశియేగాక అపురూప తేజోవతి. చంద్రబింబం వంటిముఖంతోను, శరత్కాలంలో వికసించిన కమలముల వంటి కన్నులతోను సాటిలేని సొగసుగల చుబుకముతోను, మేలిముత్యములవంటి పలువరుసతోను, మాత సరస్వతి ప్రకాశిస్తూ ఉంటుంది. ఉజ్వలమైన శ్వేత వస్త్రములను ధరించి, జాతిరత్నాలు, కెంపులు పొదగబడిన వివిధరకాల ఆభరణములు ధరించి శోభాయమానంగా దర్శనమిస్తుంది.

మహాసరస్వతి శ్రుతులకు, శాస్త్రములకు, సమస్త విద్యలకు అధినేత్రి. ఈ జగత్తులోని సర్వవిద్యలు, కళలు, ఈ తల్లి స్వరూపమే. ప్రతిమానవునిలోని బుద్ధి, విద్య, కవితాశక్తి, నటనాకౌశలము, ఉపన్యాసము-గ్రంథరచనల కావశ్యమగు సాహిత్య పటిమ, యోగ్యత, ధారణశక్తి ఆమె కృపవలననే ప్రాప్తిస్తాయి. బహువిధములుగా ప్రతిపాదింపబడే సిద్ధాంతాలు, వాటి అర్థభేదాలు, నూతన రూపకల్పనలు, వాదోపవాదములు, విమర్శలు - ప్రతి విమర్శలు మొదలగు వానికి ఆవశ్యకమయ్యే శక్తి ప్రదాత మహా సరస్వతియే! ఆ తల్లి దయవలనే శాస్త్ర మరియు జ్ఞాన సంబంధమైన, సందేహములు, భ్రమలు తొలగిపోతాయి. మానవులలో స్మరణశక్తి ప్రదాత అయిన ఈ మాత ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులను రూపంగా కలిగిఉంటుంది.

కల్పనాశక్తి మరియు ప్రతిభకూడా ఆ తల్లి వరప్రసాదమే. ఈ తల్లి అనుగ్రహంవల్లనే సృష్టికర్త చతుర్ముఖబ్రహ్మ, ఆదిశేషుడు, దేవతలగురువు బృహస్పతి, మహర్షి వాల్మీకి, వేద వ్యాసులు మొదలైనవారు వేదశాస్త్రము, స్మృతులు, ఇతిహాసములు, పురాణముల రచనల యందు సఫలీకృతులైనారు.

మాత సరస్వతిదేవియొక్క ఒక చేతియందు వేదము మరొక చేతియందు వీణ మనం దర్శించవచ్చు. అవి "విద్య మరియు సంగీతకళలకు అధిదేవత మహా సరస్వతియే" అని చెప్పకనే చెపుతుంటాయి. మానవజాతి సమస్త విద్యలు అభ్యాస సమయాన, గీత, సంగీత విభావరులందు బహువిధ నృత్య నాటక కార్యక్రమముల ప్రారంభమందు, మహాసరస్వతిని ఆరాధించి ఆ తల్లి అనుగ్రహంతో సఫలత పొందు తున్నారు. అందుకు కారణం ప్రముఖ అంశములైన లయ, తాళములతో కూడిన సంగీతముయొక్క మూలసౌందర్య స్వరూపము మహాసరస్వతి అగుటయే. బ్రహ్మస్వరూప, జ్యోతిస్వరూప, సనాతని, సమస్త కళలకు అధిధాత్రి అయినందున మాత– మహాసరస్వతి, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాది దేవతలు, సమస్త ఋషి, ముని, మానవాదుల చేత పూజింపబడుతోంది. శ్రీహరి అభీష్టురాలైనందున, రత్నములు కూర్చిన స్ఫటికాక్ష జపమాల అనుసంధానంతో శ్రీహరిని స్మరిస్తూ దర్శనమిస్తుంది గీర్వాణి. ఈ తల్లి తేజస్సు తపోమయశక్తి చేత ద్విగుణీకృతమై దర్శనంచేతనే భక్తులకు దివ్యానందాన్ని కల్గిస్తుంది. తపశ్చర్యలు కావించే తన భక్తులకు ఈ తల్లి శీఘ్రంగా ఫలప్రదానం గావిస్తుంది. మానవుల శబ్ద, అర్థ, భావ వ్యక్తీకరణలందు ప్రస్ఫుటమౌతూ ఈ తల్లి గీర్వాణిగా ప్రకాశిస్తుంటుంది. ఈ తల్లి కృపతోనే, మూర్ఖులు, అల్పమతులు – బుద్ధిమంతులై పండితులుగా, కవులుగా, ధన్యులుగాగలరు.

**మాతశ్రీవైష్ణోదేవి త్రిపిండాకృతుల రహస్యం**

ఆదిపరాశక్తి యొక్క మరొక నామమే శ్రీవైష్ణవి. అసుర సంహరణార్థం బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాదులతోగూడిన ముక్కోటి దేవతల శక్తి సమీకరణ

ద్వారా అవతరించింది ఈ దేవి. అసురుడైన రంభుని కుమారుడు, మహాబలి మహిషాసురుని అక్రమాలకు, అత్యాచారాలకు పీడితులైన ఇంద్రాది దేవతలు బ్రహ్మ, మహేశ్వరులను శరణుకోరారు. వారి సలహామేరకు దేవతలందరూ వైకుంఠవాసి శ్రీమహావిష్ణువుని చేరి తమ కడగళ్ళను ఏకరువు బెట్టినవారై శరణుకోరారు. ప్రసన్నుడైన శ్రీవిష్ణువు దివ్యదృష్టి సారించాడు. మహిషాసురుని మృత్యువు, ఒక స్త్రీ ద్వారా మాత్రమే సంభవించగలదని ఆతనికి అవగతమైంది.

ముక్కోటి దేవతలు ఆర్తితో సభక్తికంగా కావించిన స్తుతికి సంతుష్టురాలై ఒక మహాశక్తి అంశ అవతరించింది. ఆమెయే శ్రీవైష్ణవి నామంతో నేటికీ భక్తులను అనుగ్రహిస్తోంది. ప్రాచీన గుహ గర్భమందు, దర్బారులో బ్రహ్మాదివ్యాంశ – మహాసరస్వతిగాను, శ్రీవిష్ణుని అంశ – మహాలక్ష్మిగాను, శైవాంశ – మహాకాళిగాను స్థితమై ఉండినవి. బిలమందలి ఏకశిలపై పిండాకృతిలో స్వయంభువులైన మూర్తులు ఈ దేవేరుల ప్రతీకలే. ఈ త్రిస్వరూపముల సంయుక్త నామమే శ్రీవైష్ణవి. బయటకు చూడటానికి భిన్నరూపాలుగా గోచరిస్తున్నప్పటికి మూలము ఏకశిలయైనందున ఈ త్రిమూర్తులలో ఏలాంటి భేదము లేదని ప్రస్ఫుటమౌతున్నది. ఈ విధంగా మాతవైష్ణోదేవి గహ్వరమందు విరాజమానమైన త్రివిధ శక్తిఅంశలు పీఠముపై ప్రత్యేకంగా అగుపించినప్పటికీ మూలంలో సంయుక్తమై ఆదిపరాశక్తి స్వరూపమై యున్నది. ఆ విధంగా ఆమె సృష్టి, స్థితి, లయ తిరోధాన, అనుగ్రహములనే ఐదుకార్యాలు సమయబద్ధంగా నిర్వర్తించే పంచకృత్య పరాయణి అయింది. కాబట్టి శ్రీపరాశక్తి యొక్క మూలవిరాట్ నుండి ఆవిర్భవించిన ఈ త్రివిధరూపాలు ఆధ్యాత్మికంగా త్రిశక్తులైన ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి, క్రియాశక్తుల ప్రతిరూపాలు. ఈ లోకంలో ఇచ్ఛా, జ్ఞానం మరియు క్రియా శక్తుల సమన్వయము లేకుండా ఏ కార్యము ఫలప్రదం కాదు. భగవాన్ శ్రీమహావిష్ణువు లోకకళ్యాణార్థం వివిధ అవతారాలు ధరించిన విధంగా ఆదిశక్తి వైష్ణవి తన బహుశక్తిస్వరూపధారణ, దేవ, మానవ జాతులకు

అభయం, అసురనాశనం, లోకకళ్యాణం, భక్తజనుల కోరికలు తీర్చడం, మరియు ధర్మరక్షణ కల్పించుటకే అని పురాణములందు చెప్పబడి ఉన్నది.

ప్రపంచంలో మానవులందరూ సత్వ, రజస్తమోగుణములు కలిగి యుండి, నిత్య జీవితంలో సందర్భానుసారం విడివిడిగా ఆయా గుణముల లక్షణాలను వ్యక్తీకరి స్తుంటారు. వారి ప్రవర్తన అనేది వారి వ్యవహారశైలిలో ప్రముఖంగా వ్యక్తమయ్యే గుణమును బట్టి నిర్ధారింపబడుతుంది.

మానవులుగా జన్మించి అర్థవంతమైన జీవితాన్ని కొనసాగించదలచే వారు ఈ త్రిగుణములను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకొని సమతుల్యము గావించు కోవలసియున్నది. ఈ పవిత్ర గుహలో నిరంతరం విశ్లేషణలకందని ఒక అద్భుతమైన అలౌకికశక్తి ఆవరించి ఉంటుంది. మానవ జీవితం పరిపూర్ణతకు ప్రముఖావశ్యకమైనది, దుస్సాధ్యమైనది, సత్వాది త్రిగుణముల సమతౌల్యము సాధించడం" ఈ గుహప్రవేశము-ఆదిపరాశక్తి దర్శనంవల్ల అట్టి ప్రయత్నం సులభ సాధ్య మౌతుంది. ఆ విధంగా మాత శ్రీవైష్ణవి తన దర్బారు ప్రవేశించినంత మాత్రాన్నే భక్తులను అనుగ్రహించే జీవన్ముక్తి ప్రదాయిని అవుతున్నది.

## సృష్టిఆదిగా భగవతి మాహాత్మ్యం

### (అ) మధుకైటభుల వృత్తాంతం

జగత్ సృష్టి సందర్భంలో విష్ణువు యోగనిద్రలోనికి ప్రవేశించదలచి, విష్ణు మాయగా వచ్చి తన్నావహించమని, దివ్యశక్తి దుర్గను కోరినాడు. వెంటనే విష్ణు మాయ అదృశ్యరూపంలో శ్రీమన్నారాయణుని ఆవహించింది. యోగనిద్ర సమయంలో ఆ పరమాత్మ ఉచ్ఛ్వాస – నిశ్వాసముల నుండి ఓంకార ప్రణవనాదం జనించింది. అందుండి శబ్దరూపమైన వేదము ప్రకటితమైంది. తదుపరి ప్రకృతి-పురుషుల సంయోగం వల్ల విష్ణు తేజస్సుతో హిరణ్యగర్భుడు "బ్రహ్మ" అవతరించాడు.

యోగనిద్రావశుడైన శ్రీమహావిష్ణుని రెండు చెవులనుండి ఎంతోకాలంగా ఏర్పడుతూ వచ్చి పేరుకుపోయిన "గుబిలి" జలప్రవాహ తాకిడికి చెవిగూబల నుండి బయల్వెడల సాగింది. ఆ మలినపు ముద్దలు యోగమాయస్పర్శతో వికృత రూపాలు ధరించి, కవల సోదరులైన మధు, కైటభులు జన్మించారు. కారుమబ్బుల వంటి నల్లని వర్ణంతో - మలినం నిండుకున్న దేహాలతో వారిద్దరు ఆ అనంత జలరాశిలో భీభత్సం సృష్టిస్తూ ఈదుతూ "మేము ఎవరము?" అని అనంతవిశ్వం, దద్దరిల్లేలా అరుస్తూ విశృంఖలంగా చరించసాగారు.

ఇలా వారు దీర్ఘాలోచనాసాగరంలో మునిగి "కారణం లేకుండా కార్యం జరగడం అసంభవం-మన జన్మకు గమ్యం తెలియాలి" అనే నిర్ణయానికి వచ్చారు. "తమ ఉనికిని ఈ జలార్ణవంలో స్థిరపరచినది తప్పక భగవతీశక్తియే. ఆమె శక్తిస్వరూపిణి. అపార బలసంపన్నురాలు. ఆ శక్తి నాశములేనిది. జగత్తు అంతా వ్యాపించి ఉన్నది". అని నిర్ధారించుకున్నారు. ఆ శక్తి ఉనికి రహస్యాన్ని తెలుసుకోవాలన్న తీవ్రతపనతో ధ్యానమగ్నులయ్యారు. అంతలో వారికి ఆకాశంనుండి వీనులవిందయిన ఒక "వాగ్బీజము" వినిపించింది. ఆ శబ్దాన్ని అదే పనిగా అనుకరిస్తూ అభ్యాసం చేయడంలో వారు నిమగ్నులయ్యారు. అలా వారికి సగుణ మంత్రపు క్రాంతిశక్తి ప్రాప్తించింది. అదే అద్వితీయమైన నారాయణ అష్టాక్షరీ మంత్రం. (ఓం నమో నారాయణాయ) ఆ అష్టాక్షరిని తదేక ధ్యానంతో జపిస్తూ వారు వేయి సంవత్సరాలు కఠోర తపస్సు ఆచరించారు.

ప్రసన్నురాలైన ఆదిశక్తి ప్రత్యక్షమై అపారదయతో ఇలా అన్నది. "వత్సలారా! మీ తపోదీక్షకు మెచ్చాను. మీ మనోవాంఛను తెలియజేయండి. ప్రసాదిస్తాను". అంత వారు ఇరువురూ "తల్లీ! మేము ఎవరము? ఎలా జన్మించాము? తెలియజేయండి. మాకు స్వచ్ఛందమరణం వరంగా ప్రసాదించి ధన్యులను చేయండి" అని ప్రార్థించారు. అందుకు ప్రతిగా ఆ

తల్లి "మీరు పరబ్రహ్మ చెవిగుబిలి నుండి జన్మించిన కవలలు. మధు కైటభులన్న నామధేయులు. నా కృప వలన మీరు కోరుకున్నప్పుడే మీకు మృత్యువు కలుగుతుంది. ఇది తథ్యము" అని పలికి అంతర్ధాన మయింది.

మధుకైటభులు వరబలంతో అహంకారంతో మదోన్మత్తులై "యుద్ధంలో మమ్ము జయించగలవారు ఎవరైనా ఉన్నారా?" అని అరుస్తూ ఆ అనంత జలరాశిలో ఈదుతూ వెదకసాగారు.

అలా వందసంవత్సరాలు గడిచిపోయాయి. ఆశ్చర్యం! ఒకరోజు వారికి బలమైన సుదీర్ఘమైన తూడు, దాని అగ్రాన మహాపద్మం గోచరించాయి. పద్మంలోకి ఎగబ్రాకి "ఓం నమోనారాయణాయ" అన్న అష్టాక్షరి మహా మంత్రాన్ని పఠిస్తున్న చతుర్ముఖుని సమీపించారు. ఆతని ధ్యానానికి భంగం కలిగించి, సమరానికి సిద్ధం కమ్మని కాలుదువ్వారు. నాయనలారా! "నేను పరబ్రహ్మమైన నారాయణుని కుమారుడనైన చతుర్ముఖబ్రహ్మను, నా జన్మకారణం, నా కర్తవ్యం ఏమిటో తెలుసుకోగోరి నా తండ్రినిగూర్చి తపస్సు చేస్తున్నాను. నాకు యుద్ధకాంక్ష ఏమాత్రం లేదు" అని తన అనాసక్తతను వెల్లడించాడు.

ఆ మాటవిన్న మధుకైటభులు మరింత రెచ్చిపోయారు. "నీవు మాతో యుద్ధం చేసి విజయుడవై నీ పరాక్రమాన్ని నిరూపించుకో. అలా ధైర్యసాహసాలు లేకుంటే వేరెక్కడికైనా పారిపో. అసమర్థుడవైన నీవు ఈ ఆసనంపై కూర్చోన అర్హుడవు కావు. కాచుకో" అంటూ మీదమీదికి రాసాగారు. చతుర్ముఖబ్రహ్మ చింతాక్రాంతుడయ్యాడు. దుష్టులైన వారితో సామ దాన బేధ దండోపాయములు అనుసరించాలని అతని బుద్ధికి తోచలేదు. రక్షణకై యోగనిద్రా వశుడైయున్న శ్రీమహావిష్ణుని మేల్కొల్పడమే ఉత్తమమార్గమని తలచాడు.

శ్రీవిష్ణుని చెంతచేరి భక్తిమీర స్తుతిస్తూ మేల్కొలప ప్రయత్నించాడు. ఆతని ప్రయత్నమంతా నిష్ఫలం అవుతోంది. నారాయణుడు నిద్రాదేవి

వశుడైయున్నాడు. ఇక గత్యంతరం లేక కమలసంభవుడు యోగనిద్రాదేవిని, దేవిభగవతిని ఏకాగ్రచిత్తంతో ఇలా ప్రార్థించాడు.

"ఓ దేవీ! "ఈ విశ్వంలో కారణస్వరూపవు నీవు. సగుణరూపివి. నీ కార్యకౌశలం నిరుపమానం ఈ దుష్ట మధుకైటభుల దాడి నుండి నన్ను రక్షించు తల్లీ! నీవే వారిని వధించు. లేకున్న నీవు శ్రీవిష్ణువు నుండి వైదొలగి ఆతని చైతన్య వంతుని చేసి ఆతనిచే వారిని వధింపచేయి".

కరుణామయి వైష్ణవి శ్రీవిష్ణువు నుండి బయల్వెడలి ప్రక్కన ఆసీనురాలయింది. యోగమాయ ఆధిపత్యం తొలగిన పిమ్మట నారాయణుడు తన పూర్వపు బలరూప తేజస్సులను పొందినవాడై, బ్రహ్మరాక కారణం తెలుసుకొన్నాడు. దుష్ట మధుకైటభులను వధించి బ్రహ్మను రక్షించగలనని అభయమిచ్చాడు.

అంతలో బ్రహ్మను వెతుక్కుంటూ మదోన్మత్తులైన మధుకైటభులు – భీకరంగా అరుస్తూ శ్రీమన్నారాయణుని సమీపించారు. బ్రహ్మను యుద్ధానికి సిద్ధంకమ్మని కవ్విస్తూ భీత్యావేదన కల్పిస్తున్నారు. తదుపరి శ్రీమహావిష్ణుని కూడా వధించగలమని ప్రగల్భాలు పలుకుతూ రెచ్చిపోతున్నారు. వారి మాటలకు ప్రతిగా విష్ణువు "పరాక్రమ వంతులారా! మీ ఆత్మాభిమానం చూస్తుంటే, సమఉజ్జీలని నాకు మిక్కిలి గర్వంగా ఉంది. మీరు యుద్ధాన్నే కోరుకుంటే, నేను సంసిద్ధమే. మీ గర్వము అణచగలను" అని పలికాడు. ఆ మాటలకు మధుకైటభుల ఆగ్రహం కట్టలుతెంచుకుంది. మొదటగా మధువు విష్ణునితో మల్లయుద్ధానికి ఉపక్రమించాడు. అతడు అలసిపోయిన వెంటనే కైటభుడు తలపడ్డాడు. అలా మల్లయుద్ధం ఐదువేల సంవత్సరాలు నిరాఘాటంగా కొనసాగింది. నారాయణునికి అలసట కలగసాగింది. ప్రతిగా మధుకైటభుల ఉత్సాహం ఇనుమడించ సాగింది. అంత వారు "ఓ విష్ణూ! శక్తి హీనుడవైనచో మాకు దాసుడవుగా. పిరికిపందవలె పలాయనం చిత్తగించనేల? మేము నిన్ను వధించి తీరుతాం. సిద్ధమవు". అని పలికారు.

విరామ సమయంలో దీర్ఘంగా ఆలోచించాడు శ్రీహరి. భగవతి వీరికి, ఇచ్ఛామరణాన్ని వరమిచ్చిన విషయం స్ఫురించింది.

విరామానంతరం యుద్ధం తిరిగి ప్రారంభమయింది. మధుకైటభులు ఈమారు అపార విశ్వాసంతో శ్రీహరిపై ముప్పేట దాడి కొనసాగించారు. మోసంతో వారిని వధించదలచిన విష్ణువు "దేవి విష్ణుమాయను" స్మరించాడు. ముగ్ధమనోహర రూపంతో ఆదేవి యుద్ధరంగాన దర్శనమిచ్చింది. ఆ దుష్టులు, ఆ తల్లిమాయామోహంతో ప్రసరించిన మన్మథబాణాల వంటి చూపులకు ఆకర్షితులయ్యారు. తదేకంగా ఆ దేవిని చూస్తూ నిశ్చేష్టులయ్యారు.

అదే అదనుగా విష్ణు భగవానుడు, వారితో "శూరులారా! మీ సమరకౌశలం నన్నెంతో ఆకర్షించింది. మీ బలం, ధైర్యశౌర్యాలు నిరుప మానాలు. మీ అపార బలసంపద, యుద్ధపటిమలను చూచి నేనెంతో ఆనంద భరితుడనయ్యాను. మీరు కోరుకున్న వరం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. కోరుకోండి" అన్నాడు.

కామ వ్యామోహంతో కళ్ళు మూతలుపడుతుండగా అన్యమనస్కులై మధుకైటభులు ఇలా పలికారు "శ్రీహరీ! మేము యాచకులమా? అయినా మాకిచ్చేందుకేముంది నీదగ్గర? నీకే మేము వరం ప్రసాదించగలం. ప్రార్థించి అనుగ్రహం పొందు".

అదే తడవుగా శ్రీవిష్ణువు "శూరులారా! మీరిరువురు నా చేతులలో మీమీ మరణాన్ని స్వీకరించే విధంగా వరమివ్వండి" అని కోరాడు. మోసగింపబడ్డామని గ్రహించి, తమాయించుకొని మోసాన్ని మోసంతోనే ఓడించదలచారు ఆ సోదరులు. వారు విష్ణునితో "దేవా! మొట్టమొదటగా నీవేమమ్ము వరము కోరుకొమ్మంటివి. మూర్ఖులమై ఆ భాగ్యాన్ని కాలదన్నుకున్నాము. ఇప్పుడు మృత్యువు ముంగిట తుదిగా, ఆ వరం కోరుకుంటున్నాం. మమ్ములను జలశూన్యమైన ప్రదేశంలో వధించి

అనుగ్రహించు" అని పలికారు. అనుగ్రహించిన పరమాత్మ తన విశాలమైన తొడలను మరింతగా విస్తరింపచేసి ఆ జలమహార్ణవంలోనే జలశూన్య ప్రదేశాన్ని సృష్టించాడు. మధుకైటభులు ఆశ్చర్యానికి లోనయ్యారు. బలిపశువులవలె తమ శిరస్సులను విష్ణుని తొడలపై ఉంచారు. అదే తడవుగా శ్రీహరి వారితలలను తన సుదర్శనంతో ఖండించాడు. వారి కంఠాల్లోనుండి రక్తం మహాఉద్ధృతంగా ప్రవహించింది. తదుపరి వారి శిరస్సులలోనుండి నల్లని పదార్థం ఉప్పొంగి పొర్లిపారింది. అది నారాయణ అష్టాక్షరి మంత్రంతో పూనీతమైన మధుకైటభులమేధ. అది మహాజలార్ణవంలో బ్రహ్మాండంలాగా బంతి ఆకృతితో ఏర్పడింది. అదియే పవిత్ర "మేధిని" అయిన భూగోళం.

### (ఆ) మహిషాసుర జన్మవృత్తాంతం

పూర్వము దనువు అనే దైత్యరాజుకు రంభ, కరంభులనే ఇద్దరు కుమారులు ఉండేవారు. వారికి సంతానలేమి ఎంతోకాలంగా బాధించసాగింది. సంతానం కోరి వారిద్దరు భీకరమైన తపస్సు ప్రారంభించదలచి, పంచనది తీరంచేరారు. కరంభుడు ఆ నదీజలంలో మునిగి కఠోర తపస్సు ఆచరిస్తుండగా, ఈర్ష్యాద్వేషాలచే ప్రభావితుడైన ఇంద్రుడు మొసలి రూపంలో నదీజల ప్రవేశంచేసి కరంభుని తపోభంగం చేసి భీకరపోరాటంలో, స్థానబలిమి వలన అతన్ని హతమార్చాడు. పంచనదీతీరంలో పంచాగ్నులను ప్రతిష్ఠించి, ఆ అగ్నికీలల నడుమ భీకర వేడిమిని సహిస్తూ పరితపిస్తూ తపస్సు కొనసాగిస్తున్నాడు రంభుడు. సోదరుని మరణంతో రంభుని కోపం కట్టలుతెంచుకున్నది. అతని కఠోర తపస్సుకు, అగ్నిదేవుడు కనికరించలేదన్న ఆవేదన జతకలసింది. ఆత్మహత్యేశరణ్యమని తలచి రంభుడు తనశిరస్సును అగ్నికి ఆహుతి చేయదలచాడు. తన ఎడమచేతితో శిరోజాలను ఒడిసిపట్టి దక్షిణహస్తంలోని కరవాలంతో తనతల నరుక్కోవడానికి సిద్ధమయ్యాడు. అపుడు అగ్నిదేవుడు ప్రత్యక్షమై "ప్రాణత్యాగం

వల్ల ఏలాంటి కార్యములు సిద్ధించవు. నీ తపోదీక్షకు నేను ప్రసన్నుడనయ్యాను. ఏదైనా వరంకోరుకో, ప్రసాదిస్తాను" అన్నాడు.

అగ్నిదేవుని సూచనలకు సంతోషంతో రంభుడు "అగ్నిదేవా! నాకు ముల్లోకాలను జయింప సమర్ధుడైన కుమారుని ప్రసాదించు. దేవదానవ మానవాదు లెవ్వరు అతనిపై విజయం సాధించలేకుండేలా, అతడు తానుకోరుకున్న సమయంలో కోరినరూపం ధరించే సమర్థుడు-అపారశక్తి సంపన్నుడు అయ్యేలా ఆశీర్వదించు" అని కోరాడు. అందుకు అగ్నిదేవుడు "రంభా! నీ కోరిక నెరవేరుతుంది. ఏ భార్యయందు నీకు మనస్సు కలుగుతుందో ఆమె గర్భవాసాన ఆ పుత్రుడు జన్మిస్తాడు" అని పలికి అంతర్ధానమయ్యాడు.

రంభుడు తిరిగి తనరాజ్యానికి చేరుకున్నాడు. ఆ రాజ్యంలో పలు యక్షజాతిస్త్రీలు, పశు ప్రవృత్తిగల రాక్షసస్త్రీలు సహజీవనం గావిస్తున్నారు. విధిలిఖితానుసారం కామపీడితుడైన రంభుని దృష్టి ఒక యవ్వనంతో మదించిన మహిషిపై కేంద్రీకృతమయింది. రంభుడి అనురక్తివలన ఆ మహిషి గర్భందాల్చింది. ఇలా ఉండగా ఒకరోజు ఒక మదించిన మహిషము కామాంధకారంతో గర్భిణిఅయిన మహిషిపై దాడిచేసింది. అది, తనను చంపడానికి ప్రయత్నించిన రంభుని తన వాడికొమ్ములతో పొడిచి, అతి క్రూరంగా చంపింది. తుదిగా రంభుని రక్షించవచ్చిన యక్షులతో యుద్ధంలో ఆ మహిషం ప్రాణాలను కోల్పోయింది. రంభుని మరణానికి తట్టుకోలేక ఎడబాటుకు ఖిన్నురాలైన మహిషి ఆతని చితిపై ప్రవేశించి సహగమనము కావించింది. వారి అకుంఠిత అనురాగానికి ప్రతీకగా చితిమంటల మధ్యనుండి ఉద్భవించాడు మహిషాసురుడు. తనయుని బలపరాక్రమాలు, తన ఆశయసిద్ధి, పరిక్రమణప్రక్రియ, కన్నులార వీక్షించేందుకు రంభుడు చితిమంటల మధ్యనుండి తిరిగి రక్తబీజుడుగా ప్రాదుర్భవించాడు.

## మహిషాసురుడు బ్రహ్మవరములను పొందడం

కాలక్రమంలో మహాబలుడు, పరాక్రమవంతుడు, అయిన మహిషాసురుడు దానవసామ్రాజ్యానికి పట్టాభిషిక్తుడయ్యాడు. అతడు సుమేరుపర్వతంపై పదివేల సంవత్సరాలు బ్రహ్మను గూర్చి కఠోర తపస్సు ఆచరించాడు. ఆ దీక్షకు ప్రసన్నుడైన బ్రహ్మ ప్రత్యక్షమై మనోభీష్టాన్ని తీర్చడానికి సిద్ధంగాఉన్నానని, వరం కోరుకొమ్మని అడిగాడు.

"బ్రహ్మదేవా! నేను ధన్యుడనయ్యాను. నాకు అమరత్వం సిద్ధించేలా, అనుగ్రహించండి" అన్నాడు మహిషాసురుడు. అందుకు బ్రహ్మ, "దైత్యరాజా! పుట్టిన వాడు గిట్టకమానడు. ఇది ప్రకృతి ధర్మం, అధిగమింపరానిది. కావున వేరేదైనా వరాన్ని కోరుకో" అన్నాడు.

"పితామహా! మానవులు, దైత్యులు, దేవతలు, వీరెవ్వరిద్వారా నాకు మృత్యువు సంభవించకుండేలా అనుగ్రహించు. కరుణించి స్త్రీద్వారా మాత్రమే నాకు చావు ఆసన్నమయ్యేలా వరమివ్వండి. అబల అయిన స్త్రీ నన్నెలా సంహరిస్తుందో నేను చూచుకుంటాను" అన్నాడు.

ప్రతిగా బ్రహ్మ "నీ మనోవాంఛ సిద్ధిస్తుంది. పురుషులచేతిలో నీకు మరణం ప్రాప్తించదు" అంటూ అంతర్ధానమయ్యాడు.

వరమదగర్వంతో, సహజంగానే మహాబలశాలి, పరాక్రమవంతుడు, అయిన మహిషాసురుడు చతుస్సాగరపర్యంత భూభాగాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించ సాగాడు. స్వర్గాధిపత్యంపై కోరికతో దండెత్తదలచి సర్వసైన్యాన్ని సమాయత్తపరచి అనుజ్ఞకై గురువగు శుక్రాచార్యుని పిలువనంపాడు. ఇంతలో శత్రువు యొక్క బలాబలాలను విశ్లేషించిన దేవేంద్రుడు వ్యాకులచిత్తుడై గురువైన బృహస్పతిని సంప్రదించాడు. "క్లిష్టసమయంలో ధైర్యంకోల్పోకుండా శాంతివహించాలని, గెలుపుఓటములు

దైవనిర్ణయాలని, భగవంతునిపై సంపూర్ణవిశ్వాసంతో శక్తికిఅనుగుణంగా ఉద్యమించుటకు సర్వదా సిద్ధంగా ఉండాలని" బోధించాడు దేవగురువు.

అతని సలహామేరకు బ్రహ్మ, శంకరాదులతో కూడిన ఇంద్రుడు వైకుంఠం చేరాడు. బ్రహ్మాది దేవతలు నారాయణుని స్తుతించి అతనికి, "వరప్రసాదియై మదోన్మత్తుడైన మహిషాసురుడు ముల్లోకాలను జయింప దలచి ప్రథమంగా ఇంద్రలోకంపై దండెత్తిరానున్న వైనాన్ని" వివరించారు.

అదివిన్న భగవానుడు శ్రీవిష్ణువు బ్రహ్మాదిదేవతలతో "సమష్టికృషితో ఈ విపత్తును ఎదుర్కొనడానికి, యుద్ధానికి సమాయత్తంకమ్మని, సమస్తదేవతాసైన్యాన్ని సమీకరించాలని ఆదేశించాడు. శరణాగతవత్సలుని అభయవాక్కులకు ఊపిరి పీల్చుకొని నూతనోత్సాహంపొందిన దేవతాగణాలు అసురులతో యుద్ధానికి సిద్ధమయ్యారు.

## దేవగణాలతో మహిషాసురసైన్యం మహాసంగ్రామం.

### (అ) చిక్షురుని పోరాటం

త్రిమూర్తులు వాహనారూఢులై విజయోత్సాహన్ని కల్పించగా, దేవరాజు ఇంద్రుడు ఐరావతాన్ని అధిరోహించి, స్వామి కార్తికేయ, యమధర్మరాజులతో కూడి సమరశంఖం పూరించాడు.

మహిషాసురుని సర్వసైన్యాధిపతి, మహాబలశాలి అయిన చిక్షురుడు గజవాహనారూఢుడై ఎదురయ్యాడు. అతడు ఒకేమారు అయిదు బాణాలను సంధించి ఇంద్రుని ఉక్కిరిబిక్కిరి చేశాడు. సంబాళించుకున్న ఇంద్రుడు ప్రతీకారంగా తనవాడియైన బాణంతో చిక్షురుని బాణాలను, ధనస్సును తుత్తునియలు చేశాడు. మరో అర్ధచంద్రాకార బాణంతో అతని వక్షస్థలం ఛేదించాడు. ఇంద్రుని శరాల ధాటికి చిక్షురుడు తన వాహనంపైనే మూర్ఛిల్లాడు. ఇదే అదనుగా ఇంద్రుడు అతని ఏనుగుతొండాన్ని తెగనరికాడు.

ఆ ఏనుగు భీకరంగా రోదిస్తూ మరణించగా చిక్షురుడు నేలపై, దానవ, అశ్వ, గజకళేబరాల మధ్య పడిపోయాడు. ప్రాణభయంతో దానవసేనలు పారిపోసాగాయి.

### (ఆ) బిడాలుడు మూర్ఛిల్లుట

మహిషాసురుడు మిక్కిలి క్రోధంతో బిడాలుడు అనే అమితపరాక్రమశాలి అయిన దానవవీరుడ్ని ఇంద్రునితో యుద్ధానికి పంపాడు. ఇంద్రుడు ప్రయోగించిన విషసర్పబాణాలను బిడాలుడు తుత్తునియలు గావించాడు. స్వయంగా ఏబది బాణాలను ఒకేమారు సంధించి ఇంద్రుని గాయపరచాడు. తెలివిగా ఇంద్రుడు, బిడాలుని వాహనమైన మదగజపు తొండాన్ని తనగదతో తెగనరికాడు. సహింపలేని బాధతో ఆ మదగజం దిక్కులుమార్మోగేలా ఘీంకారంచేస్తూ భయంతో వెనుదిరిగి పారిపోసాగింది. ఈ క్రమంలో దానవసేనను తన బలమైన పాదాలక్రింద త్రొక్కి చంపసాగింది. బిడాలుని సైన్యం చెల్లాచెదరై వెన్నుచూపి పారిపోసాగింది. బిడాలుడు వేరొకరథాన్ని అధిరోహించి ఇంద్రునిపై ఏకధాటిగా బాణవర్షం కురిపించసాగాడు. బిడాలుని బలపరాక్రమాలు గ్రహించిన ఇంద్రుడు జయంతుని ముందిడుకొని యుద్ధం కొనసాగించాడు. జయంతుడు వాడియైన ఐదు బాణములను ఒకేమారు ప్రయోగించగా వాని తాకిడికి బిడాలుని వక్షఃస్థలమందు పెనుగాయమయింది. బిడాలుడు మూర్ఛిల్లగా సారథి, రథాన్ని యుద్ధరంగం నుండి తప్పించాడు.

### (ఇ) తామ్రుని యుద్ధపటిమ

బిడాలుని వైఫల్యంచేత కలతచెందిన మహిషాసురుడు మిక్కిలి క్రోధంతో తామ్రుడను దానవవీరుని కదనానికి పంపాడు. పరాక్రముడైన తామ్రుడు సముద్రం వంటి తనసేనతో ఎడతెగని బాణపరంపరను ప్రయోగిస్తూ దేవతలపై విరుచుకు పడ్డాడు. అందుకు దీటుగా వరుణుడు పాశంతోను,

యముడు తనదండంతోను ధాటిగా ఎదుర్కొన్నారు. యమదండం దెబ్బకు తామ్రుడు మిక్కిలిగా గాయపడినా వెనుకంజ వేయక యుద్ధం సాగించాడు. క్రమంగా బలహీనుడైన తామ్రుడు, రెట్టించిన దేవతల యుద్ధధాటికి మూర్ఛిల్లాడు.

**(ఈ) మహిషాసుర యుద్ధపటిమ – విజయకేతనం**

తన సేనాప్రముఖులందరూ యుద్ధరంగం నుండి తిరోన్ముఖులయ్యారన్న సత్యాన్ని జీర్ణించుకోలేకపోయాడు మహిషాసురుడు. ఇన్నాళ్ళు కొనసాగిన యుద్ధంలో దేవతాగణాలపై తనసైన్యం ఏలాంటి పట్టు సాధించలేకున్న దుఃస్థితికి చింతిస్తూ, ఇనుమడించినక్రోధంతో గదాధారియై స్వయంగా యుద్ధరంగంలోకి ప్రవేశించాడు. ఐరావతాన్ని అధిరోహించి మహేంద్రుడు ఎదురురాగా క్రోధంతో ఆతని భుజంపై ధాటిగా గదాప్రహారం చేశాడు. ఎదురుచూస్తున్న ఇంద్రుడు తన భీకర వజ్రాయుధంతో ఆతని గదను పిండిపిండి చేసి అతన్ని వధించేందుకు వేగంగా ముందుకు ఉరికాడు. పరాక్రమవంతుడైన మహిషాసురుడు తన పదునైన భీకరఖడ్గంతో దీటుగా ఎదుర్కోసాగాడు. ఇరువురిమధ్య ఘోరమైన పోరు జరుగుతోంది. సత్వరం యుద్ధంలో ఆధిక్యత సాధించేందుకు ఆ దానవుడు శంబరాసుర మాయను ప్రయోగించాడు తత్ఫలితంగా కోట్లాది మహిషాసురులు భీకర ఆయుధధారులై జన్మించి దేవతా సైన్యాన్ని చెల్లాచెదరు చేయసాగారు.

ఇలా దైత్యసేనల ఆధిక్యత–ఇంద్ర, వరుణ, కుబేర, యమ, అగ్ని, సూర్య చంద్రాదులను భీతావహులను కావించింది. వారందరు ఏకమై త్రిమూర్తులను శరణువేడారు. తత్క్షణం ఆ శరణాగతరక్షకులు ప్రత్యక్షమయి ఆయుద్ధరంగ స్థితిని సమీక్షించారు. దైత్యమాయ ప్రభావాన్ని గ్రహించిన శ్రీవిష్ణువు తనప్రచండ సుదర్శనచక్రాన్ని ప్రయోగించి ఆ మాయను పటాపంచలు చేశాడు. త్రిమూర్తులను ఒకేచోట చూచిన మహిషాసురుని

యుద్ధకాంక్ష "అగ్నికి ఆజ్యంతోడైనట్లు" ఏకధాటిగా ప్రజ్వరిల్లింది. పదునైన పరిఘను చేతపూని రథం నుండి వేగంగా క్రిందికి దూకాడు. ఇరుసైన్యాలు భీకరయుద్ధంలో తలపడ్డాయి. మహిషాసురుడు వరగర్వంతో రెచ్చిపోయిన వాడై విష్ణు, మహేశ్వరులతో కయ్యానికి తలపడ్డాడు. త్రికాలజ్ఞులైన త్రిమూర్తులు సమయస్ఫూర్తిని ప్రదర్శిస్తూ-జరుగబోవు కార్యానికి నాందియా అన్నట్లు-తిరిగి తమతమ ధామాలకు చేరుకున్నారు.

విజయమా! వీరమరణమా! అన్నట్లు ఇంద్రుడు వజ్రాయుధం చేతబట్టి యుద్ధరంగంలో దృఢంగా నిలువగా, వరుణుడు, కుబేరుడు, అగ్నిదేవుడు, సూర్య చంద్రులు తమతమ ఆయుధములు ధరించి అతనికి సహకారమందించ నిలబడ్డారు. క్రూరసర్పాలతోనిండిన సముద్రంవంటి రాక్షససేనమధ్య దానవరాజు తన గిట్టలతో ఆకాశాన్నంటేలా ధూళిలేపుతూ, పదునైన కొమ్ములుకల్గిన తలతో భూమిని బద్దలుచేస్తూ విజయసంకేతాలతో వారిని ఢీకొనడానికి సిద్ధంగా ఉన్నాడు. యుద్ధం ప్రారంభం కాగానే మహిషుని క్రౌర్యానికి రాక్షసబలం తోడైనందున ఆ భీకరదాడికి ఎదురొడ్డే సాహసం చేయలేని దేవగంధర్వులు వెరచి "బ్రతుకుజీవుడా!" అంటూ కదనరంగం నుండి పారిపోసాగారు. అలా నూరుసంవత్సరాలు దేవగంధర్వులతో భీకరయుద్ధం చేసిన మహిషాసురుడు సంపూర్ణంగా స్వర్గాన్ని ఆక్రమించి అందలి సమస్త సంపదలను స్వాధీనపరచుకొని, తుదిగా స్వర్గాధిపత్యాన్ని చేపట్టాడు. తమ యజ్ఞభాగాలు - కామధేనువు కరుణ - పారిజాత పుష్పప్రదాది భోగభాగ్యాలు - తుదిగా నిలువనీడకోల్పోయిన దేవతలు పద్మసంభవుని చేరి దీనంగా శరణుకోరారు. వరమదోన్మత్తుడైన ఆ దానవుని మరణం ఒక స్త్రీశక్తి చేత సంభవించవలసి యున్నదని తెలిపిన బ్రహ్మ, వారిని తోడ్కొని కైలాసం చేరాడు. బ్రహ్మరుద్రులు సైతం "వర ప్రభావంచేత ఓటమిఎరుగని పరాక్రమవంతుడైన మహిషాసురుని వధింప యోగ్యురాలైన స్త్రీ ఎవ్వరు?" అని చర్చించి, సమాధానం తోచనివారయ్యారు. పరమపురుషుడు

శ్రీమహావిష్ణుని గూడి ఈ సమస్యకు పరిష్కారం సాధించాలని వారందరూ కలసికట్టుగా వైకుంఠం చేరారు.

వారిరాకను ద్వారపాలకుడు విజయునిద్వారా తెలుసుకున్న శ్రీమహావిష్ణువు తత్క్షణం తన అంతఃపురం వీడి బయల్వెడలాడు. సమస్త దేవతల హృదయవ్యధను ముఖకవళికల ద్వారా - నిస్తేజములైన వారి ఇతర శరీరభాగముల భాష ద్వారా గ్రహించాడు. తన కరుణాకటాక్ష వీక్షణాలతో వారిని ప్రసన్నులను చేసి వారలకు ధైర్యంకల్గించాడు.

ప్రజాపతి బ్రహ్మ, మహేశ్వరుడు ఇంద్రాదులు సుఖాసీనులు అయిన పిమ్మట దేవతలు ఈ విధంగా శ్రీహరికి తమ ఇక్కట్లు ఏకరువుపెట్టారు.

"దేవాధిదేవా! దుష్టుడైన మహిషాసురుడు, వరబలంచేత మదించినవాడై మాకు పలుకష్టాలు కల్గిస్తున్నాడు. మేము "కామధేనువు, కల్పవృక్షాల దయాదృక్కులకు దూరమైనాము. భూలోక మందలి యజ్ఞఫలాలు కోల్పోయాము. నిలువనీడలేక పర్వతగుహలలో తలదాచుకొంటున్నాం. మేము వానిని ఎదుర్కొనలేకున్నాం. పురుషులెవ్వరు అతనిని వధించలేరన్న బ్రహ్మవరం అతనికి బ్రహ్మాస్త్రమై ఉపకరిస్తోంది. యుద్ధరంగంలో అతనికి ఎదురొడ్డి విజయం సాధించగల శక్తి సామర్థ్యాలు ఏ స్త్రీ కలిగిఉంది? ఈ జటిల సమస్యకు తరణోపాయం తెల్పి మమ్మల్ని కృతార్థులను చేయండి" అని ప్రార్థించారు.

## సమస్త దేవతల తేజోరాశి - భగవతి ఆవిర్భావం

శరణార్థుల విన్నపం స్వీకరించిన విష్ణువు ఇలా పలికాడు. "సమస్త దేవతల తేజస్సుతో ఒక స్త్రీమూర్తి ప్రకటితం కావలసి ఉన్నది. ఆమె మహోత్కృష్ట శక్తిశాలినియై మహిషాసురుని వధించగలదు. కావున మీరు పత్నులతో గూడి మీ శక్తులను ప్రార్థించి ప్రసన్నంగావించుకొని సామూహికంగా ధారబోసి ఏకీకృతమైన ఒక మహోన్నత శక్తిఅంశను సృజించవలసి యున్నది.

అలా ప్రకటితమైన అపారశక్తి సంపన్నకు, త్రిమూర్తులమైన మేము, సమస్త దేవతలు, వారివారి ఆయుధములను దత్తము చేయగలవారము. అట్టి సౌందర్యరాశి, బలాయుధ సంపన్న ఆ దుష్టుని దునిమి మీ ఇక్కట్లు బాపగలదు."

విష్ణుని అభయంపొందిన దేవతలు పునరుత్తేజితులయ్యారు. అంతలో చతుర్ముఖబ్రహ్మ శరీరంనుండి అరుణకాంతులతో ప్రజ్వలిస్తున్న దివ్యతేజము వెలువడింది. ఎంతో సుందరంగా కనువిందుచేస్తున్న ఆ దివ్యకాంతి కొంతభాగం శీతలంగాను, కొంతభాగం ఉష్ణంతోను మిళితమై ఉంది. అంతలో శంకర భగవానుని శరీరంనుండి దైత్యులకు భీతిగొలిపే తీక్ష్ణమైన గౌరవర్ణఅంశ ఉద్భవించింది. తత్క్షణం శ్రీమహావిష్ణుని శరీరంనుండి సత్వగుణాన్ని సంతరించుకొన్న నీలమేఘశ్యామ వర్ణంతో కూడిన దివ్యతేజస్సు వెలువడింది. తదనంతరం ఇంద్రుని దేహం నుండి ఒక అలౌకిక తేజస్సు, అదే విధంగా వరుణ, కుబేర, యమ, అగ్నిదేవుల దేహాలనుండి ప్రత్యేక తేజస్సులు ఉద్భవించాయి. అలా ఉద్భవించిన ఆ తేజఃపుంజాలన్నీ ఏకమై ఒక దివ్యతేజోభరితమైన పాలపుంతగా ఏర్పడింది. దేవ, గంధర్వగణాలు అష్టదిక్పాలకులు, త్రిమూర్తులు ఆశ్చర్యంగా చూస్తుండగానే ఆరాశి అత్యంత సౌందర్యవతిఅయిన స్త్రీగామారి దర్శనమిచ్చింది. అపుడు కార్యకారణా వశ్యకమన్నట్లు, శ్రీమహావిష్ణువు దేవతలనుద్దేశించి "దేవతలారా! మీరందరు మీమీ ఆభరణాలను, వాడియైన ఆయుధసంపత్తిని ఈ దేవికి సమర్పించండి" అని ఆదేశించాడు.

ఆనందంతో దేవతలు తమతమ ఆభరణాలను కానుకగా సమర్పించుకోగా హిమవంతుడు, ఆమెకు వాహనంగా శత్రుభీకరమైన ఒక సింహాన్ని సమర్పించు కొన్నాడు. స్వయంగా విష్ణువు తన సుదర్శనచక్ర అంశను సృష్టించి భగవతికి సమర్పించుకోగా, శంకర మహాదేవుడు తన త్రిశూలం నుండి వేరొక త్రిశూలాన్ని సృష్టించి భగవతికి కానుకగా

సమర్పించుకొన్నాడు. బ్రహ్మ గంగాజలంతో నిండిన కమండలాన్ని అందచేశాడు. ఆ విధంగా వరుణుడు ఒకశంఖాన్ని, అగ్ని, దానవ సైన్యాన్ని దహింపచేయగల శక్తిని, ఒక శతఘ్నిని, పవనుడు ధనుర్బాణాలను, ఇంద్రుడు వజ్రాయుధాన్ని – పెనుగంటను, యముడు – భీకరమైన దండాన్ని, కాలుడు పదునైన భారీ ఖడ్గాన్ని – డాలును, విశ్వకర్మ గండ్రగొడ్డలిని అర్పించారు. త్వష్ట, భగవతికి "కౌమోదకీ" అనే గదను, బహువిధములైన శస్త్రాస్త్రాలను దుర్భేద్యమయిన కవచాన్ని భక్తిపూర్వకంగా సమర్పించుకొన్నాడు.

ఆ విధంగా దివ్యాభరణభూషిత అయిన భగవతి, తన హస్తములలో వాడియైన పలురకాల ఆయుధములు ధరించి, సింహవాహనయై ప్రకాశిస్తోంది. ఈ దేవియే కాళరాత్రి, ఇంద్రాణి, వృద్ధి, వైష్ణవి అన్న నామాలతో కీర్తింప బడింది.

దేవతలంతా తాము ఎదురుచూస్తున్న సుదినం త్వరలో రానున్నదన్న ఆనందంతో మిగులభక్తిశ్రద్ధలతో శ్రీవైష్ణవికి మిన్నంటేలా జయజయధ్వానాలు చేశారు. తల్లి ఘనతను వినమ్రతతో శ్లాఘించారు. మహిషాసురుని దుశ్చర్యలను విశదపరచారు. కామధేనువు, కల్పవృక్షమువంటి తమ సంపదలను అతడు స్వాధీనం చేసుకున్న తీరు వెల్లడించారు. తుదకు భూలోకము నుండి తమకు చెందవలసిన యజ్ఞభాగాలను సైతం అందనివ్వక అతడే అనుభవిస్తున్న దార్ష్టీకాన్ని తెలియచేశారు. తమ జీవనవిధానానికి కలిగిన ముప్పును వివరించారు. ఎదుర్కొనలేక కొండగుహలలో తలదాచుకొంటున్న తమ దైన్యస్థితిని తేటతెల్లంచేశారు. మహిషాసురుని వధించి తమను రక్షించమని వేడుకున్నారు.

అపారదయానిధి, భక్తులదుఃఖాన్ని పారద్రోలే ఆ భగవతి ప్రసన్నయై, మహిషాసురుని ఎడల నిర్భయంగా ఉండమని, సత్వరం తాను అతన్ని వధించి దేవలోకంలో శాంతిని పునరుద్ధరిస్తానని అభయమిచ్చింది.

తదుపరి భగవతి దేవతలనుద్దేశించి “ఈ లోకమంతా “భ్రమ–మోహము” లతో నిండి ఉన్నందున ఎన్నో విచిత్రాలు చోటుచేసుకుంటున్నవి. ప్రారబ్ధము అనేది మిక్కిలి విచిత్రమైనది. జయింపనలవిగానిది. దానివలననే సుఖదుఃఖములు తగురీతిన ప్రాప్తిస్తాయి. మీరు నిర్భయులుగండు, మీ కష్టములు త్వరలో తొలగిపోగలవు” అని అభయమిస్తూ ఉచ్చస్వరంతో వికటాట్టహాసంచేసింది. ఆ గర్జనకు భూమి కంపించగా, పర్వతాలు క్రుంగిపోగా, సముద్రపుటలలు ఉవ్వెత్తున లేచాయి. ఆ శబ్దానికి దానవ వీరులకు ప్రాణభీతి మొదలై వారి గుండెలు లయతప్పాయి.

ఆ ధ్వని చెవినబడ్డ మహిషాసురుడు ఏదో ఆపద ఆసన్నమౌతోందన్న ఆవేదనతో కూడిన క్రోధంతో ఇలాపలికాడు.

“ఎవరో నీచుడు, అభిమాన గర్వంతో మదించి ఇట్లు గర్జించాడు. ఆ దుష్టుడు దానవుడైనా, దేవతయైనా నా వద్దకు ఈడ్చుకురండి. వానిని తత్క్షణం యమసదనానికి పంపుతాను”. మహిషాసురుని దూతలు ఆనోటా ఆనోటా విన్న సమాచారంతో భగవతియైన జగదంబ వద్దకు చేరారు. అపురూప సౌందర్యరాశియై యుండి ధరించిన దివ్యాభరణములకాంతిని తలదన్నే పదునైన, వివిధ ఆయుధముల ప్రకాశంతో శోభించే ఆ దేవినిచూచి అవాక్కయ్యారు. మిక్కిలి భీతిచెందినవారై క్షణమక్కడ నిలువలేక మహిషాసురుని చెంతకు చేరారు.

ఆతనితో తాముగాంచిన అసమాన సౌందర్యవతి, తేజోరాశి, అయిన స్త్రీ మూర్తిని గూర్చి వివరించారు. మానవి లేదా అసురి కాని ఆ స్త్రీ పదునెనిమిది భుజాలు గల్గియున్నదని, చేతులన్నింట శస్త్రాస్త్రములున్నవని సింహాన్ని అధిష్టించి ఉన్నదని తెలిపారు. ఆ స్త్రీయే గర్జన చేసియుండవచ్చని, ఆ స్త్రీ శృంగార – వీర రసముల సమన్వితయైనప్పటికీ తమకు అంతరంగములందు భీతికల్పించుచున్నదని విన్నవించుకున్నారు.

ఆసక్తితోవిన్న మహిషాసురుడు ఆ స్త్రీపై వ్యామోహముతో, ఆమెను తన పట్టమహిషిగా చేసుకొనదలచాడు. తన ప్రధానమంత్రిని సైన్యసమేతంగా పంపుతూ సామదాన బేధోపాయాలను ప్రయోగించి, అవసరమనుకొన్న, దండోపాయాన్ని సైతం ఉపయోగించి ఆమెను గాయపరచక సురక్షితంగా కొనిరమ్మని ఆదేశించాడు.

ప్రధానమంత్రి దౌత్యం విఫలముకాగా, అతడు తన రాజుకు రసభంగ మవుతుందన్న ఆలోచనతో యుద్ధముచేయక వెనుదిరిగాడు. ఆ దేవి "వాక్పటిమ - పరాక్రమము - యుద్ధసంసిద్ధత-మహిషాసురుని వధింప దృఢనిర్ణయం" గ్రహించిన అతనికి మరోగత్యంతరం లేకపోయింది. తత్త్వ వివేకి అయిన తామ్రుడు కూడా చతుర్విధ ప్రయోగాలతో విజయం సాధించనెంచ వచ్చి దేవిసముఖాన నిలువలేక విఫలుడై వెనుదిరిగాడు.

అమోఘమైన దేవి శౌర్యపరాక్రమ పటిమ నిర్ద్వందంగా ప్రకటితమౌతోంది. అయినా మహారాజు మహిషాసురుని అఖండ యుద్ధనిరతిపై అచంచల విశ్వాసం, వారి అపారస్వామిభక్తి, ఆస్థానంలో ఉప్పు-పులుసు తింటున్నందుకు కృతజ్ఞత, ఇత్యాది భావాలు సైన్యపు నాయకత్వవిభాగంలో సమరోత్సాహాన్ని ఉరకలెత్తిస్తున్నాయి. వాస్తవానికి తమ ప్రభువు మరణం ఒక స్త్రీచేతిలో వ్రాసిపెట్టి ఉందన్న విధాతనిర్దేశం ముల్లోకాలలో మారుమ్రోగుతోంది. కానీ ఈమారు ప్రభువు ఆదేశంతో కదనానికి కాలుదువ్విన ప్రముఖ దానవ యోధులు-చిక్షురాక్ష, తామ్రాక్ష, అసిలోమ, బిడాలాక్షులు తల్లిని ఎదిరించి ఆమె ఆగ్రహానికి బలియై మట్టికరిచారు. ఈ సంవిధానంలో అపారంగా దానవ పద, గజ, రథ, తురగ, సంపద నశించింది.

## మహిషాసురుని వధ

సుకుమారియైన ఒక కన్యచేతిలో శత్రుభీకరులు, శూరులు, అయిన తన సైన్యాధ్యక్ష ప్రముఖులు ఒకరి తరువాత ఒకరుగా మరణించిన వార్తలు వింటున్న మహిషాసురుడు మిక్కిలి దుఃఖితుడయ్యాడు.

వివిధరకాల ఆయుధాలతో నింపబడి, వేయిగాడిదలతో కూర్చిన రథంపై అతిసుందరమైన మానవశరీరం ధరించి యుద్ధరంగానికి బయల్దేరాడు మహిషాసురుడు. ధనుర్బాణాలను ధరించి ప్రచండ సేనావాహినితో కూడివస్తున్న దానవుని చూచి తన సన్నద్ధత వ్యక్తంచేస్తూ శంఖంపూరించింది జగన్మాత.

జగదేక సౌందర్యరాశిని ప్రత్యక్షంగా చూచిన దానవుడు ఇనుమడించిన వ్యామోహంతో ఆమె సౌందర్యాన్ని మిక్కిలిగా ప్రశంసించాడు. తన పట్టపురాణివి కమ్మని ప్రార్థించాడు. ఆమె సౌందర్యానికి తాను దాసుడనన్నాడు. ఆదేశిస్తే దేవతలతో వైరిభావాన్ని వదలివేయ గలనన్నాడు. తన ఆజ్ఞానుసారం నడుచుకోగలనని – జీవితాంతం అదే మాటపై నిలబడగలనని తన కోర్కెను అంగీకరించమని పలుమార్లు ప్రార్థించాడు. శరణుజొచ్చాడు.

ప్రతిగా దేవి ఇలా పలికింది. "దానవా! నేను ఈ సకలజగత్తుకు సృష్టికర్తను. ఈ సకల విశ్వానికి ఆత్మయైనవాడు ఆ పరమాత్మ. అతడు తప్ప వేరెవ్వరూ నాకు ప్రీతిపాత్రులుకారు. నేను అతనికి ప్రకృతిని. అతని సంయోగము వలననే నేను చైతన్యముపొంది ఈ జగమంతా వ్యాపింప చేస్తున్నాను. మూర్ఖుడవై నీవు స్త్రీ సుఖభావనలకు బానిసవయ్యావు. నీ విచిత్రస్థితికి జాలిపడి నీకు ఒక అవకాశం కల్పిస్తున్నాను. దేవతలతో వైరంవదలి పాతాళలోకం చేరి ప్రాణాలు దక్కించుకో, లేకుంటే యుద్ధానికి సిద్ధమవు. నాచేతిలో నీ మరణం తథ్యం".

ముగ్ధమనోహరంగా, మరింత ప్రశాంతంగా భగవతి వల్లిస్తున్న హితవాక్కులు కామపీడితుడైన మహిషాసురుని తలకెక్కలేదు. కామాగ్నిలో దహించబడుతున్న అతడు మరింత దీనంగా ఇలాపలికాడు.

"ఓ సుందరీ! నీవు స్త్రీవైనందున నీతో యుద్ధంచేయుటకు ఇష్టమగుట లేదు. కుసుమకోమలివైన నీతో యుద్ధము చేయుట సముచితము కాదు.

ధర్మసమ్మతము కూడా కాదు. "స్త్రీలు, బాలురు, బ్రాహ్మణులు" వీరిని వధిస్తే మూటగట్టుకొనే పాపనివృత్తికి ప్రాయశ్చిత్త విధానమే లేదు.

నిన్ను నేను నా ఇంటికి తీసుకొనివెళ్ళి, సహధర్మచారిణిగా చేసుకో దలచాను. నా కోరిక అంగీకరించు. లేకుంటే నీ దేశానికి తిరిగివెళ్ళిపో. ఇంత అందమైన నీకు చతురత అనే లక్షణం లోపించింది. అందువల్లనే నీవు నాకు భార్యవు కావడానికి అంగీకరించటం లేదు. ఎవరో శత్రువు నిన్ను మోసగించడం వల్ల నీకు ఈ దుర్బుద్ధి కలిగింది. సమయస్ఫూర్తితో సమంజసమైన నిర్ణయం తీసుకోకుంటే, తుదిగా ఒక అల్పమానవుని, దుష్టుని, పతిగా అంగీకరించి దుఃఖసాగరంలో ఎదురీదవలసి ఉంటుంది. యోచించి, నీ నిర్ణయం మార్చుకొని, నాతో సుఖజీవనం సాగించు."

క్రుద్ధురాలైన దేవి ఇలాపలికింది. "ఓరీ! దుష్టుడా! ఇదే నా తుది నిర్ణయం. ప్రాణములపై ఆశ ఉంటే పాతాళానికి వెళ్ళి నిన్ను నీవు రక్షించుకో, జగన్మాతనైన నేను జన్మ – రూపాది అంశములకు అతీతను. కాని దేవతల కడగండ్లు తొలగించ ఈ రూపంలో ప్రకటితనయ్యాను. నీ వధ అనంతరం నేను ఈ రూపం చాలిస్తాను. అతిత్వరలో నీ మరణం తథ్యము. తెలుసుకో."

మహిషాసురునిలో సహనం నశించింది. పౌరుషం పేట్రేగింది. ధనుర్బాణాలు చేబూని సమరానికి సిద్ధమయ్యాడు. పదునైన బాణములను భగవతిపై ప్రయోగించాడు. దేవి అతివేగంగా స్పందించి తన తీక్ష్ణ బాణపరంపరతో వాటిని ప్రతిఘటించి నేలకూల్చింది. ఇరుపక్షాల సేనలు విజయం తమదేనన్నట్లు ధాటిగా తలపడసాగాయి.

ఇంతలో దుర్ధరుడనే దానవుడు విషంకక్కే బాణాలను దేవిపై ప్రయోగించాడు. మెరుపు వేగంతో భగవతి ప్రయోగించిన బాణాలు వాటిని నిర్వీర్యం చేసి దుర్ధరుని నేలగూల్చాయి. ఆ పర్వతాకారుడు భీకరంగా అరుస్తూ అశువులుబాసాడు. తీవ్ర ఆగ్రహంతో త్రినేత్రుడు, అంధకుడు అనే రాక్షస

వీరులు తల్లికి ఎదురొడ్డి తనువులు బాసి, తల్లి వాహనమైన సింహానికి ఆహారమయ్యారు.

తన కళ్ళ ముందే వీరులైన సేనానాయకులు అసంఖ్యాకులైన పదాతిదళము మరణించుట చూసిన మహిషాసురుడు విజృంభించి జగన్మాతపై వివిధ బాణములను ఒక్కమారుగా ప్రయోగించగా, తల్లి వాటిని నిర్వీర్యం చేసి గదతో అతని వక్షఃస్థలాన్ని ఛేదించింది.

మూర్ఛితుడైన దానవుడు క్షణమాత్రాన్నే లేచి దేవి వాహనమైన సింహపు తలపై తనగదతో ప్రహారం చేసాడు. ఆ సింహాన్ని ఎదుర్కొవడానికి తాను సింహరూపం ధరించాడు. తదుపరి ఏనుగురూపం, మనుష్యరూపం, శరభరూపం ధరించాడు. తుదిగా జగన్మాత ధాటికి నిలువలేనివాడై తన సహజ సిద్ధమైన మహిషరూపం ధరించి తన బలమైన వాడి కొమ్ములతో పొడుస్తూ, తోకనువేగంగా తిప్పుతూ దేవికి భరించలేని బాధను కల్గించ సాగాడు. ఆ ఆనందంతో మిక్కిలి క్రూరంగా ఇలా పలికాడు. "ఓ సుందరీ! భయంతో పారిపోక ధృడచిత్తంతో నిలబడు. అనతికాలంలోనే నిన్ను వధించి తరువాత నీపై ఆశలు పెంచుకున్న ఆ దేవతలను కూడా వధిస్తాను కాచుకో".

అపుడు దేవి "మూర్ఖుడా! నీ మరణకాలం ఆసన్నమైనది, నీ వధ అనంతరం శ్రేష్ఠులైన దేవతలను నిర్భయులగావించి ముల్లోకాలలో శాంతిని, ధర్మాచరణను తిరిగి నెలకొల్పుతాను". అంటూ త్రిశూలధారిణియై మహిషాసురునిపై దూకింది. మాయా యుద్ధంలో – నిపుణుడైన దానవుడు అనేకరూపాలు ధరించి ఆమెను ఎదుర్కోసాగాడు. దేవి ఒక్క నిమిషంలో తన త్రిశూలంతో అతని వక్షఃస్థలంపై బలంగా పొడిచింది. సహించలేని బాధతో మహిషాసురుడు హాహాకారాలుచేస్తూ మూర్ఛిల్లి నేలకొరిగాడు. ఆశ్చర్యం! క్షణకాలంలో మూర్ఛనుండి తేరుకున్న మహిషాసురుడు తన పాదాలతో దేవి మీద ప్రహారము చేయసాగాడు. విజయసంకేతాలు సూచిస్తూ వికటాట్టహాసాలు చేస్తూ రణరంగమంతా కలియతిరుగసాగాడు.

అపుడు జగజ్జనని కోపంతో "ఓరీ! వరమదాంధుడా! ఈలోకంలో నీకు నూకలుచెల్లినవి. యమలోకప్రయాణానికి సిద్ధమవు. ఈ చక్రంతో నీశిరస్సు ఖండిస్తాను". అంటూ వెయ్యి ఆకులతో కూడిన పదునైన చక్రాన్ని ప్రయోగించి మహిషాసురుని శిరస్సును మెరుపువేగంతో ఖండించింది. అది చూసిన ఇంద్రాది సమస్త దేవతలు చెప్పలేనంత సంతోషంతో తల్లికి జై, జై ధ్వానాలు పలుకుతూ స్తుతించారు.

**శుంభ నిశుంభుల ప్రాబల్యము**

పూర్వం పాతాళలోక నివాసులైన శుంభ నిశుంభులను ఇరువురు రాక్షస సోదరులు మరణాన్ని జయింపవలెనన్న ప్రగాఢవాంఛతో భూలోకంలోకి ప్రవేశించారు. వారు సృష్టికర్త బ్రహ్మనుగూర్చి 10సం॥ల కాలము కఠోర తపస్సు గావించారు. క్రమంగా వారిశరీరాలు శుష్కించసాగాయి. వారి తపోదీక్షకు మెచ్చి ప్రత్యక్షమయిన బ్రహ్మ వారిని ఓ వరం కోరుకొమ్మన్నాడు.

వారు ఎంతోభక్తితో బ్రహ్మదేవునికి ప్రదక్షిణలు, సాష్టాంగనమస్కారాలు చేసి ఇలా ప్రార్థించారు. "బ్రహ్మదేవా! మేము ఈ ప్రపంచంలో మరణానికి తప్ప ఇతర ఏ సమస్యకు భయపడేవాళ్ళంకాము. అందుకే మీ శరణుకోరాము. దయతో మా ఇరువురము అమరులమయ్యేలా ఆశీర్వదించండి".

"పుట్టినవాడు గిట్టక మానడు. ఈ వరం మీరు కోరతగనిది. వేరేదైనా వరం కోరుకోండి" అన్నాడు చతుర్ముఖబ్రహ్మ.

అందుకు వారు "ఓ దయానిధీ! దేవ, మానవ, మృగ, పక్షి జాతుల ఎవ్వరిచేతా మేము మరణించకుండేలా, ముఖ్యంగా పురుషునిచేత వధింపబడకుండేలా అనుగ్రహించండి. "స్త్రీ సహజసిద్ధంగానే అబల కనుక ఆ జాతివలన మాకెట్టిప్రమాదం ఉండబోదు" అని విన్నవించుకున్నారు.

వారి కోరికను అనుగ్రహించి బ్రహ్మ అంతర్ధానమయ్యాడు. అటుపిమ్మట దైత్యగురువు శుక్రాచార్యుడు శుంభనిశుంభుల పురోహితుడయ్యాడు. అతని

అనుగ్రహంతో ఒక మహత్వపూర్ణ రజతసింహాసనం పొంది శుంభుడు పట్టాభిషిక్తుడయ్యాడు. అతని ఆధిపత్యాన్ని ఆమోదిస్తూ గొప్ప పరాక్రమ వంతులు, వీరులు అయిన చండ - ముండులనే సోదరులు, ధూమ్ర లోచనుడు, రక్తబీజుడు మొదలగువారు తమ తమ చతురంగ బలములతో కూడి శుంభుని కొలువునచేరి, తమ సమాశ్వాసనము తెలిపారు.

ఇంద్రలోకంలో తమ ఆధిపత్యాన్ని ప్రకటించేందుకు నిశుంభుడు తన సైన్యంతో కూడి భీకరంగా దాడిచేశాడు. కాని ఇంద్రుని వజ్రాయుధపు దెబ్బకు మూర్ఛిల్లి నేలకూలాడు. ఆ వార్తవిన్న శుంభుడు వాయువేగంతో యుద్ధరంగంలో ప్రవేశించి తన శౌర్య పరాక్రమాలను ప్రదర్శించి అనతికాలంలోనే ఇంద్రాది దేవతలను పరాజితులను చేశాడు. ఇంద్రభోగాలు చవిచూచి, రెట్టించిన ఉత్సాహంతో కుబేరుని కూడా జయించి, అపార సంపదను హస్తగతం చేసుకున్నాడు. సూర్యచంద్రులు అతని అధీనులై వర్తించసాగారు. దైత్యుల ఆధిపత్యం, ఆగడాలు, అత్యాచారాలకు వెరచి, సురులు కొండ గుహలందు, అడవులలోను నికృష్టమైన జీవితం గడుపసాగారు. ఇలా వేయి సంవత్సరాలు గడచిపోయాయి. ప్రారబ్ధమునకు, కాలకౌశలమునకు అతీతమేదీ లేదని హితబోధ కావించి వారికి సాంత్వన కల్గించాడు దేవగురువు బ్రహస్పతి. గతంలో మహిషాసురుడు విశృంఖలంగా సురజాతిని కడగండ్ల పాల్జేసినప్పుడు వారి ప్రార్ధనలకు అనుగ్రహించిన దేవి - భగవతి ఏవిధంగా మహిషాసురుని వధించి సురుల జీవితాలకు సుఖశాంతులు ప్రసాదించినదీ తెలియచేసాడు. హిమాలయములందు స్థితమై చండిరూపంలో భక్తులను అనుగ్రహిస్తున్న ఆ దేవిని శరణు గోరుటయే ఏకైక మార్గమని సూచించాడు.

### కౌశికి ఆవిర్భావం - ధూమ్రలోచన-చండముండుల వధ

హిమాలయమునకు చేరుకొన్న దేవతలందరూ ఎంతో దీనంగా మిక్కిలి భక్తి శ్రద్ధలతో భగవతిని ప్రార్థించసాగారు. కరుణామయి భగవతి ప్రత్యక్షమై

వారి ప్రార్థనలను శ్రద్ధగా ఆలకించింది. బ్రహ్మదేవునిచే వరంపొంది, మదించిన శుంభ-నిశుంభులు తదితరదైత్యులు దేవతలకు కల్పిస్తున్న ఆటంకాలు, కర్తవ్య నిర్వహణలో అడ్డంకులు, రాజ్య అపహరణాది దుష్కృత్యాలను విన్న భగవతి వారికి అభయం కల్పించింది.

ఆమె తన శ్రీవిగ్రహం నుండి "కౌశికి" అనే అంశను ప్రకటితం చేసింది. పార్వతి శరీరంనుండి కౌశికి ఆవిర్భవించగా, ఆమె శరీరం కృశించి నల్లబడినందున ఆమె 'కాళిక' నామంతో ప్రసిద్ధి చెందింది. భగవతి సింహాన్ని అధిష్ఠించి, కాళికతోగూడి శుంభ - నిశుంభుల వధింప బయల్దేరింది. వైరివీరుల నగర శివారులలో సుమధురగానం ఆలపిస్తూ విడిదిచేసింది. ఆమెను సందర్శించిన చండ - ముండులనే అనుచరులు, శుంభుని దరిచేరి "ఆ అసమాన సౌందర్యరాశిని చేరదీసి పట్టమహిషిని చేసుకొమ్మని" సూచించారు. అది విన్న శుంభుడు, కార్యము సానుకూలంగా నెరవేర్ప, సుగ్రీవుడను తనసచివుని దూతగా జగదంబ వద్దకు పంపాడు.

భగవతి ఆతనితో "తన చిన్ననాటి ప్రతిజ్ఞను అనుసరించి తనను జయించిన వీరుని మాత్రం వివాహమాడగలనని" తెలియజేసింది. ఈ సందర్భంగా శుంభ నిశుంభులలో ఎవ్వరితోనైనా యుద్ధానికి సిద్ధమేనని, తన సంసిద్ధత తెలియచేసింది. నిశుంభుని సలహామేరకు శుంభుడు, ఆమెను ఆధీనురాలిని చేసుకొని రాగలందులకు, ధూమ్రలోచనుడనే పరాక్రమవంతుని పంపాడు. ఆతని "వేడుకోలు - అది ఆమోదము గాని పక్షంలో యుద్ధసన్నద్ధత అన్న వ్యవహారసరళి" గ్రహించింది కాళిమాత. ప్రతిగా ఆమె "ధనుర్ధారివై సైన్యసహితుడవైన నీతో సామరస్యవచనము లెందుకు? యుద్ధానికి సిద్ధంక"మ్మని పరుషవాక్కులు పలికింది. కాళిక - ధూమ్రలోచనుల మధ్య భీకరయుద్ధం జరుగసాగింది. కాళిక విశ్వరూపంతో ఆతన్ని రథహీనుడ్ని చేసింది. అతడు కాళికను అధిక్షేపిస్తూ తన బలమైన పదునైన పరిఘతో

ఆమెపై ప్రహారము చేయబోగా, జగదంబ ఒక భీకర హుంకారం చేసింది. ఆ ప్రభావంతో అతడు కాలిబూడిదయ్యాడు.

భగవతి మిగులరౌద్రంతో సమరనాదం చేయసాగింది. తమ్ముడు నిశుంభునితో సుదీర్ఘంగా చర్చించిన శుంభుడు, చండముండులనే గొప్ప వీరులు - శూరులైన తన సైన్యాధ్యక్షులను భీకరయుద్ధానికి సమాయత్తం చేసి పంపాడు. శుంభుని బలపరాక్రమములు, అనంతసంపద, సుగుణశీలాది ప్రత్యేక ఔన్నత్యాన్ని ప్రశంశిస్తూ చండుడు చేసిన ప్రసంగాన్ని లెక్కచేయని దేవి తన పరుషపదజాలంతో అతన్ని యుద్ధానికి రెచ్చగొట్టింది. ఆ భీకరయుద్ధంలో అంబ-కాళిక, చండముండులను మూర్ఛితులను చేసి భగవతి వద్దకు ఈడ్చుకువచ్చి వారి తలలను తెగనరికి వధించింది.

## రక్తబీజుని వధ

చండముండుల మరణంతో దిక్కులేనివారై భిన్నవికలాంగులైన సైనికులు శుంభుని వద్దకుచేరారు. జగదంబ, కాళికమాతల శౌర్యపరాక్రమాలను యుద్ధనిరతిని శ్లాఘించారు. మాతను శరణుగోరి, యుద్ధము విరమించుట ఏల శ్రేయస్కరమో విన్నవించారు. కాని వరగర్వంతో, సహజ బలసంపన్నుడైన శుంభుడు వారిమాటలు లెక్కచేయలేదు. ప్రతిగా రక్తబీజుడనే రాక్షసవీరుని ప్రశంసలతో ఉత్తేజితుని చేసి యుద్ధానికి పంపాడు.

రక్తబీజుడు మాతకు తన యుద్ధసన్నద్ధతను వ్యక్తంజేస్తూ శ్రేయోభిలాషిగా, "శుంభనిశుంభులలో ఏ ఒక్కరినైనా వివాహమాడి, సమస్తసంపదలతో కూడి శృంగార రసమాధుర్యాన్ని చిరకాలం అనుభవించమని" సలహానిచ్చాడు. భగవతి, ఆగ్రహోదగ్రయై "యుద్ధానికి సిద్ధమగుట లేదా పాతాళమునకేగి ప్రాణం రక్షించుకొనుట'' అను ఏకైకఅంశపు ఎన్నికకు అతనికి అవకాశమిచ్చింది. ప్రచండ రోషంతో యుద్ధం ఆరంభించిన రక్తబీజుని దీటుగా ప్రతిఘటించి, మాత వాడియైనబాణంతో అతని వక్షఃస్థలం ఛేదించి

మూర్ఛితుని చేసింది. భీతిల్లిన సైన్యగణాలు చెల్లాచెదరయ్యాయి. ఈ విపత్కర పరిస్థితి గమనించిన శుంభుడు యోధులలో ఉత్సాహం నింపి పునరుత్తేజితులను చేయసాగాడు. అదనంగా తన సకల చతురంగ బలాలను సమీకరించి, సైన్యాన్ని మరింత బలోపేతం చేశారు. సాగరసమంగా తరలివస్తున్న శత్రుసైన్యాన్ని చూచి మాత నిరాఘాటంగా విజయ ఘంటారావం మ్రోగించసాగింది.

ఆమె ధనుష్టంకారానికి శంఖారావంజోడై వెలువడుతున్న శత్రుభీకర ధ్వని నుండి కాళికామాత ఆవిర్భవించింది. ఈమారు బ్రహ్మాది సకల దేవతల శక్తులు కూడా దేవికి అండగా నిలిచాయి. ఆ శక్తులు, ఆయాదేవతల రూప-ఆయుధ-వాహనాదులకు సదృశంగా ఆవిర్భవించాయి.

భగవతి జగదంబ, పరమేశ్వరుని సమక్షంలో చండికగా రూపం దాల్చింది. కైలాసవాసుడైన శంకరుని శుంభనిశుంభుల వద్దకు దూతగా పంపింది. ఆ దౌత్యం విఫలమై దైత్యులు యుద్ధం ప్రకటించారు. భగవతి రుద్రకాళికగా వారిపై విరుచుకు పడింది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాది దేవతల శక్తులు స్త్రీ అంశతో అంబకు అండగా చేరి వేలాది దానవులను విగత జీవులను చేశారు. మూర్ఛనుండి తేరుకున్న రక్తబీజుడు ప్రథమంగా గరుడవాహనారూఢయైన శ్రీవైష్ణవిపై శక్తిని ప్రయోగించాడు. వైష్ణవి తనగదతో ఆ శక్తిని ఆపి సుదర్శనాన్ని ప్రయోగించి అతని శరీరాన్ని ఛిద్రం చేసింది. రక్తబీజుని శరీరం నుండి భూమిమీద పడిన ప్రతిరక్తపు బిందువు నుండి వేలకొలది రక్తబీజులు ఆవిర్భవించసాగారు. వెనువెంటనే వారు కూడా యుద్ధసన్నద్ధులు కాసాగారు. శక్తిరూపిణులైన దేవీమణులకు ఈ విచిత్రం దుస్సహమైంది. సమయ స్ఫూర్తితో యోచించింది భగవతి. రక్తబీజుని శరీరం నుండి వెలువడే ప్రతిరక్తబిందువును తన దీర్ఘమైన నాలుకచే సేకరించి త్రాగుచుండ మని భద్రకాళిని ఆదేశించింది. ప్రచండ పరాక్రమంతో

చాముండి రక్తం గ్రోలుతూ, మృతదేహాలను భక్షిస్తూ విజృంభించగా జగదంబకు, రక్తబీజుని వధ సులభతర మయింది.

**శుంభ నిశుంభుల వధ**

రక్తసిక్తమైన శరీరాలతో దరిదాపు మృత్యుముంగిటకేగి అదృష్టవశాత్తు "బ్రతుకుజీవుడా" అంటు బయటకు రాగలిగిన రాక్షస యోధులు శుంభునికి, రక్తబీజుని మరణవార్త తెలియచేశారు. ప్రముఖ శక్తుల రూపంలో – దేవీమణులు, దైత్యుల కళేబరాలను కూడా మిగల్చకుండా ఆహారంగా సేవిస్తున్న చాముండేశ్వరి అండగానుండగా మహోన్నత శక్తియైన ఆ జగదంబను పరాజితురాలను చేయుట దుస్సాధ్యమని చెప్పారు. సముచిత నిర్ణయం తీసుకొమ్మని మనవి చేసుకున్నారు.

మృత్యుదేవత చేతిలో పావుగా మారిన శుంభునికి ఆ మాటలు తలకెక్కలేదు. కాలప్రభావంతో అతని బుద్ధిపెడదారి పట్టింది. తాను యుద్ధనుండి తప్పుకోవడం, రాజధర్మం కాదని తలచాడు. శుంభుడు వెంటనే సోదరుడు నిశుంభుని చేరి తాను యుద్ధరంగానికి తరులుచున్నట్లు తెలియచేశాడు.

"తాను జీవించియుండగా అగ్రజుడు – మహారాజు అయినట్టి శుంభుని యుద్ధరంగ ప్రవేశం అనుచితం" అంటూ నిశుంభుడు స్వయంగా తానే సమరానికి బయల్దేరాడు.

"విజయమో – వీరస్వర్గమో" అన్నట్లు నిశుంభుడు భగవతిని చూచిన మరుక్షణమే ఆమెపై అమ్ములవర్షం కురిపించసాగాడు. భగవతి ధనస్సును సంధించి వేలాది బాణముల వలతో అతన్ని కప్పివేసింది. అదే సమయంలో శుంభుడు తన అపారసేనావాహినితో రణరంగాన ప్రవేశించాడు. కాళికను తన శక్తులతో నియంత్రించి భగవతిని బందీని చేయతలంపుతో అతడు అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. శుంభుని గమనించిన దేవి –

అతడు దేవతలతో వైరమువీడి పాతాళమునకు గాని, సముద్రమునకు గాని వెళ్ళుటకు లేదా రణరంగమందు మరణించి స్వర్గము చేరుటకుగాని అవకాశం కల్పిస్తూ అభయమిచ్చింది. మృత్యుదేవత నెత్తిన ఎక్కిఉన్న శుంభునికి ఆ వాక్కులు రుచించలేదు.

అంతలో నిశుంభుడు మిక్కిలి క్రోధంతో తన బలమైనఖడ్గంతో దేవివాహన మైన సింహం తలపై గుచ్చి, వెనువెంటనే భగవతి జగదంబపై తన ఖడ్గం ప్రహరించ బోయాడు. మెరుపువేగంతో దేవి తనగదతో ఆ ఖడ్గాన్ని తుత్తునియలు చేసింది.

తన యుద్ధకౌశలంపై అపారనమ్మకంతో, స్వామిభక్తితో, అప్పటివరకు తన వెంట నడచిన దానవసోదరులు విగతజీవులై గ్రద్దలకు, కాకులకు, కుక్కలకు, నక్కలకు ఆహారం అవుతుండటం చూచిన నిశుంభుని క్రోధం కట్టలు తెంచుకుంది. బలమైన గదతో ఆ దేవి వాహనమైన సింహం తలపై మోది అదే వేగంతో దేవిపై దుమికాడు నిశుంభుడు. దేవి ఇనుమడించిన క్రోధంతో రెప్పపాటులో నిశుంభుని తల తెగనరికింది. వికారంగా ఆ మొండెము ఒక గదను చేబూని పైశాచికంగా నృత్యంచేస్తూ దేవతలను భయభ్రాంతులను చేస్తుండగా, దేవి వాడియైన అమ్ములతో ఆ దైత్యుని, కాళ్ళు, చేతులు నరికి అంతమొందించింది.

సోదరుని మరణవార్త శుంభుని దుఃఖసాగరంలో ముంచివైచింది. "ఆత్మీయులందరి మరణానంతరం, పిరికివానిలా యుద్ధానికి వెరచి, వైరి క్షమాభిక్షతో పాతాళంలో నివసించడం, అపఖ్యాతి పాలవడమే, కాలధర్మాన్ని ఎవ్వరూ అధిగమించలేరు. "పుట్టిన వాడు గిట్టకమానడు" అని యోచించిన శుంభుడు తన చతురంగబలాలతో కూడి యుద్ధరంగాన అడుగుబెట్టాడు.

దేవి దివ్యస్వరూపాన్ని చూచిన శుంభుడు కామమోహితుడయ్యాడు. పలువిధముల ఆమెను చేరదీసుకొనదలచి సంప్రదింపులలో విఫలుడయ్యాడు.

ఆమె రూప, యౌవనములకు యుద్ధము అనుచితమని తెలియచేశాడు. ఇక తనకు యుద్ధమే ప్రాధాన్యత అనుకొన్నచో-వికృతరూపము దాల్చి కఠినవచనములు పలుకుచూ తన పాటవాన్ని ప్రదర్శించవచ్చని భగవతికి బోధించాడు.

కుపితురాలైన భగవతి, మాతకాళికను, శుంభునితో యుద్ధము చేయ ఆదేశించింది. సాక్షాత్ మృత్యుస్వరూపిణి అయిన కాళిక ఎంతో బరువైనగదను ధరించి సమరానికి సిద్ధమయింది. ఇరువురి మధ్య భీకరయుద్ధం ప్రారంభమయింది. తన వ్యూహంలో భాగంగా మాతకాళిక ఎంతో చాకచక్యంగా దైత్యుని రథాన్ని సమూలంగా ముక్కలు ముక్కలుగా చేసింది. దానికి కట్టబడిఉన్న గాడిదలను సారథిని ఒకేమారు హతమార్చింది. పాదచారియై గదఎత్తి తనవైపువస్తున్న శుంభుని ప్రయత్నం విఫలంచేసి మెరుపువేగంతో అతని ఎడమభుజాన్ని నరికివేసింది. అతని శరీరమంతా రక్తసిక్తమై భీతిగొల్పుతున్నది. పట్టుదలతో అతడు దక్షిణ హస్తంతో గదను ధరించి కాళికవైపు వేగంగా వస్తుండగా ఆమె ఆతని దక్షిణహస్తాన్ని కూడా నరికివేసింది. చేతులు రెండింటినీ కోల్పోయినా, బాధను పంటిబిగువున భరిస్తూ శుంభుడు పరుగెడుతూ కాళికను సమీపించసాగాడు.

దేవిచేతి పదునైన కరవాలం ఆతని రెండుకాళ్ళను ఒకే వేటుతో నరికివేసింది. ఇంతలో, శరీరంలో శక్తి క్షీణిస్తున్నా, రౌద్రం ఏ మాత్రం తగ్గని శుంభుడు తనవైపు వేగంగాదొర్లుకుంటూ రావడం గమనించిన దేవి పదునైన తన ఖడ్గంతో అతని తలనునరికి పరిమార్చింది. దేవతల కష్టాలకు తెరపడగా ముల్లోకాలా శాంతి వెల్లివిరిసింది. మిగిలిన దైత్యులు ఆయుధాలు త్యజించి దేవికి ప్రణమిల్లి పాతాళ లోకానికి చేరుకున్నారు. ఇంద్రాది సమస్త దేవతలు - భగవతి చండికను, మాత కాళికను ప్రస్తుతిస్తూ, జై జై ధ్వానాలు చేస్తూ తమ తమ నివాసాలకు చేరుకున్నారు. ప్రకృతిధర్మం, దేవతల-మునుల

ధార్మిక కార్యక్రమములు పునరుద్ధరింపబడి, ధర్మాచరణ పునఃపాదు చేసుకుంది.

**బహుళ ప్రాచుర్యంలో భగవతి మహిమలు**

భక్తికి దాసి మాత భగవతి. తల్లిఎడల అపారభక్తితో ప్రగాఢ విశ్వాసంతో సేవించినవారిని కష్టాలకడలినుండి గట్టెక్కించి వారి కోరికలుతీర్చి, వారి హృదయాలలో గూడుకట్టుకొని నెలవయ్యే దయాసింధు "జగన్మాత".

తరతరాలుగా భక్తబాహుళ్యానికి ఆపద్బాంధవిగా అండగానిలుస్తూ తన మహిమలను ప్రకటిస్తూ, వ్యక్తమైన సందర్భాలు, సంఘటనలు కోకొల్లలు. భక్త హృదయాంతరాళమే ప్రమాణంగా ఈ గాథలు బహుళ ప్రాచుర్యం పొందాయి. మాతృకనెలవై ఆ తల్లి ప్రకటించిన మహిమలను మరీమరీ వినడానికి ఆసక్తి వ్యక్తం చేస్తూ భక్తుని హృదయం భక్తిసాగరమౌతుంది. ప్రాంతీయ బృందగానాలు, కోలాటాలు, భజనలు, కథాశ్రవణాలు, హరికథలు వంటి ప్రదర్శనల ద్వారా ముఖ్యంగా నవరాత్రులవంటి పండుగ సందర్భాలలో తల్లి మహిమలు విశదపరచే ఈ కథలు ఎంతో ప్రాచుర్యం సంతరించుకుంటాయి. ఇంటింటా ఈ భక్తి గాథలు పెద్దలు, పిల్లలకు ఆచార క్రమంలో తెలియచేయడం ద్వారా తరతరాలుగా ఆ తల్లిఎడల భక్తి శీతల చందనపవనంలా నలుదిక్కులా విస్తరిస్తోంది.

**(అ) "భక్త ధ్యాను"**

అది భారతదేశాన్ని మొగల్ చక్రవర్తులు పరిపాలిస్తున్న కాలం. అక్బరు చక్రవర్తి ఢిల్లీ సింహాసనం అధిష్ఠించిఉన్న కాలపు సంఘటన. నదోన్ గ్రామవాసి, వైష్ణోదేవి భక్తుడైన "ధ్యాను" వేయిమంది ఇతర భక్తులతో గూడి జ్వాలా మాత దర్శనార్థం తీర్థయాత్రకు బయల్దేరాడు. "జ్వాలాయాం వైష్ణవీదేవి" అన్నది అష్టాదశ శక్తిపీఠ స్తోత్రాంశం. ప్రస్తుత హిమాచలప్రదేశ్ రాష్ట్రంలో "కాంగ్రా" అనే ప్రాంతంలో ఈ శక్తి పీఠం నెలకొని ఉన్నది.

పంచ భూతాలలో ఒకటైన అగ్నిరూపంలో ఈ దేవి స్థితమై యున్నది. ఇచ్చటి పర్వతంపై సతీదేవి నాలుక పడినందున అప్పటినుండి జ్వాలలు వెలువడుతూనే ఉన్నట్లు యుగయుగాలుగా భక్తులు విశ్వసిస్తున్న సత్యం. ఈ జ్వాలలనే "జ్వాలాముఖి" అని "జ్వాలా వైష్ణవి" అని భక్తులు సేవిస్తుంటారు.

ఇంత పెద్ద జనసందోహాన్ని గమనించిన సిపాయిలు ఢిల్లీ నగరంలో చాందినిచౌక్ ప్రాంతంలో వారిని నిలువరించారు. భద్రతా కారణ నెపంతో వాస్తవాన్ని రాబట్టేందుకు వారు భక్త ధ్యానును అక్బరుచక్రవర్తి సభలోకి ప్రవేశ పెట్టారు. "ఇంతమందితో కూడి ఎక్కడికి నీప్రయాణం?" ప్రశ్నించాడు పాదుషా.

చేతులు జోడించి సమాధానమిచ్చాడు ధ్యాను. "అయ్యా! నేను జ్వాలా వైష్ణవి దర్శనార్థం వెళుతున్నాను. నాతో ఉన్నవారంతా ఆ తల్లి భక్తులే. తీర్థయాత్రకై వెళ్ళుచున్నాము"

"జ్వాలామాత ఎవరు? ఆమె దర్శనంతో ఏం ప్రయోజనం?" అని ప్రశ్నించాడు అక్బర్.

"మహారాజా! జ్వాలామాత ఈ సకల చరాచరజగత్ సృష్టిని, పాలనను గావించే తల్లి. అంకిత హృదయాలతో చేసే భక్తుల ప్రార్థనలను స్వీకరించి, వారి మనోభీష్టాలను సత్వరం నెరవేరుస్తుంది. ఆమె మహత్వం, వర్ణనలకు అందనిది. ఆమె వద్ద, వత్తి-నూనె లేకుండా జ్యోతి నిరంతరం ప్రకాశిస్తుంటుంది. ప్రతి సంవత్సరం ఆ తల్లి దర్శనం కోసం మేము ఇలాగే ప్రయాణిస్తుంటాము."

"ధ్యానూమహాశయా! మీ జ్వాలామాత అంతటి మహిమాన్వితురాలైతే, ఆ విషయం మాకు నిర్ధారణ ఎలా? నీవు ఆమె నిజమైనభక్తుడవైతే మాకుకూడా నిర్ధారణగా ఏదైనా ఆమె అద్భుతచర్య చూపించు. అలా అయితే మేముకూడా ఆ తల్లిని విశ్వసించగలం" అన్నాడు అక్బరు పాదుషా.

భక్త ధ్యాను, ఎంతో నమ్రతగా పలికాడు.

"మహారాజా! నేను ఆ మాతకు అత్యంత అల్పస్థాయి సేవకుడ్ని. నేను ఏ విధంగా మీకు ఆ తల్లి అద్భుతలీలలను చూపించగలను?"

అక్బరు మహారాజు ఇలా పలికాడు.

"ధ్యాను! నీభక్తి తాదాత్మ్యం, నిష్కల్మషమైనదైతే, ఆ తల్లి శీఘ్రమే నీ కోరిక నెరవేరుస్తుంది. ఆమె నీ వంటి భక్తులను సంరక్షించ కుంటే మరి నీ భక్తికి పరమావధి ఏమిటి? నీ నమ్మకాన్ని ఆ తల్లి వమ్ముచేస్తే నీ భక్తి కూడా మోసపూరితమైనదే అవుతుంది. ఇక పరీక్షకు సిద్ధమై, నీ భక్తిని నిరూపించుకో."

"ఈ పరీక్షలో భాగంగా నీ గుర్రం తలనరికేస్తాం! నీవు నీ తల్లికి మొరపెట్టుకొని ఆ గుర్రాన్ని తిరిగి బ్రతికింపచెయ్యి." అంటూనే ఆ గుర్రం మెడ తెగనరికించాడు, అక్బర్‌చక్రవర్తి. ధ్యాను ఆ ఆకస్మిక పరిణామానికి నిర్విణ్ణుడయ్యాడు. తీవ్ర ఆవేదనతో, తనకు ఒక మాస కాలం వ్యవధి ప్రసాదించమని అప్పటి వరకు తన గుర్రపు తల మొండెములను సురక్షితంగా ఉంచమని వేడుకొన్నాడు. అందుకు చక్రవర్తి అంగీకరించి, ధ్యానుకు తన సహభక్తులతోకూడి యాత్రకొనసాగించ అనుమతించాడు.

బాద్‌షావారికి వీడ్కోలు పలికిన భక్తధ్యాను సహభక్త బృందంతోకూడి తల్లి మాహాత్మ్యాన్ని మరోమారు లోకానికి చాటిచెప్పాలన్న దృఢ నిర్ణయంతో, భక్త్యా వేదనలతో జ్వాలామాత మందిరానికి చేరుకున్నాడు.

మాతృకదర్శనానికి జరుగుతున్న జాప్యానికి, వేదన మిగిల్చిన ఈ పరిణామాలకు తల్లడిల్లిన ఆ భక్తబృందం ఆర్ద్రతతో "జయ జయ వైష్ణవి దుర్గే" అంటూ తల్లిని స్మరిస్తూ రాత్రంతా దర్శనానికి ఎదురుచూస్తూ భారంగా గడిపారు. ఆ భక్తబృందం తదేకదీక్షతో వేకువనే స్నాన జపాది కర్మలను ముగించి దినమంతా భక్తిశ్రద్ధలతో తల్లిని పూజించి, రాత్రి జాగరణ

గావించారు. ప్రాతఃకాల హారతిసమయంలో ధ్యాను చేతులు జోడించి "ఓం జ్వలిన్యై నమః" అంటూ మాతృకకు మొక్కుతూ ఇలా ప్రార్థించాడు.

"ఓ మహామాతృకా! నీవు సర్వాంతర్యామివి. అక్బరుపాదుషా నా భక్తి ప్రపత్తులను పరీక్షింపనెంచాడు. నా భక్తిని లోకానికి చాటి, దయతో నీ మహత్వం లోక విదితమయ్యేలా నా అశ్వానికి పునర్జన్మ ప్రసాదించు. ఈ పాదసేవకుని కృతార్థుని గావించు. నా ప్రార్థన స్వీకరించి, "మానవులంతా భక్తికిబానిసలై–లోకమంతా ఆధ్యాత్మికతకై అర్రులుజాచేలా" ఆశీర్వదించు. కాకుంటే నా శిరస్సును ఖండించుకొని నీ పాదాలచెంత సమర్పణ గావించుకోవటంకన్నా నాకు వేరే మార్గం లేదు. ఈ అవమాన భారమనే నీచంకన్నా మరణమేమేలు. ఇది నా ఆవేదనాభరిత అంతిమ ప్రతిజ్ఞ. ఓ దయాంబురాశి! నన్ను కరుణించి అనుగ్రహించు". ధ్యాను ముఖంలోని భావాలలో దృఢనిర్ణయంతో గూడిన ఆర్ధత ప్రస్ఫుటమౌతోంది.

మాతృక మందిరం అంతామౌనం ఆవహించింది. కాలం భారంగా నడుస్తోంది. ఆ ప్రాంతమంతా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. తల్లి అనుగ్రహం వీక్షించడానికి భక్తుల హృదయాలు భారంగా స్పందిస్తున్నాయి.

సమయం గడిచేకొద్దీ తల్లి అనుగ్రహానికి నోచుకోలేక పోతున్నానన్న భావం ధ్యానును తీవ్రంగా బాధించసాగింది. సిద్ధంగా ఉంచుకున్న కత్తితో ధ్యాను, మరుసటిక్షణంలో మెరుపువేగంతో తన తల నరుక్కొన్నాడు. ఆ వేగానికి ధ్యాను తల దొర్లుతూ తల్లిపాదాల వద్దకు చేరింది. ఆశ్చర్యం! ఆ మరుసటి క్షణం కన్నులు మిరుమిట్లు గొలిపే దివ్య కాంతి ఆ మందిరం అంతా ప్రసరించింది. సాక్షాత్ జ్వాలామాత ప్రత్యక్షంకాగా భక్తుల జయ జయ ధ్వానాలు మిన్నంటాయి. తల్లి ఆత్మీయ స్పర్శతో ధ్యాను శిరస్సు, మొండెము ఏకమై అతడు పునరుజ్జీవితుడయ్యాడు. శ్రీమాత ధ్యానుతో ఇలాపలికింది. "అచంచలమైన నీ భక్తి నిష్కామమైనది. నీవు కోరుకున్న

విధంగా నీ అశ్వంకూడా పునరుజ్జీవితురాలైంది. నీ భక్తి శంకించలేనిది. నీవు తిరిగి ఢిల్లీ నగరానికి బయల్దేరవచ్చు. నీ అపార భక్తికి ప్రసన్నురాల నయ్యాను. ఏదైనా వరంకోరుకో అనుగ్రహిస్తాను."

ధ్యాను తల్లిపాదాలపై శిరస్సునుంచి ప్రణామంచేసి ఇలా నివేదించు కున్నాడు.

"ఓ జగదంబా! నీవు సర్వోన్నతమైన శక్తిస్వరూపిణివి. నీవు భక్తులను ఇంత కఠిన పరీక్షకు లోనుచేయదగునా? ఈ మానవులు అజ్ఞానులు. ప్రతిభక్తుడు తన శిరస్సును తమకు కానుకగా సమర్పించుకోగల సాహసము చేయగలిగి ఉండునా? కావున నీవు దయతో సాధారణ కానుకలను ఆమోదించి వారివారి మనోభీష్టాలను నెరవేర్చి అనుగ్రహించు".

"తథాస్తు" ఈనాటినుండి పరిపూర్ణ హృదయ సమర్పణతో ప్రార్థన గావించి కొబ్బరికాయను సమర్పించిన వారి మనోభీష్టములను నెరవేర్చగలను." అని పలుకుతూ అంతర్థానమయింది అంబ.

ఈ సంఘటన జరిగిన సందర్భంలోనే మాతృక కటాక్షంతో ఢిల్లీనగరంలో మరణించిన అశ్వపుతల మొండేనికి దానంతటదే జతకూడి ఆ అశ్వం పునరుజ్జీవనం పొందింది. అది ప్రత్యక్షంగా చూసిన అక్బర్‌పాదుషా, అతని సంస్థానంలోని మంత్రులు ఇతర సేవకులు, సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు. మాతృకమహాత్మ్యం, భక్తులపై తల్లి వాత్సల్యం, కట్టెదుట నిరూపితమైనా ఎదో సందేహం వారి మనస్సులను కలచి వేయసాగింది.

ఇదిలా ఉండగా, మాతజ్వాల మందిరంలో ఏం జరుగుతోందో వాస్తవం తెలుసుకురమ్మని పాదుషా కొంతమంది సిపాయిలను పంపాడు. నిశితంగా పరిశీలించి వచ్చిన సిపాయిలు అక్బరు చక్రవర్తికి ఇలా మనవి చేసుకున్నారు.

"అయ్యా! అక్కడ భూమినుండి మిక్కిలి కాంతివంతమైన జ్వాలలు వెలువడు తున్నాయి. అది ఆ మహాశక్తియొక్క మహిమ అయిఉండవచ్చు.

తమరు అనుజ్ఞ ఇస్తే ఆ భక్తులను అందరినీ బంధించగలము. ఈ విధంగా హిందువులు ప్రార్థనా మందిరం ఒకటి మూసివేయబడినట్లు గూడా, అవుతుంది." చక్రవర్తి అనుమతితో మరలా సిపాయిలు జ్వాలామాత మందిరం చేరారు. మొదటగా అందరూ మాత యొక్క పవిత్రజ్యోతిపై మందమైన, బరువైన, లోహపుపెనముల వంటి వానిని ఉంచారు. అయినప్పటికీ ఆ దివ్యజ్యోతి ఆ మూతలను ఛేదించి బయటకు రాసాగింది. విఫలురైన సిపాయిలు మరో ప్రయత్నంగా ఎంతో శ్రమించి సమీపంలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న ఒక నదిపాయను ఆ జ్యోతిపై నిరంతరం ప్రవహిస్తూ ఉండేలా మళ్ళించారు. ఆ ప్రయత్నంవల్ల కూడా ఆ మహిమాన్విత జ్వాలల ప్రకాశం కించిత్‌మాత్రం క్షీణించలేదు. సిపాయిలందరూ అక్బరు మహారాజును చేరి ఆయనకిలా విన్నవించుకున్నారు. "మహారాజా! ఆ జ్వాలల ప్రకాశాన్ని ఏ విధంగాను నిర్మధించలేకున్నాము. మా అన్ని ప్రయత్నాలు విఫలమైనవి. ఇకమీరు మా తదుపరి కర్తవ్యాన్ని సెలవివ్వండి."

నిర్ణయానికి ముందుగా సమగ్రంగా ఆ క్షేత్ర సమాచారాన్ని తెలుసుకొనగోరి అక్బరు పాదుషా పండితబ్రాహ్మణుల సమావేశాన్ని ఏర్పాటుచేశాడు. పండితులు కూలంకషంగా చర్చించి, తమ సలహాను విన్నవించుకున్నారు. తదనుగుణంగా అక్బరు పాదుషా మందిర నియమానుసారం ఆ తల్లికి కానుకలు సమర్పించి ప్రసన్నంకావించుకొని స్వయంగా ఆమె మహత్యాన్ని తెలుసుకోవచ్చు. పావుమణుగు స్వచ్ఛమైన బంగారంతో తయారు చేయబడిన ఛత్రాన్ని స్వయంగా తన భుజాలపై మోస్తూ పాదరక్షలు లేకుండా దేవి మందిరంలోకి ప్రవేశించాలన్నది అక్బర్‌పాదుషా అనుసరించ వలసిన నియమం. తదుపరి దేవి పూజాదికములలో పాల్గొని దేవ్యపరాధ క్షమాపణ కోరుతూ దేవిని స్తుతించి సేవించాలి.

అక్బరుచక్రవర్తి బ్రాహ్మణ పండితుల సలహాను యథాతథంగా అమలుపరచ నిర్ణయించాడు. పావుమణుగు స్వచ్ఛ బంగారంతో గొప్పగా

గొడుగు తయారైంది. పాదరక్షలు లేకుండా తన భుజాలపై ఆ గొడుగును మోసుకుంటూ పాదుషా జ్వాలామాత మందిరాన్ని చేరుకున్నాడు. అక్కడ అతనికి భగవతి దర్శనభాగ్యం కలిగింది. అపారభక్తితో శిరస్సు అవనతమైంది. తన తప్పులు స్ఫురణకు రాగా పశ్చాత్తాపంతో కుమిలిపోసాగాడు. ఆ ఆవేదనాభరిత స్థితిలో భుజముపైని ఛత్రం ఒక్కమారుగా క్రిందపడి విరిగిపోయింది. ఆశ్చర్యం! నిశితంగా పరిశీలించగా అది బంగారంతో తయారైనది కాదని, ఏదో విచిత్రమైన లోహంతో తయారయిందని నిర్ధారించబడింది. ఆ విధంగా అక్బర్ మహారాజ్ కానుకలను, దేవి స్వీకరించలేదని విదితమయింది.

జ్వాలామాత మహత్యాన్ని స్వయంగా తిలకించిన అక్బర్ అపరాధభావంతో క్రుంగిపోయాడు. అనేక విధాల మాతను స్తుతించి క్షమాబిక్షను కోరుకున్నాడు. దయామయి మాత అనుగ్రహంతో తెప్పరిల్లాడు. తిరిగి ఢిల్లీచేరిన పాదుషా భక్తులందరి మనోభావాలను గౌరవిస్తూవారితో ప్రేమ పూర్వకంగా వ్యవహరించాలని తన సిపాయిలందరకు ఆదేశాలు జారీచేశాడు.

అక్బర్ పాదుషా చేత సమర్పింపబడి, విరిగినఛత్రం తల్లి మందిరంలో ఎడమ భాగాన ఈనాటికి మనకు దర్శనమిస్తుంది.

**(ఆ) మహారాణి తారాదేవి**

మాతయొక్క జాగరణ రాత్రులందు మహారాణి తారాదేవి గాథను చెప్పడం- వినడం అనే సాంప్రదాయం ప్రాచీన కాలంనుండి అమలవుతూ వస్తున్నది. తారాదేవి స్మరణతో కూడిన జాగరణతోనే సంపూర్ణ ఫలం ప్రాప్తిస్తుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. విచిత్రమేమంటే, పురాణ, ఇతిహాస గ్రంథాలలో మహారాణి తారాదేవి కథప్రస్తావన ఎచ్చటాలేకున్నా, శ్రీమాత

జాగరణ ఉత్సవాలలో ఆమె కథా ప్రవచనాలు వినడం తరతరాలుగా అమలవుతున్న ఆత్మీయ భక్తిదాయకమైన సాంప్రదాయం. కథాక్రమం తెలుసుకుందాం!

మహారాజు దక్షుని కుమార్తెలు తారాదేవి, రుక్మన్ అనువారలు. వీరు ఇరువురు భగవతి దుర్గ ఎడల అచంచలమైన భక్తివిశ్వాసాదులు కలిగి ఉండేవారు. వారిరువురు ఒక ఏకాదశి తిథి దినాన భక్తితో వ్రతం ఆచరించి ఆ రాత్రి జాగరణలో భాగంగా భక్తితో కీర్తనలు ఆలాపించి, తల్లిమహాత్యము పఠించి, విని, ఆత్మ సమర్పణతో ముగించారు.

కానీ దైవలీలగా ఆ ఏకాదశి పవిత్ర దినాన పొరపాటుగా రుక్మన్ మాంసాహారం భుజించింది. అది తెలుసుకున్న తారాదేవి కోపంతో "నీవు నా సోదరివైయుండి, మానవజన్మ పొందియుండి కూడా, నీచయోని యందు జన్మించిన దానివలె ఘోర తప్పిదం చేసావు. అలాంటి నీవు ఒక బల్లిగా జన్మించడానికి యోగ్యురాలివి" అన్నది. తన తప్పుకు ప్రాయశ్చిత్తంగా అక్క వాక్కును శిరోధార్యంగా భావించింది రుక్మన్. తరుణోపాయం సూచించమని అక్కను వేడుకుంది.

"త్యాగ నిరతితో పరోపకారం ధ్యేయంగా జీవితం సాగిస్తే సమస్త పాపాలు తొలగిపోతాయి" – సూచించింది తారాదేవి.

తదుపరి జన్మలో తారాదేవి ఇంద్రలోకంలో అప్సరసగా జన్మించగా రుక్మన్ భూలోకాన బల్లిగా జన్మించింది. అది ద్వాపరయుగం. పంచ పాండవులు అశ్వమేధ యాగం చేయతలచి దుర్వాస మహామునిని, ముప్పదిమూడు కోట్ల దేవతలను ఆహ్వానించేందుకు వారివద్దకు ఒక దూతను పంపారు. "ఆ ముప్పది మూడుకోట్ల దేవతలు యజ్ఞంలో పాల్గొనేటట్లయితే తాను ఆ యజ్ఞంలో పాల్గొనలేనని పలికాడు దూర్వాసుడు. ముప్పది మూడుకోట్ల దేవతలను ఆహ్వానించిన పిదప ఆదూత తిరిగి పాండవులను చేరి దూర్వాసమహాముని నిర్ణయాన్ని వారికి తెలియచేసాడు.

అశ్వమేధయాగం ప్రారంభమయింది. రాజ్యంలో ప్రజలకు అదనంగా ముప్పది మూడు కోట్ల దేవతలు హాజరయ్యారు. దూర్వాసమహామునిని కాంచని దేవతలు, ఆతని ఆహ్వానించని కారణమేమని పాండవులను ప్రశ్నించారు. ''ఆహ్వానం పంపించి ఉన్నాము. మహాముని తన ఆభిజాత్యకారణమున మమ్ము అనుగ్రహించ లేదు'' అని నమ్రతతో తెలియపరచాడు ధర్మరాజు. యజ్ఞక్రతువు, హవనాది కార్యక్రమములు నిర్విఘ్నంగా ముగిసాయి. తదుపరి ఆహ్వానితులకు విందు భోజనం సిద్ధమౌతోంది.

తన ఆదేశాన్ని ఆమోదించి తగువిధంగా నడుచుకోనందుకు, తనను విస్మరించి నందుకు, పాండవులపై దూర్వాసుని ఆగ్రహం తారాస్థాయికి చేరింది. అతడు ఒక గద్దరూపం ధరించినవాడై, తన ముక్కుతో ఒక పామును బంధించి, చంపి తెచ్చి విందు వంటపాత్రలలో విసిరివేశాడు. ఈ దుశ్చర్య ఎవ్వరి కంటబడకుండా ఎంతో రహస్యంగా జరిగిపోయింది. ఆ సర్పం అతిపెద్ద పాయసపాత్రలో పడిమునిగి పోయింది. జరిగిందంతా శ్రద్ధగా గమనిస్తోంది, ఆ వంటశాలకప్పుపై ఉన్న ఒక బల్లి. ఆ బల్లి వేరెవరో కాదు, గత జన్మలో చేసిన అపచారానికి ఫలం అనుభవిస్తున్న తారాదేవి చెల్లి అయిన రుక్మన్. అక్క ఆగ్రహంతో అన్న మాటలను శిరోధార్యంగా భావించి బల్లిగా జన్మించి పరోపకారానికి, త్యాగానికి ఆత్రంగా ఎదురుచూస్తున్న దుర్గామాత ప్రియ భక్తురాలు. పూర్వజన్మ జ్ఞానంతో ప్రాయశ్చిత్త ప్రక్రియలో త్యాగంతో కూడిన పరోపకారం చేయడానికి ఆ బల్లి ఎదురుచూస్తూ క్షణాలు లెక్కిస్తోంది. కోట్లాది అతిధుల ప్రాణాలు కాపాడేందుకు తన ప్రాణం ఫణంగా పెట్టాలనే దృఢనిర్ణయం చేసుకొని ఉంది. పాయసం వడ్డనకై పలువురు రాజసేవకులు ఆ గదిలోకి ప్రవేశించారు. అదే అదనుగా వారందరు చూస్తుండగానే ఆ బల్లి కప్పునుండి పాయసపాత్రలోకి దూకి ప్రాణత్యాగం చేసింది.

వంటవారు వడ్డనవారు ఆ బల్లిని, నోటికి వచ్చినట్లు తిడుతూ పాయసపాత్రను ఖాళీ చేయసాగారు. అదే సమయంలో వారు ఆ పాయసంలో మరణించిన పామును గుర్తించారు. నిర్విణ్ణులైన పాండవులు, పరిచారకులు, దేవమానవాది అతిథులు, తప్పిన పెనుప్రాణనష్టానికి తేలికగా ఊపిరి పీల్చుకున్నారు. అందరికీ అవగత మయింది. బల్లి తన ప్రాణత్యాగం చేసి ఇందరిప్రాణాలు కాపాడిందని. వారందరు ఆ బల్లికి "తదుపరి మానవ జన్మ ప్రాప్తించాలని అంత్యంలో మోక్షం సిద్ధించాలని" ముక్తకంఠంతో భగవతిని ప్రార్థించారు.

వారి కోరికను ఆ భగవంతుడు ఆత్మీయంగా అనుగ్రహించాడా అన్నట్టు, రుక్మన్ రెండవ జన్మఅయిన ఆ బల్లి మరుసటి జన్మలో మహారాజు స్పర్శ ఇంట రాకుమారిగా జన్మించింది. ఆమె అక్క తారాదేవి తదుపరి మానవజన్మ ధరించి తారామతి అన్నపేరుతో రఘువంశజుడు, అయోధ్యాధిపతి అయిన హరిశ్చంద్రుని ఇల్లాలయింది.

జ్యోతిష్కుల పిలువనంపి మహారాజు స్పర్శ, తనకుమార్తె జాతకం వ్రాయ గోరాడు. క్షుణ్ణంగా పరిశీలించిన, జ్యోతిష్కులు ఇలా విన్నవించుకున్నారు. "ఆర్యా! బాలిక జన్మనక్షత్ర సంబంధిత గ్రహదశానుసారం పితృస్థాన మందు వైరిగ్రహ, మారకగ్రహ బలమైన ప్రభావంచేత జాతకురాలికి పితృవియోగం సంభవించనున్నది". పలు దుశ్శకునములు పొడచూపుచున్నవి. కాబట్టి ఈ బాలికను వెంటనే తుదముట్టించండి."

"బాలికను వధించడం పరమ కిరాతకం, చూస్తూ చూస్తూ ఆ పాపం నేను మూట గట్టుకోలేను" అన్న రాజుగారి మాటలు విన్న జ్యోతిష్కులు పునరాలోచించారు. "ఆర్యా! తమరు బంగారము, వెండి రేకులతాపడంతో నగిషీలు చెక్కిన ఒక కొయ్యపెట్టె తయారు చేయించి, అందు ఈ బాలికతో పాటు బంగారునగలు, వస్తుసామాగ్రి పెట్టించి నది ప్రవాహంలో విడిపించండి.

వెండి – బంగారపు రేకులు పొదిగిన ఆ పెట్టెను పేరాశతో ఎవరో ఒకరు తప్పక పట్టి – వెలికి తీయగలరు. ఆ వ్యక్తి చేత మీ బాలిక పెంచి పోషింపబడుతుంది. ఆ విధంగా మీకు ఏలాంటి పాపము సంక్రమించదు" అని సలహానిచ్చారు.

ఆవేదనతో అన్యమనస్కంగా ఉన్న రాజుగారి అంగీకారంతో బాలిక బంధించ బడ్డపెట్టె నదీప్రవాహంలో వదలివేయబడింది. అలా ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఆపెట్టె కాశీనగర సమీపంలో ఒక పారిశుధ్య పనివాని కంటబడింది. అతడు ఆ ప్రవాహం వాలున వేగంగా ఈదుతూ వెంటాడి ఆ పెట్టెను చేజిక్కించుకొని ఆత్రుతతో నదిఒడ్డుకు చేర్చాడు. ఉత్సాహంతో ఎంతోఆశగా పెట్టెతెరచి చూచిన ఆతని ఆశ్చర్యానికి అవధుల్లేవు. ఆ పెట్టెలో విలువైన బంగారు, వెండి సంపదతోబాటు, అత్యంత సౌందర్యవతి అయిన బాలిక చిరునవ్వుతో ధన్యవాదాలు తెలిపింది. ఎత్తుకొమ్మని చేతులు చాచింది. ఆహా! ఎంత ఆనందం! బిడ్డలులేని తనకు భగవత్ప్రసాదం లభించింది. పరుగుతో అతడు ఇంటికిచేరి ఆ బిడ్డను, సంపదను భార్యకు చూపించాడు. తమ చిరకాలవాంఛ అనూహ్యంగా నెరవేరినందున వారిద్దరు ఆ బిడ్డను ప్రేమమీర గుండెలకు హత్తుకొని ఆనంద భాష్పాలలో ఓలలాడించారు. భగవతికృపతో ఆమె స్తనములందు పాలు పెల్లుబకగా ఆ బిడ్డ నోటికందించి అవ్యాజ మాతృప్రేమను తనవితీరా ఆస్వాదించింది. ఆ దంపతులు ఆ బాలికకు రుక్కో అని పేరుపెట్టి అల్లారు ముద్దుగా పెంచసాగారు. చూస్తుండగానే రుక్కో యుక్తవయస్కురాలైంది. ఆ తల్లిదండ్రులు తగిన వరునకై అన్వేషించి తుదిగా అయోధ్యనగరంలోని సజాతీయ యువకునితో అంగరంగవైభవంగా వివాహం జరిపించారు. ఆ విధంగా దక్షుని రెండవకుమార్తె తన ప్రాయశ్చిత్త ప్రక్రియలో భాగంగా మొదటి జన్మలో బల్లిగా జీవితం ముగించి, రెండవజన్మలో రుక్కోగా అత్తవారింట జీవనం సాగించసాగింది.

రుక్కో అత్త రాజాహరిశ్చంద్ర సంస్థానంలో పారిశుధ్య సేవకురాలు. ఒక దినం ఆమె వ్యాధిగ్రస్తురాలయింది. అత్త తరపున పనిచేసేందుకుగాను రుక్కో రాజప్రాసాదం చేరుకుంది. మహారాణి తారామతి కొత్త పరిచారికను చూచి నివ్వెర పోయింది. పూర్వజన్మసుకృతం వల్ల ఆమె పరిచారికలో తన సోదరిని గుర్తించి ఇలా పలికింది. “చెల్లీ! నీవు ఇలా నాదగ్గరగా వచ్చి కూర్చో”. మహారాణి ఆహ్వానం ఆశ్చర్యం, ఆనందం, కల్గించగా రుక్కో ఇలా పలికింది. “అమ్మా! నేను అల్పజాతి దానను, మీ చెంత కూర్చొనుటకు అర్హురాలనుకాను”. అందుకు రాణి తారామతి ఇలాపలికింది. “చెల్లీ! నీవు గత జన్మలో నా సహోదరివి. ఏకాదశివ్రత ఆచరణదోషకారణంగా నీవు బల్లివై జన్మించావు. విధివ్రాతను ఎవ్వరూ తప్పించుకోలేరు. జరుగవలసినది జరిగిపోయింది. నీ ఈ మానవజన్మ ఎంతో విశిష్టమైనది. ఈ జన్మ దైవకృపతో సఫలం అయ్యేలా తీర్చిదిద్దుకో. మాత వైష్ణోదేవిని సేవించి, భక్తితోపూజించి నీ జన్మ ధన్యంచేసుకో”.

మహారాణి ఆత్మీయ శ్రేయోభాషణంతో రుక్కో ఆనందంతో పరవశించి భక్తి విధానాన్ని అనుగ్రహించమని అర్థించింది. మహారాణి ప్రసన్నంగా ఇలా పలికింది. “మాతశ్రీవైష్ణవి భక్తులు కోరిన కోరికలీడేర్చే కామధేనువు వంటిది. శ్రద్ధా భక్తులతో తనను పూజించి జాగరణక్రతువు నిర్వహించిన వారి అభీష్టాలను ఆ దేవి సత్వరం నెరవేరుస్తుంది”.

రుక్కో చెప్పలేనంత ఆనందంతో శ్రీవైష్ణవికి మ్రొక్కుతూ ఇలాపలికింది. “ఓ మాతా! అనుగ్రహించి నాకు మగసంతానాన్ని ప్రసాదించు. నేను నిత్యం నిన్ను పూజిస్తూ జాగరణ కార్యక్రమం కూడా జరిపించగలను”. కృపామయి దేవి, ఆ భక్తురాలి ప్రార్థనను స్వీకరించింది. ఆమె అనుగ్రహ ఫలంగా రుక్కో నవమాసాలు మోసి ఒక పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తాను ఏన్నాళ్ళగానో ఎదురుచూస్తున్న ఈ భాగ్యానికి ఎంతగానో మురిసిపోయిన రుక్కో, మాతకు తాను చెల్లించుకోవలసిన మ్రొక్కును మరచి విస్మరించింది.

అలా దురదృష్టవశాన రుక్కోకు శ్రీవైష్ణవి మాతను పూజించి జాగారణ నిర్వహించవలసిన మ్రొక్కు స్ఫురణకే రాలేదు.

క్రమంగా బాలుడు ఐదేండ్ల వయస్సు వాడయ్యాడు. ఒక దినం ఆ బాలుడు తీవ్రజ్వరం బారినపడ్డాడు. ఊహించని విధంగా మరునాడు మశూచి వ్యాధిగ్రస్తుడయ్యాడు. ఆవేదనతో రుక్కో తన గతజన్మ సోదరి, రాణి తారామతి కడకేగి, తన కష్టాన్ని వెళ్ళబోసుకుంది.

అంత తారామతి "భగవతి పూజావిధానంలో నీ వల్ల తప్పేదైనా జరిగిందేమో గుర్తు తెచ్చుకో!" అన్నది. ఆశ్చర్యం! ఆరు సంవత్సరాల క్రిందటి తన మ్రొక్కు రుక్కోకు ఆకస్మికంగా స్ఫురణకొచ్చింది. తన తప్పును అంగీకరిస్తూ అపరాధభావంతో ఆక్రోశించింది. బాలునికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరితే, ఈమారు తప్పక జాగరణవిధి విధానాన్ని నిర్వర్తిస్తానని, మనస్సులో దృఢంగా నిర్ణయించుకొని, శ్రీవైష్ణవిని శరణుగోరి నమస్కరించింది.

బిడ్డల తప్పుల్ని క్షమించి గుండెకు హత్తుకొని, కష్టాలను రూపుమాపే తల్లి హృదయం తత్క్షణం స్పందించింది. మరుసటి దినానికే బాలుడు సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడు. ఆనందంతో రుక్కో అమ్మ మందిరానికి చేరి అర్చకునితో "మీరు మా యింటి వద్ద జాగరణ" నోము జరిపించవలసిఉ న్నది. రానున్న మంగళ వారం మా ఇంటికి విచ్చేసి నన్ను కృతార్థురాలను చేయండి అని అభ్యర్థించింది.

రుక్కో! "పూజాద్రవ్యాలు మరియు నిర్వాహణ కట్టడిగా నాకో అయిదు రూపాయలు ఇచ్చుకో, నీ పేరున మందిరంలోనే జాగరణ కార్యక్రమం జరిపిస్తాను. నీవు నీచజాతి స్త్రీవి అయినందున, నేను మీ ఇంటికివచ్చి, దేవి జాగరణ వ్రతం జరిపించలేను" అన్నాడు, పండితఅర్చకుడు. "పండిత వర్యా! తల్లి అనుగ్రహం ఉచ్ఛ-నీచ జాతుల విచక్షణకు అతీతమైనది. ఆ తల్లి భక్తులందరినీ సమానరీతిలో ఆదరిస్తుంది. మీరు సంశయించవద్దు.

నా కోరిక మన్నించండి", అని వేడుకున్నది రుక్కో. రుక్కో ఆత్మజ్ఞానానికి, వేడ్కోలుకు, అచ్చెరువొందిన పండితుడు మరోమారు నిశితంగా ఆలోచించి ఇలా పలికాడు. "మహారాణి నీ జాగరణ కార్యక్రమానికి హాజరయ్యే పక్షంలో నేను మీ ఇంటికివచ్చి ఆ కార్యక్రమం జరిపించ గలను. రుక్కో ఆనందంతో వడివడిగా రాజప్రసాదానికి చేరుకొని మహారాణికి ఆత్మీయంగా నమస్కరించి, వృత్తాంతమంతా తెలియచేసి తనఇంట జాగరణ కార్యక్రమానికి ఆహ్వానించింది. రాణి తారామతి అందుకు సంతోషంగా అంగీకరించింది. ఇది గమనించిన ఆస్థానమంగలి, మహారాజు హరిశ్చంద్రుని చేరి రహస్యంగా అతనికి ఈ విషయం తెలియచేశాడు. అంతావిన్న మహారాజు "నీ వార్త అసత్యం" అంటూ ఖండించాడు.

మహారాణి పారిశుద్ధ్యపనివారి ఇంట, జాగరణ కార్యక్రమంలో పాల్గొనటం ఆచరణ యోగ్యం కానిది. కాని ఆమెను పరీక్షించ దలిచాడు మహారాజు. ఆ రోజు రాత్రంతా నిద్రరాకుండేందుకుగాను తన చేతి వేలికి చిన్నగాయం చేసుకున్నాడు. మహారాజు నిద్రించకుండటం, రుక్కో ఇంట జాగరణ సమయం ఆసన్నం కావడం వల్ల మహారాణి ఎంతో ఆందోళనకు గురికాసాగింది. ఆమె మనస్సులో మాత వైష్ణోదేవిని తలచుకొని తాను జాగరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు గాను మహారాజుకు నిద్రావస్థ కల్పించమని భక్తితో ప్రార్థించసాగింది. భగవతి అనుగ్రహంతో మహారాజు నెమ్మదిగా నిద్రలోకి జారుకుంటుండగా, ఆమె తన మందిరంలోని ఎత్తులోనున్న గవాక్షానికి ముందుగానే బిగించిన తాడు ఆధారంగా ఎగబాకి బయటకు దిగి మహలువీడి రుక్కో ఇంటికి చేరుకుంది. మహారాణి ఆతృత కారణంగా ఆమెకు తెలియకుండానే ఆమె పట్టుచేతిగుడ్డ, ఒక బంగారుగాజు, మార్గమధ్యంలో జారి పడిపోయాయి. దైవలీల! కొద్దిసేపటికే రాజాహరిశ్చంద్ర మేల్కొన్నాడు. అంతఃపురంలో మహారాణిని కాంచని అతడు ఆమెను వెతుక్కుంటూ బయల్దేరాడు.

మార్గంలో కంటబడ్డ మహారాణిచేతిగుడ్డ, బంగారుగాజులను శ్రద్ధతో సేకరించి వాటి ఆధారంగా మహారాజు పూజ, జాగరణ, జరుగుతున్న ఇంటికి చేరుకున్నాడు. ఇంటి ప్రాంగణంలో ఒకమూల నిశ్శబ్దంగా కూర్చొని ఆ కార్యక్రమాన్ని నిశితంగా పరిశీలించసాగాడు.

జాగరణ కార్యక్రమం సమాప్తం కాగానే భక్తులందరూ మాతకు మంగళ హారతులిచ్చి, నైవేద్యం సమర్పించుకున్నారు. తదనంతరం నైవేద్యం వితరణ జరుగు తోంది. ప్రసాదాన్ని స్వీకరించిన తారమతి దాన్ని తన కొంగున కట్టి భద్రంచేసింది. అదిచూసిన తోటి భక్తురాలు ఒకరు "మహారాణీ! మీరు ప్రసాదం తినకుండా మేమెలా తినగలం? మా విన్నపం అంగీకరించండి. ప్రసాదం ఆరగించండి" అని కోరింది.

అందుకు తారామతి "నేను స్వీకరించిన ప్రసాదం, మహారాజు గారికై ప్రత్యేకించ బడింది. నా కొరకై తీసుకోబోయే ప్రసాదం మీతో కలసి ఆరగించగలను" అన్నది. అచ్చటి భక్తులంతా మహారాణి పతిభక్తిని ఎంతగానో ప్రశంసించారు. ఆమెతోగూడి ప్రసాదం ఆరగించి ఆనందించారు. అలా రుక్కో అభ్యర్థనమన్నించి, భక్తితో జాగరణకు హాజరైన మహారాణి తిరిగి రాజప్రసాదం చేరింది. అప్పటికే రాజమహల్ చేరిన మహారాజు ద్వారానికి అడ్డంగా నిలబడి ఆమెను ఇలా ప్రశ్నించాడు. "తారామతీ! నీవు అల్పజాతి వారి ఇంట దైవప్రసాదం తిని మన ధర్మాన్ని భ్రష్టు పట్టించావు. ఇలాంటి నిన్ను రాజప్రాసాదంలో ఎలా ఉంచుకోగలను? నీవు రాచవంశ మర్యాదను, నా ప్రతిష్ఠను సైతం దృష్టిలో ఉంచుకోలేదు. అదే ప్రసాదాన్ని నాకై కొంగున ముడికట్టి మరీ తెచ్చావు. అది నాచే తినిపించి నన్నుకూడా అపవిత్రుని చేయదలచావు" అంటూ మహారాణి కొంగువైపు దృష్టిసారించాడు. అంతలో ఆ ప్రదేశమంతా బహువిధ పుష్పజాతుల సువాసనలతో నిండిపోయింది. దైవలీల! భగవతి కృపతో కొంగుముడిలో ప్రసాదానికి బదులుగా సంపంగి, గులాబి, బంతిపున్నాగ మొదలైనపూలు, ముడిబియ్యము, వక్కలు నిండి

ఉన్నాయి. ఆ అద్భుతం చూచిన మహారాజు ఆశ్చర్యానికి హద్దులులేవు. రాజా హరిశ్చంద్రుడు తారామతి చేయిపట్టి సగౌరవంగా అంతఃపురంలోకి నడిపించాడు. అంతట మహారాణి ఎట్టి అగ్గిపుల్ల, చెకుముకిరాయి ఉపయోగించకుండా భగవతి జ్వాలాముఖి మాతను ప్రార్థించి అగ్ని ప్రజ్వలింపచేసి చూపించింది. అది చూచిన మహారాజు ఆశ్చర్యానికి అంతులేకపోయింది. మహారాజు మనస్సులో దేవి ఎడల శ్రద్ధ, విశ్వాసము జాగృతమై ఎనలేని భక్తితో నిండిపోయింది.

ఒకరోజు మహారాజు తాను మాత ప్రత్యక్షదర్శనం చెసుకోదలచినట్లు మహారాణికి తెలియచేశాడు, "తల్లి దర్శనానికి అపారమైన భక్తికితోడు ఆత్మార్పణ, త్యాగశీలత ఆవశ్యకాలు. మీరు అపారమైన ప్రేమకల్గిన మీ కుమారుడు లోహితాస్యుని బలిగా ఇవ్వగలిగితే మీకు ఆ తల్లి ప్రత్యక్ష దర్శనం ప్రాప్తించవచ్చు". అన్నది మహారాణి. దేవిని దర్శించుకోవాలన్న తపన హరిశ్చంద్రునకు రోజురోజుకు ప్రబలంకాసాగింది. ఇహలోక బంధాలకు అతీతంగా కామమోహాలను త్యజించిన హరిశ్రంద్రుడు లోహితాస్యుని శిరస్సు అమ్మకు అర్పణచేశాడు. నిష్కల్మషమైన శ్రద్ధాభక్తులు కలిగియుండి ఆశ, మమత, అనురాగములను వీడి, తనయందే మనస్సు లగ్నముచేసి, అపార త్యాగనిరతిని ప్రదర్శించిన హరిశ్చంద్రుని భక్తికి మెచ్చినదై సింహవాహన, దుర్గ ప్రత్యక్షమై ఆతన్ని కృతార్థుని గావించింది. మరణించిన లోహితాస్యుని పునరుజ్జీవితుని చేసింది. దేవి దర్శన దివ్యానుభూతి, అపారఅనుగ్రహానికి హరిశ్చంద్రుడు పరవశుడయ్యాడు. విధిపూర్వకంగా పూజాదికములు నిర్వహించి, అపరాధ క్షమాపణ కోరుకున్నాడు. దివ్యానుగ్రహం ప్రసాదించి, దేవి అంతర్ధాన మైంది. తనకు కల్గిన ఈ మహాభాగ్యానికి కారకురాలైన మహారాణిని ప్రశంసిస్తూ మహారాజు ఇలా పలికాడు. "దేవీ నీ దైవభక్తి అనుపమానమైనది. నా అదృష్టవశాన నీవంటి భార్యను పొందగలిగాను". ఆ విధంగా రాజాహరిశ్చంద్ర దంపతులు, అయోధ్యాపురంలో, భగవతి

శ్రీమాతకు ఆమోఘమైన శిల్పకళతో అలరారే దేవాలయాన్ని నిర్మించారు. తదుపరి జీవితాంతం రాజభోగములు అనుభవించిన హరిశ్చంద్రమహారాజు, తారాదేవి, ఆమె సోదరి రుక్కో, దేవి అనుగ్రహంచేత మానవజన్మ త్యజించి మోక్షసిద్ధిపొందారు.

శ్రీమాత జాగరణఉత్సవాలలో రాణితార యొక్క కథ భక్తిపూర్వకంగా చదివినా, విన్నా సమస్తమనోవాంఛలు ఫలించి సుఖసంపదల వృద్ధికలిగి తరిస్తారన్నది జమ్మూప్రాంత వాసుల తరతరాల పరంపరాగతమైన ప్రగాఢనమ్మకం. ఈ కథ ప్రసక్తిలేని దేవి జాగరణ ఉత్సవాలకు పరిపూర్ణ ఫలప్రాప్తి సిద్ధించదన్నది భక్తులు నమ్మి భక్తితో మనసావాచాకర్మణా ఆచరిస్తున్న ధర్మం.

## (ఇ) రాజాచంద్రదేవుని పట్ల తల్లి కృప – దేవీనవరాత్రుల వ్రతకథ

పూర్వకాలంలో జమ్మురాజ్యాధిపతి చంద్రదేవుడు గొప్ప ధర్మాత్ముడేగాక వితరణశీలి కూడా. అతని రాజధాని జమ్మునగరం. అతడు తనపాలనా కాలంలో ఎన్నో దేవాలయాల నిర్మాణంగావించాడు. ఎల్లప్పుడూ అన్ని పుణ్యక్షేత్రాలు సందర్శిస్తూ అన్ని దేవాలయాలలో భక్తితో పూజాదికములు నిర్వహించేవాడు. భూరిగా కానుకలు సమర్పించేవాడు. తద్వారా దేవాలయాల అభివృద్ధి, భక్త జనుల సౌకర్యాలు మెరుగుపరచేవాడు. కానీ పూర్ణచంద్రునిలో మచ్చలా సంతానలేమి ఆ రాజదంపతులకు ఒక వెలితిగా మిగిలిపోయింది. చంద్రదేవ–ధర్మవతి దంపతులు మ్రొక్కనిదేవుడు లేడు. సందర్శించని పుణ్యక్షేత్రంలేదు. వారిరువురు ఒక మారు గంగస్నానార్థం హరిద్వార్ సందర్శించారు. అక్కడ వారు మహాత్మ హంసదేవుని ప్రవచనం విని ఎంతో ప్రభావితులయ్యారు. తమకు సంతానం కలిగేలా ఆశీర్వదించమని హంసదేవునికి మ్రొక్కి ప్రార్థించారు. అపుడు హంసదేవుడు "మహారాజా! సంతానప్రాప్తికై మీరు సర్వోత్తమమైన చండీస్తవం అనునిత్యం పారాయణ

చేయండి. ముఖ్యంగా తమ రాజ్యంలోని త్రికూటపర్వతంపై గల బిలమందు వేంచేసియున్న భగవతి వైష్ణవి మాతను సందర్శించి భక్తిమీర పూజించండి. ఆమె ఇచ్ఛాసిద్ధి స్వరూపము మీ మనోరధం నెరవేరుతుంది". అని పలికాడు. హంసదేవుని ఆత్మీయ సందేశం మదిలో మెదులుతుండగా తిరిగి రాజధాని చేరిన రాజదంపతులు యధావిధిగా సభక్తికంగా చండీయజ్ఞం నిర్వహించారు. దీక్షతో నిష్ఠగా అనునిత్యం చండీస్తవం పారాయణంచేశారు. దయాంబురాశి, సర్వమాతృకా స్వరూపిణి దేవికృపతో వారికి రూపవతియైన పుత్రిక జన్మించింది. మహారాజ దంపతుల ఆనందానికి హద్దుల్లేవు. వారు ఆ బాలికకు చంద్రభాగ అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచుకోసాగారు. కొన్ని సంవత్సరాల తరువాత తేజోవంతుడైన ఒక బాలునికి కూడా రాణి జన్మనిచ్చింది. తల్లి కరుణతో తమ జీవితాలు ధన్యమయ్యాయని ఆనందించారు ఆ రాజదంపతులు.

బాలికకు యుక్త వయస్సురాగానే చంద్రదేవుడు ఆమెను మహేశ్‌పూర్ సంస్థాన యువరాజైన శాంతాకార్‌కిచ్చి ఘనంగా వివాహం జరిపించారు ఆ రాజదంపతులు. కొన్ని సంవత్సరముల తరువాత రాజకుమారుడు చంద్రశీలుని వివాహం నిర్ణయమైంది. వివాహానికి హాజరై, వరుని ఆశీర్వదించవలసినదిగా కోరుతూ మహారాజు మహాత్మ హంసదేవ వారికి సాదర ఆహ్వానం పంపాడు. రాజుగారి ప్రార్థనను అంగీకరించి సద్గురువు సమయానికి జమ్మునగరం చేరుకున్నారు. వివాహంలో పాల్గొనేందుకు రాజకుమారి చంద్రభాగ, తన భర్త శాంతాకారునితో కూడి అరుదెంచింది. పాదనమస్కార సందర్భంలో ఆశీర్వదిస్తూ గురు హంసదేవులు, చంద్రభాగ నుదురును నిశితంగా గమనించారు. వారి యోగబలంతో మరుసటి క్షణంలో రాకుమారి భవిష్యత్ అవగతమైంది. చంద్రదేవుని ఏకాంతంగా పిలిచి రాకుమారి జాతకరీత్యా ఆనాటి నుండి ఏడవరోజు వితంతువు కానున్నట్లు వెల్లడించారు. హృదయవిదారకమైన ఆ దుర్వార్త విన్న చంద్రదేవ దంపతులు

తీవ్ర ఆవేదనతో గురుదేవుని చరణాలపై మోకరిల్లారు. ఈ ఘోరఘటన నివారించే తరుణోపాయం తెలియచేయమని ఆర్తితో దీనంగా ప్రార్థించారు. ఒక్కక్షణం దివ్యదృష్టితో పరికించిన మహాత్మ హంసదేవులు ఇలా పలికారు. "రాజా! గుర్తుతెచ్చుకోండి! హరిద్వార క్షేత్రంలో మనం మొదటిమారు కలుసుకున్న సందర్భం. నేను మీకు త్రికూటపర్వతవాసిని వైష్ణవిదేవిని గూర్చి చెప్పియున్నాను. ఆ దేవి సర్వదుఃఖాలను హరించునది. మీ కుమార్తె ఆ దేవిని దర్శించి, ఆరాధిస్తే ఈ కష్టం తొలగిపోతుంది." ఈ సమాచారం తెలుసుకున్న రాకుమారి చంద్రభాగ శరీరం భయంతో కంపించింది. పెనుభూకంపంతో భూమిబద్దలై తాను పాతాళ లోకంలోకి జారిపోతున్నట్లనిపించింది. లేనిశక్తిని కూడతెచ్చుకొని తల్లిపాదాల వద్ద కూర్చోని ఆరాధన ప్రారంభించింది.

హంసదేవుని వచనానుసారం ఏడవదినాన రాజకుమారుడు శాంతాకారుడు దుర్ఘటనకులోనై మృతుడయ్యాడు. ఆ సమాచారం నలుదిక్కులా దావానలంలా వ్యాపించింది. రాజకుమారి చంద్రభాగ మూర్ఛితురాలై నేలకొరిగింది. ఆస్థాన వైద్యుల వైద్యంతో తెప్పరిల్లిన రాకుమారి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఇలా ప్రతిన బూనింది. "మాతశ్రీవైష్ణవి నా భర్తను పునరుజ్జీవుని చేయునంతవరకు నేను అన్నపానాదులు ముట్టను. ఆకలి దప్పులతో ప్రాణత్యాగం చేస్తాను. ఆ తల్లి నాపట్ల దయచూపి నా కష్టాన్ని తీర్చవలసినదే." అంటూ దుఃఖంలోను దేవి ఆరాధనలో మునిగిపోయింది.

అలా తొమ్మిది దినములు, తొమ్మిది రాత్రులు రాకుమారి చంద్రభాగ ఆహారపానీయాదులు త్యజించి దేవిఎడల సంపూర్ణ విశ్వాసంతో అన్యధా శరణంనాస్తి అంటూ ఆత్మ సమర్పణ చేసుకొని నిరాఘాటంగా దేవి ఆరాధన కొనసాగించింది. రాకుమారి అకుంఠిత ఆర్తిప్రద దీక్షకు, ఏకాగ్రతా, ధ్యాన నిబద్ధతలకు ప్రసన్నురాలైన భగవతి శ్రీవైష్ణవి పదవరోజున ప్రత్యక్షమై శాంతాకారుని మృతదేహంపై మంత్రజలం ప్రోక్షించి తిరిగి బ్రతికించింది.

చంద్రభాగ, కన్నులవెంట ఆనందాశ్రువులు జలజల రాలుతుండగా భక్తావశ్యయైన శ్రీమాతను పలుమార్లు శ్లాఘిస్తూ ఇలా ప్రార్థించింది. "ఓ మాతా నీ కృపవలన నా సౌభాగ్యం నిలిచింది. ధన్యురాలను. నా కోరిక మన్నించి నీవు ఇచ్చటనే నిత్య నివాసివై ఈ దేశ ప్రజలకు నీ దయను నిరంతరం సుస్థిరం గావించు."

ఇలా సర్వమంగళ రూపిణి, అనంత కళ్యాణరూపిణి అయిన మహాలక్ష్మిని, ఆ దేవీ నవరాత్రులలో భారతీయ హిందూ స్త్రీలు మూకుళ్ళ యందు పుట్టమట్టితో నవధాన్యముల అంకురారోపణ గావించి, వ్రతము ఆచరించి, వివిధరకముల పిండివంటల నైవేద్యములర్పించి పూజిస్తారు. తమ భర్తలకు ఆయురారోగ్యములు, ధనధాన్య సంపదలు ప్రసాదించమని ప్రార్థిస్తారు. తద్వారా తమ ఐహిక సౌభాగ్యాలకు పరిపుష్టి చేకూరుతుందని, ఆధ్యాత్మిక చైతన్యం వికసిస్తుందని, మరణానంతరం మోక్షం సిద్ధిస్తుందని వారి ప్రగాఢ విశ్వాసం.

నవరాత్రులలో భక్తులు మొదటి మూడురోజులు – తమలోని వ్యతిరేక భావాల నిర్మూలనా శక్తి కోసం దుర్గామాతను కొలుస్తారు.

– తదుపరి మూడు రోజులు – తమలోని ఉదాత్త భావాలను పెంపొందించు –కోవడానికి, ఆత్మసంపదకు, ఐహిక సంపదల కొరకు – లక్ష్మీదేవిని

– చివరి మూడు రోజులు – జ్ఞానాన్ని, మేధాసంపత్తిని, ఆత్మసారాన్ని ప్రసాదించే సరస్వతి మాతను పూజిస్తారు. ఈ దినాలలో కావించే తీర్థయాత్రలు, దేవీదర్శనాలు విశేషఫలాన్ని ప్రసాదిస్తాయి.

**(ఈ) త్యాగానికి మరో రూపం "బాబాజీతో"**

"బాబాజీతో"గా ప్రసిద్ధిగాంచిన "జీతీమల్" 1343వ సంవత్సరంలో రాజ్‌కోట అనే గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఈ

గ్రామం జమ్మూ నగరానికి 50 కి.మీ. దూరంలో ఉన్నది. జీతీమల్ శ్రీ మాతా వైష్ణోదేవికి గొప్ప భక్తుడు. అతడు ఎన్నోమార్లు మాతృక దర్శనం పొందినవాడు. అతని ఏకైక కుమార్తె "బువా కౌడి". ఆమె మాత శ్రీవైష్ణవి దివ్యానుగ్రహమే. అతని సవతితల్లి "జోజన్" బహు కోపిష్టి. ఆమె పెట్టే కష్టాలు భరించలేక జీతీమల్ తన కుమార్తెను తోడ్కొని జమ్మూ ప్రాంతంలోని పర్వతచరియల దిగువప్రాంతానికి చేరుకున్నాడు. అచ్చట తన స్నేహితుడైన "రెలులోహర్‌తో" (కంసలి వృత్తిదారుడు) కూడి మహారాజ అజయ్‌సింగ్‌ని కలిసి ఝురీ అనే ప్రాంతంలో కొంత భూమిని వ్యవసాయంకొరకు ఉపయోగించేలా పట్టా పొందాడు. ఆ అటవీభూమిని సాధారణ రైతుకూలీలా ఎంతో శ్రమించి ముళ్ళపొదలను, బండరాళ్ళను తొలగించి సాగుబడికి అనుకూలంగా మార్చుకున్నాడు. అతడు సన్నకారు బీదరైతులా జీవనం సాగిస్తూ గ్రామంలో వ్యవసాయేతర కూలీలతోను ఇతర వృత్తి పనివారలతోను పంటను పంచుకొనేవాడు. గ్రామ ఆచారాలను పాటిస్తూ సమాజ సంక్షేమం కోసం పాటుబడేవాడు. కటిక బీదరికం అనుభవిస్తూ వ్యవసాయ ఖర్చుల కోసం, విత్తనాల కొనుగోలు కోసం ఇంటిలోని పాత్రసామాగ్రిని తాకట్టుపెట్టి ఫలాదాయం చేతికందిన రోజున బాకీతీర్చి విడిపించుకొనేవాడు. అలా నేటి భారతీయ సగటు సన్నకారురైతు జీవన విధానానికి ఆనాటి జీతో జీవితం ఆదర్శమయింది.

అలాంటి జీతో జమ్మూరాజ్యపు మంత్రి వీర్‌సింగ్ అవినీతికి బలి అయినాడు. ఒక దినం మంత్రి యొక్క క్షురకుడు జీతోను కలిసి భూమిమక్తా తనకు చెల్లించమని, అది మంత్రి ఆదేశమని తెలియచేశాడు. నియమానుసారం మహారాజా వారికి కొంత పంట సమర్పించుకోవలసి వున్నందున ప్రస్తుతం మక్తా చెల్లించుకోలేనని, కాకుంటే సాటిరైతు నుండి తాను అరువుతెచ్చిన ధాన్యంలో కొంత తీసుకొమ్మని జీతో వినయంగా విన్నవించుకున్నాడు. ఆగ్రహించిన ఆ మంత్రిగారి ప్రతినిధి, జమ్మూ చేరుకొని,

వాస్తవాలను వక్రీకరిస్తూ మంత్రిగారికి జీతోపై పితూరీలు చెప్పాడు. అదనంగా, "జీతో" పంటలో కంకులన్నింటినీ కోసి ప్రత్యేకంగా దాచి, గడ్డినిమాత్రం నూర్పిడి చేయబోతున్నట్లు, అలా మహారాజావారినే మోసం చేయనున్నట్లు ఫిర్యాదు చేశాడు. వాస్తవానికి జీతో, సమృద్ధిగా పంటపండించి, ప్రథమంగా, మహారాజావారి ప్రతినిధికి వారి వాటాను అందచేయడానికి సిద్ధంగా ఉన్నాడు.

ఆగ్రహించిన మంత్రి "లవణ కుమార్" అనే వ్యక్తిని పిలిపించి, జీతో పండించిన గోధుమ పంటనంతటిని యథాతథంగా బలవంతంగానైనా గుర్రాలపైఎత్తి తన భవనానికి చేర్చమని ఆదేశించాడు. ఈ సందర్భంగా జీతో ప్రతిఘటించినట్లయితే అతన్ని బంధించి తెచ్చేందుకు సహకారంగా భటులను కూడా తోడు పంపాడు.

లవణకుమార్ ఆ గ్రామాన్ని చేరుకున్న రోజున జీతో తనకుమార్తెను కలుసుకొనేందుకు స్వగ్రామం వెళ్ళిఉన్నాడు. ఆ సమయంలో పంటను పరిరక్షించే బాధ్యత ఇషోమేఘ అనే తన స్నేహితునికి అప్పగించి వెళ్ళాడు. మంత్రి వీర్‌సింగ్ ప్రతినిధి "ఇషోమేఘను" ఒక చెట్టుకు కట్టి పంటనంతటినీ గోతాలలో నింపుకున్నాడు. మాత అనుగ్రహంతో ఈ వార్త తెలుసుకున్న జీతో వెనువెంటనే ఝురి గ్రామాన్ని చేరుకొన్నాడు. తన స్నేహితుడు "రెలు" ఇంటి నుండి ఒక కత్తిని తెప్పించి ఆ గోతాలను తెగకోసాడు. తనకు జరుగుతున్న అన్యాయాన్ని, తన కష్టార్జితాన్ని తరలించే దోపిడీ విధానాన్ని, మంత్రి గారి అవినీతిపంధాను ఎండగడుతూ విమర్శించాడు.

కళ్ళంలో ఈ పెనుగులాటలో లవణకుమార్ యొక్క అనుచరుడొకడు జీతోను దంతెతో గుండెలపై మోదాడు. జీతీమల్ స్పృహ కోల్పోయాడు. గ్రామ ప్రజలందరూ ఏకమై భగవతిని ప్రార్థిస్తూ, అతనికి అందుబాటులో ఉన్న సమస్త వైద్యసదుపాయాలు కల్పించారు.

దేవి అనుగ్రహంతో తిరిగి కోలుకున్న జీతో తన కష్టార్జితాన్ని అక్రమంగా అధికారబలంతో తరలిస్తున్న వారినందరినీ తీవ్ర ఉక్రోషంతో శపించాడు.

"సంవత్సరంపొడవునా తన కష్టం ఒకవైపు, అక్రమార్జన ధ్యేయంగా ప్రభువుల అవినీతి పంథా మరో వైపు" అతని సమస్య. తనకుకల్గిన ఈ దుస్థితి ఏ ఇతర అన్నదాతకు ప్రాప్తించకూడదని ధృఢనిర్ణయంతో జీతో కళ్ళంలోని తన పంటకుప్పపై చేరి పదునైన కత్తితో ఉదరభాగంపై పొడుచుకొని ప్రాణత్యాగం చేశాడు. ఆశ్చర్యం! అనతికాలంలోనే జీతీమల్ పంట అక్రమ తరలింపులో అతనిపై దాడికికారకులైన వారందరి బిడ్డలు గుండెపోటుకుగురై మరణించారు.

ఆ విధంగా జీతో కటికబీదరికంతో కష్టాలకడలిలో జీవనంసాగించే తనవంటి చిన్నకారు రైతులు తరచుగా ఎదుర్కొనే దోపిడికి-జరిగిన అన్యాయానికి నిరసన వ్యక్తంచేసే పోరాటపటిమకు-ఆద్యుడుగా, త్యాగానికి ప్రతీకగా నిలిచాడు.

ఈ సంఘటన గూర్చి తెలుసుకున్న మంత్రి వీరసింగ్ తీవ్ర భయాందోళనలకు గురిఅయ్యాడు. క్రమంగా పశ్చాత్తాపంతో కుంగిపోసాగాడు. ఆస్థాన జ్యోతిష్కులను సంప్రదించాడు. వారి సలహామేరకు ఆ పార్థివదేహానికి తెల్లనివస్త్రం చుట్టించి, ఒక చెట్టు తొర్రలో దాచి ఉంచాడు.

మహాపాపమైన బ్రహ్మహత్య "అన్న మహానేరం బయటకు పొక్కకుండా ఉంచాలని, అధికారులకు వ్యతిరేకంగా జీతీమల్‌భావాలు, ఆశయాలు, విధానాలు- అతనితోనే బూడిదైపోవాలని తీర్మానించాడు మంత్రి. ఇలాంటి పరిస్థితులలో బహిరంగంగా దహనసంస్కారం జరిపిస్తే ప్రజల వ్యతిరేకతను నియంత్రించడం కష్టతరం కాబట్టి రహస్యంగా దహనసంస్కారం జరిపించాలన్నది మంత్రి ఆలోచన.

తండ్రి మరణవార్త విన్న "బువాకౌడి" ఎంతోవిచారానికిలోనై వెంటనే ఝురి నగరం చేరుకున్నది. ఎంతోకష్టంతో గ్రామస్థుల సహకారంతో తండ్రి పార్థీవదేహాన్ని గుర్తించింది. చితిని ఏర్పరచి తండ్రికి దహనసంస్కారం నిర్వహించి ఆ చితిలో తానుకూడా దుమికి ప్రాణత్యాగం చేసింది. ఈనాటికీ ఆమె మాత శ్రీవైష్ణవి యొక్క "కన్యకఅంశ" అని భక్తుల ప్రగాఢ నమ్మకం.

**బాబా చెరువు**

జీతీమల్ తన భూమిని సేద్యయోగ్యంగా మార్చేందుకు పెద్దపెద్ద కొండరాళ్ళను, వృక్షాలను తొలగించే సమయంలో సేద్యపు నీటినిల్వకోసం ఒక కుంటను త్రవ్వినాడు. మాత నామస్మరణతో, త్రవ్వబడిన ఆ కుంట అతితక్కువ లోతులోనే మంచి నీటి ఊటతో నిండిపోయింది. ఆనందంతో జీతో తల్లిని భక్తితోస్మరిస్తూ ఆ నీటిని కుష్టు వ్యాధిగ్రస్తుడైన తన మిత్రుడు ఇషోమేఘుపై ప్రోక్షించాడు. ఆశ్చర్యం! శ్రీవైష్ణవి అనుగ్రహంతో అతని కుష్టు వ్యాధి మటుమాయమైంది. గ్రామవాసుల ఆశ్చర్యానందాలకు హద్దులు లేకపోయింది.

ఆ చిన్నకుంట నేడు పెద్దచెరువుగా మారిపోయింది. ఝురీ గ్రామంలోని ఆ చెరువు "బావాడా తలాబ్" లేదా "జీతోబాబా చెరువు"గా పిలువ బడుతున్నది. ఈనాటికీ భక్తులు వివిధరకాల వ్యాధులనుండి విముక్తి పొందేందుకు ఎంతో విశ్వాసంతో ఈ చెరువులో స్నానంచేస్తారు.

**జీతో - బువాకౌడిల సమాధులు**

వారి మహోన్నతత్యాగాలకు గుర్తింపుగా మిక్కిలి గౌరవప్రదంగా బాబాజీతో, బువాకౌడిలకు వారి అనుచరులు, భక్తులు, స్మారక చిహ్నంగా వేర్వేరు సమాధులు నిర్మించారు. బాబాజీతో ఆనాడు సాగుచేసిన భూమి నేటికీ ప్రత్యేక గుర్తింపుతో యాత్రికులను ఆకర్షిస్తోంది.

ఈ ప్రదేశంలో ప్రతి సంవత్సరం కార్తీక / మాఘ పౌర్ణమిదినాన భారత దేశంలోని, జమ్మూ-కాశ్మీరు, పంజాబు, హర్యానా, ఢిల్లీ, హిమాచల ప్రదేశ్ మొదలైనటువంటి రాష్ట్రాలనుండి ఎందరో రైతులుకూడి, నూతన వంగడాలు సేద్యపు విధానాలు గురించి పరస్పరం తెలియచేసుకుంటూ తమ అనుభవాలను పంచుకుంటారు. స్మారకములైన తండ్రి కుమార్తెల సమాధులను సందర్శించి ఆధ్యాత్మికంగా వారి దివ్యాశిస్సులను పొందుతారు. ఈ సందర్భంగా భక్తులు బువాకౌడి, బాబాజీతోలపై పద్యములు, గేయములు ఆలాపిస్తారు. నాటికలు, చిరు చలనచిత్రముల రచించి ప్రదర్శిస్తారు. అంతేగాక వారిరువురి యొక్క దైవత్వం, త్యాగశీలతలను గూర్చి కధానికలు రచించి ప్రవచిస్తారు. ప్రముఖంగా కష్టజీవులై దుక్కిదున్ని, విత్తి, పంట చేతికందబోయే సమయాన ప్రకృతి భీభత్సంవల్లకాని, దొంగల దోపిడి, లేదా అధికారుల దుర్నీతి కారణంగాగాని తీవ్రంగా నష్టపోయి దుర్భర జీవితాన్ని గడిపే చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీల సంక్షేమం గూర్చి ప్రదర్శనలు నిర్వహిస్తారు. వారి జీవన, వ్యవసాయ విధానాలు మెరుగు చేసుకొనేందుకు సూచనలు అందచేస్తారు.

క్రమంగా ఈ కార్యక్రమము గ్రామీణవారోత్సవాలుగా రూపొంది ప్రభుత్వ, వివిధ శాఖల సమన్వయంతో నిర్వహించబడుతున్నది. అందు వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం రైతుల ముందుంచబడుతోంది. సంబంధిత పరికరాలు తక్కువ ధరతో రైతులకు అందచేయబడుతున్నవి.

ఈ విధంగా భక్త జీతో అతని కుమార్తె, దైవాంశయైన బువాకౌడిలు భౌతికంగా మానవాళి మధ్య లేకున్నా, తరతరాలుగా శ్రీ వైష్ణవి ఎడల తమ భక్తితత్పరత వలన, సమాజ శ్రేయస్సుకు  వారి నిస్వార్థకృషి దృష్ట్యా, కృషీవలురుగా సగటు భారతీయ చిన్నతరహా వ్యవసాయదారుల కష్టనష్టాలను స్వయంగా అనుభవించిన ఆదర్శప్రాయులుగా, వారిసమస్యల పరిష్కారానికై,

అనుసరించవలసిన పంథాకు రూపకర్తలుగా, అవినీతిని ఎండకట్టి, ఎదురొడ్డి నిలిచి, ఆ సమాజ రుగ్మతను రూపుమాప కృషిచేసిన సంస్కర్తలుగా, ఆ తండ్రి, కుమార్తెలు దైవాంశులుగా నేటికీ, భారతీయ కృషీవలుల హృదయాలలో నెలవైయున్నారు.

**(ఉ) మహారాజ రణజీత్**

మొగలాయిల పాలనరోజుల్లో అనగా మూడు వందల సంవత్సరాలకు పూర్వం జమ్ము నగరం రాజధానిగా మహారాజ రణజీత్ దేవ్ జనరంజకంగా రాజ్యమేలేవాడు. ఆనాటి ఢిల్లీ పాదుషాకు సుసంపన్నమైన జమ్మురాజ్యాన్ని స్వాధీనం చేసుకోవాలన్న దురాశ కలిగింది. ఈ ఆలోచనను అతడు తన లాహెూర్‌నగర ప్రతినిధితో పలుమార్లు పంచుకున్నాడు. కానీ జమ్మువంటి పర్వతశ్రేణులతో నిండిన రాజ్యంపై దండెత్తడం అంత సులభం కాదని అతనికి తెలుసు. ఇక తుదిగా తన లాహెూర్‌నగర ప్రతినిధి మీర్‌మన్ను ద్వారా రణజిత్ దేవ్‌ను లాహెూర్‌కు పిలిపించి, మోసంతో ఖైదీని చేయాలని సంకల్పించాడు.

ప్రజ్ఞావంతుడైన రణజీత్ కుచ్ఛితమైన పాదుషా ఆలోచనను, దానికి మీర్‌మన్ను వంతపాటను జాగ్రత్తగా గమనించేవాడు. ఆ కారణంగా, పలుమార్లు ఆహ్వానింపబడినా అతడు లాహెూర్‌ను సందర్శించలేదు.

కొంతకాలం పిమ్మట ఒకమారు మహారాజ్ రంజీత్ త్రికూట పర్వతప్రాంతానికి వేటకై బయల్దేరాడు. ఆశ్చర్యం! అక్కడ శిఖరంపై ఆసీనురాలైన ఒక దివ్యకన్య దర్శనమిచ్చింది. ఆమెకు నమస్కరించిన రణజీత్ "తల్లీ! మీ పేరేమి? మీ నివాసమెక్కడ?" అని ప్రశ్నించాడు. అంత దేవి, "రాజా! నా నామధేయం శ్రీవైష్ణవి. దూరంగా కనపడుతున్న ఆ గుహయే నా నివాసం. అక్కడకు ఈ మార్గంద్వారా సులువుగా చేరుకోవచ్చు" అంటూ మార్గం సూచించింది.

రాజా రణజీత్ భక్తితో దేవికి మ్రొక్కి ఇలా విన్నవించుకున్నాడు. “మాతా! లాహోర్ రాజ్యపాలకుడు నన్ను బందీచేయు దురుద్దేశ్యముతో, కపటప్రేమతో పలుమార్లు తన రాజ్యమునకు ఆహ్వానించియున్నాడు. ఇది జమ్మునగరాన్ని స్వాధీనం చేసుకొనేందుకు ఢిల్లీ చక్రవర్తి యొక్క దుష్టరాజనీతి. ఇప్పుడు నా కర్తవ్యమేమి?” అంత శ్రీ వైష్ణవి “వత్సా! నీవు నిస్సంకోచంగా ఈ మారు ఆ ఆహ్వానాన్ని మన్నించు, నీకెట్టి అపకారము జరుగదు” అంటూ అభయమిచ్చి అంతర్ధానమయింది.

కొన్నాళ్ళ తదుపరి లాహోర్ రాజ్యపాలకుని నుండి తమదేశం సందర్శించమని ఆహ్వానంఅందగా, రాజా రణజీత్, దేవి అనుమతితో లాహోర్ చేరాడు. అదే అదనుగా మీర్‌మన్ను, రణజీత్‌ను బందీగావించాడు. ఆవేదనతో– ఆర్తితో రణజీత్ మాతను ప్రార్థిస్తూ అలసటతో నిద్రావశు డయ్యాడు. స్వప్నంలో దేవి సాక్షాత్కారమై, “రాజా! నీవు ఏ విధంగాను చింతించవలదు. మీర్‌మన్ను తానంతట తానే మిమ్ము విడుదల చేయగలడు” అని పలికింది.

మరుసటి దినం, ఆత్యాశ్చర్యంకొలిపేలా, పశ్చాత్తప్తుడైన లాహోర్ పాలకుడు, క్షమాపణ కోరుతూ రణజీత్‌ను కారాగారం నుండి విడుదల గావించాడు. రణజీత్‌తో సంధి కుదుర్చుకొని, సాదరసన్మానం గావించి వీడ్కోలు పలికాడు. ఆ దేవి మహాత్యానికి రణజీత్ అచ్చెరువొంది, తల్లిని పలురీతులశ్లాఘించాడు.

ఆతరువాత రణజీత్ జమ్మూ రాజ్యాన్ని నిరాఘాటంగా అరువదిఏడు సంవత్సరాలు పాలించాడు. ఆతని పాలనాకాలంలోనే వైష్ణవిమాత గుహవరకు భక్తులకు ఎట్టి అసౌకర్యం లేకుండా మార్గం సుగమం కావించబడింది. అతడు పాదరక్షలు లేకుండా పలుమార్లు కాలినడకన దేవి దర్శనం చేసుకొని, పూజించి, ధన్యుడయ్యాడు.

## (ఊ) శ్రీరామచంద్రునికి మాత దుర్గ అనుగ్రహం

అది రామాయణ మహాకావ్యంలోని యుద్ధకాండ పర్వం. శ్రీరామచంద్రుడు వానరసేనతో కూడి లంకపై దండెత్తేందుకు సముద్రతీరం చేరాడు. సేతునిర్మాణ సందర్భంలో పరమశివుని ప్రార్థించగా అతడు ప్రత్యక్షమై "విజయం సిద్ధించుగాక!" అని ఆశీర్వదించాడు. భగవతి దుర్గను ఉపాసించి ఆమె దయతో శీఘ్రమే విజయాన్ని పొందవచ్చని అనుగ్రహించాడు. శంకరుని ఆదేశానుసారం శ్రీరాముడు భగవతి దుర్గను ఆరాధించేందుకు 108 తామర పుష్పాలను తెప్పించాడు. శ్రీరాముని భక్తితత్పరతను పరీక్షించే నిమిత్తం మాత ఆ పుష్పాలన్నింటిలో ఒక పుష్పాన్ని దృగ్గోచరం కాకుండా చేసింది, పుష్పారాధన సమయంలో ఒక పుష్పం తగ్గి ఉండడం గమనించారు శ్రీరామచంద్రులు. భగవతి పూజ నిర్విఘ్నంగా కొనసాగేందుకు ఆ పుష్పానికి బదులుగా కమలము వంటి తన నేత్రాన్ని భగవతిపూజలో సమర్పించడానికి నిశ్చయించారు దాశరథి.

ఆ నిర్ణయం అమలులోభాగంగా శ్రీరాముడు ఒక బాణపు మొనతో తన కంటిని వెలికితీయబోతుండగా సాక్షాత్ భగవతి ప్రత్యక్షమై, వారించి ఇలా ఆశీర్వదించింది. "ఓ శ్రీరామచంద్రా! మీ భక్తిని పరీక్షించేందుకు ఒక పుష్పాన్ని నేనే మాయం చేసి ఉన్నాను. మీ భక్తిసాగరపు లోతు తెలుసుకున్న నేను ఎంతో ప్రసన్నురాలనయ్యాను. రావణునితో జరుగబోయే భీకర సంగ్రామంలో మీకు అఖండవిజయం ప్రాప్తించుగాక".

అంత శ్రీరాముడు "మాతా! రావణునితో యుద్ధంలో సులభతరంగా విజయం సాధించేందుకు మార్గం అనుగ్రహించండి" అని పలికాడు. "రామచంద్రా! ఇచ్చట ఒక యజ్ఞం నిర్వహించ తలపెట్టు. ఆ యజ్ఞాన్ని జరిపించేందుకు రావణుని ఆహ్వానించు. ఇక రావణుడు యాజ్ఞీకానికి అంగీకరించకుంటే, అతడు బ్రాహ్మణునకు నిర్దేశింపబడిన కర్మను నిర్వర్తించని

కారణంగా సర్వశక్తులను కోల్పోయి భ్రష్టుడౌతాడు. అంగీకరించిన పక్షంలో యజ్ఞానంతరం నిన్ను ఆశీర్వదించినప్పుడు ఆ ఆశీర్వాదమే అతనికి ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. విజయోస్తు!" అంటూ భగవతి అంతర్ధానమయింది.

దేవి ఆదేశానుసారం శ్రీరాముడు యజ్ఞనిర్వహణకు ఉపక్రమించి, ఒక దూతద్వారా, ఋత్విజునిగా రావణుని ఆహ్వానించారు. మహా పండిత రావణుడు ఆ ఆహ్వానాన్ని అంగీకరించి యజ్ఞాన్ని నిరుపమానంగా నిర్వహించాడు. యధావిధిగా అవభృథస్నానానంతరం రావణబ్రహ్మ "మహారాజా! మీరు ఏ ఆశయంతో ఈ యజ్ఞం తలపెట్టారో ఆ ఆశయం సిద్ధించుగాక" అని శ్రీరాముని ఆశీర్వదించాడు. తదనుగుణంగా రామ-రావణ సంగ్రామంలో శ్రీరాముడు రావణుని సునాయాసంగా సంహరించి సీతమ్మను చెరనుండి విడిపించి పరిగ్రహించాడు.

వాల్మీకివిరచిత రామాయణమునందు ఈ అంశపు ప్రస్తావన లేకున్నా ఈ గాథ ఏడువందల సంవత్సరముల నుండి జమ్మూ విభాగ ప్రాంతమంతా బహుతరాలభక్తుల హృదయాంతరాళాలలో పదిలంగా నిక్షిప్తమై క్రమంగా విశ్వవ్యాప్తమవుతున్నది. మాతఎడల నిరుపమానభక్తికి నిదర్శనంగా పెద్దలు ఇతర భక్తికథలతో పాటు ఈ అంశాన్ని అత్యంతఆత్మీయతతో తదుపరి తరాలవారికి తెలియచెప్తారు. ఇక హరికథలు ప్రవచనాలు, నాటకాల విషయం సరేసరి. ఇవన్నీ ఏకంగా మాత మహాత్మ్యాన్ని నిరంతరంగా దశదిశలా విస్తృతంగా వ్యాపింపచేయుచున్నవి. నిబద్ధతతో కూడిన ధర్మాచరణ ప్రమాణంగా, ఒకవ్యక్తి విజ్ఞతతో ఆచరించిన ధర్మమే అతడిని ఎల్లవేళలా కాపాడుతుందన్నది. ఇది నిర్ధారితసత్యము.

**శ్రీ మాతా వైష్ణోదేవి దర్బారు యాత్రికులకు ముఖ్య సమాచారం**

కాట్రా నుండి తల్లిదర్బారుకు బయల్దేరే యాత్రికులు గమనించవలసిన ముఖ్య విషయాలు.

## బయల్దేరే ముందు

1) యాత్రికులు "దర్శని దర్వాజ" వద్ద నుండి బయల్దేరే ముందుగా యాత్రాస్లిప్ తీసుకోవాలి. ఇది కాట్రా బస్‌స్టాండ్ వద్దనున్న "యాత్రా రిజర్వేషన్ కౌంటర్" నుండి తీసుకోవాలి. ఈ స్లిప్ లేకుండా ఏవ్యక్తి, బాణగంగ చెక్‌పోస్ట్ దాటి ప్రయాణం చేయడానికి అనుమతించబడదు. యాత్రి రిజర్వేషన్ కౌంటర్ మరొకటి రెండవ బస్టాండ్ వద్ద అనగా ఉధంపూర్ వెళ్ళే మార్గంలో ఏర్పాటు చేయబడింది. ఈ రెండు కేంద్రాలు ఉదయం 06 గం॥ల నుండి రాత్రి 11 గం॥ల వరకు తెరువబడి ఉంటాయి.

2) కాట్రాలో గానీ, ఆదికువారి, సాంజీఛాట్ మరియు భవన్‌వద్ద గాని అద్దెగదుల సౌకర్యం పొందదలచినవారు, "ఎంక్వైరీ మరియు రిజర్వేషన్ కౌంటర్" నీహారిక కాంప్లెక్స్ శ్రీ మాతా వైష్ణోదేవి ష్రైన్ బోర్డు వారి యాత్రికుల సౌకర్య సముదాయం, బస్టాండ్ వద్ద, కాట్రా నుండి ముందస్తు రిజర్వేషన్ పొందవచ్చు.

3) స్వారీ గుఱ్ఱములు, కూలీలు, పిల్లలను చేరవేసే చక్రాల బండ్లు, పల్లకి వంటి సౌకర్య సేవల ధరలను ముందుగానే తెలుసుకొని నిర్ధారించుకోవాలి. ఈ సేవలనందించే వారు తగిన, అమలులోఉన్న రిజిస్ట్రేషన్ కార్డు (ఫోటోతో కూడినట్టిది) కలిగి ఉన్నారని నిర్ధారించుకోవాలి. వారి రిజిస్ట్రేషన్ నంబరును గుర్తుగా వ్రాసుకోవాలి. దయచేసి ఆమోదింపబడిన ధరలకంటే మించి చెల్లించవద్దు.

4) ఈ మార్గంలో వీడియోకెమెరాలు, మొబైల్ ఫోన్‌లు, మొదలైన ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు కలిగి ఉండటం నిషేధింపబడింది. అట్టి పరికరాలను కాట్రా నగరంలోనే ఉచిత లాకర్ సౌకర్యంలో భద్రపరచుకోవాలి.

5) వీలైనంత తేలికయైన సామాగ్రితోనే ప్రయాణం కొనసాగించండి. ఆవశ్యకం కాని బట్టలు మరియు ఇతర వస్తువులను కాట్రా నగరంలోనే భద్రంగా ఉంచుకోవచ్చు. ఆహారము, పానీయాలు, దుప్పట్లు, నివాస వసతి వంటివి మార్గమధ్యంలో తగినంతగా లభిస్తాయి.

**భవన్‌కు నడకదారి మార్గమధ్యంలో**

1) ఈ పుణ్యక్షేత్రయాత్ర పవిత్రతను సదా గుర్తెరిగి మనవంతు బాధ్యతగా తోటివారి సౌకర్యాన్ని, భక్తి భావాలను గౌరవిస్తూ, పెద్దగా అరవడం, కేకలు పెట్టడం, అసభ్యంగా మాట్లాడటం, క్రోధంతో ప్రవర్తించడం. వికృత చేష్టలు వంటి పనులకు పాల్పడరాదు, ఈ యాత్ర భక్తుల విశ్వాసము, ఆధ్యాత్మిక భావనల సమ్మిళితమైన అపూర్వ దివ్యానుభవ అన్వేషణ. దయచేసి విహార యాత్రగా భావించరాదు.

2) తోటి భక్తుల మనోభావాలను సవినయంగా గౌరవించండి.

3) భద్రతా విభాగపు తనిఖీల వద్ద బాధ్యతగా సహకరించండి.

4) కొండచరియలు విరిగిపడే అవకాశపు సూచికలు ఉన్నచోట విశ్రాంతి కోసంగా ఎట్టి పరిస్థితులలోను నిలువ వద్దు.

5) పొగత్రాగుట, పొగాకు తంబ వంటివి నమలుట, ఉమ్మి వేయుట, మండే అగ్గిపుల్లను అశ్రద్ధగా వదలుట, పేకలు ఆడుట, మొదలైన వ్యసనాలకు దూరంగా ఉండండి. మార్గమధ్యంలోను, భవన్ యందు మద్యము, మత్తుపానీయాలు సేవించుట, మాంసాహారము భుజించుట సంపూర్ణంగా నిషిద్ధము.

6) పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి మార్గాన్ని, కొండ చరియలను భవన్ ప్రాంతాన్ని అపరిశుభ్రం చేయవద్దు. వాడుకనుండి తీసివేయ దగ్గవానిని చెత్త కుండీల యందు వేయండి.

7) అవసరానికి మించిన నగదు, బంగారు ఆభరణములు, మొదలైన వానిని వెంట తీసుకొని వెళ్ళడం చేయవద్దు. మీతో ఉన్న విలువైన వస్తువులపై తగు జాగ్రత్త వహించండి. జేబుదొంగలు, చిల్లర దొంగల యెడల కడుజాగ్రత్త వహించండి.

8) క్రొత్త వ్యక్తులకు మీ వస్తులను అప్పగించి మోసపోకండి. అట్టి వస్తువులను సామాన్లు భద్రపరచు గదులయందుగానీ, ఉచిత లాకర్లయందుగానీ భద్రపరచుకోండి.

9) పరిచయం లేని వ్యక్తులు ఇవ్వబోయే ఏ వస్తువును స్వీకరించవద్దు.

10) అనుమానస్పదంగా తిరుగాడే వ్యక్తుల పట్ల, ఎవ్వరిదీ కానట్లు వదిలి వేయబడ్డ వస్తువుల పట్ల జాగ్రత్త వహించండి. అట్టి సమాచారం భద్రతా సిబ్బందికి వెంటనే తెలియజేయండి.

11) ముష్టి వారిని ప్రోత్సహించకండి. యాచకత్వం ఇచ్చట నిషేధింపబడింది.

12) శ్రీమాతా వైష్ణోదేవి ష్రైన్ బోర్డు వారి ఆఫీసు కౌంటర్లు, దుకాణములు, కానుకలు స్వీకరించు కార్యాలయము నందు ఇచ్చిన నగదుకు, వస్తువులకు, తగు రశీదు పొందండి.

13) అధిక రక్తపోటు, గుండె మరియు అస్తమా, వ్యాధిగ్రస్తులైన యాత్రికులు తమ వైద్యుల వద్ద, ప్రయాణానికి ముందుగానే అనుమతి తీసుకొనగలరు.

**భవన్ పరిసరాలలోను దర్శన సందర్భంలోను**

1) భవన్ ప్రాంతం చేరుకోగానే చెక్‌పోస్ట్ వద్ద యాత్రా స్లిప్ చూపించి దర్శనం కోసం వెళ్ళవలసిన గ్రూపు నంబరు తెలుసుకోవాలి.

2) గ్రూప్ నెంబరు ప్రకటించిన తరువాత మాత్రమే దర్శనం కోసం గేట్ నం.1 వద్దకు చేరాలి. ముందుగాచేరి గేటువద్ద రద్దీ కల్పించవద్దు. అడ్డీలపైగా దాటే ప్రయత్నం చేయరాదు.

3) స్నానఘట్టాల వద్ద సబ్బులు తలసాన్నపు నూనెలు ఉపయోగించవద్దు. బట్టలు ఉతకడం ఇచ్చట నిషేధించబడినది.

4) దర్శనం కోసం బయల్దేరే ముందు స్నానం ముగించి పరిశుభ్రమైన వస్త్రాలు ధరించండి.

5) నగదు మరియు ఎన్నిక చేయబడ్డ కానుకలు తప్ప వేరేవి పవిత్ర గుహలోకి అనుమతించబడవు. వానిని ఉచితంగా లభ్యమయ్యే లాకర్లందు భద్రం చేసుకోవచ్చు.

6) భక్తులు వేచియుండే విశాలమైన ప్రధాన వసారాయందు తెచ్చుకున్న కొబ్బరి కాయలను సమర్పించి, అందుకు గుర్తుగా టోకెన్ పొందండి. దాని ఆధారంగానే తిరిగి కొబ్బరికాయలను పొందగలరు.

7) మాత గుహ గర్భాలయంలో ప్రవేశించిన సమయంలో మీ దృష్టి మహామాతృక యొక్క పవిత్ర పిండాకృతులపై మాత్రమే కేంద్రీకరించండి.

8) తోటిభక్తుల ఏకాగ్రతను భంగంచేసేలా పవిత్ర గుహలో జేజేలు పల్కడం, తల్లిని శ్లాఘించడం, కీర్తించడం, భక్తి గీతాల ఆలాపన వంటివి చేయరాదు.

9) తల్లికి భక్తితో సమర్పించదలచిన నగదు బంగారు ఆభరణాలు వెండి పాత్రలు వంటివి పవిత్ర గుహలో దేవి పిండాకృతులు నెలవైన పీఠంవద్ద సమర్పించరాదు. బదులుగా “విరాళములు మరియు ఆభరణముల పెట్టె”లో సమర్పించండి.

10) భవన్ ప్రాంతమందు వివిధ కేంద్రాలలో ఏర్పరచబడ్డ "కానుకలు మరియు విరాళముల పెట్టెల" యందు విరాళములను సమర్పించు కోవచ్చు. లేదా కంప్యూటీకరించబడిన విరాళముల కేంద్రముల వద్ద సమర్పించి తగిన రశీదు పొందగలరు. జాగ్రత్త వహించండి. భగవతి ష్రైన్ బోర్డు వారు నగదు, కానుకలు మొదలగు వాని సేకరణకు గాను ఏ ఒక్క వ్యక్తిని నియమించలేదు.

11) భవన్ ప్రాంతములయందు "కన్యాపూజల" నిర్వాహణ, ఖండితముగా నిషేధించబడినది.

12) అచ్చటి దేవస్థాన ఉద్యోగులకు గాని ఇతరులకు గానీ, వారి నుండి పొందిన సేవలకు ప్రతిఫలంగా దక్షిణ రూపంగా గాని, నగదుగా గానీ, వస్తురూపంగా గానీ ఏమీ ఇవ్వరాదు.

**మాత శ్రీవైష్ణవి పిలుపు**

విశ్వవ్యాపి అయిన మాత శ్రీవైష్ణవి భక్తాభీష్టప్రదాయిని. నిత్యం తనను స్మరిస్తూ ఉండే భక్తులను తప్పక అనుగ్రహిస్తుంది.

ఆకలిమరచి ఆడుకుంటున్న పిల్లలను, వండివడ్డించి పిలిచే తల్లిలా ఆ మాత అర్హులైన వారిని ఆత్మీయంగా ఆహ్వానిస్తుంది. జగజ్జనని నుండి పిలుపు శ్రావ్యమైన శృంగ నాద ధ్వనియే. ఆ ధ్వని తల్లిదర్బారుచుట్టూ ఉన్న ఎత్తైన కొండశిఖరాలు తాకి, గుహల అంతరాళాలు శోధించి లోతు తెలియరాని లోయలలోనికి చొచ్చుకొనిపోయి వేవేలరెట్లుగా ప్రతిధ్వనించి విశ్వవ్యాప్త మౌతుంది. తల్లి పిలుపు అందుకున్న భక్తులు గుంపులు గుంపులుగా సత్వరం తల్లి దర్శనం కోరుకుంటూ త్రికూట పర్వతం కాలినడకన ఎక్కడం ప్రారంభిస్తారు. "జై మాతాజి" అని భక్తిమీర నినాదాలు చేస్తూ, ఆ తల్లి అసమాన వైభవాన్ని పాటలుగా పాడుకుంటూ, "దర్శని దర్వాజా" వద్దకు చేరుకుంటారు. అచ్చటి నుండి ఇనుమడించిన ఉత్సాహంతో భక్తుల దీక్ష మొదలవుతుంది.

మూడువందల అరవై రోజులు, అన్ని ఋతువులలోను, అంటే "చమటలు కక్కించే వేసవి గాని-ఎముకలు కొరికే చలి కాని-భీకర తుఫాను గాలులతో కూడిన వర్షాలుకానీ", భక్తులదీక్షను కించిత్ మాత్రం చలింపచేయలేవు. తల్లి కుంకుమ నొసట ధరించి, "జైమాతాది" అన్న వేష్టము తలకు చుట్టుకోగానే ఏదో తెలియని దివ్యానందం కూడిన సాహసంతో భక్తులు ఉద్యుక్తులౌతారు. భక్తులు "తల్లిఒడి (దర్బార్) వెచ్చదనం" కోసం అనుక్షణం ఆరాటపడుతుంటారు. వారు భగవతియొక్క ప్రేమానుభూతియే జన్మసార్థక్యతగా భావిస్తారు. వైష్ణవిదేవి సందర్శనం కోసం ప్రయాణ మార్గం ఎంతో కష్టతరం. నిటారుగా ఉండే కొండచరియలకు నిచ్చెనవంటి ఎత్తైన మెట్లు, యాత్రికుల సహనానికి పరీక్షగా నిలుస్తాయి. ఏదో అవ్యక్తమైన అతీతశక్తి వారిని వెన్నంటిఉండి ఎంతోఎత్తైన ఆ శిఖరాలను ఆనందంగా అధిరోహించేశక్తిని వారికి కలుగచేస్తుంది. "ఆదికుమారి" అన్న ప్రదేశం నుండి ప్రాచీనమైన ఎత్తైన మెట్లమార్గం కష్టతరమైనది కాగా అదే కేంద్రం నుండి నూతనంగా నిర్మించబడిన (వయా) హిమకోటి మార్గం మిక్కిలి విశాలంగా నడకకు సౌకర్యవంతమైన రోడ్డుమార్గం. ఇరుమార్గాల నుండి ప్రయాణించే భక్తులకు తమ ప్రయాణపు తుదిదశలో అల్లంత దూరాన భవన్ కంటబడగానే ఉప్పొంగే ఆనందం, అప్పటివరకు అనుభవించిన కఠోరశ్రమను తక్షణం కనుమరుగు చేస్తుంది.

## కాట్రా నగరం నుండి భవన్‌లోని, తల్లి దర్బారు సందర్శనం

### కాట్రా నగరం

కాట్రానగరం జమ్మూ మరియు కాశ్మీర్ రాష్ట్రంలో జమ్మూ నగరానికి యాభై కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ నగరం త్రికూట పర్వతపు పాదాల వద్ద, మాతా శ్రీవైష్ణవి దర్బారును చేరుకోవడానికి ప్రధాన మూలస్థావరమై యున్నది. ఈ నగరం సముద్రమట్టం నుండి 2500 అడుగుల ఎత్తులో నెలకొని ఉన్నది.

జమ్మూ నుండి రోడ్డుమార్గాన 2 గంటల ప్రయాణంతో కాట్రా నగరాన్ని చేరుకోవచ్చు. సహజ సిద్ధంగానే అందమైన ఈ నగరం దిన-దినం ఎంతో అభివృద్ధి చెందుతున్నది. గత కొన్ని సంవత్సరాలుగా యాత్రికులకొరకు ఎన్నో ధర్మశాలలు, సౌకర్యవంతమైన హోటళ్ళు అన్నిరకాల విక్రయశాలలు నిర్మితమౌతున్నాయి. బస్స్టాండు నుండి చింతామణి (ధర్మశాల) వరకు మిక్కిలి పొడవైన వీథి ఉన్నది. ఇచ్చట వివిధ రకాల విక్రయశాలలు ఏర్పడి ఉన్నందున, యాత్రికులకు, నిత్యవసరాలనుండి తల్లికి సమర్పించవలసిన కానుకలవరకు అన్నివస్తువులు లభ్యమౌతాయి.

చింతామణి సమీపంలోని 'దర్శని దర్వాజ" వద్దనుండి అంబ దర్బారుకు కాలినడక మార్గం (రమారమి 12 కిలోమీటర్ల దూరం) ప్రారంభమౌతుంది. ఇచ్చటి నుండి భక్తులు కాలినడకన గానీ, గుర్రముపై గానీ, పల్లకి సౌకర్యం గానీ పసిబిడ్డలకై తోపుడుబండ్లు కానీ ఎంచుకోవచ్చు. అధికభాగం యాత్రికులు నడకకే మొగ్గుచూపుతుండగా, వయోవృద్ధులు అనారోగ్య వంతులు, పసిబిడ్డల తల్లిదండ్రులు, ఆవశ్యకమైన సౌకర్యాలు ఎన్నుకుంటారు.

భక్తులు కాట్రా నుండి సాంజీఛాట్ వరకు హెలికాప్టర్ సౌకర్యం కూడా వినియోగించుకోవచ్చు. హెలికాప్టర్ టిక్కెట్ల కోసం నీహారిక భవన సముదాయంలోని "కరెంట్ హెలీ – టిక్కెట్ కౌంటర్"లో సంప్రదించవచ్చు. ఈ ప్రయాణికులకు కూడా యాత్రా రిజిస్ట్రేషన్ స్లిప్ అత్యావశ్యకం, ప్రయాణికులందరూ ఆధార్‌కార్డు కలిగి ఉండాలి. అదనంగా వారి ప్రయాణానికి సంబంధించిన ఆధారపత్రాలు అనగా విమాన/బస్ ప్రయాణపు/ టాక్సీ ప్రయాణపు టిక్కెట్లు కూడా చూపించవలసి ఉంటుంది. టికెట్ల కొరకు మధ్యవర్తులను నమ్మి మోసపోరాదు.

### రిజిస్ట్రేషన్ స్లిప్

ఈ స్లిప్‌ను "యాత్రా పార్చి" అంటారు. దర్శనీ దర్వాజా వద్ద నుండి ప్రయాణం ప్రారంభించే ముందుగా భక్తులు వారి పేర్లను ఆధార్‌కార్డు

ఆధారంగా తప్పక నమోదు చేసుకోవాలి. ఇలా వివరాలు పొందుపరచబడిన స్లిప్‌ను యాత్రాపార్చి అంటారు. అత్యావశ్యకమైన ఈ స్లిప్‌ను ఉచితంగా పొందవచ్చు. ఈ "యాత్రాపార్చి" ఒక్కమాటలో చెప్పాలంటే తల్లి శ్రీవైష్ణవి మందిరానికి ప్రయాణం సాగించడానికి పత్ర రూపంగా అనుమతి.

భక్తులు "బాణగంగ" అనే ప్రాంతంలో మొదటి తనిఖీ కేంద్రం చేరుకుంటారు. ఈ కేంద్రం యాత్రికుల నమోదు కేంద్రం నుండి 1.5 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. యాత్రాపార్చి పొందిన సమయం నుండి ఆరుగంటల లోపు భక్తులు ఈ తనిఖీ కేంద్రం వద్ద తప్పక హాజరు కావలసి వుంటుంది. అలా కాకున్న పక్షంలో ఈ స్లిప్ రద్దయినట్లు పరిగణించి, తనిఖీ సిబ్బంది చేత వెనుకకు తీసుకొనబడుతుంది. అట్టి యాత్రికులు తిరిగి కొత్త యాత్రాపార్చిని యాత్రి రిజిస్ట్రేషన్ కౌంటరు నుండి పొందవలసి ఉంటుంది.

**యాత్రికులకు భీమా**

యాత్రికులు మాత మందిరం వరకు ప్రయాణానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నందువల్ల అదే ప్రాతిపదికగా "తప్పని సరిగా ధానంతటదే" అన్న విధంగా మార్గమధ్యంలో ఎదురయ్యే అన్ని రకాల అనూహ్యమైన ప్రమాదాలు, (అరుదుగా సంభవించే వంటివి) గ్రూపు పాలసీలో పొందుపరచబడిన విధంగా సంభవించే మరణానికి జీవిత భీమా చేయబడుతుంది. యాత్రీకులు ఎలాంటి ప్రీమియం చెల్లించవలసిన అవసరం లేదు. ఇది కేవలం ఉచితం. ప్రమాద కారణంగా మరణం సంభవిస్తే పెద్దవారికి ఒక లక్షరూపాయలు, పిన్న వారికి ఇరువదిఅయిదువేల రూపాయలు చొప్పున వారసులకు పరిహారం చెల్లింపబడుతుంది. గుండెపోటు వంటి సహజ మరణాలకు ఈ భీమా వర్తించదు.

## భక్తుల సంఖ్య – దర్శన ప్రక్రియ

ఇతర పుణ్యక్షేత్రాలలో వలె కాక శ్రీమాత వైష్ణవిదేవి మందిరం ఎత్తైన పర్వత శ్రేణుల మధ్య లోయలో గుహయందు నెలకొనియున్నది. కాట్రా నుండి భవన్ వరకు మార్గమంతా ఆవశ్యకమైన వసతులు ఏర్పరచబడినవి. ప్రత్యేకంగా భవన్ పరిసరప్రాంతమంతా బస, ఆహారం, ఆరోగ్యం, ఉచిత లాకరు సౌకర్యం వంటి ఆవశ్యకములు కల్పించబడినవి.

త్రికూట పర్వతశ్రేణి, సహజసిద్ధంగా పేరుకుతగ్గట్టు నిలువెత్తు ఆకృతితో ఏర్పడి ఉన్నది. నిటారైన మెట్లు – నడకదారి అయినందున భక్తులకు, ప్రయాణం కష్టసాధ్యమౌతుంది. కానీ మాతదర్శనం – భగవతి మందిరంలో ప్రాప్తించే అపార శక్తిపాత దివ్యానుభవంకోసం బిడ్డల ఆరాటం ఈ ప్రయాణశ్రమను త్రోసిరాజంటుంది.

భక్తుల సౌకర్యార్థం – అన్ని వసతులు కల్పింపబడినా, ఏటేటా అనూహ్యంగా పెరుగుతున్న భక్తుల సంఖ్యతో పోల్చినప్పుడు అదనపు సౌకర్యాల కల్పన / మరింత మంది భక్తులకు దర్శనం కల్పించడం అన్న అంశాలలో కొన్ని పరిమితులు, కొన్నింట గరిష్ఠపరిమితికి చేరిన మౌలికవనరుల వైనం అవగతమవుతుంది.

కాబట్టి నిర్దేశిత సమయంలో దర్శదర్వాజా నుండి భవన్ వరకు మార్గమధ్యంలోని భక్తుల సంఖ్య మరియు తల్లి మందిరపు ముఖ్య సముదాయంలోని భక్తుల సంఖ్యను కలిపి పరిగణనలోనికి తీసుకొని దర్శన వరుసలలోని భక్తుల సంఖ్యను నియంత్రించటం జరుగుతుంది. పవిత్ర పిండాకృతులు గుహయందు పీఠంపై స్థితమైయున్నందున దర్శనం కొరకు యాత్రికులను సమూహంగా అనుమతించడానికి అవకాశముండదు. కాబట్టి దర్శనవిధానం – దినమంతా నిరంతరంగా సాగే వరుసక్రమం పద్ధతి (ఉదయాస్తమయ పూజ–హారతి సందర్భాలలో తప్ప) నిర్దిష్టంగా ఇక్కడ అమలు చేయబడుతోంది.

## బస సౌకర్యం

భక్తుల బస సౌకర్యంకోసం శ్రీమాతా వైష్ణోదేవి ష్రైన్‌బోర్డువారు 'కాట్రా' నగరంలో సౌకర్యవంతమైన ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా "నీహారిక యాత్రినివాస్" మరియు శక్తిభవన్ అనే సముదాయాలను నిర్మించి సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ గదుల దినసరి అద్దె యాత్రికులకు అందుబాటులో ఉండేలా బోర్డు శ్రద్ధ వహిస్తుంది.

ఇచ్చట నామమాత్రపు అద్దెతో డార్మిటరీ వసతి, ఉచిత లాకరుసౌకర్యం, అల్పాహార, భోజన సదుపాయాలు కూడా లభ్యమౌతాయి. ఇవికాక కాట్రా నగరంలో మరెన్నో "విశ్రాంతి గృహాలు, విడిదులు, విలాసవంతమైన హోటళ్ళు, ధర్మశాలలు" – వ్యక్తులు, సంస్థలు, ధార్మిక సంస్థలు, ట్రస్టులచే నిర్వహింపబడుతున్నవి. కొన్ని ధార్మికసంస్థలు భక్తులకు ఉచిత బస అల్పాహార, భోజన సదుపాయాలు కల్పిస్తుండగా, కొన్నింట నామమాత్రపు అద్దెతో సౌకర్యవంతమైన బస, ఆహార, అల్పాహారాదులు సమకూరుస్తున్నారు.

వీటన్నింటికి అదనంగా ఇతర వ్యక్తుల సంస్థల నిర్వాహణలో మరెన్నో లాడ్జిలు అతిథి గృహాలు సాధారణ సౌకర్యాల నుండి అధునాతన సౌకర్యాలను అందించే హోటళ్ళు, కాటేజ్‌లు, రిసార్టులు యాత్రికులకు అందుబాటులో ఉంటాయి.

## క్లోక్‌రూమ్ సౌకర్యం

యాత్రికులు కాట్రా నుండి భవన్ వరకు తమ ప్రయాణం సౌకర్య వంతంగా సాగేందుకు అతి స్వల్ప వస్తుసామగ్రి మాత్రమే తమతో ఉంచుకోవడానికి ఇష్టపడతారు. కావున మాతా వైష్ణోదేవి ష్రైన్ బోర్డువారు తమ అతిథి గృహాలు, యాత్రి నివాస్‌లు అన్నింటివద్ద ఉచిత లాకరు సౌకర్యానికి అదనంగా, ఉచిత క్లోక్‌రూము సౌకర్యం కూడా ఏర్పరచి

ఉన్నారు. ఇతర వ్యక్తులు, సంస్థలు నిర్వహించే లాడ్జిలు, అతిథి గృహాలు హోటళ్లవద్ద కూడా ఈ సౌకర్యాలు లభ్యమౌతాయి.

రైల్వే రిజర్వేషన్

"నీహారిక" యాత్రికుల సౌకర్య సముదాయంలో (ముఖ్య బస్‌స్టాండు వద్ద) కంప్యూటరీకరించబడ్డ, రైల్వే రిజర్వేషన్ కౌంటరు నిర్వహించ బడుతోంది. భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు.

**దర్శని దర్వాజ**

తల్లి దర్శనానికి నాందివాక్యంగా, త్రికూట పర్వతాలను అధిరోహించ డానికి సంసిద్ధులైన భక్తులు "దర్శని దర్వాజా"ను చేరుకుంటారు. నీహారిక యాత్రినివాస్ నుండి ఈ దర్వాజా 1 కి.మీ. దూరంలో ఉంటుంది. ఇచ్చట మనం రెండు ద్వారాలను గమనించవచ్చు. వీనిలో పురాతన ద్వారాన్ని "దర్శని దర్వాజా" లేదా ప్రాంతీయ భాషలో "దర్శని డియోడి" అని వ్యవహరిస్తారు. ఇక్కడ నుండి భక్తులు త్రికూట పర్వత శ్రేణుల సంపూర్ణ రమణీయ దృశ్యాన్ని వీక్షించవచ్చు. కాబట్టి "దర్శని దర్వాజా" అన్నపేరు నూటికినూరుపాళ్ళు అర్థవంతమైనది. తల్లిభక్తులు ఆమె నివాసమైన త్రికూట పర్వతాన్ని వీక్షించగానే సాక్షాత్ మాత "హంసలి" అనే గ్రామంలో పండిత శ్రీధరుని ఇంటినుండి (ప్రస్తుత నామం "భూమిక") ఆ పర్వత సానువులలోని గుహ చేరుకున్న విధానం స్ఫురణకురాగా ఆనందాశ్రువులు పెల్లుబుకు తుండగా భక్తితో తాదాత్మ్యం చెందుతారు. అలా అది మాత మొదటిదర్శనంగా భావిస్తారు. త్రికూట పర్వతాల పాదస్థానమైన ఈద్వారం సముద్రమట్టానికి 2800 అడుగుల ఎత్తులో ఉన్నది. ఇక్కడి నుండి మాతదర్బారు చేరుకోవడానికి దరిదాపు 14 కి.మీ. దూరం పర్వతారోహణ చేయవలసి ఉంటుంది. నడిచి ఎక్కలేని వారికోసం గుఱ్ఱాలు, పల్లకీలు, డోలీలు తదితర సౌకర్యాలు ఈ కేంద్రం వద్దనే లభ్యమౌతాయి.

## బాణ గంగ

భక్తులు "దర్శని దర్వాజా" దాటిన పిదప ఏటవాలుగా ఒక కిలో మీటరు దూరం ప్రయాణించి చెక్‌పోస్టును చేరుకుంటారు. ఇక్కడ యాత్రాస్లిప్ ముద్ర వేయబడి, ధ్రువీకరింపబడుతుంది. ఆ విధంగా తదుపరి ప్రయాణానికి ఆమోదం తెలియచేయ బడుతుంది. యాత్రికుని వద్దనున్న యాత్రాస్లిప్ జారీచేయబడిన సమయం నుండి 6 గంటల కాలం మించిపోయి ఉన్నట్లయితే, ఆ స్లిప్ చెల్లనిదిగా పరిగణించి చెక్‌పోస్టు సిబ్బంది వెనక్కు తీసుకుంటారు. అలాంటి సందర్భంలో యాత్రికుడు తిరిగి కాట్రా నగరం చేరి యాత్రా రిజర్వేషన్ కౌంటరు నుండి నూతన యాత్రి స్లిప్ పొందవలసి వుంటుంది.

అలా చెక్‌పోస్ట్ దాటిన పిమ్మట యాత్రికులు ఒక వంతెన మీదుగా ప్రయాణించి "బాణగంగ" అనే ప్రదేశం చేరుకుంటారు. ఈ ప్రదేశంలో కొండల నుండి ఉద్ధృతంగా వెలువడుతున్న నీటి ప్రవాహం దర్శించవచ్చు. అలా ఆ ప్రవాహం దిగువకు చేరగా ఏర్పడిన సరస్సులోని నీటిని భక్తులు, తల్లి బాణం సంధించి వెలికిదీసిన పవిత్ర జలంగా విశ్వసించి పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

దైవాంశయైన బాలిక (మాత శ్రీవైష్ణవి) పండిత శ్రీధరుని ఇంట (ప్రస్తుత భూమిక మందిరం) జరుగుతున్న విందులో యోగి భైరవనాథుని దుష్ప్రవర్తన కారణంగా ఈ మార్గంలోనే త్రికూట పర్వతాలకు ప్రయాణించిందని భక్తుల ప్రగాఢ నమ్మకం.

ఆ సమయంలో భగవతి మందిరానికి కాపలాదారుడు నల్లని వర్ణంతో ధైర్య సాహసాలు ఉట్టిపడే వానర వీరుడు. అతడు మాతృకను అనుసరిస్తూ ఈ ప్రదేశంలో మిక్కిలి దప్పిగొన్నాడు. జగజ్జనని తన వింటితో బాణం సంధించి కొండరాతిని ఛేదించగా పాతాళంలోని గంగ ఉవ్వెత్తున

ఎగిసిపడింది. వానరుని దప్పిక తీర్చిన ఆ జలం, ఈ ప్రదేశంలో ఏర్పడ్డ గుడి, నాటి నుండి "బాణగంగ" అనే పేరుతో ప్రసిద్ధి గాంచినవి.

ఈ క్షేత్రం కాట్రా నగరం నుండి సుమారు 2.5 కి.మీ.ల దూరంలో సముద్ర మట్టానికి 2800 అడుగుల ఎత్తులో నెలకొని ఉన్నది. కొద్దిగా ముందుకు సాగితే దేవి శ్రీవైష్ణవి అష్టభుజిగాయున్న దివ్య విగ్రహం ప్రతిష్ఠింపబడిన దేవాలయం యాత్రికులను ఆకట్టుకుంటుంది. ప్రకృతిసిద్ధంగా ఎత్తైన పర్వతాలు, హరితం నింపుకున్న లోతైన లోయలు గల రమణీయమైన ఈ ప్రదేశం యాత్రికులకు విశ్రాంతి కలుగచేసి పునరుత్తేజితులను చేస్తుంది. ఈ దేవాలయం, గుఱ్ఱపు బాట యొక్క వంపు భాగంలో కట్టుబడి వున్నందున మెట్ల మార్గంలో నడిచే భక్తుల కనుగప్పిపోయే అవకాశం ఎంతో ఉంది. భక్తులందరికి అష్టభుజి వైష్ణవి దర్శనానుగ్రహం తప్పక సిద్ధించుగాక.

**చరణ పాదుక**

ఈ ప్రదేశంలో భగవతి అంశయైన బాలిక భైరవనాథుడు వెంటాడు తుండగా సేద తీరేందుకు ఇచ్చట కొంత సేపు విశ్రమించిందని కథాంశం. ఆ సందర్భంలో ఇంద్రాద్రి దేవతలచే అనునిత్యం పూజించబడే పాదాలు అచ్చటి రాతిపై ముద్రించబడ్డవి. పవిత్ర పాద ముద్రలు గల శిలాఫలకం చుట్టూ అందమైన మందిరం నిర్మించబడినది. కావున ఈ ప్రదేశం "చరణపాదుక" అని పిలువబడుతోంది. ఈ మందిర ముఖద్వారానికి కుడి భాగాన నిలువెత్తున సంజీవని పర్వతాన్ని ధరించియున్న శ్రీ ఆంజనేయుని విగ్రహం దర్శనమిస్తుంది. చిరంజీవిగా, హిమాలయ నివాసియైన శ్రీ హనుమ, భక్తులకు మాతృదర్శనం అనుగ్రహిస్తూ వారికి ఎలాంటి ఆపదలు దరిచేరనీయకుండా సంరక్షిస్తారు. ఈ ప్రదేశం బాణగంగ నుండి రమారమి 1.5 కి.మీ.ల దూరంలో సముద్ర మట్టానికి 3380 అడుగుల ఎత్తులో నెలకొని ఉన్నది. ఈ ప్రదేశం వరకు నడక మార్గానికి ఇరువైపులా అల్పాహార,

పండ్లు, పానీయాలు, దేవత పూజా ద్రవ్యాలు మొదలగు వివిధ అంగళ్ళు ఉన్నవి. అంతేగాక ఇక్కడ వైద్య సౌకర్యాలతో కూడిన ఒక ఆరోగ్య కేంద్రం కూడా ఏర్పాటు చేయబడింది. ఇచ్చట ప్రథమ చికిత్స మరియు ఆవశ్యక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. భక్తులు తల్లి చరణాలకు భక్తితో ప్రణమిల్లి మిక్కిలి కఠినతరమైన మిగిలిన యాత్రను ఇచ్చటి నుండి పట్టుదలతో కొనసాగిస్తారు.

**ఆదికుమారి**

భక్తులు చరణపాదుక మందిరం నుండి సుమారు 4.5 కి.మీ.ల దూరం ప్రయాణించి విశాలమైన పీఠభూమి వంటి మిట్ట ప్రదేశం చేరుకుంటారు. సముద్ర మట్టానికి 4800 అడుగుల ఎత్తులో ఉండే ఈ ప్రదేశం ఆదికుమారి అని పిలువబడుతుంది. ఇచ్చటకు చేరుకుంటే మాతృక మందిరానికి ప్రయాణం సగభాగం పూర్తయినట్లు.

ప్రాచుర్యంలో ఉన్న కథాంశం పరంగా శక్తిఅంశయైన బాలికను వెతుక్కుంటూ, భైరవనాథుడు చరణపాదుక ప్రదేశం చేరుకున్నాడు. ఆ కన్యను, గుర్తించగలనన్న ఆత్మవిశ్వాసం సడలుతుండగా ఇచ్చట ఆ కన్య మసలిన బలమైన ఆధారాలు లభించిన కారణంగా ఆనందంతో తిరిగి తన కర్తవ్య దీక్షకు పునరంకితుడయ్యాడు. మార్గమధ్యంలో అతడు తపోదీక్షలో నిమగ్నమైన ఒక వృద్ధసాధువును గమనించాడు. ఆతృతతో ఆ సాధువును చేరి ఈ ప్రాంతంలో సంచరిస్తున్న ఒక బాలికను చూచియున్నారా? అని ప్రశ్నించాడు, భైరవుడు. అందుకు ఆ సాధువు ఇలా బదులిచ్చాడు.

"ఆర్యా! ఆమె సాధారణ బాలిక కాదు. ఆమె సమస్త లోకాలకు మాతృకయైన సర్వోన్నత శక్తి "ఆదికుమారి". అనగా ఈ జగత్తు సృష్టికి పూర్వము నుండి కన్యక. ఈమెయే! పరబ్రహ్మ పరమాత్మల అంశయైన ఆదిశక్తి".

పురాణానుసారం ఇచ్చటనే మాత వైష్ణోదేవి, యోని ఆకృతిగల ముఖ ద్వారము కలిగి గర్భాకారంలో వున్న గుహలో నవమాసాలు కఠోరమైన తపస్సు ఆచరించింది. అంటే, పండిత శ్రీధరుని ఇంట జరిగిన గొప్ప విందులో భైరవుని దుష్ప్రవర్తనకు ఆగ్రహించిన కన్యక శ్రీ వైష్ణవి అచ్చటి నుండి అంతర్ధానమయింది. తన తిరుగు ప్రయాణంలో ఆమె బాణగంగ, చరణపాదుక, ప్రదేశాలలో విశ్రమించి ప్రస్తుత "ఆదికుమారి" అనబడే ప్రదేశం చేరుకుంది. ఇచ్చటి గుహయందు కన్యక నవమాసాలు దీర్ఘ తపస్సు ఆచరించింది. ఈ ప్రదేశం గుహ లోపల కుడిభాగంలో మాతృగర్భ ఆకారంలో ఉంటుంది. భైరవుడు తనను వెదుక్కుంటూ రావడం గమనించిన మాతృక తన త్రిశూలంతో గుహ అంత్యభాగంలో మార్గం ఏర్పరచి మరింత ఎత్తుకు పర్వతాల వైపుగా సాగిపోయింది.

**ఆదికుమారి – గర్భజూన్**

గర్భస్థ శిశువులా నవమాసాలు శ్రీవైష్ణవి ఈ గుహలో తపమాచరించి నందున ఈ గుహ "గర్భ–జూన్" లేదా "గర్భయోని" అన్న పేరుతో ప్రసిద్ధమయింది. అనగా సహజసిద్ధంగా గర్భాకృతితోయున్న ఆ గుహ యోని ఆకృతి గల ప్రవేశద్వారము కలిగియుండుట విశేషము. ఈ గుహలో ప్రవేశించేందుకు యాత్రికులు, ఆఫీసువద్ద, తమ యాత్రాస్లిప్‌ను చూపించి ప్రత్యేక ప్రవేశ అనుమతి స్లిప్ పొందవలసి ఉంటుంది.

సొరంగము వంటి ఈ గుహ 15 అడుగుల పొడవు ఉంటుంది. భూమికి సమాంతరంగా ప్రవేశద్వారం కలిగియున్న ఈ గుహ తరువాత నిలువెత్తు ఆకృతిగా రూపుదిద్దుకున్నది. గుహ అంతర్భాగంలో మార్గం మిక్కిలి ఇరుకుగా ఉంటుంది. ఇందు ప్రవేశించే భక్తులు, మార్గమంతా శ్రద్ధా భక్తులతో శ్రమించి ఎగబ్రాకుతూ పైకి చేరుకోవలసి ఉంటుంది. ఈ గుహలో ప్రవేశించి, ప్రయత్నం కొనసాగించలేక వెనుతిరిగిన వారు పాపాత్ములుగా పరిగణించ బడతారు.

మాత శ్రీవైష్ణవి నవమాసాలు తపోదీక్షలో విడిది చేసిన ఈ గుహ ఎంతో మహిమాన్వితమైనది. స్వయంగా ఆద్యాశక్తి విరాజమానమైన ఆ గుహ నిరుపమానమైన శక్తిస్థావరము. అట్టి శక్తికి మాతృక తపస్సుమూలాన ఉద్భవించిన శక్తి జతకాగా ఆ ప్రదేశమంతా ఆవరించియున్న భావాతీతశక్తి, భక్తులకు దివ్యానందం కలుగచేస్తుంది. జీవితకాలంలోనే జీవాత్మ తన మూలమైన పరమాత్మశక్తిని ఆస్వాదించుట వలన కలిగే ఈ ఆనందం వర్ణనకందనిది.

ఆ గుహలో ప్రవేశించి బయల్వెడలిన మాత్రాన్నే భక్తుల  పాపాలన్నీ పరిహరించబడి, ఆత్మ తిరిగి తన సహజసిద్ధమైన పవిత్రతను సంతరించు కుంటుందని భక్తుల ప్రగాఢ నమ్మకం.

ఆదికుమారి కేంద్రం వద్ద, శ్రీ మాత వైష్ణోదేవి ష్రైన్ బోర్డు వారు, భక్తులకు ఆవశ్యకములైన వివిధ సౌకర్యాలను కల్పించారు. ఇచ్చట ఉచిత విశ్రాంతి గదులు, త్రాగునీరు, స్నాన సౌకర్యాలు, చలికాచే దుప్పట్లు, సామాన్లు భద్రపరిచే గదులు, లాకరు సౌకర్యం, మైకుల ద్వారా ప్రకటనలు, టెలిఫోను, అల్పాహారశాలలు మొదలగునవన్నీ అందుబాటులో ఉంటాయి. అంతేగాక 2 మరియు 4 పడకలు గల సూట్ సౌకర్యం కూడా కల్పించబడింది. వీటి ముందస్తు నమోదు కాట్రా నగరంలోని విచారణ మరియు రిజర్వేషన్ కౌంటర్ వద్ద చేసుకోవచ్చు.

**హాథీమథ**

పురాతన మార్గమైన బాణగంగ, చరణపాదుక, ఆదికుమారి, - హాతీమథ, సాంజీఛాట్ - భవన్ (మాతృకా మందిరం) అన్నమార్గం మాత శ్రీవైష్ణవి పాదస్పర్శతో పునీతమైన మార్గం. అనగా యోగి భైరవనాథుడు అనుసరిస్తూ రాగా ఆదికుమారి పయనించిన మార్గమిది.

అనాదిగా భక్తులు ఆదికుమారి నుండి హాథీమథమీదుగా సాంజీఛాట్ చేరుకోవడానికి నిటారుగా ఏర్పడ్డ కొండచరియలకు నిలువెత్తు విధంగా ఉన్న నిచ్చెన మెట్లను కఠోరశ్రమకోర్చి తల్లి దర్శనమే ధ్యేయంగా అధిరోహిస్తారు. నేటికీ ఈ మార్గాన్నే ఎంచుకొని సహనంతో కష్టాన్ని మునిపంట భరిస్తూ, భక్తి తత్పరతను చాటుకొనే భక్తులు వేలకు వేలు బాణగంగ ప్రదేశం నుండి ఆదికుమారి వరకు దూరం సుమారు 5.5 కి.మీ. ఉంటుంది. ఆదికుమారి నుండి హాథీమథ, మెట్లమార్గంలో 2.5 కి.మీ. దూరంలో ఉంటుంది. ఈ ప్రదేశం సముద్రమట్టం నుండి 6500 అడుగుల ఎత్తులో ఉంటుంది.

అనగా ఆదికుమారి నుండి మాతృక మందిరం చేరుకొనేందుకు, రెండు మార్గాలు ఉన్నవి. (1) పురాతనంగా ఉన్న మార్గం. ఈ మార్గం ఆదికుమారి నుండి హాథీమథ, సాంజీఛాట్ అన్న కేంద్రాల మీదుగా "భవన్" (మాతృక మందిరం) చేరుకోవడం. (2) ఆదికుమారికి చేరుకొనే కి.మీ. 0.5 ముందు ఇంద్రప్రస్థ అన్న ప్రాంతం నుండి హిమకోటి అనే ప్రదేశం మీదుగా భవన్ చేరుకొనేందుకు నూతనంగా ఏర్పడిన మెట్లులేని నడకమార్గం రెండవది. ఇది ఎత్తు అధిరోహణ, క్రమంగా స్వల్పకష్టంతో సాధ్యమయ్యే విధంగా విభజించబడి మెలికలతో కూడిన రోడ్డు మార్గం.

పురాతనమైన మొదటిమార్గం నిలువెత్తుగా వున్న కొండమీదకు నిటారుగా ఉన్న మెట్ల దారి. ఈ మార్గంలో ప్రయాణం కష్టతరం. గుండెవ్యాధి, ఊపిరితిత్తుల, శ్వాస సంబంధమైన వ్యాధులు కలవారు ఈ మార్గాన్ని ఎంచుకోకపోవడమే మంచిది. ఈ పురాతనమార్గం దైవాంశఅయిన బాలిక పండిత శ్రీధరుని ఇంటివద్ద ఘనమైన విందునుండి, భైరవనాధుడు తనను వెంటాడుతూ రాగా పయనించి గుహయందలి తన మందిరం చేరుకున్న మార్గం. అనగా పూర్వము "హంసలి" అని, ప్రస్తుతం "భూమిక" అని పిలువబడే ప్రదేశం నుండి భవన్ (మాతృక మందిరం) వరకు. కొన్ని వందల

సంవత్సరాల నుండి భక్తులు ఈ మార్గంలోనే భవన్ చేరుకొని భగవతి కృపకు పాత్రులయ్యారు.

ఈ మార్గంలో భక్తులు పర్వతశిఖరాన ఒకచోట ఏనుగు నొసలు, తల ఆకృతిలో ఏర్పడియున్న విశాలమైన పీఠభూమి వంటి ప్రదేశం చేరుకుంటారు. ఆ ప్రదేశం "హాథీమథ్" అని పిలువబడుతోంది. ఈ ప్రదేశం రమణీయమైన ప్రకృతిశోభతో అలరారుతుంటుంది.

మాత శ్రీవైష్ణవి పిలుపునందుకున్న భక్తులు ధన్యులు. వారు ఏ ప్రాంతం వారైనా ఆ మరుక్షణాన్నే మరో ఆలోచన లేని మనో సంసిద్ధతతో మాతృక మందిరం వైపు వారియాత్ర ప్రారంభమౌతుందన్నది, భక్తుల స్వీయ అనుభవసత్యం. ఆ మార్గంలో ప్రయాణం ఎంత కష్టతరమైనదైనా, అనగా అధిరోహించడానికి కష్టమైన ఎత్తు అయినా, లెక్కకందని నిలువెత్తు మెట్లున్నా, ఆ భక్తులకు మాత కృపతో ఈ యాత్ర సుసాధ్యమే. శ్రీమాతృక అదృశ్య దివ్యశక్తిగా వారిని ముందుండి నడిపిస్తూ ఆ ఎత్తైన పర్వతాలను మెట్టు తదుపరి మెట్టుగా సునాయాసంగా అధిరోహింపచేస్తుంది. "జైమాతాది" అన్న మాతృక నామస్మరణకు స్పందనగా, నిరీక్షితయైన ఆ తల్లి చిరుదరహాసపు శీతలపవనాలు బిడ్డల శ్రమను తక్షణం మరపింపచేస్తాయి. ఈ కేంద్రం నుండి – భైరవనాథుని మందిరానికి ఒక కాలిబాట చీలిపోతుంది. పూర్వంలో యాత్రికులు ఈ బాటను అనుకరించి భైరవనాథుని లోయకు చేరుకొని దర్శనానంతరం భవన్‌కు చేరుకొనేవారు. కానీ ఇటీవల "మాతృక దర్శనానంతరం మాత్రమే భైరవనాథుని దర్శనం చేసుకోవాలన్న ధర్మాచారం ప్రాచుర్యం సంతరించుకొని ప్రబలమైనది. అందుచేత హాథీమత్ నుండి భైరవమందిరం ప్రయాణించే భక్తుల సంఖ్య క్రమేపి తగ్గిపోసాగింది.

**సాంజీ చాట్**

పూర్వపు మార్గంలో భక్తులు ఆదికుమారి కేంద్రం నుండి కి.మీ. 3.25 దూరంలో హాథీమత్ దాటిన పిమ్మట సాంజీఛాట్ అన్న ప్రదేశం

చేరుకుంటారు. నిటారుగా ఉండే ఎత్తైన మెట్లతో ఎక్కడానికి ఎంతో శ్రమించవలసిన మెట్లమార్గం ఇక్కడితో ముగుస్తుంది. ఇచ్చటి నుండి లోయగా ఉండే భవన్ చేరుకోవడానికి దిగుడుమెట్ల నడకమార్గం మొదలౌతుంది. ఆదికుమారి నుండి సాంజీఛాట్ మీదుగా భవన్‌కు చేరుకొనే మార్గం ప్రకృతి సిద్ధంగా ఎంతో రమణీయంగా ఉంటుంది. వరుణుడు ఇక్కడే తిష్ఠవేశాడా! అన్నట్లు అపారమైన వర్షంతో వసివాడని వృక్షసంపద, పచ్చిక బయళ్ళు, స్పర్శతోనే తల్లి ఆత్మీయఆహ్వానాన్ని అందిస్తూ ప్రసరించే చల్లని పిల్లగాలులు, భక్తుల అంతరంగంలోని ఆధ్యాత్మిక భావనలకు అనుభవార్హమైన దివ్యజ్ఞాన విభూతిని అందచేస్తాయి. మంచుతో నిండిన పర్వతాలు – హరితం తమలో నింపుకున్న లోయలు, విస్తృతమైన పర్వతాల మధ్య ఉద్ధృతంగా వీచే శీతల గాడ్పులు, సంవత్సరం పొడవునా నిండుగా ప్రవహించే కొండవాగులు, ఇవన్నీ కలిసి ఏకంగా ఒక మనోహర దృశ్య కావ్యాన్ని ఆవిష్కరించి భక్తుల ముందుంచుతాయి.

మాత శ్రీవైష్ణోదేవి మందిరాన్ని తదనుబంధ వ్యవహారాలను శ్రీ మాత వైష్ణోదేవి ష్రైన్ బోర్డువారు పరిగ్రహించకముందు ఆ మందిరాన్ని స్థానిక వ్యక్తులు కొందరు సమష్టిగా నిర్వహించేవారు. ఆ రోజుల్లో వారు పవిత్ర గుహలో భక్తులు మాతృకకు సమర్పించిన "ధాన్యము, ధనము, బంగారు, వెండి వస్తువులు, ఆభరణములు" మొదలైన కానుకలను సాంజీఛాట్ అనే ఈ ప్రదేశంలో పంచుకొనేవారట. పారిభాషికంగా "సాంజీఛాట్" అంటే సామూహికంగా కొందరు, వ్యక్తులు సేదదీరడం కోసంగానీ వ్యవహారాలు నెరుపుకొనేందుకు గానీ కలవడంకోసం ఉపయోగించే రేకుల పందిరి. ఎన్నో సంవత్సరాలుగా అర్చకుల (బరీదార్‌లు) ఆధ్వర్యంలో మాతృక మందిరం నిర్వహింపబడినందున ఈ ప్రదేశానికి ఆ పేరు సార్థకమయింది.

వాతావరణ ప్రతికూలత, రాత్రి సమయం కారణంగా యాత్ర కొనసాగించక ఈ కేంద్రంలో బసచేసే యాత్రికులకు ఆవశ్యకమైన అన్ని సౌకర్యాలు కల్పించబడినవి. నాలుగు అంతస్తుల వైద్యశాల, భోజనాలయము, ఉచిత విశ్రాంతిగదులు, మంచినీటి సదుపాయం, చలికాచే దుప్పట్లు, పడకపైపరచే గుడ్డలు, అల్పాహార అంగళ్ళు, అద్దెగదులు, దూరవాణి సౌకర్యం, మాతృక మందిరంలో భక్తులు సమర్పించుకొనే కానుకలు విక్రయించే అంగడి, మొదలైన సౌకర్యాలన్నీ కల్పించబడినవి. ఇటీవల కాలంలో ఇచ్చట రెండు హెలీప్యాడ్‌ల నిర్మాణం జరిగింది. కాట్రా నగరం నుండి భవన్ చేరుకోవడానికి సాంజీచాట్ వరకు యాత్రీకుల సౌకర్యార్థం హెలీకాప్టర్ ప్రయాణ సౌకర్యం ఏర్పరచబడింది. వెలుతురు, వాతావరణం అనుకూలించే సమయంలో భక్తులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చు. కాట్రా నగరంలో "నీహారిక" యాత్రికుల వసతి సముదాయంలోను, భవన్ ప్రాంగణంలోను ఈ టిక్కెట్లు ముందస్తుగా లేదా అప్పటికప్పుడు ప్రయాణానికి అనుగుణంగా ఆయా కంపెనీల వారి కార్యాలయాలలో అమ్మకం జరుగుతుంది.

ఈ ప్రాచీన మార్గంలో "పాంఛీ-అంబ" అనే రెండు రమణీయ దృశ్య కేంద్రాలు యాత్రికులకు విరామాన్ని కల్పిస్తూ దివ్యానందాన్ని కలుగచేస్తాయి. సాంజీఛాట్ నుండి భవన్ చేరుకొనేందుకు కి.మీ. 2.75 దూరం లోయలోనికి దిగుడు మెట్లు మార్గం. ఇది ఎంతో సులభతరమైనది. అప్పటివరకు శ్రమ కష్టాలకు ఓర్చిన భక్తులకు ఎంతో ఉపశమనం కల్గించి పునరుత్తేజితులను చేస్తుంది.

**ఆదికుమారి నుండి భవన్ వరకు నూతన మార్గం**

ఆదికుమారి నుండి భవన్ అనగా "తల్లి పవిత్రగుహ" చేరుకోవడానికి రెండు మార్గాలు ఉన్నవి. మొదటిది ప్రాచీన మార్గము. ఇది "హాథీమత్" మరియు సాంజీఛాట్ అన్న ప్రదేశాల మీదుగా భవన్ చేరుకోవడం. ఇక

రెండవది నూతన మార్గం. ఇది "హిమకోటి" అన్న కేంద్రం మీదుగా నిర్మించబడింది. ఈ మార్గం హిమకోటి మార్గం లేదా తారాకోట మార్గం అని పిలువబడుతోంది.

ఆదికుమారి అన్న ప్రదేశం సముద్ర మట్టానికి 4800 అడుగుల ఎత్తులో ఉండగా, భవన్ (తల్లి స్థితమైన గుహ) 5200 అడుగుల ఎత్తులోను, సాంజీ ఛాట్ అన్న ప్రదేశం 6200 అడుగుల ఎత్తులోను ఉన్నవి.

కాబట్టి శ్రీ మాతావైష్ణోదేవి ష్రైన్‌బోర్డువారు ఆదికుమారి నుండి సాంజీ ఛాట్ వరకు సుమారు 1000 అడుగుల ఎత్తుగా ఉండి కఠినతరమైన మెట్లమార్గానికి సులభతరమైన ప్రత్యామ్నాయ నడకమార్గాన్ని నిర్మించి, పాదాచారులైన భక్తులకు ఎంతో గొప్ప సౌకర్యం కల్పించారు. "చరణపాదుక" అన్న ప్రదేశం నుండి "ఆదికుమారి" గుహకు చేరుకొనే మార్గంలో, 0.5 కి.మీ. ముందుగా, ఇంద్రప్రస్థ అనే ప్రదేశం నుండి దర్బారుకు చేరుకొనేందుకు నూతన విశాలమైన నడకమార్గం నిర్మించబడి కొద్ది సంవత్సరాలక్రితం ప్రారంభించబడింది. ఈ కేంద్రం నుండి భవన్ వరకు వృద్ధులు, దివ్యాంగుల కొరకు బ్యాటరీతో నడిచే వాహనాలు సాధారణ టిక్కెట్ ధరతో నడుపబడుచున్నవి. ఈ నూతన నడకమార్గం పురాతన మార్గం కన్నా విశాలంగా ఉన్నది. ఈ మార్గంలో గుర్రపుస్వారి సౌకర్యం నిషేధించబడింది. అందుచేత పాదయాత్రికులకు-వేగంగా తమపక్కగా దూసుకుపోయే స్వారీగుర్రాల వలన కలిగే అసౌకర్యం-తొలిగిపోయింది. అదనంగా ఆ గుర్రాల మలమూత్రాలతో మార్గం అపరిశుభ్రత అన్న సమస్య కూడా తొలగిపోయింది. నూతన మార్గంలో ప్రయాణించడం ఎంతో సౌకర్యంగా ఉంటుంది. కారణమేమంటే మెట్లంటూలేని ఆ మార్గమంతా క్రమంగా ఎత్తును అధిరోహించే విధానం ఒకే పంథాలో ఉన్నందున పాదయాత్రికులకు శ్రమ అన్పించకుండా ప్రయాణం సాగిపోతుంది.

ఈ నూతన మార్గంలో "హిమకోటి" అన్న ప్రాంతం – "ఆదికుమారి" నుండి కి.మీ. 2.75 దూరంలో ఉంటుంది. ఈ మార్గంలో ఎన్నో రమణీయ దృశ్యాలను "సత్య, హిమకోటి, సాకేత్" అన్న మూడు కేంద్రాల నుండి వీక్షించవచ్చు. హిమకోటి అన్నకేంద్రం మిగుల రమణీయమైన ప్రదేశం. ఇచ్చట నుండి మనోజ్ఞమైన లోయ ప్రకృతి సౌందర్యం వీక్షించేందుకు వేయికనులు చాలవు. ఆ ప్రాంతమంతా దైవమాయలా, కష్టాలను సత్వరం తొలగించి ఉపశమనం కల్పించే నిశ్శబ్దం రాజ్యమేలుతుంటుంది. ఈ ప్రదేశంలో ధ్యానం చేసే వారికి మాతృక అనుగ్రహంతో అద్భుతమైన అలౌకిక శక్తిపాత అనుభవం కలుగుతుంది.

## మాతా శ్రీవైష్ణోదేవి దర్బార్

తల్లి ఎడల బిడ్డల గౌరవ ప్రపత్తులు ఎనలేనివి. తల్లి వేంచేసి స్థితమైన పవిత్రగుహ పరిసరప్రాంతమంతా దర్బారు అని పిలువబడుతుంది. అనగా మహాశక్తి యొక్క కొలువు అని అర్ధము.

మహామాతృకకు అనునిత్యం తమ భక్తి ప్రపత్తులను ప్రకటించేందుకు గాను సమస్త దేవతలు ఈ గుహయందు హాజరై దేవిని స్తుతించి జయజయ ధ్వానాలు పలికి హారతులిచ్చి, అనుగ్రహం పొందుతారని భక్తుల అపార విశ్వాసం. ఇరు మార్గాల నుండి భవన్‌కు చేరుకునే భక్తులకు భవన్ ఇంకా సుమారు కి.మీ. 1.5 దూరం ఉందనగా దర్బారు పరిసరాల సంపూర్ణ దృశ్యం మొదటిసారిగా ప్రకటితమవుతుంది. ఆ క్షణంలోనే భక్తులకు కఠినతరమైన ఆరోహణ కష్టమంతా ఒక్కమారుగా మటుమాయమై వేయి ఏనుగుల బలం పుంజుకున్నట్లవుతుంది. తల్లిని చేరుకున్నామన్న సంతోషం వారికి మరింత ఉత్సాహాన్ని శ్రద్ధాభక్తులను కలుగచేస్తుంది.

మార్గమంతా సంపూర్ణంగా దీటైన పైకప్పు కలిగి యుండి విద్యుద్దీపాల సౌకర్యం కూడా అమరి ఉన్నందున భక్తులు రాత్రి పగలు తారతమ్యం

లేకుండా వాతావరణ ప్రతికూలతను సైతం లెక్కచేయక మాతృక దర్శనానికి సాగిపోతూనే ఉంటారు.

భవన్ ప్రాంతం చేరుకోగానే భక్తులకు "శ్రీధర సభ" అనే ఎత్తైన విశాలమైన భవనం కన్పిస్తుంది. ఇది భక్త శ్రీధరుని పేర ఏర్పడిన సొసైటీవారు నిర్మించినట్టిది.

కొద్దిగా ముందుకుసాగితే ఎడమ వైపు కన్పించే బహుళ అంతస్థుల భవనమే "రావల్పిండి సభ". తదుపరి జమ్ము పరిపాలకుడైన మహారాజ రణవీర్ సింగ్ నిర్మించిన భవనాన్ని దర్శించవచ్చు. ఈ భవనంలో "ధర్మార్ధ ట్రస్టు" వారి ఆఫీసు, పడకపైగుడ్డలు, దుప్పట్లు మరియు వంటపాత్రలు మొదలగునవి నిల్వచేసే గదులు మరియు యాత్రికులు బసచేసే గదులు మొదలైన సౌకర్యములు కల్పించబడి వున్నవి. "కాళిక భవన్"యందు, బోర్డువారి పరిపాలనా కార్యాలయము నిర్వహింపబడుచున్నది. గది సంఖ్యలు 4, 8ల వద్ద, భక్తులు తమ సమస్యల పరిష్కారానికై సంప్రదించవచ్చు.

**గ్రూప్ నంబరు తెలుసుకోండి**

భవన్ చేరుకున్న భక్తులు సెక్యూరిటీ పరీక్ష పూర్తి చేసుకున్న వెంటనే దర్శనం కొరకు తమ గ్రూపు నంబరు తెలుసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. చెక్‌పోస్ట్ పక్కనే వున్న "యాత్రాస్లిప్ కౌంటర్"లో గ్రూప్ నంబరు కేటాయించబడుతుంది. ఈ గ్రూప్ నంబరు ద్వారా భక్తులు ఏ వరుస క్రమంలో ఏ సమయంలో తాము మహామాతృక దర్శనం పొందబోతున్నది తెలుసుకుంటారు. ప్రస్తుతం ఏ గ్రూపునంబరువారు దర్శనం పొందుతున్నారని తెలుసుకోవడం ద్వారా వరుసలలో రద్దీ నివారింపబడి దర్శన విధానం క్రమబద్ధీకరింపబడి అత్యధిక మంది భక్తులు దర్శనం పొందగలుగుతారు.

ఏ ఒక్క నిర్దిష్ట సమయంలోనైనా దేవి దర్శనం పొందుతున్న భక్తుల సమూహం "ప్రస్తుత సమూహంగా" పిలువబడుతుంది. ప్రస్తుత

సమూహసంఖ్య మరియు ఒకానొక యాత్రికునికి కేటాయించబడ్డ సమూహ సంఖ్య పరిగణిస్తే మిగిలిన సమూహాలు దర్శనంకోసం వేచియుండవలసిన సమయం నిర్ధారిత మవుతుంది. సాధారణ దినాలలోను, ఓ మాదిరి రద్దీ ఉన్న దినాలలోను భక్తులకు భవన్‌కు చేరుకున్న వెంటనే మాతృక దర్శనం జరుగుతుంది. ఏది ఏమైనప్పటికీ మిక్కిలి రద్దీ ఉండే ప్రత్యేక మాసాలలో ప్రత్యేక పర్వదినాలలో మాత్రం, ఒక్కొక్క సమూహం తమవంతు పిలుపు వచ్చేవరకు కనీసం తొమ్మిది నుండి పది గంటల వరకు వేచియుండవలసి ఉంటుంది.

ఏది ఎలాఉన్నా రద్దీతో సంబంధం లేకుండా భక్తులు భవన్‌కు చేరిన వెంటనే తమ సమూహం నంబరు తెలుసుకోవడం అత్యవసరం.

**భవన్ పరిధిలో యాత్రికులకు సౌకర్యాలు**

శ్రీ మాతా వైష్ణోదేవి ష్రైన్ బోర్డు వారు భక్తుల గరిష్ఠ రద్దీ స్థాయిని దృష్టియందుంచుకొని భవన్ పరిసరాలలో విస్తృత స్థాయిలో సౌకర్యములు కల్పించియున్నారు. ముఖ్య భవన్ సముదాయంలో గౌరి మరియు వైష్ణవి భవన్‌లలో ఫర్నీచర్‌తో కూడిన రూములు అద్దెకు లభిస్తాయి. "మనోకామన భవనమందు" డార్మిటరీ మరియు ఉచిత లాకర్ సౌకర్యం లభిస్తాయి. వీటికి అదనంగా వివిధ ట్రస్టులు, సొసైటీలు భక్తుల సౌకర్యార్థం – బస, ఆహారము తదితర వసతుల కల్పిస్తూ వున్నవి.

శ్రీమాత వైష్ణోదేవి దర్బారుకు అనుబంధంగా "ష్రైన్‌బోర్డు"వారిచేత భక్తకోటికి అత్యావశ్యకములైన, ఆహారము, అల్పాహారము, వైద్యము, మందులు, దూరవాణి, చరవాణి చలికాచే దుప్పట్లు, ఉచిత లాకర్లు, సామాన్లు భద్రపరచు గదులు, భగవతికి సమర్పించే కానుకలు విక్రయించే దుకాణాలు, సమాచారము – ప్రకటనలు, పోలీస్ సహాయము, భద్రత తదాది సమస్త సౌకర్యాలు కల్పించబడి ఉన్నవి.

## దర్శనం కొరకు సిద్ధంకండి

మాతృక దర్శనానికి ముందు అత్యధికభాగం యాత్రికులు, శ్రీవైష్ణవి పాదాలను స్పృశిస్తూ గుహబయటకు వెలువడే చరణగంగ స్నానఘట్టంలో పవిత్ర స్నానమాచరిస్తారు. గుహనుండి బయల్వెడలే పవిత్రజలం నియంత్రించబడి గొట్టాల ద్వారా మందిరానికి దిగువ భాగంలో ఉండే స్నాన ఘట్టానికి మరలించబడుతున్నది. ఈ ఘట్టంలో పవిత్ర స్నానానంతరం భక్తులు (అనగా గదులను ముందుగా నమోదు చేసుకోనివారు) తమ వస్తు సామాగ్రిని, ఉచిత లాకరులయందుగానీ, సామాగ్రిని భద్రపరచు గదుల యందు గానీ (క్లోక్ రూమ్) దాచుకొనవలెను. నగదు మరియు తల్లికి సమర్పించుకొనే కానుకలు తప్ప వేరే ఏ వస్తువులను పవిత్ర గుహలోనికి అనుమతించరు. సాధారణ వాడకపు వస్తువులైన బెల్టు, దువ్వెనలు, కలము, పెన్సిల్, పర్సులు, చేతి సంచులు మొదలైనవి గుహలోనికి తీసుకొనిపోవుట నిషేధించబడింది. అలాగే ప్రసాదం నివేదనకు గాను మిఠాయిలు తీసుకొని వెళ్ళడం కూడా నిషేధించబడింది.

పవిత్ర స్నానాంతరం భక్తులు తమ గ్రూపు నంబరు, పిలువబడినప్పుడు లేదా తెరపై ప్రకటించబడినప్పుడు ఆ ద్వారము వద్దకు చేరుకోవాలి. అచ్చట వారు లోనికి ప్రవేశించ అనుమతి లభిస్తుంది. అలా వారికి జీవితంలో మరువలేని అత్యంత ఆనందదాయకమైన ఘట్టం వారి ముందు ఆవిష్కృతమౌతుంది. అదే, దివ్యమాతృక పవిత్ర గుహలోని సహజసిద్ధ రాతిపీఠంపై కొలువుదీరిన, త్రిపిండాకృతులైన శ్రీమాత సరస్వతి, శ్రీమాత మహాలక్ష్మి మరియు శ్రీమాత మహాకాళుల ఏక సమయ దర్శన భాగ్యం. అనగా ఆ ముప్పురు మాతల ఏకీకృత సదృశరూపమైన మాతా శ్రీవైష్ణవి దివ్యదర్శనం. నిరంతరం మాతృక, పాదాభిషేకం గావించే చరణగంగ ప్రవాహపు హోరు గంభీరంగా దేవిసప్తశతి వినిపిస్తుండగా శ్రీవైష్ణవిని సందర్శించిన భక్తులు సాత్విక గుణ సంపన్నులై దివ్యానందంతో మైమరచి ఒక్కక్షణం, బ్రహ్మానందస్థితికి చేరుకుంటారు. జీవాత్మకు ఈ స్థితి–పరమాత్మ

అనుగ్రహవీక్షణ ఫలమే. మరోలా ఇదీ, తల్లి, తనపిలుపుకు స్పందించిన బిడ్డలకు అందించే అమూల్య, అలౌకిక విభూతి.

**వరుసలలో వేచియుండుట**

సాధారణ దినాలలో దర్శనం కోసం భక్తులు ఒకటి సంఖ్య గల ద్వారం ద్వారా లోనికి నేరుగా ప్రవేశించవచ్చు. సహజమైన భక్తులఆతృతకు అనుగుణంగా సత్వరం వారు పవిత్ర గుహలోని “మాతృక శిలాపీఠం” వద్దకు చేరుకుంటారు.

ఇక ప్రత్యేక పర్వదినాలలో అనగా తీవ్రమైన రద్దీ ఉన్న దినాలలో భక్తులు వరుసలో గానీ, వేచియుండు గదులలో గానీ, ముందున్న వరుస దర్శనం పొంది తరలిపోయే వరకు వేచియుండవలసి వుంటుంది. అలాంటి సందర్భాలలో భక్తులు వీక్షించేందుకు వారి ఆధ్యాత్మిక స్థితికి అనుగుణంగా “ష్రైన్ బోర్డు” వారు, భక్తులు బారులుదీరిన వసారాపొడవునా, వేచియుండు గదులన్నింటా రంగుల దృశ్య శ్రవణ పరికరాలను అమర్చియున్నారు. తద్వారా మాతృక మందిరంలో జరుగుతున్న అభిషేకం, అర్చన మొదలైన కార్యక్రమాలన్నీ ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంటాయి. అంతేగాక హిందూధర్మ సంబంధిత పురాణాల ప్రవచనాలు, పౌరాణిక చలన చిత్రాలు మొదలైనవి కూడా ప్రసారం చేస్తున్నందున భక్తులు ఆధ్యాత్మిక భావనలలో సంపూర్ణంగా లీనమై, మాతృక దర్శనంతో అనూహ్యమైన అలౌకిక ఆనందం పొందుతారు. భక్తుల వరుసలోను, వేచిఉండే గదులలోను త్రాగునీరు, శౌచాలయము మొదలగు సౌకర్యములు కల్పించబడినవి.

భక్తులు వేచియుండే ప్రధాన – విశాలమైన గదిలో భక్తులు తమ వద్దనున్న కొబ్బరి కాయలను మందిర సిబ్బందికి అందించి ప్రతిగా వారి వద్ద నుండి ఒక టోకెన్‌ను పొందవలసి వుంటుంది. భద్రతాకారణం దృష్ట్యా భక్తులు కొబ్బరికాయలను ఈ ప్రదేశం దాటి తమతో తీసుకొనిపోవడానికి అనుమతించబడదు.

దర్శనానంతరం భక్తులు "కొబ్బరి కాయలు తిరిగి అందించు కౌంటర్" నందు టోకెన్ అందచేసి కొబ్బరికాయలు తిరిగి పొందవచ్చు. ఇచ్చటనే మందిర బోర్డువారు భగవతిప్రసాదము, ఒక వెండిపూత కల్గిన మాతృక డాలరు అందచేస్తారు. ఈ డాలరు ఒకవైపు "శ్రీ మాతావైష్ణోదేవి ష్రైన్‌బోర్డు" అన్న పదం ఆంగ్లలిపితో వృత్తాకారంగా ముద్రించబడిఉండగా, మధ్యలో పైభాగాన మేఘము, ఆ ఎత్తున త్రికూట పర్వతశ్రేణి, ముద్రించబడి ఉంటాయి. దిగువగా నాణెపు కుడిభాగాన డాలరు తయారైన, సంవత్సరము, ఎడమభాగాన మాత మందిరము ముద్రించబడి ఉంటుంది. మరో వైపు ప్రాచీన గుహలోని పీఠశిలపై శ్రీమహాసరస్వతి, శ్రీమహాలక్ష్మి, శ్రీమహాకాళుల త్రిపిండాకృతులు ముద్రించబడి ఉంటాయి. పూజామందిరంలో ఈ డాలరు ఉన్న ఇంట సమస్త సంపదలేగాక, విద్య వైజ్ఞానిక పరిణతి సిద్ధిస్తుంది. శత్రుబుద్ధి నశించి నిర్భయం చోటుచేసుకుంటుంది.

## ప్రాచీన ప్రవేశ మార్గం

శ్రీమాత దర్శనం కోసం గుహలోనికి చేరుకోవడానికి నిర్దేశిత ద్వారంలో వరుస క్రమంలో కొద్దిగా ముందుకు సాగిపోతే అభిముఖంగా కప్పుభాగపు ఎత్తున శ్రీమహాగణపతితో కూడి త్రిమాతల మూర్తులు దర్శనమిస్తాయి. ఇచ్చట భక్తులకు తమ కుడిచేతి వైపు, తెరచియున్న నోరు వంటి, దరిదాపు భూమికి సమాంతరమైన ఒక గుహ ప్రవేశ మార్గం దర్శనమిస్తుంది. ఈ ముంగిట అను నిత్యం దీపారాధన, పూజ, హారతి నిర్వహించబడతాయి. ఈ ద్వారమే పవిత్ర పిండాకృతులు స్థితమైన ప్రాచీనగుహకు పురాతన ముఖద్వారము. ఒక సంవత్సర కాలంలో అత్యధిక సమయం ఈ ద్వారం మూసివేయబడి వుంటుంది. ప్రవేశద్వారం నుండి గుహలోని పీఠంవరకు చాలా ఇరుకుగా ఉండినందున ఒక భక్తుడు గర్భాలయంలోకి చేరుకొని దర్శనం చేసుకొనేందుకు ఎంతోకాలం వెచ్చించవలసి ఉంటుంది.

ప్రస్తుత–రోజువారి భక్త సమూహాల రద్దీని దృష్టియందుంచుకొని యోచిస్తే, రోజుకు యాత్రీకుల సంఖ్య 8000 కంటే తక్కువ ఉంటే తప్ప ఈ ద్వారము దర్శనార్థం తెరచి ఉంచబడదు.

ముఖ్యంగా శీతాకాలంలోను, యాత్రా దినాలు కానిరోజులలోను అనగా పవిత్ర గుహను సందర్శించే భక్తులసంఖ్య అత్యల్పంగాఉన్న దినాలలో ప్రాచీన సహజసిద్ధమైన గుహద్వారం భక్తుల ప్రవేశంకోసం తెరువబడుతుంది. ఈ గుహ ముఖద్వారం నుండి ప్రవేశ మార్గం ఎత్తు తక్కువ గాను, ఇరుకుగాను ఉంటుంది. ఈ ద్వారం గుండా కష్టంగా ప్రవేశించి ఉద్ధృతంగా ప్రవహించే "చరణగంగ"కు ఎదురీదుతూ ఆద్యంతం మోకాళ్ళపై పాకుతూ కష్టాన్ని సహించి తల్లి దర్శనం పొందడం ఒక దివ్యానుభవం.

**గుహకు నూతన సొరంగ మార్గాలు**

పైన పేర్కొన్న సమస్యలను అధిగమించడానికి, అనుదినం మరెంతో మంది భక్తులకు తల్లి దర్శనం కల్పించేందుకు గాను బోర్డువారు రెండు నూతనసొరంగ మార్గాలు నిర్మించారు. ఒక మార్గం ప్రవేశం కొరకు ఉపయోగించబడుతున్నది. ఇది నేరుగా మాత గర్భాలయానికి దారి తీస్తుంది. రెండవ మార్గం నిర్గమనానికి గాను ఉపయోగించబడుతున్నది.

సుందర గుహకు ప్రాచీనమార్గ ప్రదేశం దాటి భక్తులు వసారాలో కొంత దూరం అలా ముందుకు నడిస్తే, అసంఖ్యాకమైన గంటలు పైకప్పు నుండి వ్రేలాడుతూ ఉండటం గమనించవచ్చు. ఈ ఘంటానాదం భక్తిభావాన్ని జాగృతం చేయడమే గాక, ఓంకారాన్ని స్ఫురింపచేస్తూ భక్తులలో ఏకాగ్రత శక్తిని పెంచుతుంది. అలా కొద్దిగా ముందుకు సాగితే విశాలమైన పాలరాతి నిర్మితమైన అరుగును గమనించవచ్చు. ఆ అరుగుపై మాత వాహనమైన సింహపు బొమ్మలు దర్శనమిస్తాయి. ఆ ప్రక్కనే గల హవనకుండము అనునిత్యం ఋత్వికుల మంత్రోచ్చారణ మార్మోగుతుండగా, సమర్పించే

హవిస్సులతో అగ్నికీలలు ఆకాశన్నంటుతూ పరిసర పర్యావరణం, కాలుష్య రహితమవుతుంది.

ఉభయ సొరంగ మార్గాల మధ్య మాతృక చండిక యొక్క ఎత్తైన పంచలోహ విగ్రహం నెలకొల్పబడి ఉన్నది. ఈ విగ్రహం నూతన సొరంగ మార్గాలలో ప్రవేశించడానికి బారులు దీరిన భక్తులకు అభిముఖంగా ఉంటుంది. ఈ మాత విగ్రహం, మాతృక తనపిలుపును అందుకొని సత్వరం అరుదెంచిన బిడ్డలను ప్రేమమీర ఆహ్వానించి ఆశీస్సులను అందిస్తున్నట్లుంటుంది.

నిలువెత్తులో నున్న నూతన ప్రవేశమార్గంలో విద్యుద్దీపాల కాంతితో చరణగంగ నీరు పాదాలను తాకి పవిత్రులను చేస్తుండగా, భక్తులు తల్లి దర్శనానికి పవిత్ర గుహ గర్భాలయానికి చేరుకుంటారు. ముగ్గురమ్మలను, మూలపుటమ్మను ఒకేమారు కాంచిన భక్తునికంట ఆనందాశ్రువులు జాలువారుతుండగా తన కష్టాలన్నింటిని మరచి అతడు సత్త్వగుణ సంపన్నుడౌతాడు. శరణాగతి పథంలో పరమాత్మ చెంత ఉన్నందున భక్తుని ఆత్మశక్తి, మనశ్శక్తి ఉద్దీపన చెంది ప్రకాశిస్తాయి. ఇలాంటి భగవతి ప్రసాదిత దైవిక స్థితి - జీవాత్మ - పరమాత్మలు అభేదమన్న సిద్ధాంత ప్రాతిపదికకు, వివరణలకందని సారూప్యమై ఉండవచ్చు !.

### భవన్ పరిసరాలలో సందర్శనీయ మందిరములు

### (అ) శ్రీరామ మందిరం - దిగువన దుర్గమందిరం

మాత శ్రీవైష్ణోదేవి "దర్బారు" దర్శనానంతరం భక్తులు నిర్గమన మార్గంలో కొంత దిగువ ప్రాంతానికి చేరుకుంటారు. పవిత్ర గుహకు దిగువగా "ఖాన్-చౌక్" అన్న ప్రదేశంలో నిర్మితమైన ఈ శ్రీరాముని ఆలయం దర్శించదగ్గది. మహంత్ శ్రీశ్రీ బాబా రామ్ రతన్ దాస్ 1974వ సం॥ మార్చి నెలలో ఈ ఆలయ నిర్మాణం పూర్తి గావించి, విగ్రహ ప్రతిష్ఠ, తదాది క్రతువులు నిర్వహించారు. శ్రీ బాబాజీ "సూర్యకుండం"లో సుదీర్ఘ తపస్సు

ఆచరించిన కాలంలో శ్రీరామభక్త హనుమాన్ ప్రత్యక్షమై, మాత శ్రీవైష్ణవి గుహ సమీపంలో రామమందిర నిర్మాణం కావించమని ఆదేశించినట్లు, తదనుగుణంగా ఈ ఆలయ నిర్మాణం జరిగినట్లు తెలియుచున్నది.

ఈ దేవాలయములో సీతామాత, లక్ష్మణ సమేత శ్రీరామచంద్రులు, వారికి అభిముఖంగా భక్త హనుమాన్‌ల అందమైన విగ్రహాలను దిగువ భాగాన శ్రీ దుర్గామాత విగ్రహము, వీక్షించిన భక్తులు నిశ్చేష్టులౌతారు. ఈమందిరము ధ్యానమాచరించటానికి అనువైనది. దర్శనానంతరం, హారతి స్వీకరించిన భక్తులు, సమీపంలోని లోయలోనికి, దిగుడుమెట్లు వరుసన, క్రిందికి చేరి అచ్చటి చిన్న గుహలోని శంకర మహాదేవుని దర్శించుకుంటారు.

**(ఆ) ప్రాచీన శివగుహ**

రామమందిరానికి దిగువగా ప్రకృతి సిద్ధమైన ఈ ప్రాచీన గుహ మాతావైష్ణోదేవి గుహకు సమకాలీనమైనది. ఈ గుహకు ఏటవాలుగా ఉండే కప్పు భాగం నుండియే గాక లోని మూడు దిక్కులా కుడ్యభాగముల నుండి మూడువందల అరవై రోజులు ఉత్పన్నమయ్యే నీటి ఊట ఏకంగా పెనుధారగా మారి గుహ అంతటా ప్రవహిస్తూ ఉంటుంది. ప్రముఖంగా కప్పు భాగం నుండి సమీకృతమైన ధార పరమశివుని శిరముచేరి అభిషేకము గావిస్తుంటుంది.

ఇచ్చట స్ఫటిక లింగాకృతితో నున్న శంకరభగవానుని ప్రతిష్ఠ జరిగియున్నది. అలా శక్తి స్థితమైన ప్రదేశంలో పరమ శివుని కూడా సందర్శించడం భక్తులకు వర్ణనాతీతమైన అలౌకిక అనుభూతి కల్గిస్తుంది.

క్రితంలో ఈ గుహయొక్క ఉనికి కేవలం స్థానికులైన భక్తులకు మాత్రమే తెలిసి ఉండేది. కాని మాతృక మందిరం నిర్వాహణ మరియు నియంత్రణ శ్రీమాతా వైష్ణోదేవి ష్రైన్ బోర్డు వారి ఆధ్వర్యానికి మారిన పిమ్మట, ఈ గుహ మార్గం సుగమం కావించబడింది. విద్యుత్ సౌకర్యం కూడా

కల్పించబడింది. బోర్డువారు వివిధ సమాచార మాధ్యమాల ద్వారా ఈ గుహ ప్రాశస్త్యాన్ని కూడా విస్తృతంగా ప్రచారం గావిస్తున్నారు.

అందుచేత మాతృదర్శనానంతరం భక్తులంతా ఈ గుహను సందర్శించి, పూజించి, పవిత్ర అభిషేక జలాన్ని శిరస్సున ప్రోక్షించుకొని పునీతులౌతారు. ఆ విధంగా భక్తులు అభిషేక ప్రియుడైన సదాశివుని ఇచ్చట సదాభిషిక్తునిగా దర్శించి ధన్యులౌతారు.

**(ఇ) భైరవనాథుని మందిరం**

శ్రీ భైరవనాథుని మందిరం భవన్ నుండి కి.మీ. 1.5 దూరంలో, శ్రీమాత వేంచేసియున్న కొండగుహకు సమీపంలో ఉన్న కొండశిఖరంపై నిర్మించబడింది. ఈ కొండ నిట్టనిలువుగా ఏర్పడి ఉన్నందున మందిరం చేరుకోవడానికి భక్తులు నిలువెత్తుగా నిర్మితమైన నిచ్చెనమెట్లను పోలిన మార్గంలో అధిరోహించాలి. మెట్ల మార్గమే కాక, కాంక్రీటుతో నిర్మించిన నడక మార్గాన్ని కూడా భక్తులు ఎంపిక చేసుకోవచ్చు. నడక మార్గంలో అవసరానికి అనుగుణంగా గుర్రపు స్వారీని గానీ, పల్లకి యందు ప్రయాణ సౌకర్యాన్ని గాని ఉపయోగించుకోవచ్చు.

ఇలా భవన్ నుండి భైరవబాబా మందిరానికి చేరుకొనే ఈ మార్గం తదుపరి సాంజీఛాట్ వరకు పొడిగింపబడి ఉన్నది. భవన్ నుండి భైరోబాబా మందిరం చేరుకోవడానికి "రోప్‌వే" సౌకర్యం కూడా కల్పించబడియున్నది. ఇది భవన్ ప్రాంతంలో ఒక ప్రత్యేక ఆకర్షణ. ఇది కఠినతరమైన మెట్లు, నడక మార్గాలకు ప్రత్యామ్నాయమై, ఎంతో సుగమం, సౌకర్యవంతం, వేగవంతం అయినట్టిది. భవన్‌యందలి "మనోకామన" అనే భవనానికి (భక్తులకు డార్మిటరీ సౌకర్యం కల్పించే భవంతి) ఎదురుగా ఉన్న భవనంలో టిక్కెట్లు పొందవచ్చు. ఇచ్చటి నుండి ప్రారంభమయ్యే రోప్‌వే ప్రయాణం తిరిగి ఇచ్చటకు చేరడంతో ముగుస్తుంది.

భైరవబాబా మందిరం నెలకొన్న ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 6619 అడుగుల ఎత్తులో ఉన్నది. కావున ఈ ప్రదేశం యాత్ర మొత్తంమీద అత్యధిక ఎత్తైన ప్రదేశంగా చెప్పుకోవచ్చు.

పురాణాంతర్గతంగా, శ్రీ వైష్ణవి అనుగ్రహించిన విధంగా శ్రీ మాత దర్శనానంతరం భైరవ్‌బాబాను దర్శించనిదే భక్తులు తమ సంపూర్ణ యాత్రాఫలాన్ని పొందలేరు.

పూర్వం హంసలి అనే గ్రామంలోని పండిత శ్రీధరుని ఇంట నిర్వహించబడిన విందులో మద్యమాంసాలను వడ్డించమన్నాడు భైరవనాథుడు. వైష్ణవుని ఇంట వారి సాంప్రదాయంతో జరుగుతున్న విందులో ఆ పదార్థములు కోరదగినవి కావని వారించింది, కన్యక ఆదికుమారి. మొండి పట్టుదలతో ఆ కన్యను పట్టి నిలిపి ఆమె సంపూర్ణ వివరాలు తెలుసుకోదలచి ఆమెను వెంబడించాడు భైరవనాథుడు.

తుదిగా మాతృక ఆగ్రహానికి గురై ఆమెచే వధింపబడ్డాడు. అలా ధన్యుడైన భైరవుడు పశ్చాత్తాపంతో తల్లిని శరణుజొచ్చాడు. తాను భావితరాల వారిచే దుష్టునిగా పరిగణింపబడకుండేలా అనుగ్రహించమని ఆర్ద్రతతో ప్రార్థించాడు. కరుణామయి మాత “తన దర్శనానంతరం భక్తులు భైరవనాథుని దర్శించుకోకుంటే వారికి సంపూర్ణ యాత్ర ఫలం సిద్ధించబోదన్న” తీర్మానంతో భైరవుని అనుగ్రహించింది.

భైరవవధ సందర్భంలో అతని శిరస్సు తెగిపడిన ప్రదేశంలో ఈ మందిరం నిర్మింపబడగా, మొండెము భాగాన్ని మాతృక ప్రాచీన గుహ ముఖద్వారం వద్ద భక్తులు దర్శించవచ్చు.

భైరవనాథుని మందిర ముఖద్వారపు మధ్యభాగంలో శ్రీ హనుమాన్ విగ్రహం దర్శనమిస్తుంది. మందిర గర్భంలో భైరవనాథుని తల పిండాకృతిగా ఉంటుంది. దానికి వెనుకగా చిన్న ఆంజనేయ స్వామి విగ్రహం ఉంటుంది.

అనునిత్యం భైరవుని నల్లని వస్త్రంతోను, ఆంజనేయుని ఎర్రని వస్త్రంతోను అలంకరిస్తారు. ఈ మందిరం పక్కనే ఒక చిన్న హవనకుండం, దానికి సమీపంలోనే దేవి ఆయుధమైన త్రిశూలం ఉన్నవి. హవన కుండమందలి భస్మము ఎంతో పవిత్రమైనది. నిత్యం భైరవ బాబాను ఆరాధిస్తూ ఈ విభూతిని ధరించడం లేదా గృహంలో దైవమందిరంలో భద్రపరచడం వల్ల కుటుంబ సభ్యులకు భీతి, ప్రాణహాని దరిచేరవు. ముఖ్యంగా పసిబిడ్డలకు ఎలాంటి బాలారిష్టాలు, అపమృత్యువు సంభవించవు. ఇంటిల్లిపాదికి రక్షణ కల్పించబడుతుందని భక్తులు అపార విశ్వాసం.

అలా ఆదికుమారిని గుర్తించలేక భక్తిహీనుడై దుష్ప్రవర్తనతో మాతృక ఆగ్రహానికి లోనై ఆమెచే వధించబడ్డ భైరవనాథుడు, ఆంత్యంలో ఆత్మజ్ఞాన ఉద్దీప్తుడై తల్లిని శరణుకోరి, తన ప్రవర్తనకు మిక్కిలిగా చింతిస్తూ తల్లికి తన ఆత్మను సమర్పించుకొని, దాసుడై ధన్యుడయ్యాడు. తల్లి ఆదేశంతో భైరవనాథుడు తనను సందర్శించిన భక్తులకు ఎలాంటి అరిష్టములు వాటిల్లకుండా కాపాడుతుంటాడు. భైరోంబాబా మందిరానికి కి.మీ. 0.5 దూరంలో ఉన్న "ఓం" అనే రమణీయ లోయ దృశ్యము యాత్రికులకు ప్రత్యేక ఆకర్షణీయకేంద్రము.

**(ఈ) గుర్రాలశాల**

శ్రీవైష్ణవి ప్రాచీనగుహకు కొద్దిదూరంలో పూర్వం రాజులు ఉపయోగించిన గుర్రాలశాల ఉన్నది. పలురకాల వృక్షాలతో సతతం హరితం నింపుకొని ఉండే ఈ ప్రదేశం ఎంతో రమణీయంగా ఉంటుంది.

**యాత్రయందు ఇతర సందర్శనీయ ప్రదేశములు**

మాతా శ్రీవైష్ణవి స్థితమైన పవిత్రగుహకు చేరుకొనేందుకు సాగించే యాత్ర జమ్మునగరం నుండి ఎంతో ఆధ్యాత్మికతను సంతరించుకున్నదై రమణీయమైన ప్రదేశాల మీదుగా సాగుతుంది. వానిలో కొన్ని మాత

లోకకళ్యాణార్థం అవతరించిన కారణంగా, ఆమెపాద స్పర్శతో పునీతమైన క్షేత్రములు. మరికొన్ని, మాతృక తపమాచరించిన ప్రదేశాలైనందున సహజ దైవికశక్తికి తపోశక్తిని కూడా మేళవించుకొని ప్రకాశిస్తున్న దివ్య క్షేత్రాలు.

కొన్ని క్షేత్రాలలో శ్రీమాత తన దైవలీలలను ప్రదర్శించి మానవాళికి ఆస్తికత, భక్తిభావనలను పెంపొందించుకొని ధర్మబద్ధమైన జీవితం సాగించి దైవసాయుజ్యం పొందే మార్గాలను ప్రసాదించింది. ఆ విధంగా "సృష్టి, స్థితి, లయ, తిరోధాన, అనుగ్రహ", అను పంచ కార్యాలను నిర్వహించే పంచకృత్యపరాయణియైన మహామాతృక కలియుగంలో మానవరూపం ధరించింది. ఆతల్లి తుదిగా త్రివిధ శక్తిరూపాలైన సరస్వతి, మహాలక్ష్మి, మహాదుర్గలతో ఐక్యమయిన పవిత్ర గుహయే "మాతృక దర్బారు" అని పిలువబడుతున్నది.

త్రికూట పర్వతపు పాదభాగాన కాట్రానగరం నెలకొని ఉన్నది. ఈ నగరం వరకు రైలుమార్గం పొడగింపక పూర్వం భక్తులు వివిధ ప్రాంతాల నుండి, విమాన ప్రయాణంద్వారా గాని, రైలుప్రయాణం ద్వారా గాని, రోడ్డుమార్గాన గాని, ప్రథమంగా జమ్ము నగరం చేరుకొనేవారు. ప్రస్తుతం కాట్రా నగరాన్ని దేశంలోని అన్ని ప్రముఖ నగరాల నుండి రైలుమార్గం ద్వారా సౌకర్యవంతంగా చేరుకోవచ్చు.

పూర్వం కొందరు భక్తులు జమ్మూ నగరం నుండి పాదయాత్రగా భవన్‌లోని భగవతి దర్బారు చేరుకొనేవారు. ఆ యాత్రా మార్గంలోను, జమ్మునగర పరిసరాలలోను వివిధ సందర్శనీయ కేంద్రాలను గూర్చి తెలుసుకుందాం. ప్రథమంగా,

**జమ్ము నుండి కాట్రా మార్గంలో దర్శనీయ క్షేత్రములు**

జమ్ము నగరం నుండి కాట్రా వరకు ప్రతి 10 లేదా 15 మిషముల వ్యవధితో సాధారణ మరియు సౌకర్యవంతమైన బస్‌లు నడుస్తుంటాయి.

రైల్వే స్టేషన్ వద్ద నుండి సౌకర్యవంతమైన బస్‌లు నడుస్తుండగా అచ్చటికి 3 కి.మీ. దూరంలో ఉన్న రాష్ట్ర రోడ్డుట్రాన్స్‌పోర్టు బస్‌స్టాండు నుండి సాధారణ బస్‌లు అందుబాటులో ఉంటాయి. కాట్రా చేరుకోవడానికి 2 గంటల సమయం పడుతుంది. ఈ ప్రయాణమంతా ఎత్తైన కొండల మధ్యగా సాగుతుంది. మార్గంలో భద్రతా సిబ్బంది వారి తనిఖీలు జరుగుతుంటాయి. ఈ ప్రాంతం పాకిస్థాన్‌తో సరిహద్దులోని కార్గిల్ వెళ్ళే మార్గంలో ఉంటుంది. కావున జాతీయ భద్రతా సిబ్బంది ఈ ప్రాంతాన్ని "నిరంతర తనిఖీ – పర్యవేక్షణ" ఆవశ్యకమైన ప్రదేశంగా గుర్తించారు.

## (క) జమ్మూ నగరంలో బస-భోజన సౌకర్యాలు

ఇతర గుర్తింపు పొందిన యాత్రాస్థలాలలాగా జమ్ము నగరంలో కూడా యాత్రికుల అవసరాలకు, ఆర్థిక వనరులకు అనుగుణంగా వివిధరకాల బస మరియు భోజన సౌకర్యాలతో కూడిన హోటళ్ళు వున్నవి. ఇక మాత శ్రీవైష్ణోదేవి ష్రైన్‌బోర్డువారు జమ్ము రైల్వే స్టేషన్‌కు ఎదురుగా "వైష్ణవిధామ్" అన్న భవనంలో భక్తులకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన బస కల్పిస్తున్నారు. మాత శ్రీవైష్ణవి దర్శనార్థం కాట్రా సందర్శించే భక్తుల కోసం మాత్రమే ఈ సౌకర్యం కల్పించబడుతుంది. ఈ భవన సముదాయంలో డార్మిటరీ, స్వీయగదులు విశాలమైన ముందుగదితోకూడి పలు పడక గదులు, (సూట్) వంటి సౌకర్యాలకు అదనంగా విశాలమైన భోజనశాల ఏర్పరచియున్నారు. ఇచ్చట సముచిత ధరలతో పరిశుద్ధంగా వండిన సంపూర్ణ శాకాహారం లభిస్తుంది. ఈ ప్రాంగణంలో మాతశ్రీ వైష్ణవి పూజాద్రవ్యాలు, వివిధ రకాల ఛాయాచిత్రాలు, జ్ఞాపికలు నామమాత్రపు ధరలతో లభిస్తాయి. ఈ నగరంలో ఇతర ధార్మిక సంస్థల, ట్రస్టుల నిర్వహణలో మరెన్నో ధర్మశాలలు, ఉచిత వసతి గృహాలు నిర్వహింపబడుతున్నాయి.

## శ్రీ రఘునాథ దేవాలయం - జమ్ము

భారతదేశంలోని ప్రసిద్ధ ప్రాచీన దేవాలయాలలో, జమ్ము నగరంలోని రఘునాథ దేవాలయం ఒకటి. ఈ దేవాలయాన్ని క్రీస్తు పూర్వం 1856 సం॥లో అప్పటి జమ్ము రాజ్యాధీశులైన మహారాజా రణబీర్ సింగ్ నిర్మించారు. ఈ దేవాలయం సాధారణ బస్‌స్టాండ్ సమీపంలో ఉన్నది. అద్భుతమైన ఈ నిర్మాణశైలి, సాంకేతిక ప్రజ్ఞ, యాత్రికులను మంత్రముగ్ధులను చేస్తాయి. ఈ దేవాలయ నిర్మాణం "శ్రీరామ మూలయంత్రం" ప్రతిష్ఠానుసారం ఆగమశాస్త్రబద్ధంగా జరిగినది. ఈ దేవాలయ ప్రాంగణంలో పదునారు దేవీదేవతల మందిరాలు అద్భుతమైన సాంకేతిక, శిల్పనైపుణ్యంతో నెలకొని ఉన్నవి. ఎత్తైన ఈ ఆలయాల గోపురాలు భారత దేశపు తలమానికంలా ఎంతో ఘనతను సంతరించుకొని గర్వంగా నిలిచి భక్తుల మనస్సును దోచుకుంటాయి. గోపురాలపైనా, దేవాలయాల అంతర్గతంగాను ఉన్న శిల్పసంపద ఎంతో కళాత్మకమై, భక్తులను ఆశ్చర్యచకితులను చేస్తుంది.

దేవాలయాల నగరంగా పేరొందిన జమ్ము - ప్రకృతి సిద్ధంగానే ఎంతో అందమైన ప్రదేశం. ఈ నగరం, ఎన్నో దేవీ - దేవతల ఆలయాలకు కాణాచి. "భాగ్-ఎ-బాహు" అప్పుఘర్ - చిన్నసరస్సులో బోటింగ్ వంటి ఆసక్తిదాయకమైన అంశాలతో చిన్నపిల్లలకు ఎంతో ఆకర్షణీయమైనది ఈ ప్రదేశం.

బాహుదుర్గంలో నెలకొన్న మాతా మహాకాళి ఆలయం ఎంతో ఆకర్షణీయంగా ఉండటమే కాక భక్తులను ఎనలేని భక్తి పారవశ్యంతో ముంచెత్తి, కోరికలను నెరవేరుస్తూ అపార ధైర్య సాహసాలను కూడా ప్రసాదిస్తుంది. అమర్‌మహల్ మ్యూజియం, ముబారక్ మండిలోని "డోగ్రా కళల ప్రదర్శనా కేంద్రం", వన్యమృగ అభయారణ్యం, ఈ నగరంలోని ఇతర ముఖ్యమైన సందర్శనీయ కేంద్రాలు. ఇవన్నీ ఒకదానికొకటి ఎంతో దగ్గరగా నెలకొని ఉన్నాయి.

**(ఖ) కౌల్ - కంథోళి**

జమ్మూ నగరంనుండి కాట్రా మార్గంలో జాతీయ రహదారిపై 8 కి.మీ. దూరంలో "నగ్రోత" అనే పట్టణం దర్శనమిస్తుంది. ఈ పట్టణానికి చేరువలో "కౌల్-కంథోళి" అనే ప్రాచీనమైన, చారిత్రాత్మకమైన ప్రదేశాన్ని మనం సందర్శించవచ్చు. పూర్వం జమ్మూ నగరం నుండి మాతా వైష్ణోదేవి సందర్శనార్థం భక్తులు పాదయాత్ర కావించేవారు. వారి యాత్రలో "కౌల్-కంథోళి" చేరుకోవడం మొదటి మజిలీగా భావించేవారు. ఈ ప్రదేశంలోని ఆలయంలో తల్లిని దర్శించడం మాతృక అనుగ్రహించిన మొదటి దర్శనంగా భావించి ఆనందించి, తదుపరి పాదయాత్రకు ఆవశ్యకమైన కొత్తశక్తిని పుంజుకొనేవారు.

బాలికగా శ్రీ వైష్ణవి, స్థానిక సమవయస్కులైన బాలికలతో కూడి ఇచ్చట బంతి ఆట ఆడుకొంటూ తన చేష్టలతో అందరినీ అబ్బురపరచేదని, తరతరాలుగా చెప్పుకోబడుతున్న భక్తుల ప్రగాఢ ఆత్మీయ రూఢిఅంశం.

అలా బాలగా తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటున్న రోజుల్లో ఒక దినం ఒక బాలిక మిక్కిలి దాహంగొన్నదై విలవిలలాడుతూ, మాతృకను త్రాగునీరు అందించమని కోరింది. అంతట మాతృక ఆమెకు ఒక పాత్రను అందించింది. భూగర్భ నీరు మృగ్యమైన ప్రదేశంలో ఒకచోట ఆ పాత్రను గాలిలో ఊపమని కోరింది. ఆ బాలిక గాలిలో అలా ఊపగానే ఆశ్చర్యం! గ్రామ ప్రజలంతా నిర్విణ్ణులై వీక్షిస్తుండగా ఒక్కమారుగా భూమి నుండి నీరు ఉవ్వెత్తున ఎగిసిపడింది. ఆనాటి నుండి ఈ ప్రదేశం "కౌల్ కంథోళి" అని పిలువబడుతుంది. ఈ ప్రాంతీయ పదానికి అర్థం "పాత్రనుగాలిలో ఊపుట".

పురాణాంతర్గతంగా మాతశ్రీవైష్ణవి ఈ గ్రామంలో సుదీర్ఘకాలం నివశించినట్లు తెలుస్తోంది. మహాభారత ఇతిహాస కాలంలో ధర్మరాజాది

పంచపాండవులు తమ తల్లులు కుంతి, మాద్రిలతో కూడి ఈ ప్రాంతంలోని ఒక ఆశ్రమమందు నివసించేవారు. మాత ఆశీస్సులతోనే పాండవులు తమ తల్లిదండ్రులకు జన్మించారని వారు బాల్యంలో సింహభాగకాలం (ఎక్కువ కాలం) తల్లిని సేవిస్తూ ఈ ప్రాంతంలోను, తదుపరి శ్రీ వైష్ణవి పవిత్రగుహ సమీపంలోను నివసించారని తెలియుచున్నది. మాత ఎడల తమ భక్తి ప్రపత్తులకు నిదర్శనంగా కౌల్-కంథోళిలో ఆలయం వారే నిర్మించారని చెప్పబడుతున్నది.

ఈ ఆలయంలో కూడా శ్రీమాత పిండాకృతిశిల రూపంతో దర్శనమిస్తుంది. శ్రీమాత తన త్రికూట పర్వతపు ప్రయాణానికి గాను ఈ గ్రామం వీడిన రోజుననే, ఈ పిండాకృతిశిల భూమినుండి బయల్వెడలి స్వయంభువుగా పూజలను అందుకుంటున్నది. ఈ ప్రాంగణంలో బహు దేవీదేవతల ఆలయాలు నిర్మించబడినవి. చిన్నవైనప్పటికి, ఈ ఆలయాలు, అర్చామూర్తులు, శిల్పసంపద, ఎంతో అందంగా మలచబడినందున, వీక్షించగానే భక్తులకు దివ్యానందం ప్రాప్తిస్తుంది.

### (గ) దేవమాయి

తల్లి ద్వితీయ దర్శనం. జమ్మూ - కాట్రా జాతీయ రహదారిలో జమ్ము నుండి దరిదాపు 43 కి.మీ.ల దూరంలో “న్యూమెయిన్” అనే చిన్న గ్రామం ఉంది. ఇక్కడ నుండి పక్కకు చీలి 3.5 కి.మీ.లు ప్రయాణిస్తే దేవమాయి అన్న గ్రామం చేరుకుంటాము. ఇచ్చట దేవాలయంలో మాత వైష్ణోదేవిని దర్శించిన భక్తులు అది తల్లి ప్రసాదించిన రెండవ దర్శన భాగ్యంగా తలచి తన్మయం చెందుతారు. ఈ ఆలయం ఎత్తైన కొండ మీద నిర్మించబడింది. ఈ ప్రదేశంనుండి, ప్రకృతి సౌందర్యాన్ని, నిండుగా సంతరించుకొన్న త్రికూట పర్వత శిఖరాలను ప్రస్ఫుటంగా వీక్షించవచ్చు. పూర్వం జమ్మూ నుండి పాదయాత్ర కావించే భక్తులు ఈ ప్రదేశాన్ని తమ రెండవ మజిలీగా భావించి

– మాతృకకు దగ్గరౌతున్నామన్న ఆనందంతో శ్రమను మరచి రెట్టించిన ఉత్సాహంతో ప్రయాణం కొనసాగించేవారు.

తన జీవితాంతం మాతృకను మిక్కిలి భక్తి శ్రద్ధలతో సేవించి తరించిన "దేవమాయి" అన్న భక్తురాలిపేరిట ఈ గ్రామం ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయాన్ని సందర్శించే భక్తుల సంఖ్య ప్రస్తుత కాలంలో అంతంతమాత్రంగా ఉంటున్నది. కానీ పురాణాంతర్గతంగా ఈ క్షేత్రపు మాహాత్మ్యం, భక్తుల ప్రగాఢ విశ్వాసంతో జతకలిసి బలంగా వేళ్ళూని, కొమ్మలు, ఊడలు అపరిమితంగా విస్తరిస్తుండగా ఆకాశమంత వటవృక్షమై వందల సంవత్సరాల నుండి భక్తుల కోర్కెలుఈడేరుస్తూ అభయమనే నిశ్చింతను నీడగా కల్పిస్తోంది.

శ్రీమాత బాలకన్యకగా దైవిక మహత్తును ప్రదర్శిస్తూ సుదీర్ఘ తపస్సు నాచరిస్తూ నూటపది సంవత్సరాల కాలం ఈ గ్రామంలో నివసించిందని భక్తుల ధృడ నమ్మకం. ఆ బాలకన్య తనను సందర్శించేందుకు వచ్చిన భక్తులకు అర్హత కనుగుణంగా వరాలను ప్రసాదించేది. తన తపోదీక్ష ముగిసిన పిమ్మట ఆ తల్లి భక్తులసమక్షంలోనే శిలా విగ్రహంగా రూపుదాల్చి నిత్య పూజలందుకుంటున్నది. శ్రీమాత ధరించిన త్రిశూలము కూడా ఇచ్చట భద్రపరచబడింది. మాతృక విగ్రహంతో పాటు ఈ త్రిశూలం కూడా పూజలందుకుంటున్నది. శ్రీ వైష్ణోదేవి స్వహస్తాలతో నాటబడిందన్న ఒక మామిడి చెట్టు ఈ మందిరానికి కొద్దిదూరంలో నెలకొని ఉంది.

పూర్వకాలంలో జమ్మూ నుండి కాట్రా ప్రయాణం "దేవమాయి" నగరం మీదుగా జరుగుతుండేది. ఆ రోజుల్లో తల్లి పవిత్ర గుహ చేరదలచిన భక్తులు, ముందు రోజు రాత్రి ఇచ్చట, నిద్ర చేసేవారు. కానీ, నేడు కాట్రా నగరానికి నేరుగా రహదారి కల్పించబడినందున, ఆ నగరంలో ఏర్పడిన అన్ని సౌకర్యాలను దృష్టియందుంచుకొని, భక్తులు కొద్దిమంది మాత్రమే "దేవమాయి" గ్రామాన్ని సందర్శిస్తున్నారు. అయినప్పటికీ ఈ ప్రదేశంలో

సహజసిద్ధమైన ప్రకృతిదృశ్యాల సౌందర్యం, కనువిందుచేసే త్రికూటపర్వత శిఖరాల ప్రత్యేక ఔన్నత్యశోభ– మాత తిరుగాడి స్థితయైనందున, ఈ గ్రామం సంతరించుకున్న పవిత్రత–ఈగ్రామాన్ని ప్రముఖ సందర్శనీయ కేంద్రంగా తీర్చిదిద్దినవి.

## కాట్రా నగరంలో

### (క) భూమిక మందిరం

ఈ మందిరం శ్రీమాతావైష్ణోదేవి బాలకన్యకగా కలియుగంలో ప్రప్రథమంగా భక్తుడైన శ్రీధరపండితుని అనుగ్రహించ పాదంమోపిన ప్రదేశం. “భూమిక!” అనగా కథకు పీఠిక. లేక ముందుమాట అని అర్థం. అంతేగాక భవిష్యత్‌లో తన లీలావైచిత్రిని ప్రదర్శించేందుకు మాతృకవేసిన మొదటి అడుగు.

ఈ మందిరం కాట్రా–పెన్‌థాల్ మార్గంలో కాట్రానగరానికి రెండు కిలోమీటర్ల దూరంలో నెలకొని ఉంది. భూమిక అనే ఈ ప్రాంతం అలనాడు “హంసలి” అని పిలువబడిన గ్రామం. ఎత్తైన పర్వతశిఖరాలనుండి వయ్యారాలు ఒలకబోస్తూ అందమైన జలపాతంగా అలరిస్తూ, భూమిని స్పృశించగానే ఇనుమడించిన ఉత్సాహంతో పరవళ్ళుతొక్కుతూ ప్రవహించే కాలువ ఇచ్చటి ప్రత్యేక ఆకర్షణ. ఈ కాలువకు ఇరువైపులా ఈ గ్రామం విస్తరించి ఉన్నది. ఈ గ్రామానికి నలువైపులా కొండచరియలు నిండుగా హరితాన్ని నింపుకొని ప్రకాశిస్తూ ఉంటాయి. ఈ కాలువ పరివాహక ప్రదేశమంతా ఎత్తైనచెట్లు, వాని ఆధారంతో పైకెగబాకి విరగబూసిన తీగలు, పలురకాల ఫలవృక్షాలు, చిలకాకుపచ్చ చీరకట్టినట్లు నిండుహరితంతో ప్రకాశించే భూమాత. అలా శోభాయమానమైన అంశాలన్నింటి కలగలుపుగా, ఎంతో మనోజ్ఞంగా, భూమిక ప్రదేశం యాత్రికులను మంత్రముగ్ధులను చేస్తుంది.

దేవి దర్శనం కొరకు భక్తులు కాలువపైగల వంతెనదాటి ఆవలి ఒడ్డుకు చేరుకోవాలి. ఈ వంతెనపై నడక ప్రారంభించేముందు భక్తులు వారి కుడిచేతి పక్క కొండకున్న భైరవబాబా బిలమును గమనించవచ్చు. భక్తులు వంతెనదాటి ఈ పవిత్ర ప్రదేశాన్ని చేరుకుంటారు. వారు తమ వామహస్తపు వైపునుండి, వరుస క్రమంలో, ప్రాచీన శివాలయం, గుహను బోలిన పండిత శ్రీధర్ మరియు వారి ధర్మపత్ని శ్రీమతి సులోచనాదేవి గార్ల మందిరం, మాతాజీ ధర్మశాల, భూమిక మందిరాలను దర్శించవచ్చు. ఇతిహాసానుసారం, సంతానభాగ్యం నోచుకోని శ్రీధరపండితుడు అనుదినం మాతృకను భక్తిమీర పూజిస్తూ తుదిగా "దేవీ అపరాధ క్షమాపణ స్తోత్రం" చేస్తూ తనకు సంతానం ప్రసాదించమని దీనంగా వేడుకొనేవాడు. అతని భక్తికి మెచ్చిన మాత శ్రీవైష్ణవి సప్తకన్యకల పూజలో తానొక్కరిగా పూజలందుకొని అనుగ్రహించింది.

ఆ విధంగా ఏడువందల సంవత్సరాల పైచిలుకు కాలంక్రితం ఈ ప్రదేశమందు వైష్ణోమాత తన దివ్యపాదం మోపి, కాలిగజ్జల ధ్వని-మంగళాశాసనం కాగా, తన భవిష్యత్ లీలావైచిత్రికి, నాంది పలికింది. ఆ ప్రథమాంకం ఏనాటికి ముగింపులేనిదై, దుష్టశిక్షణ-శిష్టరక్షణ ధర్మపరిరక్షణ నిర్వహింపబడుతున్నవి. ప్రప్రథమంగా జగజ్జననిదర్శనం పొంది ధన్యులైన పండిత శ్రీధరదంపతులు గుహయందు సుఖాసీనులై మాతృకను పూజించుచున్నట్లు కన్నులవిందు చేసే ఆ మందిరం అద్భుతంగా ఉంటుంది.

ఆ మందిరం వామభాగాన గల "మాతాజీ ధర్మశాల", భక్తులు అనునిత్యం భండారా నిర్వహించుకొనేందుకు సౌకర్యవంతంగా ఉంటుంది. తమ కోరికలు నెరవేరిన భక్తులు కృతజ్ఞతతో మహా మాతృక మందిరంలో పూజలు నిర్వహించి, విందు ఏర్పరచి భక్తులందరకు ప్రసాదం పంచుతారు.

ఈ ధర్మశాల పక్కనే "ప్రాచీనవైష్ణోదేవి భూమిక మందిర్" నిర్మించ బడింది. తెల్లపాలరాతితో నిర్మితమైన ఈ మందిర ప్రవేశద్వారం వద్ద మాతృక

వాహనమైన సింహమును, తదుపరి హవన కుండమును దర్శించవచ్చు. పిదప "వైష్ణోమాత దర్బార్" అన్న మందిర గర్భంలో "బాలకన్యక-ఆదికుమారి" చిరునవ్వుతో దర్శనమిచ్చి, ఆశీర్వదిస్తుంది. ఆ తల్లి సరసన మాత శ్రీవైష్ణవి దర్శనం భక్తులను తక్షణం దివ్యావస్థకు చేరుస్తుంది. లోక కళ్యాణార్థం శ్రీధరుని ఇంట బాల కన్యకగా చిరుమువ్వల సవ్వడితో అడుగిడిన ఆదికుమారి పర్యవసాన క్రమంలో భైరవుడు వెంటరాగా త్రికూటపర్వత చరియలలోప్రథమంగా "ఆదికుమారి" గుహ అనగా "గర్భయోని" చేరింది. నవమాసానంతరం ప్రాచీనగుహ అనగా నేటి దర్బార్. గుహమందిరం చేరి ముగ్గురు మాతలతో ఐక్యమయింది. అట్టి ముద్దుల బాలకన్యకను, సమస్త శుభలక్షణ, సుశోభిత-త్రిభువన సౌందర్యరాశి అయిన మాత శ్రీవైష్ణవిని ఒకేమారు ఇలా భూమిక మందిరంలో ప్రశాంతంగా సందర్శించగలడం భక్తులజన్మకు మరువలేని అలౌకిక అనుభూతి.

ఈనాటి "శ్రీమాతవైష్ణోదేవి" అనన్య ప్రాభవానికి, భక్తులు పొందుతున్న అపూర్వ నిదర్శనానుభూతి ప్రసాదాలకు" అంకురము-మూలము అయినది, భూమికయైన ఈ "బాలకన్యకయే".

మహామాతృకగా తన బిడ్డలను ప్రేమమీర, నోరారా పిలిచి, మనసారా అనుగ్రహిస్తుంది. వారిలో ఆధ్యాత్మిక జీవన సరళిని అంకురింపచేసి, అది పెనువృక్షంగా వేళ్ళూని, విశాలంగా ఊడలుబారి విస్తృతమయ్యేలా చేస్తోంది.

శ్రీమాత, గతమందు వివిధ యుగాలలో ధర్మపరిరక్షణకై అవతరించి దుష్కృత్యములు ఆచరించినవారిని వధించి శరణాగతులను అనుగ్రహించింది. ఇక ధర్మాచారపరాయణులకు, సాధువులకు, తనయందు ఆత్మసమర్పణ చేసుకున్న భక్తులకు, జీవన్ముక్తి ప్రసాదించుట, ఆ తల్లికి పరిపాటియే.

వేదప్రోక్తమైన సనాతనధర్మ పరిరక్షణకు మాత తన తొలి అడుగు మోపగా పవిత్రమైన "భూమిక" అనబడే ఈ ప్రదేశపు ప్రాముఖ్యత

అంతింతకాదు. నేటికీ 'ఈక్షేత్రంలో భక్తులు ఆచారంగా భండారా (విందుభోజనం) నిర్వహిస్తారు. మాత బాలకన్యకగా స్వయంగా అరుదెంచి ప్రప్రథమంగా నైవేద్యం స్వీకరించి అనుగ్రహిస్తుందని భక్తుల ప్రగాఢవిశ్వాసం. ఈ విందులో పాల్గొని, సాక్షాత్ మాతృక భండారా నిర్వహించిన ఈ ప్రదేశంలో ప్రసాదాన్ని స్వీకరించిన యాత్రికభక్తులు ఎంతటి అనుగ్రహవంతులోమరి!

ఇతిహాస క్రమంలో ఈ "ముగురమ్మల మూలపుటమ్మ-అమ్మ-పెద్దమ్మ" శ్రీవైష్ణోదేవిగా భవన్ ప్రదేశమంతా దివ్యమైన ఆధ్యాత్మిక వైభవం విరాజిల్లచేస్తోంది. ఇలా ఈ భూమండలమందలి భక్తసాగరం సమస్తం జీవితకాలంలోనే దైవిక, ఆధ్యాత్మిక సంపద అనుభవించే మహాభాగ్యం కల్పించినది, "ఈ భూమిక మందిరమందలి బాలకన్యక త్రికూటయే".

ఈ మందిరంలో బాలకన్యకను – మాత శ్రీవైష్ణవిని, ఒకేమారు దర్శనం చేసుకున్నంతనే భక్తులకు సత్త్వ, రజస్తమోగుణాల మేలికలుపు ప్రసాదింపబడుతుంది. అలా ఆదికుమారియైన పరమాత్మ సందర్శనంవల్ల జీవాత్మ తన గతస్థితి గుర్తెరిగి దివ్యానందం పొందుతుంది.

**(ఆ) రఘునాథ మందిరం**

కాట్రా బస్‌స్టాండ్ నుండి అర్ధకిలోమీటర్ దూరంలో అందమైన శ్రీరామచంద్రాది దేవతల ఆలయాల సముదాయం నెలకొనిఉన్నది. అందు ఒకానొక దేవాలయము నలుబదినాలుగు క్వింటాళ్ళ బరువుతో కూడిన శ్రీహనుమాన్ విగ్రహము, ప్రతిష్ఠితమైన మందిరం కాగా మరో దేవాలయంలో శ్రీరామ సీతామాత, లక్ష్మణస్వామివార్ల విగ్రహాలు ప్రతిష్ఠింపబడినవి. ఒక దేవాలయంలో భగవాన్ అశుతోష్ స్వామి, మరొక దేవాలయంలో ఈ ఆలయాల వ్యవస్థాపకులైన "స్వామి నిత్యానందుల" వారి సమాధి నిర్మించబడినవి. యాత్రికులు ఈ దేవాలయాల సముదాయాన్ని సులభంగా సందర్శించవచ్చు. వైష్ణోదేవి దర్శనానికి బయల్దేరగానే కాట్రా ముఖ్యవీథిలో

టౌన్‌ఏరియా-కమిటీ వారి ఆఫీస్ దాటిన పిమ్మట, ఒక కాలినడకమార్గం చీలి సమీపాన గల రఘునాథ మందిరం చేరుకుంటుంది.

**(ఇ) చింతామణి**

కాట్రా బస్‌స్టాండ్ నుండి చింతామణి దేవాలయం దరిదాపు ఒక కిలోమీటరు దూరంలో ఉంటుంది. ఈ సముదాయం చింతామణి ట్రస్ట్ వారిచే నిర్మింపబడింది. ఇచ్చట నవదుర్గల విగ్రహాలు ముఖ్యదేవాలయంలో ప్రతిష్ఠింపబడినవి. ఈ దేవాలయం ఎదురుగా ఒక శివాలయం సందర్శించ దగినది. ఇచ్చట ప్రతిష్ఠితమైన శివలింగమూర్తి భారీయైనదేకాక ఎంతో ఎత్తైనది కూడా. ఈ దేవాలయం "గౌరి శంకర మహాదేవ దేవాలయం" అని పిలువబడుతోంది. ఈ ట్రస్టువారిచే ఒక ధర్మశాల నిర్వహింప బడుతున్నది. ఇచ్చట యాత్రికుల బస సౌకర్యార్థం అధునాతన సౌకర్యాలు కల్పించబడిన రూములు అందుబాటులో ఉంచుతారు. ఈ సముదాయం దర్శని దర్వాజాకు అతి సమీపంలో ఉంటుంది.

## శివ-ఖోరి మందిరం

## (శివ పరమాత్మధామం)

"శివఖోరి మందిరం" అనబడే ప్రసిద్ధ దైవక్షేత్రం, లింగమూర్తిఅయిన భగవాన్ పరమశివుని కైలాసధామం. స్వయంభు పరమశివస్థితమైన ఆ ప్రాచీనగుహ ఒక పర్వత శిఖరంపై ప్రకృతిసిద్ధంగా ఏర్పడి ఉన్నట్టిది. ఈ క్షేత్రం కాట్రానగరానికి 90 కిలోమీటర్ల దూరంలో నెలకొనిఉంది. మరోవిధంగా చెప్పాలంటే జమ్ము-కాశ్మీర్ రాష్ట్రంలో, జమ్ము విభాగంలోని ఉద్ధంపూర్ జిల్లా, రియాసి తహసిల్‌లో జమ్ము నగరానికి ఉత్తరదిశగా కి.మీ. 140ల దూరంలో ఉంటుంది. రోడ్డు మార్గంలో రాన్‌సూ అనే ఈ పర్వతపాదభాగ గ్రామానికి చేరుకోవచ్చు. అనగా రాన్‌సూగ్రామం రియాసి-రాజౌరి ముఖ్యమార్గంలో కుందామోర్హ్ అన్నప్రదేశం నుండి కి.మీ. 6 దూరంలో

వుంటుంది. భక్తులు పవిత్రగుహ ముఖద్వారం చేరుకోవడానికి కి.మీ. 4ల దూరం పాదయాత్ర సాగించాలి.

ఈ శివఖోరి అనేగుహ జమ్ము-కాశ్మీరు రాష్ట్రంలోని అన్ని దైవమందిర గుహలకన్న మిక్కిలి విశాలమైనది. సహజ సిద్ధమైన ఈ గుహ 200 మీ.ల పొడవు, 1 మీ.వెడల్పు, 2 మీ. నుండి 3 మీ.ల ఎత్తు కలిగివుండి స్వయంభు శివలింగమునకు స్థావరమై ఉన్నది. పూర్వీకుల నుండి జనవాక్యంగా దైవమందిరం తదుపరి, ఈ గుహ అంతర్భాగం అనంత్యము. లోన కొంత భాగం ప్రయాణించిన పిదప రెండు మార్గాలుగా చీలి ఒక మార్గం కాశ్మీరు నగరం చేరుకుంటుందని ప్రాంతవాసుల నమ్మకం. గుహ అంత్యం తెలుసుకోదలచి సాహసించిన సాధువులు తిరిగిరాని కారణంగా కొంతదూరం పిదప ఈ గుహ మూసివేయబడింది. గుహ గర్భమందిరాన్ని చేరుకోవడానికి భక్తుడు నడుము సంపూర్ణంగా వంచి కొంతభాగం, ప్రాకుతూ కొంతభాగం, శరీరాన్ని ఇరువైపులా వంచుతూ కొంతభాగం ప్రయాణించవలసి ఉంటుంది. అచ్చట అంత కష్టంలోను గుహగర్భంలో దర్శనమిచ్చే సుమారు 1 మీ. ఎత్తుగల సహజ సిద్ధ శివలింగాకృతి యాత్రికులను అపారభక్తి పారవశ్యంతో ముంచెత్తుతుంది.

ఇందుకు అదనంగా ఆ గర్భమందిరంలో మాత పార్వతి, సిద్ధి గణేశుడు, మహానంది ఆకృతుల సహజ శిలాప్రతిములు మనసును ఆకట్టుకుంటాయి. గుహ కప్పుభాగం పరమశివుని భూషణములైన బహువిధ పన్నగముల ఆకృతులతో చూపరులకు ఆనందం కలిగిస్తుంది. నిత్యాభిషిక్తునకు శిరమున వసుధారపాత్రవంటి శిలాకృతి నుండి గోవుచనుమొన ఆకృతిద్వారా పవిత్రజలం చేరుకుంటూ భక్తులకు దర్శనమాత్ర అభిషేకభాగ్యం ప్రసాదిస్తుంది.

ఈ పవిత్రగుహను గురించి ప్రాచుర్యంలో ఉన్న ఆసక్తికరమైన కథలెన్నో ఉన్నా ఈ శివఖోరిగుహ ఒక ముస్లిం గొర్రెలకాపరిచే కనుగొనబడిందన్నది

ఒకానొక ప్రముఖమైన కథ. తప్పిపోయిన తన గొర్రెపిల్లకోసం అతడు ఆ పర్వత చరియలంతటా వెతుక్కుంటూ ఈ గుహప్రాంతానికి చేరుకున్నాడట. గుహలోకి తొంగిచూసిన ఆ ముస్లిం గొర్రెలకాపరి ఎంతో ఆశ్చర్యానికి లోనయ్యాడు. దివ్యకాంతులతో ప్రకాశిస్తున్న ఆ గుహలో కొందరు సాధువులు మహాశివునికి అభిషేకార్చనలు నిర్వహిస్తుండగా, మరికొందరు "ఓం నమఃశివాయ" అన్న ప్రణవ పంచాక్షరి మంత్రజపం ఆచరిస్తున్నారు. కొందరు మహర్షులు ధ్యానముద్రలో నిశ్చలురై దర్శనమిచ్చారు. అలాంటి సాధుసంత్‌లను ఆ గొర్రెలకాపరి ఆ పరిసర ప్రాంతాలలో అంతకు ముందెన్నడూ చూచినది లేదు. తదేకంగా ఈ దృశ్యం వీక్షించిన ఆ గొర్రెలకాపరి దైవశక్తి ప్రభావితుడై పరమ శివానుగ్రహానికిపాత్రుడై తన్మయత్వంతో భక్తి మీర పూజించసాగాడు. తమ ఉనికిని, పరమశివుని ప్రత్యక్ష నివాసపు గుహవిశేషాలను బయటి లోకానికి వెల్లడించరాదని ఆ సాధువులు అతనికి సూచించారు. స్వయంభువై ప్రకృతిసిద్ధంగా నిరంతరం అభిషిక్తుడౌతున్న ఆ పరమశివుని భక్తిపారవశ్యంతో వీక్షిస్తున్న అతడు అర్ధమనస్కంగా తలూపాడు.

గుహముందుగా సంచరిస్తున్న తన గొర్రెపిల్లను ఆత్మీయంగా హత్తుకుంటూ పరమశివుని మాహాత్మ్యాన్ని, తన అనుభవాన్ని నెమరేసుకుంటూ ఇంటికి చేరాడు. నాటి దివ్యానుభవపు జ్ఞాపకాలు మదిలో పునరావృతమౌతుండగా నిద్రలేని రాత్రి గడిపాడు ఆ ముస్లిం గొర్రెలకాపరి. అతడు వేకువనే లేచి తన గ్రామప్రజలందరితో సభక్తింగా ఈ సమాచారాన్ని పంచుకొని శివ-ఖోరి పవిత్రగుహను భక్తలోకానికి తెలియపరచి ధన్యుడయ్యాడు. ఈ విధంగా ప్రపంచానికి తెలియని ఎందరో సాధు-సంత్‌లు, మహర్షులు తమ తపస్సుకు, తద్వారా మోక్షసాధనకు దశాబ్దాల తరబడి ఈ గుహను స్థావరంగా ఏర్పరచుకొన్నారన్న సత్యం విశదమౌతోంది.

1960వ సంవత్సరం వరకు కొందరికి మాత్రమే తెలిసివున్న ఈ “గుహ–దైవ మందిరం” గత కొన్ని దశాబ్దాలుగా వేవేలభక్తుల సందర్శనతో అత్యంత భక్తిప్రాధాన్యత సంతరించుకొని వెలుగొందుతున్నది. మాఘ బహుళ త్రయోదశి, మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ మూడు–రోజులు ఉత్సవాలు నిర్వహింపబడతాయి. వేలాది భక్తులు దేశ విదేశాలలోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసి ఈ సందర్భంగా ఈ పవిత్రగుహ మందిరంలోని పరమశివుని సందర్శించి ధన్యులౌతున్నారు. ఈ ఉత్సవాలు/తిరునాళ్ళు ఆంగ్ల కాల మానానుసారం సాధారణంగా ఫిబ్రవరి/మార్చి నెలలలో నిర్వహింప బడతాయి.

ఎందరో శివభక్తులు రక్షాబంధనదినం అనగా రాఖీపౌర్ణమి సందర్భంగా ఈ ప్రాచీన పవిత్ర గుహమందిరాన్ని సందర్శించి పరమశివుని కృపకు పాత్రులౌతున్నారు. ఈ క్షేత్రాన్ని సందర్శించే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించటానికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రియాశి నగర సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్‌వారు వివిధశాఖల అధికారుల సమావేశం ప్రతి సంవత్సరం నిర్వహిస్తూ రాన్‌సూ గ్రామము–శివఖోరి మార్గము–ప్రాచీన పవిత్ర గుహ మందిరములందు అమలౌతున్న–ఆవశ్యకములైన భక్తులసౌకర్యములను సమీక్షించి, సమన్వయిస్తారు. స్వయంగా పర్యవేక్షించి, నిర్దిష్టంగా అమలయ్యేలా చూస్తారు. వారి సమీక్షానుసారం 2005 సం॥లో ఈ గుహను సందర్శించిన భక్తులసంఖ్య మూడు లక్షలు. ప్రస్తుతం రాన్‌సూ గ్రామం నుండి శివఖోరి గుహను సందర్శించే రోజువారి భక్తులసంఖ్య రెండువేలు.

ఈ తీర్థయాత్రలో ప్రకృతి సౌందర్య వీక్షణానుభూతి, స్వయంభు పరమశివుని ప్రకృతి–సిద్ధ అభిషేక సందర్శన, వెరసి భక్తులకు కైలాస సందర్శనము వంటిది.

## మాత శ్రీవైష్ణోదేవి ష్రైన్‌బోర్డువారి ఆర్జిత సేవలు

**(క) వ్యక్తులపేర నిర్వహించబడే రెండు విధముల పూజలు.**

**(అ) మాతృక పూజ : రుసుము : రూ. 2100/-**

ఈ పూజ సమయంలో భక్తులు హాజరుకావలసిన అవసరం లేదు. ఈ పూజకు ఎవరికొరకుగాను లేదా ఎవరిచేత నమోదు చేయబడియున్నదో ఆ వ్యక్తి లేదా ఆ వ్యక్తుల పేరున వారి గోత్రనామాలతో వారు హాజరుకాకున్నా పూజ నిర్వహింపబడుతుంది. ఆ పూజ ప్రసాదము, నమోదైన చిరునామాకు కొరియర్‌ద్వారా అందచేయబడుతుంది. భక్తులు ఏ తేదీకైనా పూజకు నమోదు చేసుకోవచ్చు. సంవత్సరం మొత్తంమీద ఏరోజుకైనా నమోదు చేసుకొనేందుకు భక్తులకు అవకాశం ఉన్నది. ముందుగా నమోదు చేసుకోవడంద్వారా కాని, ఉన్న అవకాశాన్ని బట్టి ఆ రోజుకారోజైనా పూజ నిర్వహించుకొనే సౌకర్యం కూడా ఉన్నది. ఈ సందర్భంగా గరిష్ఠంగా ఒక కుటుంబంలోని ఐదుగురు సభ్యుల పేర్లు (గృహస్థునితో కలుపుకొని) తెలియచేయవచ్చు. హవనము లేదా పూజాకార్యక్రమములో వారి గోత్రనామాలు మాతృకకు నివేదించబడతాయి.

**(ఆ) మాతృక పూజ, రుసుము : రూ. 11,000/-**

ఈ పూజావిధానంలో భక్తుడు/భక్తురాలు తప్పక హాజరుకావలసి ఉంటుంది. అతడు లేదా ఆమె హవనము లేదా పూజాకార్యక్రమములో అదనంగా (గరిష్ఠంగా) నలుగురు సభ్యులతో కూడి మొత్తం మీద ఐదుగురు సభ్యులు మించకుండా హాజరుకావచ్చు.

ఈ గృహస్థులు కాళికా భవన్ ప్రదేశంలోని రూము నంబరు "ఎనిమిది" వద్ద నమోదు చేసుకున్న రోజున ఉదయం 8 గంటలకు ముందుగా హాజరు కావలసి ఉంటుంది. ఏ కారణం వల్లనైనా భక్తులు ఆ సమయానికి ముందు

హాజరుకానిపక్షంలో అతడు లేదా ఆమె ఆ అవకాశాన్ని కోల్పోవలసి ఉంటుంది.

**(ఖ) శ్రద్ధా సుమన్ విశేషపూజలు.**

**(అ) పూజా టిక్కెట్ రూ.26,000/-**

- ఈ పూజకు ఒక్కరు మాత్రమే అనుమతించబడతారు. ఈ పూజాపథకం ప్రకారం క్రింది సౌకర్యములు కల్పించబడతాయి.
- పవిత్రగుహయందు హారతిదర్శనానికి ఆ వ్యక్తితోపాటు పది సంవత్సరాలలోపు వయస్సుగల బాలుడు లేదా బాలికను అనుమతిస్తారు.
- కాట్రానగరంలో నిహారిక యాత్రీనివాస్ సముదాయంలో ఒక రెండు పడకలగది సమశీతోష్ణ సదుపాయంతో మరియు భవన్‌నందు ఒక రెండు పడకల గది సౌకర్యం.
- కాట్రా నగరం/భవన్‌లో ఒక వ్యక్తికి, తోడున్న బాలుడు/బాలికకు గరిష్ఠంగా ముమ్మార్లు భోజనం.
- భగవతి ప్రసాదము (కాగితపు సంచిలో)
- ఒక వ్యక్తికి హెలికాప్టర్ టిక్కెట్ మరియు బ్యాటరీ కారు టిక్కెట్టు.

**(ఆ) పూజా టిక్కెట్ రూ.48,000/-**

- ప్రవేశానుమతి - ఇరువురకు. ఈ పూజాపథకం ప్రకారం క్రింది సౌకర్యములు కల్పించబడతాయి.
- పవిత్ర గుహయందు ఆరతి దర్శనం - ఇరువురు భక్తులు వారితోపాటు, పది సంవత్సరముల లోపు ఇరువురు బాల/బాలికలకు
- కాట్రా నగరంలో నీహారిక యాత్రీ నివాస్ సముదాయంలో సమశీతోష్ణ సౌకర్యంతో రెండుపడకల గది మరియు భవన్‌యందు ఒక రెండు పడకలగది.

- కాట్రా/భవన్ ప్రదేశాలలో గరిష్టంగా ఇరువురు భక్తులు మరియు ఇరువురు బాల/బాలికలకు ముమ్మార్లు భోజనం.
- భగవతి ప్రసాదములు రెండు (కాగితపు సంచిలో)
- ఇరువురు వ్యక్తులకు హెలీకాప్టర్ మరియు బ్యాటరీ కారు టిక్కెట్లు.

**(ఇ) పూజా టిక్కెట్ రూ. 71,000/-**

- ప్రవేశానుమతి : ముగ్గురు భక్తులు మాత్రము. ఈ పూజా పథకం ప్రకారం క్రింది సౌకర్యములు కల్పించబడతాయి.
- పవిత్రగుహలో హారతి-దర్శనం ముగ్గురు భక్తులు, వారితోపాటు పది సంవత్సరములలోపు బాల/బాలికలు ఇరువురు మాత్రము.
- కాట్రా నగరంలో నీహారిక యాత్రీనివాస్ సముదాయంలో నాలుగు పడకలగది సమశీతోష్ణ సౌకర్యంతో మరియు భవన్‌యందు ఒక నాలుగు పడకలగది.
- గరిష్ఠంగా ముగ్గురు పెద్దవారు మరియు ఇరువురు బాల/బాలికలకు ముమ్మార్లు భోజనం కాట్రా/భవన్ ప్రదేశాలలో
- భగవతి ప్రసాదములు - మూడు (కాగితపు సంచిలో)
- ముష్వరు వ్యక్తులకు హెలికాప్టర్ మరియు బ్యాటరీ కారు టిక్కెట్లు.

**(ఈ) పూజా టిక్కెట్ రూ. 1,21,000/-**

- ప్రవేశానుమతి : ఐదుగురు భక్తులు మాత్రము. ఈ పూజాపథకం ప్రకారం క్రింది సౌకర్యములు కల్పించబడతాయి.
- పవిత్రగుహలో హారతి - దర్శనం ఐదుగురు భక్తులు, వారితోపాటు పదిసంవత్సరముల లోపు బాల/బాలికలు ఇరువురు మాత్రం.

- కాట్రానగరంలో నీహారిక యాత్రీనివాస్ సముదాయంలో నాలుగు పడకలగది సమశీతోష్ణ సౌకర్యంతో మరియు భవన్‌యందు ఒక నాలుగుపడకల గది మరియు ఒక రెండు పడకలగది
- గరిష్ఠంగా ఐదుగురు పెద్దవారు మరియు ఇద్దరు బాల/బాలికలకు ముమ్మార్లు భోజనం - కాట్రా/భవన్ ప్రదేశాలలో
- భగవతి ప్రసాదములు - ఐదు (కాగితపు సంచిలో)
- ఐదుగురు వ్యక్తులకు హెలికాప్టర్ మరియు బ్యాటరీ కారు టిక్కెట్లు.

**సూచిక :** అన్ని పూజ టిక్కెట్లకు సంబంధించి హెలికాప్టర్ టిక్కెట్ -వాతావరణ సానుకూల్యత - ఆ దినం ఆ సౌకర్యం లభ్యతను అనుసరించి ఉంటుంది.

## జమ్ము ప్రాంతమందు నవరాత్రి ఉత్సవములు

వైదికశాస్త్రమందు 'శక్తి' అనగా ప్రకృతియే. స్త్రీయే ప్రకృతి అని ఆర్షధర్మ ఆరాధనతత్వం. మాతృదేవత యెడల ఆరాధనాతత్త్వము హైందవ ధర్మమందు ప్రత్యేకత సంతరించుకొని యున్నది. దీనికంతకూ మూలము "తల్లియే సమస్త సృష్టికి కారణభూతురాలన్న సత్యము".

### దేవి-ఆదిపరాశక్తి-నవరాత్రములు

శ్రీమద్దేవీ భాగవత సారాంశము సమగ్రంగా "నిత్య-సత్య-బాలకన్యక" అయిన దేవి, ఆదిపరాశక్తి ఆవిర్భావము, ఆ తల్లి పంచకృత్య పరాయణత్వము మరియు మహాత్మ్య విశ్లేషణ. అందు భగవతి ఆద్యాశక్తి, బ్రహ్మ విష్ణుమహేశ్వరులకు తన స్వరూపమును వర్ణించి, వారలకు క్రమంగా, మహాసరస్వతిని, మహాలక్ష్మిని మహాకాళిని సమర్పించి, కర్తవ్య నిర్వహణకై వారిని ఆదేశించినట్లు విశదమవుతున్నది.

మహిషాసురాది క్రూరదైత్యులు త్రిలోకములందు శిష్టుల ధర్మాచరణకు విఘ్నములు కల్పిస్తూ, ప్రతిఘటించిన వారిని హతమారుస్తూ ఇంద్రాది

దేవతలను పదవీచ్యుతులను చేసి ఇంద్రలోక ఆధిపత్యానికై ప్రయత్నించ సాగారు. దైత్యుల తపశ్శక్తిని, వరబలాన్ని ఎదుర్కోలేని దేవతలు త్రిమూర్తులను శరణువేడారు. శ్రీమహావిష్ణువు ఆదేశానుసారం దేవతలందరు తమ తమ తేజస్సులను ప్రకటించారు. అవన్నియు కలిసి ఒక దేదీప్యమానమైన "తేజఃపుంజము" రూపుదిద్దుకొన్నది. ఆ తేజోరాశి సౌందర్యవతిగానేకాక మహాశక్తిగా ఉద్భవించింది. దేవతలందరూ తమతమ అస్త్రశస్త్రములను, వస్త్రాభరణములను ఆ దేవికి అర్పించారు. హిమవంతుడు వాహనంగా సింహమును సమర్పించుకొన్నాడు. త్రిమూర్తులు తమతమ ఆయుధ అంశాలను బహూకరించారు.

ఆ పరాశక్తి మహిషాసురాది దుష్టరాక్షసులను సునాయాసంగా వధించి ముల్లోకాలలో శాంతిని నెలకొల్పింది. లలితోపాఖ్యాన అంతర్గతంగా పరమశివుని క్రోధాగ్నికి మన్మథుడు భస్మమయ్యాడు. రతీదేవి కన్నీటితో తడిసిన ఆ భస్మరాసుల నుండి భండాసుర మొదలగు రాక్షసులు ఉద్భవించి ముల్లోకాలలోను ధర్మానికి కీడుకల్గిస్తుండగా అధర్మం రాజ్యమేలసాగింది. దేవమానవాదుల, ఆర్తులబాపుటకు భగవతి లలితారూపిణిగా, బాలకన్యక, గణాధ్యక్ష, వారాహిలద్వారా ఆ రాక్షసులను వధించి ధర్మాన్ని పునరుద్ధరించింది. దుష్టశక్తులపై విజయంగా తల్లిని శ్లాఘిస్తూ ముల్లోకాలలో నవరాత్రుల పండుగ జరుపబడింది.

జమ్ము విభాగ ప్రాంతంలో నవరాత్రులలో మొదటిరోజు శ్రేష్ఠమైన పుట్టమట్టితో ప్రతిఇంట పూజామందిరంలో క్షేత్రమేర్పచి అందు బార్లీధాన్యము జల్లి అంకురారోపణగావిస్తారు. పదవదినాన ఆ మొలకలను పూజానంతరం భగవతి ప్రసాదంగా భక్తులకు పంచుతారు. జమ్ము-కాశ్మీర్ రాష్ట్రమంతా ఈ పవిత్రబార్లీ మొలకలను నవజాతదుర్గగా విశ్వసించి భక్తితో పూజిస్తారు. తుదిగా భక్తులు దుర్గను పూజించి ఈ మొలకలను నదులలో నిమజ్జనం చేస్తారు.

భారతీయ సంస్కృతిలో మాత ఆదిపరాశక్తి "త్రివిధ అంశలు" ఒక్కొక్కటి మూడు దినముల చొప్పున ఆరాధింపబడుతాయి. మొదటి మూడుదినములు మానవులలోని తామసికశ్రద్ధ కారణంగా జనించు మోహము విషాదము, అజ్ఞానము, కుటిలత్వము, క్రోధము, నాస్తికత వంటి దుర్గుణములు నశింపచేయు శక్తి అంశయైన దుర్గ ఆరాధనతో నిర్వహింపబడతాయి.

తదుపరి మూడురోజులు "ఆధ్యాత్మిక సంపదను ప్రసాదించు భగవతి అంశయైన "శ్రీమహాలక్ష్మి" ఆరాధన జరుగుతుంది. ఆ తల్లియే ఇహలోకమున అపార సంపత్ప్రదాయిని. మిగులు మూడు దినములు భగవతి జ్ఞానప్రసాద అంశయైన "శ్రీమహాసరస్వతి" ఆరాధనా దినోత్సవములు. ఆ తల్లియే మానవులకు జ్ఞానము, విద్య, సంస్కారము, కళాప్రవీణత, పాండిత్యము, పరిశోధన, ప్రవచనము వంటి ప్రజ్ఞ, విలువిద్య వంటి నిపుణత ప్రసాదించునట్టిది.

మానవుడు అన్ని రంగములలో సమతౌల్యము సాధించి జీవనసాఫల్యము పొందగలందుకు భగవతి యొక్క త్రివిధ శక్తుల అనుగ్రహము అత్యంత ఆవశ్యకమైనది. కావున నవరాత్రములందు భగవతి త్రివిధ అంశలకు ఆత్మసమర్పణ - ఆరాధనలకు ఈ నవరాత్రి మహోత్సవములు వైదిక ప్రోక్త ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ నవరాత్రములందు దేవి "శైలపుత్రి" గాను, "బ్రహ్మచారిణి" గాను, "చంద్రఘంట" గాను, "కూష్మాండ" గాను, "స్కందమాత"గాను, "కాత్యాయని" గాను, "కాళరాత్రి" గాను, "మహాగౌరి" గాను, "సిద్ధిధాత్రి" గాను, భక్తుల కోరికలీడేర్చే నవరూపాలలో అలంకృతయై పూజలందుకొని అనుగ్రహిస్తుంది.

జమ్ము పరిసరప్రాంతాలలో నవరాత్రి ఉత్సవములు అత్యంత వైభవంగా నిర్వహింపబడుతాయి. రాష్ట్రమంతా దేవాలయములు, మందిరములు, పవిత్రగుహ మందిరముల ముందు ఎంతో సుందరంగా అలంకరించిన పందిళ్ళు వేస్తారు. అందు దుష్టశిక్షణ-శిష్టరక్షణ సందర్భాలలో ఆ తల్లి

ప్రదర్శించిన రూపాకృతులను విగ్రహాల రూపంతో ఆవిష్కరించి నిత్యపూజలు నిర్వహిస్తారు. ప్రత్యేక పూజలు, హవనములు, జాగారణలు నిర్వహిస్తారు. శారీరక, మానసిక, మాలిన్యాలను తొలగించుకోవడానికా అన్నట్లు ఉపవాసాలు ఆచరిస్తారు.

ఈ నవరాత్రుల పండుగ సందర్భంలో త్రికూటపర్వతాగ్రమందలి శ్రీమాతావైష్ణోదేవి గుహ పాదభాగమైన కాట్రానగరం దేదీప్యమానంగా అలంకరింపబడుతుంది. ప్రతి సంవత్సరం ఈ ఉత్సవాలలోభాగంగా అశేషభక్తజనం విద్యుద్దీపాల కాంతిలో మాత విగ్రహాలతో జేజేనాదాలు పలుకుతూ శోభాయాత్ర నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు సమాంతరంగా నిర్వహింపబడతాయి. భక్తిగీతాలాపన పోటీలు నిర్వహిస్తారు. కాట్రానగరంలోను, దర్బారు మార్గమంతా జాగరణలు పవిత్రంగా నిర్వహించబడతాయి. రాష్ట్రంలో ప్రముఖ సాంస్కృతిక సంస్థయైన "నటరంగ్ గ్రూపు" వారు పలు ప్రదేశాలలో–బాబాజీతో, భక్తధ్యాను, రాజాచంద్రదేవ్, రంజిత్‌దేవ్", మొదలగు భక్తుల కథాంశాలతో పలునాటికలు, నాటకాలు ప్రజారంజకంగా ప్రదర్శిస్తారు. పలుచోట్ల పురాణములు, దేవిమహాత్మ్యము ప్రధానాంశములుగా, నృత్యములు, నృత్యరూపకములు ప్రదర్శింపబడతాయి. దేవాలయములందు, మందిరములు, పందిళ్ళయందు పవిత్రగుహాలన్నింటి ముంగిట, హవనములు, దుర్గసప్తశతి పఠనములు నిర్వహించుట ఇచ్చట ప్రత్యేక ప్రాధాన్యత. ఈ సందర్భంలో మాత శ్రీవైష్ణోదేవి మందిరానికి భక్తులరద్దీ అసాధారణంగా ఉంటుంది. భవన్ ప్రాంతమంతా రంగురంగుల విద్యుద్దీపాలతోను దేవీదేవతల ఆకృతులతోను, అందమైన పూలమండపాల తోను అలంకరించబడుతుంది. భక్తుల దర్శనవరుసలు, ప్రాచీన గుహాముఖ ద్వారం, నూతన సొరంగ మార్గాలు, ప్రత్యేకంగా శ్రీవైష్ణవి పవిత్రగుహలలో ఎంతో శోభాయమానంగా పుష్పాలంకరణ కావించబడుతుంది.

భవన్ ముఖ్యప్రాంగణంలో ప్రపంచమానవాళి సౌభాగ్యానికి, శాంతికి గాను షట్చండి యాగం, ఆర్షధర్మానుసారం సభక్తికంగా నిర్వహించబడుతుంది. మిగిలిన భవన్ పరిసరమంతటా మనసును దోచుకొనే పలువర్ణాల పుష్పాలతో ద్వారములు స్తంభములు, మందిరములు అలంకరించబడతాయి. ఈ నవరాత్రములేకాక చాంద్రమానానుసారం మాసమందలి శుక్ల మరియు కృష్ణపక్షపు ఎనిమిదవ, తొమ్మిదవ, మరియు పదునాల్గవ, దినములగు అష్టమి, నవమి, చతుర్ధశి తిథులు కూడా వివిధ సాంప్రదాయములు మరియు నమ్మకములను బట్టి శుభప్రదములై శ్రేయస్కరములైనట్టివి.

భారతీయుల ప్రముఖ పర్వదినమైన దీపావళిదినాన మాత మహాలక్ష్మి, మహాకాళి దేవతలకు ప్రత్యేక అలంకార, అర్చనాదులు ఘనంగా నిర్వహింపబడతాయి. భారతదేశంలోని పలుప్రాంతాలలోలాగా ఈ ప్రాంతంలో కూడా నవరాత్రులు సంవత్సరంలో రెండుమార్లు జరుపుకుంటారు. ఆంగ్ల కాలమానానుసారం మార్చి లేదా ఏప్రిల్ నెలలలో, అనగా చైత్రమాసంలో శ్రీరామనవమి నవరాత్రులుగాను, సెప్టెంబరు-అక్టోబరు నెలలలో అనగా ఆశ్వయుజ మాసములో దుర్గానవరాత్రులుగాను ఎంతోభక్తితో జరుపుకుంటారు. వేసవి-శీతాకాలాల ప్రారంభం-వాతావరణ స్థితిగమనములకు ప్రధాన దశలైనందువల్ల ఈకాలం తానేప్రకృతియైన మాతదుర్గ దీక్షస్వీకరణకు, ఆ తల్లిని కొలుచుటకు, అత్యంత శ్రేయస్కరమైన కాలంగా విశ్వసిస్తారు. కావున కలి కల్మషదోష నివారణకు, దేవి అనుగ్రహసిద్ధికి, ఇరునవరాత్ర పర్వదినాలలోను భగవతి దుర్గను భక్తిమీర కొలుస్తారు. శ్రీలలిత దుష్టభండాసురుని వధించి శిష్టులను రక్షించి ధర్మమును పునర్పాదుకొల్ప వానితో ఏకంగా తొమ్మిదిదినాలు ఘోరయుద్ధం సాగించింది. తుదిగా భండాసురవధతో నెలకొన్న శాంతికి చిహ్నంగా దేవి విజయాన్ని శ్లాఘిస్తూ ఆ తల్లి పరమోత్తమ లక్షణాలను ప్రశంసిస్తూ భక్తులు నవరాత్రి మహోత్సవాలు జరుపుకుంటారు.

ఈ తొమ్మిదిదినాల అలంకరణ, అర్చనాదులు భగవతి యొక్క అనుగ్రహసిద్ధికై నవదుర్గాంశల నామ, రూప, గుణ అంశావతార ఆవిష్కరణ మరియు ఆరాధనయే. చాంద్రమానానుసారం ఈ నవరాత్రులు ఆశ్వయుజమాసంలోని శుద్ధపాడ్యమితో ప్రారంభమై శుక్లపక్షచంద్రునిలా దినదినప్రవర్ధమానంగా తేజోమయమయ్యే దినాలలో జరుపుకొనబడతాయి.

చంద్రనిభయైన మాతకు ఈ దినాలు అత్యంత ప్రీతిపాత్రములు. శ్రీమద్దేవీ భాగవతానుసారం ప్రతిదినప్రాశస్త్యము మాతయొక్క ఒక్కొక్క నవదుర్గ దివ్యస్వరూపంతో అనుసంధానమై యున్నది.

* * *